
'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 323

గురువారం 13-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఘనమైన ముగింపు

చివరి వన్డేలోనూ ఇంగ్లండ్‌పై భారత్ విజయం. సిరీస్ 3–0తో సొంతం. – 14లో



కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్

కంపెనీలకు విమానయాన సంస్థల స్పెషల్ ఆఫర్లు. – 15లో

'స్థానికం'.. ఇప్పట్లో లేనట్టే!

మరో విడత కులగణన సర్వే నిర్వహణకు సర్కారు నిర్ణయం

బీసీలకు 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటన



స్థానిక ఎన్నికలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, సీతక్క, పొన్నం, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు రామకృష్ణారావు, దాన కిశోర్ తదితరులు

- అసెంబ్లీలో, పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదానికి సమయం పట్టే చాన్స్
- అప్పటివరకు ఎన్నికలు జరిగే అవకాశం లేనట్టే
- మే లేదా జూన్‌లో ఒకేసారి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించవచ్చనే అంచనా
- సీఎం రేవంత్ ఆధ్వర్యంలో 'స్థానిక' ఎన్నికలపై చర్చ
- తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ రిజర్వేషన్లు పెంచేలా కేంద్రాన్ని కోరాలని నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 'స్థానిక' ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం కనిపించడం లేదు. వారంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చేస్తుందని, బీసీ రిజర్వేషన్లు ఖరారు కావడమే తరువాయి అన్నంతగా నెలకొన్న ఉత్కంఠ ఒక్కసారిగా చల్లారిపోయింది. రాష్ట్రంలో మరో విడత కుల గణన సర్వే నిర్వహణకు సర్కారు నిర్ణయించడం, బీసీలకు 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని భావించడమే దీనికి కారణం. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో, పార్లమెంటులో బిల్లు ఆమోదానికి సమయం పట్టే అవకాశం ఉందని, దీనితో మే లేదా జూన్ నాటికి 'స్థానిక' ఎన్నికలు జరగవచ్చని మిగతా 3వ పేజీలో ▶

ఓబీసీల కలను నిజం చేస్తాం..

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ఆమోదింపజేస్తాం
- 16 నుంచి 28 వరకు మరోసారి సర్వే నిర్వహిస్తామని వెల్లడి

3 లో

మరో 15,000


ఐఐటీలు, ఎన్ఐటీల్లో పెరగనున్న సీట్లు

- ఆన్‌లైన్ విధానంలో కొత్త కోర్సులు తెచ్చే యోచనలో ఐఐటీలు
- కేంద్రానికి ప్రతిపాదనలు
- సానుకూలంగా కేంద్రం.. త్వరలో నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) కాలేజీల్లో ఇంజనీరింగ్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రాథమిక అంచనా ప్రకారం 15 వేల (ఐఐటీల్లో 5 వేలు, ఎన్ఐటీల్లో 10 వేలు) సీట్లు పెంచాలనే ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం వద్దకు వచ్చాయి. దీంతోపాటు ఆన్‌లైన్ విధానంలో కొన్ని కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని ఐఐటీలు యోచిస్తున్నాయి. కొన్నేళ్లుగా విద్యార్థుల నుంచి మిగతా 5వ పేజీలో ▶



తెరపైకి తెలివైన బుర్ర



ఏఐకి తగినట్టుగా దేశీయ సెమీ కండక్టర్ చిప్‌ల రూపకల్పనపై ఫోకస్

ఇప్పటికే 'శక్తి' మైక్రోచిప్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఇస్రో–ఐఐటీ మద్రాస్

సాక్షి, హైదరాబాద్: మొబైల్ ఫోన్ల నుంచి స్మార్ట్ పరికరాల దాకా ఏది పనిచేయాలన్నా కంప్యూటర్ చిప్‌లు కంపల్సరీ. అందులోనూ కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరికరాల కోసం వేగవంతమైన, సమర్థవంతమైన మైక్రో ప్రాసెసర్లు అవసరం. వాటిని తగిన విధంగా ఉపయోగించుకోవడానికి, కృత్రిమ మేధను అనుసంధానం చేయడానికి లాంగ్వేజ్ మోడల్స్ కావాలి. ఇప్పుడు వీట న్నింటినీ దేశీయంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు కూడా మిగతా 5వ పేజీలో ▶


- దీని ఆధారంగా అంతరిక్ష ప్రయోగాల్లో వినియోగించే మైక్రో ప్రాసెసర్ తయారీ
- మరోవైపు మైక్రో అండ్ స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్ రూపొందిస్తున్న ప్రైవేటు కంపెనీలు
- న్యాయ, వైద్య రంగంలో ఇవి అద్భుతాలు సృష్టిస్తాయంటున్న నిపుణులు
- సైబర్ సెక్యూరిటీకి కూడా అద్భుతంగా తోడ్పాటు

కొత్త పన్ను చట్టం.. ఎంతో సులభతరం!

- నేడే లోక్‌సభకు సమర్పణ
- నిరుపయోగ నిబంధనలకు గుడ్‌బై
- అర్థం కాని పదబంధాలకు స్వస్తి
- 622 పేజీలకు కుదింపు

- గడిచిన ఆర్థిక సంవత్సరానికి (పీవై) రిటర్నులు దాఖలు చేసే సంవత్సరాన్ని అసెస్‌మెంట్ సంవత్సరంగా (ఏవై) ప్రస్తుతం పిలుస్తున్నారు. ఇకపై పీవై, ఏవై పదాలు ఉండవు. వీటి స్థానంలో ఏప్రిల్ 1 నుంచి 12 నెలల కాలాన్ని (ఆర్థిక సంవత్సరాన్ని) 'ట్యాక్స్ ఇయర్'గా సంబోధిస్తారు.
- బిల్లులోని ముఖ్యాంశాలు చిన్న వ్యాక్యాలతో, చదివేందుకు వీలుగా, టేబుళ్లు, ఫార్ములాలతో ఉంటుంది
- కొత్త బిల్లును 622 పేజీలకు కుదించారు. సెక్షన్లను 526కు, షెడ్యూళ్లను 16కు పెంచారు. చాప్టర్లు 23గానే ఉన్నాయి.

– 15లో



ఇదండీ సంగతి



ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి జంప్ చేసే సంస్కృతి మాది కాదు!

కలిసి నడుద్దాం.. కలిమి సాధిద్దాం



- భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ నిర్ణయం
- ఇరుదేశాల సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని తీర్మానం
- కీలక వ్యూహాత్మక రంగాల్లో భారత్, ఫ్రాన్స్ మధ్య సహకారంపై సమీక్ష

- వివరాలు 6లో

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో సజ్జన్ దోషే..



- మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ హత్యోదంతం తర్వాతి రోజు ఢిల్లీలో చెలరేగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో తండ్రీకొడుకులను సజీవ దహనం చేసిన కేసులో కాంగ్రెస్ మాజీ పార్లమెంట్ సభ్యుడు సజ్జన్ కుమార్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు దోషిగా తేల్చింది. అయితే ఫిబ్రవరి 18న శిక్షా కాలాన్ని ఖరారుచేసే అవకాశం ఉంది. ఈ కేసులో 79 ఏళ్ల సజ్జన్‌కు కనిష్టంగా యావజ్జీవ కారాగార శిక్ష లేదంటే గరిష్టంగా మరణశిక్ష పడే అవకాశం ఉంది. - వివరాలు 6లో



ఘనంగా మండమెలిగె

మేడారంలో పోటెత్తిన భక్తులు.. గద్దెల వద్ద ప్రత్యేక పూజలు

- వివరాలు 5లో



6 లో

2 కోట్ల మంది మహా స్నానం

మహా కుంభమేళాలో మాఘి పూర్ణిమను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 2 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారు. 26వ తేదీ వరకు కొనసాగే మహాకుంభ్‌లో చిట్టచివరి అమృత్ స్నానఘట్టం మహాశివరాత్రి రోజున ఉంటుంది.



సోలో లైఫే సో బెటరూ!

పలువురు అమ్మాయిలు ఇటీవల ఒంటరి జీవితానికే మొగ్గుచూపుతున్నారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టడం,పిల్లల్ని కనడంపై విముఖత చూపుతున్నారని మోర్గాన్ స్టాన్లీ అధ్యయనం వెల్లడించింది.

2 లో

మూడు రోజుల్లో పీసీసీ కొత్త కార్యవర్గం!

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ కార్యవర్గ కూర్పు తుది దశకు చేరుకుంది. కొత్తగా ప్రకటించబోయే కార్యవర్గంలో ఎంతమంది ఉండాలి? ఏ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమివ్వాలి? ఏ ప్రాతిపదికన ఇవ్వాలి? తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్‌లో కీలక సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో కార్యవర్గాన్ని ఖరారు చేసినట్టు తెలిసింది. సమావేశంలో చర్చించి రూపొందించిన జాబితాను ఏఐసీసీ ఆమోదానికి పంపనున్నారు. అనంతరం రెండు లేదా మూడురోజుల్లో పీసీసీకి కొత్త కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశాలు ఉన్నాయని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

బీఆర్‌ఎస్ సమర్థవంతమైన ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తోంది

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశిస్తున్నా: ఎంపీ చామల



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ సమర్థవంతమైన ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తోందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను, చేసిన పనులు చెప్పుకోవడంలో విఫలం అవుతున్నామని చెప్పారు. అయితే పథకాల లబ్ధిదారులు ఎన్నికల్లో వారి అభిప్రాయాన్ని ఓటు రూపంలో తెలియజేస్తారన్నారు. ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నట్లుగా తమ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదని చెప్పారు. బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మీడియాతో చామల చిట్‌చాట్ చేశారు. తాను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎంపీలుగా పనిచేసిన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో పాటు.. భట్టి విక్రమార్క కూడా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేశారని గుర్తుచేశారు.

బీర్ల ధరల పెంపులో ఏపీ, తెలంగాణ సర్కార్ల కుమ్మక్కు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను మద్యం మాఫియా నడిపిస్తోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బీర్ల ధరల పెంపులో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కుమ్మక్కై.. ఒకేమారు ధరలు పెంచడమే దీనికి నిదర్శనమన్నారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల నడుమ పరస్పర ఒప్పందాలున్నాయని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ధరలు నామమాత్రంగా పెంచితే గగ్గోలు పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు ఒక్కో బీరు ధరను రూ.40 మేర పెంచారన్నారు. ఆయన తెలంగాణ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొద్దిరోజుల్లో బ్రాందీ, విస్కీ ధరలు పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. రాష్ట్రంలో హోమ్ గార్డులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదని, ఉద్యోగ విరమణ చేస్తున్న వారు ఆర్థిక ప్రయోజనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

కాంగ్రెస్ వైఖరితోనే బీజేపీ బలోపేతం: కూనంనేని

స్థానిక ఎన్నికల్లో కలిసొస్తే కాంగ్రెస్‌తో పొత్తు



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ వివిధ రాష్ట్రాల్లో అవలంబించిన వైఖరి కారణంగానే మళ్లీ బీజేపీ బలం పుంజుకుంటోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఇది దేశానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. సీపీఐ కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీలో ఆప్ ఓడిపోవడంతో బీజేపీ మరింత రెచ్చిపోయే అవకాశం లభించిందన్నారు. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వైఖరి మీదనే పొత్తు ఆధారపడి ఉంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ కలిసివస్తే ఆ పార్టీతో ముందుకు సాగుతామని, లేకపోతే సీపీఐకి బలం ఉన్న చోట్ల ఒంటరిగా పోటీ చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్లలో మార్పులొద్దు

సీఎంకు ధర్మ సమాజ్ పార్టీ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎస్సీ రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేయాలని, దీనిలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయొద్దని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విశారదన్ బహిరంగ లేఖ రాశారు. కొన్ని రాజకీయ కారణాలతో ఆ గ్రూప్‌లో ఉన్న వారిని, ఈ గ్రూప్‌లోకి మార్చడం మొదలు పెడితే సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ అధ్యయనం చేసిన నివేదికను స్వాగతిస్తున్నామన్నారు. దీనిలో ఎలాంటి మార్పులు చేసినా ఉద్యమిస్తామని విశారదన్ మహారాజ్ హెచ్చరించారు.

సోలో లైఫే సో బెటరూ!



'పెళ్లిపై నమ్మకం లేదు.పెళ్లి చేసుకోవడమంటే స్వేచ్ఛను కోల్పోవడమే. అలా బతకడం నాకే మాత్రం ఇష్టం లేదు. ఒక్కసారి వైవాహిక జీవితంలోకి ప్రవేశించిన తర్వాత సొంత ఆలోచనలకు, అభిప్రాయాలకు, ఆకాంక్షలకు, చివరకు అభిరుచులకూ అవకాశం ఉండదు. ఇలా ఎంతోమందిని చూశాను. అందుకే పెళ్లికి దూరంగా ఉన్నాను..'

ఇది 35 ఏళ్ల విజయ (పేరు మార్చాం) బలమైన అభిప్రాయం. ఆమె ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలోని ఓ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. అక్కడే ఒక మహిళల హాస్టల్లో ఉంటున్నారు.

సాక్షి, హైదరాబాద్: చాలామంది మహిళలు ఇటీవలి కాలంలో వివాహ బంధం, దాంపత్య జీవితంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పాతికేళ్ల వయసు దాటినా పెళ్లి ఊసు ఎత్తేందుకు కూడా ఇష్టపడని వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విజయలా స్వతంత్రంగా జీవించాలనుకునే వారితో పాటు వృత్తిపరమైన బాధ్యతల వల్ల కొందరు, మంచి కెరీర్ కోసం ప్రయత్నించే క్రమంలో ఒత్తిడికి గురవుతూ మరికొందరు వివాహం విషయంలో నిరాసక్తతను ప్రదర్శిస్తున్నట్లు మోర్గాన్ స్టాన్లీ అధ్యయనం వెల్లడించింది. తమ జీవితాన్ని తమకు ఇష్టమైన విధంగా గడపడానికి వీలవుతుందనే భావనే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. ఒకవేళ పెళ్లి చేసుకున్నా పిల్లల్ని కనేందుకు ఇష్టపడటం లేదని తెలిపింది. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థ సర్వే నిర్వహించింది. 2030 నాటికి ఒంటరి మహిళల సంఖ్య 45 శాతానికి పెరగవచ్చునని అంచనా వేసింది. వీరిలో 25–44 ఏళ్ల లోపు వయసున్న వారే అత్యధిక సంఖ్యలో ఉంటారని పేర్కొంది. వ్యక్తిగత అభివృద్ధి, తాము ఎంచుకున్న రంగాల్లో పురోగతికే యువతులు ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించింది. మరోవైపు కుటుంబ బాధ్యతలూ ఇందుకు కారణమవుతున్నాయి.

బాధ్యతలు పంచుకుంటూ.. కెరీర్ కోసం కష్టపడుతూ..

సాధారణంగా అమ్మాయిలు 25 ఏళ్లలోపే పెళ్లిళ్లు చేసుకుంటారు. కానీ ఇటీవలి కాలంలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడా కుటుంబ బాధ్యతలను పంచుకుంటున్నారు. తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటున్నారు. తోబుట్టువుల కెరీర్ కోసం కష్టపడుతున్నారు. అదే సమయంలో జీవితంలో స్వేచ్ఛను కోరుకుంటున్నారు. అల్వాల్‌కు చెందిన సుజాత (పేరు మార్చాం.) ఒక ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నారు. 'పదేళ్ల క్రితమే నాన్న చనిపోయారు. అప్పటి నుంచి తమ్ముడు, చెల్లి, అమ్మను చూసుకోవడం నా వంతైంది. చూస్తుండగానే 40 ఏళ్లు వచ్చేశాయి..'అంటూ నవ్వేశారు ఆమె. సుజాత లాగానే చాలామంది అమ్మాయిలు కుటుంబ బాధ్యతల నేపథ్యంలో వయసు దాటి పోయిందనే భావనతో వివాహ బంధానికి దూరమవుతున్నారు. కానీ కొంతమంది యువతుల్లో స్వేచ్ఛాయుత జీవితంపై ఆసక్తి పెరుగుతోంది. వారి ఆలోచనలు, అభిప్రాయాలు వైవాహిక జీవితానికి వ్యతిరేకంగా ఉంటున్నాయి. ఎల్‌బీనగర్ ప్రాంతానికి చెందిన శైలజ.. 'పెళ్లి కంటే ఆర్థిక స్వాతంత్య్రం ఎంతో ముఖ్యం.అది లేకుండా పెళ్లి చేసుకోవడం ఆత్మహత్యాసదృశం..'అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. ఆమె ప్రస్తుతం ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేస్తున్నారు. ఇప్పటికే 28 ఏళ్లు దాటాయి. అయినా ఒంటరిగానే ఉండిపోవాలని కోరుకుంటున్నారు.

పిల్లలూ భారమేనా..!

పెళ్లి చేసుకున్నప్పటికీ మరికొంతమంది మహిళలు పిల్లల్ని కనేందుకు వెనుకాడుతున్నారు. 'ఈ రోజుల్లో పిల్లల్ని కనడం. పెంచడం ఎంతో ఖరీదైన విషయం. ఆ విషయంలో ఆచి తూచి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది..' అని ఒక యువతి వ్యాఖ్యానించారు.

ఒంటరి జీవితానికే మొగ్గు చూపుతున్న ఎక్కువమంది అమ్మాయిలు	వివాహ బంధంలోకి అడుగు పెట్టడం, పిల్లల్ని కనడంపై విముఖత	ఎలాంటి బాదరబందీ లేకుండా కొనసాగడం పైనే ఆసక్తి	వ్యక్తిగత స్వేచ్ఛ, కెరీర్‌లో ముందుకు దూసుకెళ్లడంపైనే దృష్టి	2030 కల్లా 45 శాతానికి పెరగనున్న సింగిల్ ఉమెన్ సంఖ్య	మోర్గాన్ స్టాన్లీ అధ్యయనం వెల్లడి

నేను, నా స్వేచ్ఛ అనే భావన బలపడుతోంది

దేశంలో అలాగే హైదరాబాద్‌లోనూ ఇలాంటి ట్రెండ్ కనిపిస్తోంది. మా అమ్మాయి పెళ్లిచేసుకోవడం లేదంటూ ఇటీవల కొందరు తల్లిదండ్రులు మా దగ్గరకు వచ్చినపుడు.. పెళ్లి ఎందుకు, ఆ అవసరం ఏమిటీ, పిల్లలు ఇతర బాదరాబందీ అంతా ఎందుకంటూ అమ్మాయిలు ప్రశ్నిస్తున్నారు. పెళ్లితో తమ స్వేచ్ఛ, కెరీర్ దెబ్బతింటుందని, ఒకవేళ వివాహానికి ఒప్పుకున్నా పిల్లలు వద్దనుకునే వాళ్లనే చేసుకోడానికి సిద్ధమని చెబుతున్నారు. కొంతమంది చదువు, ఉద్యోగాల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటూ స్వేచ్ఛా జీవితం గడిపాక..ఇక కుటుంబం, సంతానం వంటివి వద్దనుకుంటున్నారు. మనం అనే ఉమ్మడి భావన పోయి నేను, నా స్వేచ్ఛ, నా కెరీర్ అనే భావన బలపడుతోంది. తల్లిదండ్రుల కోరిక మేరకు ఇలాంటి వారికి మేం కౌన్సెలింగ్ ఇస్తున్నాం.



- పి.జ్యోతిరాజా, సైకాలజిస్ట్, శ్రీదీప్తి కౌన్సెలింగ్ సెంటర్

నచ్చిన వరుడు, మెచ్చిన ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ..

మరోవైపు నచ్చిన వరుడు లభించకపోవడం కూడా కొంతమంది అమ్మాయిలకు శాపంగా మారుతోంది. ప్రత్యేకంగా కొన్ని సామాజిక వర్గాలకు చెందిన యవతులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మంచి విద్యార్హతలు, ఉద్యోగం, కెరీర్ అవకాశాలు, వ్యక్తిత్వం, అభిరుచులు తమకు నచ్చినట్లు ఉంటేనే పెళ్లికి అంగీకరిస్తున్నారు. అలాంటి అబ్బాయి లభించే వరకు నిరీక్షిస్తున్నారు. మరోవైపు విదేశీ సంబంధాల కోసం ఎదురుచూసే కుటుంబాల్లోనూ అమ్మాయిలకు పెళ్లిళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయి. కొంతమంది సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు ఏళ్ల తరబడి చదువుతున్నారు. లక్ష్యాన్ని సాధించేవరకు పెళ్లికి దూరంగా ఉండాలనే భావనతో ఐదారేళ్లకు పైగా గడిపేస్తున్నారు.అప్పటికే పెళ్లి వయసు దాటిపోతోంది.

భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు!

వచ్చే 10, 15 ఏళ్లలో వివాహ బంధానికి సంబంధించి మరింత ఎక్కువగా సవాళ్లు ఎదురుకావొచ్చు. ప్రస్తుతం 20 నుంచి 25 ఏళ్లు పైబడిన యువతుల్లో కొంతమంది పెళ్లి అంటే విముఖత వ్యక్తం చేస్తున్నారు. క్రమంగా ఈ ఆలోచన విధానం అమ్మాయిల్లో పెరుగుతోంది. వివాహం అనగానే బాధ్యతల్లో చిక్కుకుపోవడం, పిల్లల్ని కని వారి సంరక్షణలో, సంసార బాధ్యతల్లో మునిగిపోవడం అని అనుకుంటున్నారు. తమ స్వేచ్ఛకు, స్వతంత్రతకు భంగం వాటిల్లుతుందని భయపడుతున్నారు. ఉన్నత చదువులు చదివి, సమాజంలో మంచి ఉద్యోగం చేస్తున్నా.. మళ్లీ కుటుంబపరంగా ఎన్నో బరువు బాధ్యతలు మోయాల్సి రావడం కూడా ఇందుకు కారణమవుతోంది. అమ్మాయిల్లో పెళ్లి, పిల్లల పట్ల విముఖత పెరగడానికి పురుషుల మనస్తత్వాల్లో మార్పు రాకపోవడం కూడా ఒక కారణంగా భావించవచ్చు.

- సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్, యూ అండ్ మీ కౌన్సెలింగ్ సెంటర్



ఇందిరమ్మ ఇళ్లకు జియో ఫెన్సింగ్

సర్వేలో చూపిన స్థలంలో, కచ్చితంగా ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు

- ఇందుకోసం కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన ప్రత్యేక యాప్
- ఇంటి నిర్మాణ స్థలం అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా అప్‌లోడ్
- తదుపరి తనిఖీలో, స్థలంలో ఏమాత్రం మార్పు వచ్చినా సాయం నిలిపివేత
- అక్రమాలు జరిగినట్టు గుర్తిస్తే ఇంటి మంజూరు రద్దు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పేదలకు ప్రభుత్వ సాయంతో కట్టించే ఇళ్లకు తొలిసారి జియో ఫెన్సింగ్ చేయనున్నారు. ఇందుకోసం కృత్రిమ మేధ సాయంతో ప్రత్యేకంగా యాప్‌ను అభివృద్ధి చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో దీనికి శ్రీకారం చుడుతున్నారు. 2013లో రాష్ట్రంలో జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేసేందుకు అప్పటి అధికారులు ప్రతిపాదించినా అది ముందుకుపడలేదు. అయితే ఈసారి ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు జరిగినట్టు తేలితే 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల పథకం'నిధులు ఇవ్వబోమని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పిన నేపథ్యంలో.. అక్రమాలకు అవకాశం లేకుండా జియో ఫెన్సింగ్ విధానం అమలుకు సర్కారు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

ఏమాత్రం తేడా వచ్చినా పట్టేస్తుంది

రాష్ట్రంలో మొదటి విడతగా సొంత జాగా ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. అర్హుల గుర్తింపునకు ఇటీవల సర్వే చేసిన అధికారులు సొంత జాగా ఉన్న నిరుపేదలతో కూడిన ఎల్1 జాబితాను సిద్ధం చేశారు. ఇల్లు కట్టే స్థలాన్ని సర్వే సమయంలోనే చూపారు. ఇప్పుడా స్థలాన్ని జియో ఫెన్సింగ్ చేయనున్నారు. ఆ స్థలంలోనే ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయాల్సి ఉంటుంది. లబ్ధిదారులు ముగ్గుపోసే విషయాన్ని గ్రామ కార్యదర్శి, వార్డు ఆఫీసర్‌కు తెలపాలి. వారు వచ్చి సర్వే సమయంలో చూపిన స్థలం అదేనా, కాదా అన్నది గుర్తిస్తారు. తర్వాత ప్రత్యేక యాప్ ఉన్న మొబైల్ ద్వారా ఆ స్థలం వివరాలు, ఫొటోను అప్‌లోడ్ చేస్తారు. ఈ సందర్భంగా ఆ స్థలం అక్షాంశ, రేఖాంశాల వివరాలతో జియో ఫెన్సింగ్ అవుతుంది. తదుపరి తనిఖీకి వచ్చినప్పుడు ఆ స్థలం వద్దే నిలబడి యాప్ ద్వారా పరిశీలిస్తారు. అక్షాంశ, రేఖాంశాలు మ్యాచ్ అయితేనే.. తదుపరి ఫొటోలు, వివరాలు అప్‌లోడ్ అవుతాయి. లేకుంటే యాప్ తిరస్కరిస్తుంది. అంటే కచ్చితంగా అదే స్థలంలో ముగ్గు పోసినది మొదలు ఇల్లు పూర్తయ్యేదాకా.. ప్రతిదశలో నిర్మాణం పరిస్థితి అప్‌డేట్ అవుతుంది. లేకుంటే అవకతవకలు జరిగినట్టు తేల్చి లబ్ధిదారు గుర్తింపు రద్దు చేస్తారు. ప్రభుత్వ సాయం నిలిచిపోతుంది.

అక్రమాలను అరికట్టేందుకే..

గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, ఒక స్థలం చూపి మరో స్థలంలో ఇల్లు కట్టడం, లబ్ధిదారు పేరుతో వేరొకరి స్థలంలో ఇళ్లు కట్టడం, పాత ఇళ్లను కొత్తగా కట్టిన ఇంటిగా చూపటం వంటివాటితో ప్రభుత్వ సాయాన్ని దుర్వినియోగం చేశారని అధికార వర్గాలు చెబుతున్నాయి. కొందరు సిబ్బంది కుమ్మక్కై నిధులు పక్కదారి పట్టించారని.. ఇప్పుడు జియో ఫెన్సింగ్‌తో అలాంటి అక్రమాలకు పాల్పడే వీలుండదని అంటున్నాయి

ఉచిత ఇసుక విధివిధానాలపై దృష్టి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందు రాష్ట్రంలో 71,482 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు. ఇప్పుడు వారు ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. పునాదులు తీసిన తర్వాత తొలి విడత సాయంగా రూ.లక్ష అందిస్తారు. ఇక ప్రతి ఇంటికి 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో స్టీలు, సిమెంట్ తక్కువ ధరకు అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి విధివిధానాలు ఖరారు కావాల్సి ఉంది. టోకెన్ల జారీ ద్వారా అందించాలని అధికారులు యోచిస్తున్నట్టు సమాచారం.

తెలంగాణ జాగృతి 'మహిళా శంఖారావం'

మార్చి 8న ఇందిరా పార్కు వద్ద ధర్నా: కవిత

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బూటకపు హామీలు ఇచ్చి మోసగించిందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. మహిళల పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టేందుకు మార్చి 8న ఇందిరా పార్కు వద్ద 'మహిళా శంఖారావం'నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో తెలంగాణ జాగృతి మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలతో కవిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మహిళా శంఖారావం'పోస్టర్లను విడుదల చేశారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా మహిళలకు రూ.2,500 చొప్పున ఇవ్వడం లేదు. ఒక్కో మహిళకు రేవంత్ ప్రభుత్వం బాకీ పడిన రూ.35 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి బస్సుల సంఖ్యను తగ్గించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై నిలదీస్తారనే భయంతో రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు చేసుకుని పారిపోయారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుంది' అని కవిత హెచ్చరించారు.



మహిళా శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

రేపు ఎస్సీ వర్గీకరణ, కులగణనపై కాంగ్రెస్ సమావేశం

గాంధీభవన్‌లో ప్రత్యేక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

హాజరుకానున్న సీఎం రేవంత్, మున్షీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి, హైదరాబాద్: కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాల్లో కాంగ్రెస్ పార్టీ పకడ్బందీగా ముందుకెళ్తోంది. సామాజికంగా సున్నితమైన ఈ విషయాల్లో తాము తప్పు చేశామనే భావన ఎక్కడా ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అందులో భాగంగా ముందుగా పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ రెండు అంశాలను అర్థం చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈనెల 14న గాంధీభవన్‌లో కులగణన, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథులుగా హాజరు కానున్న ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ప్రజెంటేషన్ ఇస్తారని గాంధీభవన్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న ఈ ప్రజెంటేషన్‌కు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ బాధ్యులు, పోటీ చేసిన అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పీసీసీ కార్యవర్గ సభ్యులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల నేతలు హాజరు కానున్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాల్లో ఎలాంటి పద్ధతులను ప్రభుత్వం పాటించింది? అనే అంశాలను పార్టీ ప్రతినిధులకు కూలంకషంగా వివరించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని టీపీసీసీ వర్గాలు చెప్పాయి.

అసమానతలు రూపుమాపేందుకే వర్గీకరణ

మూడు గ్రూపులుగా ఎస్సీల వర్గీకరణ

- వర్గీకరణ ఫలాలు ప్రతీ గడపకు చేరాలి
- మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలకు మంత్రి దామోదర దిశానిర్దేశం




సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్ కులాల్లోని అసమానతలను రూపుమాపేందుకే వర్గీకరణ అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వర్గీకరణ ఏ ఒక్క కులానికో, వర్గానికో వ్యతిరేకం కాదని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించి అపోహలు తొలగించాలని అన్నారు. ప్రతి గడపకూ వర్గీకరణ ఫలాలను తీసుకెళ్లే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కాగా, ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ వన్‌లో, మధ్యస్తంగా ఉన్న 18 కులాలను గ్రూప్ 2లో, కొంత మెరుగ్గా ఉన్న కులాలను గ్రూప్3లో చేర్చాలని కమిషన్ చేసిన సూచనకు అనుగుణంగా వర్గీకరణ జరుగుతుందన్నారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, లక్ష్మీకాంతరావు, అడ్లూరి లక్ష్మణ్, మందుల సామేల్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తదితరులతో భేటీ అయ్యారు. దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను నెరవేరుస్తున్న సందర్భంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదటినుంచీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. 2005లో అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్మానం చేశారని, ఆ తీర్మానం ఆధారంగా 2006లో నాటి యూపీఏ ప్రభుత్వం జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ వేసిందన్నారు. 2006 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో, 2024 ఆగస్టు ఒకటిన తీర్పు వచ్చిందని, తీర్పు వచ్చిన గంట లోపలే వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని తెలిపారు. ఆ వెంటనే కేబినెట్ సబ్ కమిటీని, వన్ మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించారన్నారు. కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన మరునాడే అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేశారని వివరించారు.

మా నినాదం.. మేమెంతో మాకు అంత!

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

బీసీల మేధోమథన సదస్సులో జస్టిస్ వి.ఈశ్వరయ్య



సాక్షి, హైదరాబాద్: 'మేమెంతో మాకు అంత'అనే నినాదంతో వెనుకబడిన తరగతుల్లోని ప్రజలంతా ఉద్యమించాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఈ రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం స్థానిక సంస్థల్లోనే కాకుండా విద్య, ఉద్యోగావకాశాల్లోనూ బీసీలకు 42 శాతం కోటా అమలు చేయాలన్నారు. పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సస్, ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్తంగా మేధోమథన సదస్సును బుధవారం బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి, ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదన్నారు. ఆయన బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిగా ప్రచారం చేసుకున్నప్పటికీ... బీసీలకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదన్నారు. అనంతరం బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రూపొందించిన ప్రైవేటు బిల్లును సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల్లోనూ బీసీలను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాచరణపై పీఆర్‌ఆర్‌డీ శిక్షణా తరగతులు

సాక్షి, హైదరాబాద్: మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీఈవో, ఆర్డీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణను వివరించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, ఇటీవల ప్రభుత్వపరంగా నిర్వహించిన కులగణనలో వెల్లడైన బీసీ రిజర్వేషన్లకు అనుగుణంగా ఆ రిజర్వేషన్లను ఖరారు చేయాలని సూచించినట్టు సమాచారం. ఈ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి చేయాల్సిన కసరత్తును గురించి ఓ మోడల్ ద్వారా వివరించారు. స్థానిక ఎన్నికల్లో చేపట్టాల్సిన రిజర్వేషన్ల ఖరారుపై విడిగా ప్రభుత్వపరంగా ఉత్తర్వులు విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ జీవోకు అనుగుణంగా పంచాయతీలు, మండలాలు, జిల్లాల వారీగా బీసీల రిజర్వేషన్లను ఖరారు చేస్తారు.

స్థానిక ఎన్నికల్లో 'నోటా'పై మీ అభిప్రాయం ఏంటి?

రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు కోరిన రాష్ట్ర ఎన్నికల సంఘం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 'నోటా'గుర్తు చేర్చే అంశంపై రాష్ట్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల అభిప్రాయాలను సేకరించింది. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ అంశంపై రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు కోరారు. స్థానిక ఎన్నికల బ్యాలెట్ పేపర్లపైనా నోటా గుర్తు ఉంచాలని బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం కోరగా, దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇంకా చట్టరూపం దాల్చనందున హడావుడిగా దానిని పెట్టాల్సిన అవసరం లేదని కాంగ్రెస్, బీజేపీ ఇతర పార్టీలు అభిప్రాయపడ్డాయి. బ్యాలెట్ పత్రాలు, ఈవీఎంలలో నోటా అనే అదనపు గుర్తు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు 2013లోనే ఆదేశించిన విషయాన్ని ఎన్నికల కమిషనర్ వివరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ఒక్కరే పోటీలో ఉంటే, పోలింగ్ జరపకుండానే ఆ వ్యక్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించే వ్యవస్థ ప్రస్తుతం అమలులో ఉంది. ఒకవేళ ఒకే వ్యక్తి బరిలో ఉన్నా, బ్యాలెట్ పేపర్‌లో నోటా గుర్తును చేర్చి ఎన్నికలు నిర్వహించే వ్యవస్థగా మార్చేందుకు అభిప్రాయాలను తెలియజేయాలంటూ రాజకీయపార్టీలను ఎన్నికల సంఘం కోరింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగియగానే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నప్పుడు, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ ఎన్నికకు వారం రోజుల వ్యవధి ఇవ్వడం ఎందుకని బీజేపీ నేత ఎస్.మల్లారెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో బి.కమలాకరరావు, పి.రాజేశ్‌కుమార్ (కాంగ్రెస్), సోమభరత్‌కుమార్, సీహెచ్ రాకేష్‌కుమార్, పల్లేరవికుమార్ (బీఆర్‌ఎస్), ఎస్.మల్లారెడ్డి, ఆంథోనిరెడ్డి (బీజేపీ), తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు (సీపీఐ), డీజీ నర్సింహారావు (సీపీఎం), సయ్యద్ ఖలీలుల్లా (ఎంఐఎం), అబ్బాస్ అహసాన్ (ఆప్), సురేందర్‌రెడ్డి (ఏఐఎఫ్‌బీ), నేమూరి శంకర్‌గౌడ్, రాధారాం రాజలింగం (జనసేన) పాల్గొన్నారు.



రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీకుముదిని

గ్రేటర్ మేయర్‌పై అవిశ్వాసం మీద వచ్చేవారం భేటీ

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అంశంమీద వచ్చే వారం కీలక సమావేశం ఉంటుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో జరిగే భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో భేటీ అనంతరం శ్రీనివాస్ యాదవ్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఈ నెల 17న తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణన సర్వే వివరాలు తప్పుల తడకలా ఉన్నాయన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 51 శాతంగా నమోదు కాగా, తాజా సర్వేలో తక్కువగా చూపారన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారే జనాభాలో 90 శాతం మంది ఉన్నారని పేర్కొన్నారు. బీసీలు, ముస్లింల జనాభా తగ్గి, ఓసీల జనాభా పెరిగిందని ప్రభుత్వం చెపుతున్న లెక్కలపై ఆయన మండిపడ్డారు.

మూడెకరాలలోపు రైతుభరోసా

- జమ చేస్తున్నట్టు ప్రకటించిన మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రైతుభరోసా పథకం కింద మూడో విడతలో మూడెకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో బుధవారం పెట్టుబడి సాయం జమ చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మూడెక రాలలోపు భూమి ఉన్న 9,56,422 మంది రైతుల ఖాతాల్లో రూ.1,230.98 కోట్లు జమ చేసినట్టు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇవి కాకుండా 2 ఎకరాలలోపు భూ రికార్డులను అప్‌డేట్ చేసిన తర్వాత మిగిలిపోయిన 56,898 మంది రైతులకు చెందిన 63,900 ఎకరాలకు రూ.38.34 కోట్లు అందజేసినట్టు వివరించారు. మూడు విడతల్లో కలిపి 44,82,265 మంది రైతులకు చెందిన 58.13 లక్షల ఎకరాలకు రూ.3,487 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. మిగతా వారికి కూడా త్వరలోనే జమ చేస్తామని మంత్రి తెలిపారు.

'కులగణన' పేరుతో రీ సర్వే చేయాలి: బండి



సాక్షి, హైదరాబాద్: కులగణన ఓ బోగస్ సర్వే అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. మళ్లీ ఇంటింటికీ వెళ్లి కులగణన పే రుతో రీసర్వే చేప ట్టాల్సిందేనని, గ్రామ సభల ఆమోదం పొందాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. 'బీసీల్లో ముస్లింలను చేరిస్తే ఒప్పుకునే ప్రసక్తే లేదు. బీసీ సామాజిక ఓటర్ల సంఖ్యను తగ్గించి చూపడం వెనుక కుట్ర ఉంది' అని ఆయన బుధవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. కుల గణన సర్వేలో 3.1 శాతం మంది పా ల్గొనలేదని, వారికోసం మళ్లీ రీసర్వే చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గ మన్నారు. కులగణనలో లేని 60 లక్షల మంది కిపైగా ప్రజలు ఏమైనట్టని ప్రశ్నించారు. 'తెలంగాణలో ఆధార్ కార్డులున్న వారి సంఖ్య 3 కోట్ల 95 లక్షలు. కానీ కులగణన సర్వేలో జనాభా 3 కోట్ల 70 లక్షలుగా కుదించడం పెద్ద బూటకం' అని ధ్వజమెత్తారు.

ఓబీసీల కలను నిజం చేస్తాం..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి


మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరోసారి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా వారి వివరాలను కూడా సేకరించనుంది. ఈ నెల 16 నుంచి 28 వరకు ఈ సర్వే నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్లకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశం జరిగింది. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను.. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, సీఎస్ శాంతికుమారి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి భట్టి మీడియాకు వెల్లడించారు.

బిల్లుకు పూర్తి చట్టబద్ధత కోసం చర్యలు

'రాష్ట్రంలోని బీసీలు, ఓబీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ, తదితర రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మార్చి మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా..దశాబ్దాల ఓబీసీల కలను నిజం చేసే దిశలో ఓబీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదింపజేసి పార్లమెంట్‌కు పంపిస్తాం. ఆ తర్వాత కలసి వచ్చే రాజకీయ పార్టీలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి ప్రతినిధి బృందం వెళుతుంది. ప్రధానితో పాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలను, అన్ని పార్టీల నేతలు, ఎంపీలను కలిసి ఈ బిల్లుకు పూర్తి చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు చేపడతాం. పార్లమెంట్‌లో ఓబీసీల రిజర్వేషన్ బిల్లు పాస్ చేయించేందుకు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలను, శక్తులను ఏకం చేస్తాం..' అని డిప్యూటీ సీఎం చెప్పారు.

మూడు పద్ధతుల్లో వివరాల నమోదు

'ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో 3.1 శాతం మంది పాల్గొనలేదు. అలాంటి వారు ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు తమ వివరాలు, సమాచారం నమోదు చేసుకోవచ్చు. మూడు పద్ధతుల్లో అంటే.. టోల్ ఫ్రీ నంబర్ (ఇంకా ప్రకటించలేదు)కు ఫోన్ చేసి, మండల కార్యాలయాల్లో ప్రజాపాలన అధికారుల వద్ద, ఆన్‌లైన్‌లో కుటుంబ వివరాల నమోదుకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి కోరితే అధికారులు వారి ఇంటికి వెళ్లి అన్ని వివరాలు నమోదు చేసుకుంటారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటి వారు గతంలో ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వలేదు. మరికొందరు అందుబాటులో లేకుండా పోయారు అలాంటి వారందరి కోసం మరోసారి అవకాశం కల్పిస్తున్నాం..' అని భట్టి వివరించారు.

బీసీల ప్రయోజనాల కోసం భారం మోసేందుకు సిద్ధం

'ఇప్పటికే ఏడాదికి పైగా ఎన్నికలు జరగకపోవడంతో పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. ఎన్నికలు ఆలస్యమైతే మరింత ఇబ్బంది అవుతుంది కదా..' అని ఓ విలేకరి ప్రశ్నించారు. దీంతో 'కులగణనలో రాష్ట్రంలో బీసీలు 56 శాతమున్నట్టుగా తేలిన నేపథ్యంలో వారి ప్రయోజనాల కోసం మరో 2, 3 నెలలు ఆర్థిక భారం పడినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది..' అని భట్టి బదులిచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా లక్ష మందికి పైగా సిబ్బందితో పూర్తి శాస్త్రీయంగా సమగ్ర ఇంటింటి సర్వే జరిగిందని చెప్పారు. బిల్లు ఆమోదం కోసం రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి అంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

మరోసారి సర్వే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: జాజుల

సమగ్ర ఇంటింటి కులగణన సర్వేను మరోసారి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీలు, ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి చట్టం చేయాలని నిర్ణయించడం శుభ పరిణామమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారికంగా సేవాలాల్ జయంతి నిర్వహించాలి

కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు టీ–బీజేపీ ఎంపీల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ జయంతిని ఫిబ్రవరి 15న దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం బీజేపీ ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావు, విశ్వేశ్వర్ రెడ్డి, గొడెం నగేశ్, మాజీ ఎంపీ సీతారామ్ నాయక్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, ఎస్టీ మోర్చా నాయకులు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

93 లక్షల గృహాలకు డిజిటల్ కనెక్టివిటీ

- ప్రపంచ బ్యాంకు బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ


మంత్రి శ్రీధర్ బాబుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 93 లక్షల గృహాలను డిజిటల్ కనెక్టివిటీ పరిధిలోకి తీసుకువస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. టీ ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించామన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు బుధవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా పైలట్ ప్రాజెక్టును చేపట్టిన నాలుగు గ్రామాల్లో ఇటీవల ప్రపంచ బ్యాంకు బృందం పర్యటించింది. ఈ భేటీలో తమ క్షేత్రస్థాయి పర్యటన అనుభవాలను మంత్రితో పంచుకుంది. హాజిపల్లి (రంగారెడ్డి జిల్లా), మద్దూర్ (నారాయణ్‌పేట), సంగుపేట (సంగారెడ్డి), అడవి శ్రీరాంపూర్ (పెద్దపల్లి) గ్రామాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీతో స్థానికులకు కలిగిన ప్రయోజనాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్టు బృందం సభ్యులు వైజయంతీ దేశాయ్, కింబర్లీ జాన్స్.. మంత్రికి వివరించారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు శ్రీధర్‌బాబు వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటికే 32 వేల కి.మీ. పొడవున ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ఇషిరా మెహతా, అరుణ్ శర్మ, స్యూ సంజ్ ఎంగ్ పాల్గొన్నారు.

'స్థానికం'.. ఇప్పట్లో లేనట్టే!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

మరో విడత కులగణన సర్వే..

రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేలో పాల్గొనని 3.1 శాతం (దాదాపు 16 లక్షల మంది) వివరాల నమోదు కోసం మరో విడత సర్వే నిర్వహించాలని నిర్ణయించామని సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాకు చెప్పారు. ఆ సర్వే తర్వాత బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్లు సాధిస్తామని తెలిపారు. తద్వారా 'స్థానిక' ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు పరోక్షంగానే బయటపెట్టారనే చర్చ జరుగుతోంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడినట్టేనని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీలో బీసీ బిల్లును ఆమోదించి పార్లమెంట్‌కు పంపడం, అక్కడ ఆమోదం పొందడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో.. రాష్ట్రంలో రిజర్వేషన్లు ఖరారు కాక స్థానిక ఎన్నికలు మరికొన్ని నెలలు వాయిదా పడవచ్చని రాజకీయవర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్, మున్సిపాలిటీల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందని, మే లేదా జూన్‌లో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

వడివడిగా అడుగులు వేసినా..

బీసీ డెడికేటెడ్ కమిషన్ వేగంగా అధ్యయనం పూర్తి చేసి సర్కారుకు నివేదిక అందజేయడం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక అందడం, కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ అంశాలపై అసెంబ్లీలో చర్చ వంటి పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈనెల 15వ తేదీలోగా వస్తుందని కొందరు మంత్రులు బహిరంగంగా ప్రకటించారు. ఎన్నికలకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖలు కసరత్తు చేపట్టాయి. సిబ్బందికి శిక్షణ, జిల్లా కలెక్టర్లకు ఓరియంటేషన్ కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి.. ఈ నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలోగా మండల, జిల్లా పరిషత్, ఆ తర్వాత వారం రోజుల వ్యవధి ఇచ్చి పంచాయతీ ఎన్నికలు నిర్వహించవచ్చని ప్రచారం జరిగింది. బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల బ్యాలెట్ పేపర్లపై 'నోటా' గుర్తు చేర్చు అంశంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం కూడా జరిగింది.

ఎన్నికలపై భిన్నాభిప్రాయాల మధ్య..

స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలా, వద్దా అన్న అంశంపై బుధవారం సీఎం ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగిందని తెలిసింది. తక్షణమే ఎన్నికలకు వెళ్లాలని కొందరు మంత్రులు ప్రతిపాదించగా.. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు తదితరులు రిజర్వేషన్లపై బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారని తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై చట్టబద్ధత కల్పించే దిశగా ముందుకెళ్లాలని వారు స్పష్టం చేశారని సమాచారం. స్థానిక సంస్థలకే కాకుండా విద్య, ఉద్యోగపరంగా కూడా బీసీలకు తగిన రిజర్వేషన్లను కల్పించాలని వారు అభిప్రాయపడ్డారని తెలిసింది. మరోవైపు వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుంటే కేంద్రం నుంచి అందాల్సిన విధులు రావని.. వీలైనంత త్వరగా నిర్వహించాలని కొందరు మంత్రులు సూచించారని సమాచారం. అయితే ఈ అంశం చాలా సున్నితమైనదని.. బీసీల రిజర్వేషన్లు కీలకమని, ఈ విషయంలో విధుల కంటే కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిబద్ధత ముఖ్యమని సీఎం రేవంత్‌తోపాటు మరికొందరు అభిప్రాయపడ్డారని తెలిసింది. ఈ క్రమంలో బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని, అసెంబ్లీలో బిల్లును ఆమోదించి, తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్‌లో ఈ అంశాన్ని పొందుపరచాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారని సమాచారం.

రీసర్వే అయినా సరిగా చేయండి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కులగణన సర్వే తప్పుల తడక అని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఒప్పుకుందని, సర్కారు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీసీల జనాభాను తగ్గించి, వారికి తీవ్ర మనోవేదన కలిగించినందుకు సీఎం రాష్ట్రంలోని బీసీలందరికీ క్షమాపణలు చెప్పాలని ఎక్స్ వేదికగా బుధవారం ఆయన డిమాండ్ చేశారు. కనీసం మలి విడత సర్వే అయినా సమగ్రంగా నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు.

దక్షిణాది రాష్ట్రాలను అవమానించడం తగదు: హరీశ్‌రావు

ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు మరింత వృద్ధి చెందేలా చేయూత ఇవ్వాలని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తే 'చోటి సోచ్' అని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ అవమానించడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచే శారు. తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధే దేశ అభివృద్ధికి తోడ్పడుతుందన్న విషయాన్ని గుర్తించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డీసీసీబీల పదవీకాలం పొడిగింపు?

- రాష్ట్రంలో 9 డీసీసీబీ, 906 పీఏసీఎస్ చైర్మన్ పదవులు
- ఈ నెలతో ముగియనున్న పాలక మండళ్ల పదవీకాలం
- ఆరు నెలలు పొడిగించాలని మంత్రి తుమ్మలను కోరిన చైర్మన్లు
- 8 డీసీసీబీలు కాంగ్రెస్ చేతిలోనే ఉండటంతో పొడిగించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)ల పాలక మండళ్ల పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. మరికొద్ది రోజుల్లో ఐదేళ్ల పదవీకాలం ముగియనున్న 9 డీసీసీబీలతోపాటు 906 పీఏసీఎస్‌లకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం కరీంనగర్ మినహా మిగతా 8 జిల్లాల డీసీసీబీ చైర్మన్లు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నేతృత్వంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి తమ పదవీకాలాన్ని పొడిగించాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆయన సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని వారికి మంత్రి హామీ ఇచ్చారు. కాగా, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించి ఒకటిరెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

8 మంది చైర్మన్లు కాంగ్రెస్ వాళ్లే

ఐదేళ్ల క్రితం రాష్ట్రంలోని 9 డీసీసీబీ చైర్మన్ పదవులను బీఆర్‌ఎస్ గెలుచుకున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిలో కొందరు అధికార పార్టీలో చేరారు. మరికొన్నిచోట్ల అవిశ్వాస తీర్మానాల ద్వారా పాత చైర్మన్లను తొలగించి కొత్తగా కాంగ్రెస్‌వారు ఎన్నికయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం 8 మంది డీసీసీబీ చైర్మన్లు, సుమారు 700 మంది పీఏసీఎస్ చైర్మన్లు, ఇతర పాలక మండళ్ల సభ్యులు కాంగ్రెస్‌వారే. దీంతో వీరి పదవీకాలాన్ని పొడిగించే విషయంలో సీఎం కూడా సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.

26న కొలకలూరి పురస్కారాల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 26న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కొలకలూరి పురస్కారాల ప్రదానం జరగనుందని ప్రొఫెసర్లు కొలకలూరి మధుజ్యోతి, కొలకలూరి సుమకిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొలకలూరి భాగీరథీ పురస్కారం–2025కి.. జూకంటి జగన్నాథం రచన 'ఒక కప్పు చాయ్– నాలుగు మెసేజ్‌లు' ఎంపికైంది. కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం–2025కి.. టూకుమళ్ల వెంకటప్పయ్య 'స్వర్గాదపీ గరీయసి', కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం–2025కి.. గడ్డం మోహనరావు 'చిందోళ్ల చరిత్ర, సంస్కృతి–సాహిత్యం' ఎంపికైనట్టు వివరించారు. రచయితలకు రూ.15 వేలతో పాటు సత్కారం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.



జనాలు భావ ప్రకటనా స్వేచ్ఛను కోరుకుంటారు.
కానీ ఆలోచనా స్వేచ్ఛను అరుదుగా ఉపయోగించుకుంటారు.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 13 ఫిబ్రవరి 2025

కుంటిసాకులు

ఇప్పటికే సమస్త జీవన రంగాలనూ అల్లుకుపోయిన కృత్రిమ మేధ (ఏఐ)పై పారిస్‌లో వరసగా రెండురోజులపాటు కొనసాగి మంగళవారం ముగిసిన మూడో శిఖరాగ్ర సదస్సు ఆశించిన ఫలితాలు అందించలేకపోయింది. సరిగ్గా రెండేళ్ల క్రితం బ్రిటన్‌లోని బ్లెచ్‌లీ పార్క్‌లో జరిగిన తొలి ఏఐ శిఖరాగ్ర సదస్సు (సేఫ్టీ సమ్మిట్) పూర్తిగా భద్రతాపరమైన అంశాలపై దృష్టిపెట్టింది. నిరుడు దక్షిణ కొరియాలోని సియోల్‌లో జరిగిన రెండో శిఖరాగ్ర సదస్సు ప్రముఖ ఏఐ సంస్థల నుంచి భద్రతకు సంబంధించి నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటామన్న వాగ్దానాలు పొందగలిగింది. దానికి కొనసాగింపుగా పారిస్ శిఖరాగ్ర సదస్సును 'ఏఐ యాక్షన్ సమ్మిట్'గా నామకరణం చేశారు. ఏఐ పరిమితులేమిటో, అంతర్జాతీయ స్థాయిలో అందుకు పాటించాల్సిన నిబంధనలేమిటో ఈ శిఖరాగ్ర సదస్సు నిర్దేశిస్తుందని అందరూ ఊహించారు. కానీ బ్లెచ్‌లీ సదస్సు సాధించిన కొద్దిపాటి విజయాలనూ పారిస్ సదస్సు ఆవిరి చేసింది. దాపరికం లేని, సమ్మిళిత ఏఐ సాధనకు సమష్టిగా కృషి చేయాలన్న పిలుపునైతే ఇచ్చిందిగానీ, ఈ డిక్లరేషన్‌పై సంతకం చేసేది లేదని అమెరికా, బ్రిటన్‌లు మొరాయించాయి. మనతోపాటు 60 దేశాలు అంగీకరించిన ఈ డిక్లరేషన్‌ను అగ్రరాజ్యాలు కాదన్నాయంటే ఈ రంగం తీరుతెన్నులు ఎలా వుండబోతున్నాయో అంచనా వేయొచ్చు. 'కొన్నేళ్ల క్రితం చర్చించిన ఏఐ భద్రత గురించి మాట్లాడటానికి ఇక్కడకు రాలేదు. ఏఐలో వెల్లువలా వచ్చిపడే అవకాశాలే నావరకూ ప్రధానాంశం' అని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుండబద్దలు కొట్టారు. ఆయన ప్రస్తావించిన ఏఐ భద్రత అనేది నిజానికి 2023లో బ్రిటన్ చొరవతో బ్లెచ్‌లీ పార్క్ శిఖరాగ్ర సదస్సులో లోతుగా చర్చించిన అంశం. కానీ సదస్సులో పాల్గొన్న బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆ సంగతే గుర్తులేనట్టు వ్యవహరించి అమెరికా తోకపట్టుకుపోయారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా దేశాల వైఖరులు మారితే అంతర్జాతీయంగా వాటికి విశ్వసనీయత ఏముంటుంది? ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పారిస్ వాతావరణ ఒడంబడిక నుంచి బయటికొస్తున్నట్టు ప్రకటించారు. లక్షల కోట్ల పెట్టుబడితో ప్రధాన ఏఐ సంస్థలన్నీ సాగిస్తున్న పరిశోధనలు భవిష్యత్తులో ఎటువంటి కొత్త ఆవిష్కరణలకు అంకురార్పణ చేస్తాయో, అవి ప్రపంచ పౌరుల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపగలవోనన్న ఆందోళన అగ్రరాజ్యాలకు లేశమాత్రమైనా లేదని తేలిపోయింది.

ఏఐతో ఉద్యోగాలకు ముప్పు వచ్చిపడుతుందని, భవిష్యత్తు అగమ్యగోచరమవుతుందని అన్ని దేశాల్లోనూ భయాందోళనలున్నాయి. వందమంది గంటలో చేయగల పని ఏఐ కొన్ని క్షణాల్లో చేసి చూపటాన్ని గమనిస్తే అవి సహేతుకమైనవేనన్న అభిప్రాయం కలుగుతుంది. అయితే శిఖరాగ్ర సదస్సుకు సహాధ్యక్షత వహించిన ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు ఉద్యోగాల స్వభావం మారుతుంది తప్ప ఉద్యోగాలు పోవు. కొత్త సాంకేతికతలు అడుగుపెట్టినప్పుడు ఆ నైపుణ్యతలను పెంచుకోలేనివారికి ఇబ్బందులుంటాయి. ఆ సాంకేతికతల్ని లొంగదీసుకోవటమే ఇందుకు పరిష్కారం. ఏఐ ఇప్పుడు దాదాపు అన్ని రంగాల్లోనూ అద్భుతాలు సృష్టిస్తోంది. ముఖ్యంగా వైద్య, వైజ్ఞానిక రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిశోధనలు పూర్తి స్థాయిలో అందుబాటులోకొస్తే ఊహకందని వినూత్న ఆవిష్కరణలు రంగప్రవేశం చేస్తాయి. చికిత్సకు లొంగని మొండివ్యాధులు పలాయనం చిత్తగిస్తాయి. ఆయుఃప్రమాణాలు పెరుగుతాయి. అయితే రక్షణ, యుద్ధతంత్ర, అంతరిక్ష రంగాల్లో ఇది సృష్టించగల ఉత్పాతాలు చిన్నవేమీ కాదు. ఇందుకు కొత్త తరం ఏఐ మోడల్స్ ఉదాహరణ. తాజా మోడల్ ఒకటి సవరణలకు అవకాశం లేకుండా తన సృజనకర్తనే పక్కదారి పట్టించేలా తనను తాను కాపీ చేసుకుందని ఆ రంగంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు బయటపెట్టారు. వచ్చే అయిదేళ్లలో సూపర్ హ్యూమన్ స్థాయి ఏఐ రూపొందటం ఖాయమని వారంటున్నారు. భద్రతకు సంబంధించి ఏఐలో సాగుతున్న పరిశోధనల్లో తలెత్తే ప్రశ్నలకు పరిష్కారం కనుగొనకపోతే పరిణామాలు దారుణంగా ఉంటాయన్నది వారి హెచ్చరిక.

కానీ అమెరికా తప్పుడు సూత్రీకరణలు చేస్తోంది. భద్రత గురించిన జాగ్రత్తలను సెన్సార్‌షిప్‌గా వక్రీకరిస్తోంది. యూరప్ యూనియన్ (ఈయూ) రూపొందించిన నియంత్రణ చట్టాలు ఆ రంగం పీకనొక్కడానికే పనికొస్తాయని వాన్స్ భాష్యం చెబుతున్నారు. ఏఐ విషయంలో సైద్ధాంతిక పక్షపాతాలకు అతీతంగా వ్యవహరించాలని, స్వేచ్ఛనీయాలని ఆయన డిమాండ్. తప్పుడు సమాచార వ్యాప్తిని గుర్తించి తొలగించటానికి ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాలు రూపొందించుకున్న ఉపకరణాలను (ట్రంప్ వస్తారనగానే ఆ సంస్థలు స్వచ్ఛందంగా వాటిని ఉపసంహరించుకున్నాయి) సెన్సార్‌షిప్‌గా వక్రభాష్యం చెప్పినవారు ఇంతకుమించి ఆలోచించగలరా? ఏఐ రంగంలో ఇప్పట్లాగే భవిష్యత్తులోనూ తన ప్రాబల్యమే కొనసాగుతుందని, దాన్ని గుప్పెట్లో పెట్టుకుని లక్షల కోట్ల లాభాలు ఆర్జించవచ్చని అమెరికా కలగంటోంది. కానీ ఇటీవల చైనానుంచి వచ్చిన డీప్‌సీక్ దూకుడు గమనిస్తే ఈ రంగం ఎవరి జాగీరూ కాదని స్పష్టమవుతోంది. ఇలా నిరంతరం ఊహాతీతంగా చకచకా ఎదుగుతున్న రంగానికి బాధ్యతాయుతమైన మార్గాన్ని నిర్దేశించకపోతే దానివల్ల మానవాళికి ముప్పు కలిగే అవకాశం లేదా? సురక్షిత, హేతుబద్ధ, పార దర్శక ఏఐ రూపొందటానికి దేశాలన్నీ సమష్టిగా కృషి చేయకపోతే, సాధించే అభివృద్ధిని ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి నెలకొల్పనట్టయితే అది స్వీయ వినాశనానికే దారితీస్తుందని అన్ని దేశాలూ గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.7.47 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** మఖ రా.8.51 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.8.16 నుండి 9.56 వరకు, తదుపరి తె.5.25 నుండి 7.05 వరకు (తెల్లవారితే శుక్రవారం). **దుర్ముహూర్తం:** ఉ.10.22 నుండి 11.10 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** సా.6.20 నుండి 7.56 వరకు

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఏఐలో చైనాతో పోటీ పడగలమా?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

లియాంగ్ వెన్‌ఫెంగ్ అనే 39 ఏండ్ల చైనా యువకుడు తన నూతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ– కృత్రిమ మేధ) కంపెనీలో అతి తక్కువ ఖర్చుతో ఒక అద్భుతం చేశాడు. అతను డీప్‌సీక్ అనే కొత్త చాట్ బాట్ యాప్‌ను కనిపెట్టి ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశపెట్టాడు. జనవరి చివరి వారంలో ప్రవేశపెట్టిన ఈ సెర్చ్ ఇంజిన్ ఒక్కరోజులోనే అమెరికాకు ఒక ట్రిలియన్ డాలర్లు, అంటే ఒక లక్ష కోట్ల నష్టాన్ని తెచ్చిపెట్టింది. అమెరికాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చిప్‌లు తయారుచేసే కంపెనీలు భారీ నష్టాన్ని చవిచూశాయి.

సులభంగా అర్థమయ్యే భాషలో చెప్పాలంటే, ఇప్పుడు ప్రపంచ సమాచార సెర్చ్ అంతటినీ గూగుల్ కంపెనీ గుప్పిట్లో పెట్టుకొని ఉంది. అంతేకాకుండా ఇతర యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ మొదలైనవన్నీ అమెరికన్ల పరిశోధనలో రూపుదిద్దుకున్నవే. ఈ రంగంలో చైనావారు కూడా ఈ అమెరికా టెక్నాలజీని తీసుకొని తమ దేశ అవసరాలకు అప్లై చేసుకుంటున్నారు. లియాంగ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పిన దాని ప్రకారం, చైనాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ ఇప్పటివరకు జరుగలేదు. ఆధార ఏఐ సైన్సును లియాంగ్ ఇన్నోవేటివ్ సైన్సుగా మార్చాడు.

హేతుపూర్వక సమాజం

ఐతే చైనా చాలా ఇతర రంగాల్లో ఇన్నోవేషన్లు చేస్తూ వస్తున్నది. అది కమ్యూనిస్టు దేశంగా మారకముందే తమ దేశంలోని అగ్రికల్చరిజం అనే ఫిలాసఫీని కన్ఫ్యూషియనిజం, బుద్ధిజంతో జతపర్చి సమాజాన్ని ఒక హేతుపూర్వక సమాజంగా మారుస్తూ వచ్చింది. మతతత్వానికంటే ముందే వారు వ్యవసాయ తత్వానికి పాఠశాలల్లో ఉన్నత స్థానమిచ్చారు. పిల్లల్ని బడి నుండి పొలానికి, పొలం నుండి బడికి పంపి... పని, పాఠాలు కలగలిపి నేర్పించారు. చైనా పాఠశాల విద్యా విధానం వందల సంవత్సరాల శ్రమ జీవన పాఠాలతో ముడిపడింది. ఆ దేశంలో మతాన్ని, హేతుబద్ధతను ముడేశారు. దాన్ని పిల్లలకు నేర్పే అగ్రికల్చరిజం ఫిలాసఫీతో అనుసంధానించారు. భూమికి, ఆకాశానికి, ప్రకృతికి, వానకు, గాలికి గల సంబంధాన్ని మెటీరియలిస్ట్ ఆధ్యాత్మికతకు అనుసంధానించడం వల్ల చిన్నప్పటినుండే పిల్లల మెదళ్లలో క్రియేటివ్ దైవవాదం ఏర్పడింది. ఈ విధానాన్ని సభ్య సమాజమంతటికీ అనుసంధానించారు. తద్వారా వారి దైవం ఉత్పత్తిలో భాగమయ్యాడు లేదా అయింది.

అందుకే గన్ పౌడర్, కాగితం, కంపాస్, అచ్చు యంత్రం, సిస్మోమీటర్ (భూకంపాల అధ్యయన మిషన్) ముందు వాళ్ళే కనిపెట్టారు. సిస్మోమీటర్‌ను 1880లో బ్రిటిష్ జాన్ మిల్నే కనుక్కున్నాడని రాసుకున్నప్పటికీ అది మొదలు చైనా కనిపెట్టిందే. ఆ సైన్సు తరువాత జపానుకు పాకి వారిని చాలా భూకంపాల నుండి కాపాడింది.

డెంగ్ షియావోపింగ్ కాలంలో ప్రపంచ ఆధునిక సైన్సుతో తమ సైన్సును అనుసంధానం చేస్తున్నప్పుడు, మావో ధరించే 'బంద్ గలా కోటు' తమదేనా లేదా 'టై అండ్ సూట్' తమదా అని చర్చ జరిగింది. ఐతే టై-సూట్ చైనా డిస్కవరీ అని చారిత్రక ఆధారాలు దొరికాయి. దాంతో అధ్యక్షుడి నుండి కిందిస్థాయిల వరకు టై-సూట్‌ను అధికార డ్రెస్‌కోడ్‌గా మార్చుకున్నారు.



◆ చైనా పాఠశాల విద్యా విధానం వందల ఏళ్ల శ్రమ జీవన పాఠాలతో ముడిపడింది. వారు పని, పాఠాలు కలగలిపి నేర్పించారు. దాంతో ఉత్పత్తి చైనీయుల జీవితంలో భాగమైంది.

ఇండియా పరిస్థితి ఏమిటి?

చైనా యువకులు గత ముప్పయి సంవత్సరాలుగా యూరో–అమెరికా డిస్కవరీస్‌తో పోటీ పడాలని ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. మావో కల్చరల్ రెవల్యూషన్ కాలంలో ఇచ్చిన నినాదం 'మాయావాదాన్ని బద్దలుకొట్టి, ప్రకృతిని పఠించు'. ఆయన యునాన్ రిపోర్టులో ఆ దేశంలోని అగ్రికల్చరిజం తత్వభూమికను బాగా అర్థం చేసుకున్నాడు. ఈ మొత్తం పరిణామ క్రమమే చైనాలో సైన్సు, మతం, నైతికత జాగ్రత్తగా అనుసంధానం కావడం. ఆ సామాజిక చైతన్యం నుండే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వాళ్ళు అమెరికాను తలదన్నే మార్గంలో ఉన్నారు. అందులో భాగమే డీప్‌సీక్. మరి మన దేశం స్థితి ఏమిటి?

ఋగ్వేద రచనా కాలంలోనే ఇక్కడి అగ్రికల్చరిజం ఫిలాసఫీని చంపేశారు. ఉత్పత్తి రంగంలో శాస్త్రీయ శ్రమ చేస్తున్న శూద్రులను (దళితులూ అందులో భాగమే) బానిసలుగా మార్చి, శ్రమశక్తి అజ్ఞానమని నిర్వచించారు. ఈ ఆలోచనను బలోపేతం చెయ్యాలని ఆరెస్సెస్–బీజేపీ నాయకత్వం సైన్సు నుండి మతాన్ని సంపూర్ణంగా విడగొట్టాలనే భావనతో పయనిస్తోంది. చైనా డీప్‌సీక్ కనిపెట్టి అమెరికాను అతలాకుతలం చేసిన రోజులలోనే కుంభమేళాపై వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ద్వారా ఖర్చవుతున్నాయి. ఉత్పత్తికీ, ఆధునిక సైన్సుకూ పూర్తిగా దూరంగా ఉండేవారికి మీడియా ద్వారా విపరీతమైన ప్రచారం చేస్తున్నారు. వీటి ప్రభావం లక్షలాది మంది స్కూలు, కాలేజీ పిల్లల మీద పడి దీన్నే భారతదేశ మార్గంగా భావించే దశకు తీసుకెళ్తున్నారు. ఉత్పత్తితో ముడిపడినవారికి స్తుతి చెయ్యట్లేదు. కూర్చొని తినేవారికి రాజ్యం గౌరవ పీఠం వేస్తుంది. ఇంగ్లిష్ వ్యతిరేక ప్రచారం, పురాతన దుస్తులు ధరించాలనే ప్రచారం యువకులను కచ్చితంగా సైన్సు వ్యతిరేకులను చేస్తుంది. ఈ దేశపు యువతను సీరియస్ యూనివర్సిటీ పరిశోధకులను చెయ్యనివ్వకుండా మూఢ నమ్మకస్తుల్ని చేస్తుంది.





డీప్‌సీక్ సీఈవో లియాంగ్ వెన్‌ఫెంగ్

◆ చైనాతో సమానంగా ఉన్న ఇంత పెద్ద జనాభాను సైన్సుకు శత్రువులను చేస్తే కొత్త ఆలోచనలు ఎక్కడి నుండి వస్తాయి?

◆ కొత్త డిస్కవరీలు జరగాలంటే డబ్బు ఒక్కటే సరిపోదు. శాస్త్రవేత్తలు ఆవిర్భవించే సామాజిక, గృహ, మార్కెట్, మత పునాది ఉండాలి.

ప్రశ్నించే తత్వం ముఖ్యం

చైనాలో అది మతరంగంలోగాని, ఉత్పత్తి రంగంలో గాని, యూనివర్సిటీలోగాని ప్రశ్నించే తత్వాన్ని బాగా నేర్పుతారు. మావో 'వంద ఆలోచనలు ఘర్షణ పడనివ్వు, వంద పువ్వులు వికసించనివ్వు' నినాదం వాళ్ళ సంఘర్షణల చరిత్ర నుండి వచ్చింది. కానీ ఇండియాలో స్కూళ్లు, యూనివర్సిటీల్లో మతరంగాన్ని, అంతకంటే ముఖ్యంగా ఉత్పత్తి రంగాన్ని ఆలోచనల ఘర్షణలకు బయట నడవాలనే సంప్రదాయాన్ని ప్రచారం చేస్తున్నారు. మోహన్ భాగవత్ ఉత్పత్తికీ, దేవుడికీ మధ్య సంబంధం, ఘర్షణ గురించి ఒక్క ఉపన్యాసం ఇవ్వగా మనం చూడలేదు. మోదీ కూడా నెహ్రూ లాగా సైన్సు మీద ఒక్క సుదీర్ఘ ఉపన్యాసం ఇవ్వలేదు. చైనాతో సమానంగా ఉన్న ఇంత పెద్ద జనాభాను సైన్సుకు శత్రువులను చేస్తే కొత్త ఆలోచనలు యువతకు ఎక్కడి నుండి వస్తాయి?

నేను ఇంతకుముందు వ్యాసంలో చెప్పినట్లు... కులం, ఏకవృత్తి, మూఢ నమ్మకాలు వేల ఏండ్లుగా మన మెదడు చిప్‌ను లాక్ చేసిన స్థితి ఉన్నది. ఆరెస్సెస్/బీజేపీ ప్రయత్నం ఈ లాక్ చెయ్యబడ్డ చిప్‌ను ఓపెన్ చెయ్యడం వైపు లేదు. వారి రాజకీయ మూఢ నమ్మకం ఈ లాక్‌ను తుప్పు పట్టించింది. అది పగల కొడితే తప్ప ఓపెన్ కాదు. కానీ అలాంటి ప్రయత్నం మన విద్యా రంగంలో ఎవరు మొదలు పెట్టినా వారిని దేశద్రోహులు, సనాతన వ్యతిరేకులు అని ముద్ర వెయ్యడం, భయభ్రాంతులకు గురి చెయ్యడం మామూలైంది. ఈ స్థితిలో చైనాతో పోటీపడే డిస్కవరీస్ ఇక్కడ ఎలా జరుగుతాయి? కొత్త డిస్కవరీలు జరగడానికి డబ్బు ఒక్కటే సరిపోదు. సైంటిస్టును అభివృద్ధి చేసే సామాజిక, గృహ, మార్కెట్, మత పునాది ఉండాలి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

సోషల్ మీడియా

త్యాగ బంధం



లక్ష కంటే ఎక్కువమంది భారతీయులు 1914లో(మొదటి ప్రపంచ యుద్ధం) ఫ్రాన్స్ కోసం పోరాడారు. పది వేల మంది మళ్లీ ఎప్పటికీ తిరిగిరాలేదు. బురదతో కూడిన కందకాల్లో పోరాడటం కోసం, మరణం దిశగా నడుస్తున్నామని తెలియకుండా వాళ్లు మాసే (ఫ్రాన్స్ నగరం) నేల మీద కాలుమోపారు. ఫ్రాన్స్, ఇండియాను వాళ్ల త్యాగం ఎప్పటికీ కలిపి ఉంచుతుంది.

– ఇమాన్యుయల్ మెక్రాన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు

ముఖ్యం కాదా?



ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ శిఖరాగ్ర సమావేశంలో పాకిస్తాన్ పాల్గొనకపోవడం అనేది నిజంగా ఆందోళనకరం. మన ప్రాధాన్యాలు ఏమిటో పునరాలోచించుకోవాలి.

– అబ్దుల్ బాసిత్, పాకిస్తాన్ మాజీ రాయబారి

సమ్మతి లేకపోతే నేరమే!



వైవాహికమా, ఇంకోటా అని కాకుండా అత్యాచారం అనేది దారుణ నేరం. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. పార్టీలకు అతీతంగా మహిళా ఎంపీలందరూ ఒక్క గొంతుకతో మాట్లాడి, వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించేలా చేయాలి. లేదంటే ఏ శిక్షా భయం లేకుండా మరింత మంది పురుషులు భార్యలు చచ్చిపోయేలా అత్యాచారాలు చేస్తారు. (అసహజ లైంగిక కృత్యం ద్వారా భార్య మరణానికి కారణమైన భర్తను ఛత్తీస్‌గఢ్ హైకోర్టు వదిలేసిన నేపథ్యంలో.)

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

మన తీరు



మనదో విచిత్రమైన దేశం. కమెడియన్ల నుంచి బాధ్యతను, రాజకీయ నాయకుల నుంచి కామెడీని డిమాండ్ చేస్తాం.

– ప్రణవ్ మెహతా, ఆంట్రప్రెన్యూర్

తైవాన్‌కూ వర్తిస్తుందా?



'గాజా పాలస్తీనియన్లకు చెందుతుంది. అది పాలస్తీనా భూభాగంలో అంతర్భాగం' అని చెబుతోంది చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటన... తైవాన్ కూడా తైవానీస్ ప్రజలకు చెందినట్టుగానే, వాళ్ల ప్రాదేశిక హక్కులు, ప్రత్యేక గుర్తింపు, ప్రజాస్వామిక స్వేచ్ఛలకు అది ముఖ్యం అయినట్టుగానే!

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

శాంతి సందేశమా?



రాత్రి ఉక్రెయిన్ మీద రష్యా నుంచి భారీ బాంబుల దాడి జరిగింది. ఉక్రెయిన్‌లో ప్రతి అర్ధరాత్రి వైమానిక దాడులతో మొదలవుతోంది. శాంతి కోసం తన 'సంసిద్ధత'ను రష్యా ఈ విధంగా చూపుతోందనుకుంటాను. శాంతిని నెలకొల్పాలంటే రష్యా మీద ఒత్తిడి తేవాలి, ఉక్రెయిన్ మీద కాదు.

– వ్లాదిమీర్ యెర్మొలెంకో, ఉక్రెయిన్ సంపాదకుడు

పనికి వెళ్లలేం!



ముంబయిలో ఒక ఏడాదంతా పూర్తిగా వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చి రోడ్లను బాగు చేయించాలి. సమస్య తీవ్రమైన నవ్వులాటగా మారుతోంది.

– మనీషా సింఘాల్, కంటెంట్ క్రియేటర్

ఇన్ బాక్స్

అమెరికా? అనాగరికా?

అమెరికా అధ్యక్షుడి ఆలోచనలు, నిర్ణయాలు, చర్యలు అనాగరికంగా తయారవుతున్నాయి. అవి ఆ దేశాన్ని గొప్పగా మారుస్తాయో లేదో గానీ ఇతర దేశాలకు తలనొప్పిని తెస్తున్నాయి. రాజకీయ, ఆర్థిక, భౌగోళిక స్థితుల్ని తలకిందులు చేసేవిగా ఉన్నాయి. ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యపై అధ్యక్షుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ... అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం. అంతవరకూ అభినందనీయమే. ఒకప్పుడు వలసల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ ఆర్థిక శక్తిగా మారిన దేశం వలసల్ని నేడు అరికట్టాలని అనుకోవడం వారి అవసరం. అందునా అక్రమంగా వచ్చిన వాళ్ళని ఆపడం, వెనక్కి పంపించడంలో ఎవరికీ ఆక్షేపణ, అభ్యంతరం ఉండనక్కర లేదు. కానీ వారిని గొలుసులతో బంధించి, అమానవీయంగా సైనిక విమానాల్లో తరలించడం ఒకింత అతి. దొంగతనం నేరమే కావొచ్చు కానీ రూపాయి దొంగిలించినవాడిని గుండుకొట్టి ఊరేగించడం చేస్తే అతి అంటారు. అది అన్యాయం కూడా! తాము కఠినంగా ఉన్నాం అని చెప్పుకోడానికి ఇంత తీవ్రంగా వ్యవహరించనక్కరలేదు. మన దేశం ఈ విషయమై అభ్యంతరం వెలిబుచ్చి, వారిని ఉన్నంతలో మర్యాదగా తీసుకురావడానికి కృషి చెయ్యాల్సింది.

ఇక రెండోది గాజా భూభాగాన్ని ఖాళీ చేసి అక్కడ నివాసముంటున్న పాలస్తీనీయుల్ని వేరే చోటకు తరలిస్తాడట అమెరికా అధ్యక్షుడు. అలా చెయ్యడానికి అదేమైనా అమెరికా సొంతమా? ఒక సార్వభౌమిక దేశం. ఇజ్రాయెల్ దాడిలో నష్టపోతూ, లక్షలాది మంది అన్యాయంగా నిరాశ్రయులైన దేశం. వీలైతే యుద్ధాన్ని ఆపి, అక్కడి ప్రజలకు సాంత్వన కలిగించాలి. క్షతగాత్రులకు,అమాయక ప్రజలకు మానవతా దృక్పథంతో అందుతున్న సాయాన్ని కూడా అందనివ్వకుండా చేస్తున్న ఇజ్రాయెల్‌కు బుద్ధి చెప్పాలి. అది కాదు కదా... అక్కడున్న స్థానిక ప్రజలందరినీ కట్టగట్టి ఎక్కడికో పంపించేస్తాననడం దురహంకారం. ఇలాంటి చర్యల వల్ల, ఆలోచనల వల్లనే తీవ్రవాదం, ఫాసిజం లాంటివి పెరిగి ప్రపంచం నష్టపోతోంది. అన్ని దేశాలూ ముక్తకంఠంతో ఖండించాల్సిన వ్యాఖ్యలివి. ఒక దేశపు అధినేత అహంకారం, ఆ దేశంతో పాటు, మిగతా దేశాల్ని కూడా ప్రమాదం లోకి నెట్టేస్తున్నప్పుడు, ఇది తప్పు అని గట్టిగా చెప్పగలగాలి. ఎన్ని దేశాలు స్పందిస్తాయో చూడాలి.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ । 94408 36931

విద్వేషం చేసిన దాడి

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో గల చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్‌పై ఫిబ్రవరి 7వ తేదీ శుక్రవారం కొందరు వ్యక్తులు ఆయన ఇంట్లోకి జొరబడి దాడి చేశారు. తమని తాము శ్రీరాముని వంశానికి చెందినవారమని చెప్పుకొన్న ఆ గుంపు, రామరాజ్య స్థాపన కోసం తమకు ఆర్థికంగా సహాయం చేయాలని, తాము ఏర్పాటు చేసుకున్న 'శ్రీరామ సైన్యం'లోకి ఇక్ష్వాకు వంశస్థులను ఎంపిక చేయించాలని రంగరాజన్‌ను డిమాండ్ చేశారు. దానికి ఆయన నిరాకరించినందుకు ఆయనపై భౌతిక దాడి చేశారు. హిందూత్వ భావజాలానికి ప్రతినిధులుగా వ్యవహరించే వారంతా ఇలాంటి దాడులే గతంలో చేస్తే ఎవరూ నోరు మెదపలేదు. కానీ ఈరోజు రంగరాజన్ పైన జరిగిన దాడిని మాత్రం ముకుమ్మడిగా ఖండిస్తూ వస్తున్నారు.



నిజానికి ఇది మొదటి దాడి కాదు, ఇలా విద్వేషంతో జరుగుతున్న దాడుల పరంపరలో చివరిది కూడా కాకపోవచ్చు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం, హిందూ రాష్ట్ర స్థాపన కోసం తాము చేసే ప్రయత్నానికి సహకరించమని పలువురు హిందువులు గౌరవంగా చూసే, పేరు ప్రఖ్యాతులు గల వ్యక్తిపై దాడి చేయడం ఈ సంఘటనలో గల కొత్త అంశం. ఎవరైనా హిందూ మతాన్ని అగౌరవ పరుస్తున్నారని, మతానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించి, అలా నష్టం కలిగించిన వారిని శిక్షించే పని కూడా తామే చేయడం ఇప్పటివరకు మనం చూశాం. ఇటీవల తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై జరిగిన దాడి కూడా మత విశ్వాసాలను ఆయన గౌరవించలేదన్న ఆరోపణ మీదనే! ఇప్పుడు మాత్రం మత విశ్వాసాలను గౌరవించి సనాతన ధర్మాన్ని పాటించి, దాని ఎదుగుదల కోసం నిరంతరం శ్రమించే అర్చకుని పైన దాడి జరిగింది.

ఇది అత్యంత హేయమైన చర్య. బహుశా వారికి రంగరాజన్, అతను ఆలయాన్ని నడిపే పద్ధతి, ఆయనకి ఈ వ్యవస్థ పట్ల గల గౌరవం కూడా నచ్చలేదని తెలుస్తోంది. అంటే వచ్చిన వారికి భారత రాజ్యాంగం పైన, న్యాయ వ్యవస్థ పైన విశ్వాసం లేదన్నది స్పష్టం. వారు తమ సొంత ఊహా ప్రపంచంలో, తమ సొంత రాజ్యాంగాన్ని అమలు చేయడం కోసం ఒక ఉన్మాద స్థితిలో ఉన్న మూక. ఇది సాధారణ హిందూ మతస్థులపైన అదుపు తప్పిన హిందూత్వ విద్వేషం చేసిన దాడి!

ఎదుటి వ్యక్తుల విశ్వాసాలు మన విశ్వాసాలకు భిన్నమైనవి అయినందువల్ల మాత్రమే ద్వేషించాలి అన్న అభిప్రాయం సాధారణ హిందూ జన సామాన్యానికి ఎప్పుడూ లేదు. ఇప్పుడు యువతలోకి క్రమంగా వచ్చి చేరుతున్న అసహన వాతావరణం రంగరాజన్ పైన జరిగిన దాడి ద్వారా మనకు తెలుస్తుంది. దాడికి వచ్చిన శ్రీరామసేన ఏర్పాటు చేసిన వీర రాఘవరెడ్డి అనే యువకుడు తన యూట్యూబ్ ఛానల్‌లో చిత్రవిచిత్రమైన వీడియోలు పెట్టాడు. వాటిని చూసినప్పుడు అతను ఎలాంటి రాజ్యాన్ని స్థాపించడానికి ఆ సేన ఏర్పాటు చేశాడో మనకు అర్థం అవుతుంది. మన దేశానికి రాజ్యాంగం 1950 జనవరి 26న అమలైన నాటికంటే ముందే ఈ దేశంలో మనుస్మృతి అనే రాజ్యాంగం ఉన్నదని, అది అసలు ఈ దేశపు రాజ్యాంగం అని, ఇప్పుడు అమలవుతున్న రాజ్యాంగం మన భారత దేశపు విలువలకు సరిపోదని అతని ప్రగాఢ విశ్వాసం. నిజానికి ఈ విశ్వాసం అతనికి మాత్రమే లేదు ఈ దేశాన్ని ప్రస్తుతం పరిపాలిస్తున్న పార్టీ సైద్ధాంతిక భావజాలానికి కారణమైన సంస్థ కూడా నమ్ముతున్నట్లుంది. సమానత్వ, సౌభ్రాతృత్వ, లౌకిక విలువలకు వ్యతిరేక భావజాలాన్ని నూరిపోస్తే కలిగే విపరిణామాలు ఇలాగే ఉంటాయి. దాన్ని ఒంటపట్టించుకున్నటువంటి యువత దారి తప్పుతుంది. అలాంటి వారే ఈరోజు ఈ రకంగా దాడులకు పాల్పడుతోందని అర్థం చేసుకోవాలి. విద్వేషాలకు స్వస్తి పలికితేనే సమాజానికి శ్రేయస్కరం.

– టి. హరికృష్ణ, మానవ హక్కుల వేదిక । 94940 37288

నిర్మల విశ్వాసం

గంగలో స్నానం చేస్తే పాపాలన్నీ తొలగిపోతాయని మన పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. ఒకప్పుడు ఒక పాపాత్ముడు గంగలో స్నానం చేసి తన పాపాలన్నింటినీ కడిగివేసుకోవాలని నిర్ణయించుకొన్నాడు. గంగలో ఒక మునక వేసిన తర్వాత 'ఇంత చిన్న చర్యతో నా పాపాలను నేను కడగివేసుకోగలనా?' అనే అనుమానం కలిగింది. ఇటువంటి అనుమానం వలన అతను గంగాస్నాన ప్రభావాన్ని కించపరిచాడు. ఫలితంగా అతను ఏ సంకల్పంతో గంగలో స్నానం చేయాలనుకున్నాడో, అది దుర్బలమైపోయింది. ఈవిధమైన వ్యక్తులు గంగా స్నానం చేయడం వలన పరిశుద్ధులం అయ్యామని ఎప్పుడూ తలచరు. ఐతే అటువంటివారు పదే పదే గంగా స్నానం చేస్తారు లేక మన పవిత్ర గ్రంథాలను నిందించడం ప్రారంభిస్తారు. ఎవరి ఆలోచన స్వచ్ఛంగా, విశ్వాసపూర్వకంగా ఉండదో (అనగా సందేహరహితంగా ఉండదో) అటువంటివారిని పరిశుద్ధులను చేయడం గంగకైనా లేదా శిరస్సుపై గంగను ధరించిన శివునికైనా సాధ్యం కాదు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మనస్సు అంతర్ముఖమైనప్పుడు ఆత్మ దర్శనం కలుగుతుంది. దీనికి భిన్నంగా బహిర్ముఖమైనప్పుడు మనస్సు అహంభావంతో ప్రపంచంలో తిరుగాడుతుంది. పత్తితో తయారైన వస్త్రం అనేక దుస్తుల రూపంలోకి మారిన తర్వాత ఆ యా దుస్తుల పేర్లతో పిలవబడుతుంది. అలాగే బంగారంతోనే రకరకాల ఆభరణాలు తయారైనా ఆభరణాల పేరుతోనే బంగారం పిలవబడుతుంది. ఇక్కడ పత్తి వస్త్రం లేదా బంగారం అనేది మాత్రమే వాస్తవం. తయారైన దుస్తులు, లేదా ఆభరణాలు కాదు. ఇలా అన్నింటిలోను 'ఒకే ఒకదానిని' (వస్త్రాలన్నిటిలో పత్తిని లేదా ఆభరణాలన్నింటిలో బంగారాన్ని) చూడగలుగుటయే నిజమైన జ్ఞానం.

అన్నిరకాల వస్త్రాలకు ప్రత్తి, అన్ని రకముల ఆభరణాలకు బంగారం ఏ విధంగా మూలమో... అదే విధంగా, ఈ ప్రపంచమందలి ప్రాణులన్నీ ఆభరణాల మాదిరిగా వేరు, వేరుగా కనబడుతున్నప్పటికీ, అన్నింటికీ మూలం ఆత్మచైతన్యం ఒక్కటే. ఈ విషయాన్ని అర్థం చేసుకొని, ఆత్మ సాక్షాత్కారానికి ప్రయత్నించడమే నిజమైన జ్ఞానం.

తాజా కాదు.. ఈజీ ఫుడ్డుకే జై

ప్రాసెస్డ్ ఆహారాన్నే ఎక్కువగా వినియోగిస్తున్న ప్రజలు

- తృణధాన్యాలు, పాలు, పండ్లు, కూరగాయలు వీటి తర్వాతే..
- దేశంలోనే రెండోస్థానంలో తెలంగాణ

మొత్తం ఆహార వ్యయంలో 27.47% వీటి కోసమే ఖర్చు చేస్తున్న వైనం..	గ్రామీణ ప్రాంతాల్లో	పట్టణ ప్రాంతాల్లో
	20.84 %	33.63 %

- కుటుంబ వినియోగ వ్యయ సర్వే వెల్లడి
- కూల్‌డ్రింక్‌లు, చిరుతిళ్లు, బేకరీ పదార్థాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయంటున్న వైద్యులు



సాక్షి, హైదరాబాద్: అధిక పోషకాలుండే తాజా ఆహార పదార్థాల కంటే సులభంగా అందుబాటులో ఉండే నిలువ ఉండే ఆహారంపైనే ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఆహారానికి చేస్తున్న ఖర్చులో.. ప్రాసెస్డ్ ఆహారానికి సంబంధించిన వ్యయమే ఎక్కువగా ఉంటోంది. దేశ వ్యాప్తంగా ప్రాసెస్డ్ ఆహారంపైన చేస్తున్న ఖర్చు 24.44 శాతం ఉన్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'కుటుంబ వినియోగ వ్యయ సర్వే-2023-24' స్పష్టం చేస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలు 20.93 శాతం ఖర్చు చేస్తుండగా.. పట్టణ ప్రాంత ప్రజలు 27.95 శాతం ఖర్చు పెడుతున్నారు. ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగంతో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు ఆస్కారం ఉన్నప్పటికీ... వినియోగం మాత్రం వేగంగా పెరుగుతూ వస్తోంది.

ఆధునిక జీవనశైలికి అనుగుణంగా..

ఆధునిక జీవనశైలికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. ప్రధానంగా ఉద్యోగులు, విద్యార్థులు వారి రోజువారీ కార్యకలాపాల్లో బిజీ ఉంటూ వెంటనే అందుబాటులో ఉండే (అత్యవసర ఆహారం) నిల్వ ఉండే, శుద్ధి చేసి భద్రపర్చిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. ఈ ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండకపోవడం, ఆహారం ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు వీలుగా ఉపయోగించే రసాయనాల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కూల్‌డ్రింక్‌లు, చిరుతిళ్లు, బేకరీ పదార్థాలు ఎక్కువగా తినడం మంచిది కాదని అంటున్నారు.

పాలు, పండ్లను మించి ఖర్చు


కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ వినియోగ వ్యయ సర్వేలో ఆహారంపై చేసే ఖర్చును ఏడు కేటగిరీల్లో లెక్కించారు. తృణధాన్యాలు, పాలు.. పాల ఉత్పత్తులు తదితర ఈ ఏడు కేటగిరీల్లోనూ ప్రాసెస్డ్ ఆహారం, బేవరేజెస్ (పానీయాలు) ఖర్చే ఎక్కువగా ఉండడం గమనార్హం. మొత్తం మీద పట్టణ ప్రాంతంతో పోలిస్తే గ్రామీణ ప్రాంత ప్రజలు కొంత పోషకాలున్న ఆహారాన్ని తీసుకుంటున్నారు. తృణధాన్యాలు, గుడ్లు, చేపలు, మాంసాహారాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మాత్రం అందుకు భిన్నంగా ప్రాసెస్డ్ ఆహారంపైనే ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే తృణధాన్యాలు, కూరగాయలకు ప్రాధాన్యత తక్కువగా ఉంది. ఇక్కడ ఈ సరుకులకు డిమాండ్ ఎక్కువగా ఉండగా, తాజా సరుకుల లభ్యత కష్టంగా ఉండడంతో వీటి వినియోగానికి ప్రాధాన్యత తగ్గుతోంది. మరోవైపు హోటళ్లు, కర్రీ పాయింట్లకు ప్రాధాన్యత ఇవ్వడం కూరగాయల కొనుగోలుపై ప్రభావం చూపుతోంది.

రాష్ట్రాల్లో తమిళనాడు టాప్

ప్రాసెస్డ్ ఫుడ్, పానీయాలపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో (పట్టణ ప్రాంతం) తమిళనాడు (34.30 శాతం) మొదటి వరుసలో ఉంది. ఆ తర్వాత స్థానంలో తెలంగాణ, కర్ణాటక, అసోం, పంజాబ్ రాష్ట్రాలున్నాయి. గ్రామీణ ప్రాంత కేటగిరీలోనూ తమిళనాడు (29.89 శాతం) ముందుండగా.. అసోం, కర్ణాటక, పంజాబ్, రాజస్తాన్, ఒడిశా, గుజరాత్ తదుపరి స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణ 10వ స్థానంలో ఉంది.

రాష్ట్రంలో జాతీయ సగటును మించి..

రాష్ట్రంలో ప్రజలు మొత్తం ఆహారం కోసం చేస్తున్న వ్యయంలో ప్రాసెస్డ్ ఫుడ్ కోసమే 27.23 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇది జాతీయ సగటు కంటే 2.79 శాతం అధికంగా ఉండడం ఆందోళన కలిగించే విషయం. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సైతం మొత్తం ఆహారంలో ప్రాసెస్డ్ ఆహారంపై 20.84 శాతం ఖర్చు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో ఇది ఏకంగా 33.63 శాతంతో దేశంలో రెండో స్థానంలో ఉంది. దేశ సగటుతో పోలిస్తే మన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాసెస్డ్ ఆహారంపైన చేస్తున్న ఖర్చు ఎక్కువగా ఉన్నప్పటికీ.. పట్టణ ప్రాంతంలో ఆందోళనకర స్థాయిలో ఉండడం గమనార్హం.



ప్రాసెస్డ్ ఫుడ్‌తో జీర్ణకోశ వ్యాధుల ముప్పు

దేశంలో ప్రాసెస్డ్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్ కల్చర్ గత దశాబ్ద కాలంలో వేగంగా పెరిగింది. ఇంతకుముందు తాజా ఆహారాన్నే ఎక్కువగా తీసుకునే అలవాటు ఉండేది. ప్రస్తుతం మారుతున్న జీవనశైలికి అనుకూలంగా కార్పొరేట్ కంపెనీలు ఈ తరహా ఆహారాన్ని విరివిగా అందుబాటులోకి తెస్తున్నాయి. ఎక్కువగా కష్టపడే అవసరం లేకపోవడంతో ప్రజలు కూడా వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఇలాంటి ఆహారం ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు రకరకాల రసాయనాలను కలుపుతారు. వీటివల్ల ఎక్కువగా జీర్ణకోశ సంబంధిత వ్యాధులు మొదలవుతాయి. అవి క్రమంగా క్యాన్సర్లకు కూడా దారితీసే అవకాశం ఉంటుంది. గత పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు కొత్త కొత్త క్యాన్సర్లు బయటపడుతున్నాయి. అందువల్ల ఇలాంటి ఆహారాన్ని వీలైనంత వరకు తీసుకోకుండా.. తాజా ఆహారానికి ప్రాధాన్యత ఇస్తే మంచిది.



- డాక్టర్ అనిల్‌కుమార్ మన్నవ, కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్

ఘనంగా మండమెలిగె



మేడారానికి పోటెత్తిన భక్తులు

గద్దెల వద్ద ప్రత్యేక పూజలు

సమ్మక్క శక్తిపీఠాన్ని అలంకరించిన ఆడపడుచులు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారంలో మినీజాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. నాలుగు రోజులపాటు జరిగే జాతర మొదటిరోజు బుధవారం మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో ఘనంగా మండమెలిగె పండుగ నిర్వహించారు. ఉదయం ఆలయాలను శుద్ధి చేసిన పూజారులు.. మండమెలిగె పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మేడారంలోని సమ్మక్క గుడిలో అమ్మవారి శక్తి పీఠాన్ని, గుమ్మాన్ని ఆడపడుచులు, పూజారులు పసుపు, కుంకుమలతో అలంకరించారు. సమ్మక్క పూజారి సిద్దబోయిన నితిన్ ఇంటినుంచి పవిత్ర జలం, పసుపు, కుంకుమలను తీసుకొని పోచమ్మగుడికి వెళ్లి.. చీర సమర్పించి పూజలు చేశారు. నితిన్ ఇంటి వద్ద తయారు చేసిన మామిడి తోరణాలను డోలు వాయిద్యాల నడుమ తీసుకొని వెళ్లి చిలకలగుట్ట వెళ్లే దారి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా కట్టి, ధ్వజస్తంభాన్ని నిలిపారు. రాత్రి పసుపు, కుంకుమ, పూజా సామగ్రి తీసుకొని డోలు వాయిద్యాలతో సమ్మక్క గద్దెకు చేరుకున్నారు. అనంతరం రహస్య పూజలు నిర్వహించారు. అలాగే కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సారలమ్మ పూజారులతో పాటు గ్రామంలోని ఆదివాసీలంతా కలసి సారలమ్మ గుడి నుంచి పసుపు, కుంకుమ, శాకహారం (ఇప్పపువ్వు సారా) తీసుకొని గద్దెల వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. మంత్రి సీతక్క బుధవారం రాత్రి మండమెలిగె పండుగలో పాల్గొన్నారు. ముందుగా సమ్మక్క గుడిలో పూజలు చేశారు. అనంతరం గద్దెలను దర్శించుకున్నారు.

భక్త జన సందడి..

అమ్మవార్లను దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే మొదలైన భక్తుల తాకిడి మధ్యాహ్నం వరకు కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద షవర్ల కింద స్నానాలు ఆచరించి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బాయిలర్ కోళ్ల అమ్మకాలు డీలా..

జాతరలో కోళ్లు, యాటలను మొక్కుగా సమర్పించడం ఆనవాయితీ. అయితే బర్డ్‌ఫ్లూ వార్తల ప్రభావం మినీ జాతరపై కూడా పడింది. కోళ్ల వ్యాపారులు గిరాకీ సరిగా లేక డీలా పడిపోయారు. మార్కెట్ రేట్ ప్రకారం మినీ జాతరలో బాయిలర్ కోడి కేజీ రూ.180, జుట్టు కోడి రూ.గుత్తకు రూ.200 అమ్మకాలు చేపట్టినా భక్తులు ముందుకు రాలేదు. దీని గురించి పలువురు భక్తులను ప్రశ్నించగా, బర్డ్‌ఫ్లూ వార్తల కారణంగా సొంత గ్రామాల నుంచి నాటుకోళ్లను తీసుకొచ్చినట్లు తెలిపారు. మరికొందరు స్థానికుల వద్ద రేటు ఎక్కువైనా నాటుకోళ్లనే కొనుగోలు చేశారు.

మరో 15,000

▶ మొదటి పేజీ తరువాయి

వస్తున్న డిమాండ్ మేరకు సీట్లు పెంచాల్సిన అవసరాన్ని ఐఐటీలు, ఎన్ఐటీలు గత ఏడాది కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్ అర్హత సాధించిన విద్యార్థులంతా అన్ని ఐఐటీల్లోనూ కంప్యూటర్ కోర్సులనే మొదటి ఆప్షన్‌గా పెట్టుకుంటున్నారు. దాదాపు 1.45 లక్షల మంది ఈ బ్రాంచ్‌లనే కౌన్సెలింగ్‌లో మొదటి ఐచ్ఛికంగా ఎంచుకున్నారు. సీట్లు పెంచాలంటే ఫ్యాకల్టీతోపాటు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి అదనంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఐఐటీలు కేంద్రానికి పంపిన నివేదికలో పేర్కొన్నాయి. వీటికి కేంద్రం సానుకూలంగా ఉందని, త్వరలో నిర్ణయం రావొచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే ఐఐటీల్లో ఈ ఏడాది ఏఐ/ఎంఎల్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/మిషన్ లెర్నింగ్), డేటా సైన్స్ తదితర కంప్యూటర్ కోర్సుల్లో కనీసం 4 వేల సీట్లు పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ఐఐటీల్లో మొత్తం 17 వేల సీట్లు ఉన్నాయి.

సీటు అక్కడే కావాలి...

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు పొందిన వారు బాంబే-ఐఐటీపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అందువల్ల సీట్ల పెంపునకు కేంద్రం అంగీకరిస్తే బాంబే-ఐఐటీకి మొదటి ప్రాధాన్యమిచ్చే వీలుంది. ఆ తర్వాత ఢిల్లీ, కాన్పూర్, మద్రాస్ ఐఐటీలకు ప్రాధాన్యమిస్తున్నారు. వీటి తర్వాత స్థానంలో హైదరాబాద్ ఐఐటీ నిలిచింది. బాంబే ఐఐటీలో ఓపెన్ కేటగిరీలో బాలురు 67, బాలికలు 291వ ర్యాంకుతో క్రితంసారి సీటు కేటాయింపు ముగిసింది. మొత్తం మీద మంచి పేరున్న ఐఐటీల్లో 5 వేల లోపు ర్యాంకు వరకూ సీటు దక్కింది. అయితే, విద్యార్థులు అంతగా ప్రాధాన్యమివ్వని ఐఐటీల్లో 11,200 ర్యాంకు వరకూ సీట్లు వచ్చాయి. ఈ కేటగిరీలో బిలాల్ ఐఐటీ ఉంది. ఇలాంటి ఐఐటీల్లో సీట్లు పెంచడం అవసరం లేదని భావిస్తున్నారు.

ఎన్ఐటీల్లో...

ఐఐటీల్లో సీట్ల పెంపు నేపథ్యంలో ఎన్ఐటీల్లో ఈసారి కటాఫ్ పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరంగల్ ఎన్ఐటీలో కంప్యూటర్ సైన్స్‌కు అంతకుముందు 1996 ర్యాంకు వరకూ సీటు వస్తే, 2024లో బాలురకు 3,115 ర్యాంకు వరకూ సీటు వచ్చింది. సీట్లు పెరిగితే 2025లో 4 వేల ర్యాంకు వరకూ సీటు వచ్చే అవకాశముంది. తమిళనాడు తిరుచిరాపల్లి ట్రిపుల్‌ఐటీలో బాలురకు గత ఏడాది 996 ర్యాంకుతోనే సీట్లు ఆగిపోగా, ఈ ఏడాది మాత్రం బాలురకు 1,509 ర్యాంకు దాకా సీటు వచ్చింది. ఎన్ఐటీల్లో 82 శాతం విద్యార్థులు తొలి ప్రాధాన్యంగా కంప్యూటర్ సైన్స్‌ను ఎంచుకోగా, రెండో ప్రాధాన్యత కూడా 80 శాతం ఇదే బ్రాంచ్ ఉండటం విశేషం. మొత్తం మీద గత ఏడాది ఆరు రౌండ్ల తర్వాత 34,462వ ర్యాంకు వరకూ బాలికల విభాగంలో సిక్కిం ఎన్ఐటీలో సీఎస్‌సీ సీట్లు వచ్చాయి. మెకానికల్‌కు మాత్రం 58 వేల ర్యాంకు వరకూ ఓపెన్ కేటగిరీ సీట్లకు కటాఫ్‌గా ఉంది. బయోటెక్నాలజీకి 48 వేల వరకూ సీటు వచ్చింది. ఈసారి సీట్లు పెరిగితే ఈ కటాఫ్‌లో మార్పులు ఉండొచ్చని భావిస్తున్నారు.

గత ఏడాది ప్రధాన ఐఐటీల్లో కటాఫ్ ర్యాంకులు

ఐఐటీ	బాలురు	బాలికలు
బాంబే	67	291
కాన్పూర్	238	610
ఖరగ్‌పూర్	279	702
ఢిల్లీ	118	419
మద్రాస్	148	479
హైదరాబాద్	674	1300
తిరుపతి	3701	6558
రూర్కీ	412	1165
పాలక్కడ్	5162	11200

ప్రేమించడం లేదని పెట్రోల్ పోశాడు

హుజూర్‌నగర్: తనను ప్రేమించడం లేదని యువతిపై పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన కేసులో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను ఎస్ఐ ముత్తయ్య విలేకరులకు తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన మారబత్తుల సుందర్ ప్రమోద్‌కు.. అదే గ్రామానికి చెందిన ఒక యువతి ఏడాది క్రితం పరిచయమైంది. అప్పుడప్పుడు మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో సుందర్ ఆ యువతిని ప్రేమిస్తున్నానని చెప్పాడు. అయితే ఆ యువతి అంగీకరించలేదు. కాగా ఆ యువతి మూడు నెలల క్రితం హుజూర్‌నగర్ పట్టణంలోని తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ కోదాడ రోడ్డులో గల ప్రైవేట్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తోంది. సోమవారం సుందర్ ప్రమోద్ .. యువతికి ఫోన్ చేసి మాట్లాడాలని ఆ సంస్థ నుంచి బయటకు పిలిపించాడు. తనను ప్రేమిస్తావా లేదా అంటూ బెదిరిస్తూ వెంట తెచ్చుకున్న పెట్రోల్ ఆమెపై పోసి అగ్గిపుల్ల వేయాలని ప్రయత్నించాడు. ఇంతలో స్థానికులు గమనించి అతడిని పక్కకు నెట్టివేశారు. దీంతో ఆ యువకుడు పారిపోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు బుధవారం పట్టణ శివారులోని ఎంబీ కెనాల్ వద్ద పట్టుబడ్డాడు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

సచివాలయంలో నకిలీ ఐఏఎస్!

సాక్షి, హైదరాబాద్: సచివాలయానికి నకిలీ అధికారుల బెడద పెరుగుతోంది. గతంలో సెక్షన్ ఆఫీసర్, తహసీల్దార్ అంటూ పలువురు హల్‌చల్ చేయగా, తాజాగా ఒకరు నకిలీ ఐఏఎస్ అవతారమెత్తారు. ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సొంత స్నేహితులనే మోసం చేశాడు. తమ స్నేహితుడు ఐఏఎస్ అని నమ్మిన వారు ఉద్యోగం కోసం రూ. 20 వేల నుంచి లక్ష రూపాయల వరకు సమర్పించుకున్నట్లు సమాచారం. ఈ నకిలీ ఐఏఎస్ ఏకంగా కార్యదర్శి పేరిట ఔట్‌సోర్సింగ్ అపాయింట్‌మెంట్ లెటర్ వాట్సాప్‌లో పంపించాడు. తాను జీఏడీ వ్యవహారాలు చూస్తున్నానని, బుధవారం సచివాలయానికి వచ్చి ఒరిజినల్ అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకోవాలని పంపించారని బాధితులు చెప్పారు. ఈ విషయం సచివాలయ భద్రతాధికారి దేవీదాస్ దృష్టికి వెళ్లగానే ఆయన వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. విషయం గమనించి సదరు నకిలీ ఐఏఎస్, ఆయనకు మధ్యవర్తిగా డబ్బులు వసూలు చేసే మరో వ్యక్తి అక్కడి నుంచి తప్పించుకున్నట్లు సమాచారం. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు ఐఏఎస్‌గా చెప్పుకున్న వ్యక్తి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన బాలకృష్ణగా గుర్తించారు. సచివాలయ భద్రతాధికారి ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఈ నకిలీ ఐఏఎస్ బారిన పడి ఆరేడుగురు డబ్బులు పోగొట్టుకున్నట్లు ప్రాథమికంగా తేల్చారు. నకిలీ ఘటనలో సచివాలయ ఉద్యోగుల పాత్ర పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

తెరపైకి తెలివైన బుర్ర

▶ మొదటి పేజీ తరువాయి

ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. స్మార్ట్ టెక్నాలజీపై కసరత్తు చేస్తున్నాయి. మైక్రో చిప్స్‌ను, అత్యంత శక్తివంతమైన సెమీ కండక్టర్లను రూపొందించి ఏఐ మేధోశక్తికి అనుసంధానం చేస్తున్నాయి. 2027 నాటికి అంతరిక్ష, వైద్య, విద్య, న్యాయ రంగాల్లో శరవేగంగా నాణ్యమైన సేవల ందించే ఏఐ ఆధారిత మాడ్యూల్స్ కూడా రూపొందుతున్నాయి.

ఊపిరిపోస్తున్న పరిశోధనలు

చిప్‌ల అభివృద్ధి, కృత్రిమ మేధ రంగంలో దిగ్గజ కంపెనీలే కాదు.. మన దేశంలో ఐఐటీ విద్యార్థులు, అంతరిక్ష పరిశోధకులు కూడా రంగంలోకి దిగారు. మద్రాస్ ఐఐటీ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సంయుక్తంగా 'శక్తి' పేరిట చిప్‌ను, దాని ఆధారంగా పనిచేసే మైక్రో ప్రాసెసర్లను రూపొందించాయి. ఇప్పుడిప్పుడే ప్రాణం పోసుకుంటున్న ఈ ప్రాసెసర్లు అత్యంత శక్తివంతంగా పనిచేస్తాయని, అంతరిక్ష రంగంలో అద్భుత సాంకేతికత వినియోగానికి వీలుకల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

లాంగ్వేజ్ మాడ్యూల్స్‌తోనూ..

కృత్రిమ మేధలో కీలకమైన మైక్రో అండ్ స్మాల్ లాంగ్వేజ్ మాడ్యూల్స్‌ను ఐటీ దిగ్గజాలు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, మహీంద్రా వంటి సంస్థలు రూపొందిస్తున్నాయి. నేరాల దర్యాప్తు, న్యాయ విభాగాలకు సంబంధించి ఇవి అద్భుతాలు సృష్టించగలవని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉదాహరణకు పదేళ్లుగా కనిపించకుండా పోయిన వ్యక్తి.. చిన్ననాటి ఫోటో ఆధారంగా ఇప్పుడెలా ఉన్నాడు? ఆ వ్యక్తి ఏయే ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉంది? అనే అంశాలను ఏఐ ఆధారంగా అంచనా వేయవచ్చు. కోట్లాది మంది వ్యక్తుల కదలికలను పసిగట్టి, గుర్తించగల టెక్నాలజీని ఇందులో పొందుపరుస్తున్నారు. ఇక ఏదైనా కేసులో న్యాయమూర్తి తీర్పు చెప్పే ముందు అలాంటి కేసుకు సంబంధించిన గతంలోని జడ్జిమెంట్లను క్రోడీకరించి అందించే మాడ్యూల్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నారు. మరోవైపు వైద్య రంగంలో శస్త్ర చికిత్సల సమయంలో స్మార్ట్ లాంగ్వేజ్ ద్వారా కణజాలాల స్థాయిలో స్కానింగ్ చేసి విలువైన సమాచారం ఇవ్వగల మాడ్యూల్ అందుబాటులోకి రానుంది. చికిత్స వంద శాతం విజయవంతంగా పూర్తయ్యేందుకు అవి సహకరించనుంది.

మరింత మేధోమథనం జరగాలి..



ఏఐలో కీలకమైన చిప్స్ తయారీ, లాంగ్వేజ్ మాడ్యూల్స్‌కు సంబంధించి తెలంగాణలో మరింత కృషి జరగాలని నిపుణులు చెబుతున్నారు. ఇంతకాలం సీఎస్‌సీ, ఇతర కంప్యూటర్ కోర్సులు చేసిన విద్యార్థులు.. ఎలక్ట్రానిక్స్ కోర్సులను చిన్నచూపు చూశారని, సెమీ కండక్టర్స్‌ను, ఏఐ ఆధారిత చిప్స్‌ను ఇప్పటికీ మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని గుర్తు చేస్తున్నారు. 2026 నాటికి మైక్రో చిప్స్, మినీ మైక్రో చిప్స్ అవసరం 60 శాతం పెరుగుతుందని, ఇప్పటి అవసరాల్లో భారత్ కేవలం 20 శాతమే సమకూర్చుకుంటోందని అంటున్నారు. అమెరికా ఆంక్షలు, చైనా డీప్‌సీక్ వ్యవహారం తర్వాత సొంతంగా మాడ్యూల్స్, మైక్రో చిప్స్ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఏఐ, మారుతున్న టెక్నాలజీల నేపథ్యంలో తెలంగాణలో ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు అవసరమని ఉన్నత విద్యా మండలి భావిస్తోందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

తోడ్పాటుకు 'ఏఐ' సరే.. తుది నిర్ణయం సరికాదు



న్యాయవ్యవస్థలో కొత్త సాంకేతికత ఆహ్వానించదగ్గ పరిణామం. సాక్ష్యం, నేర దర్యాప్తు, పాత తీర్పుల తోడ్పాటు వంటి అంశాలకే ఏఐ పరిమితం అవ్వాలి. కేసుపూర్తి విచారణ, తీర్పులో మానవ మేధోశక్తి మాత్రమే పని చేయాలి. అప్పుడే తీర్పులు వాస్తవికతకు అద్దం పడతాయి. ఏఐ ఎంత శక్తివంతమైంది అయినా దాన్ని న్యాయ వ్యవస్థలో పరిమితంగానే వాడాలి.

- రిటైర్డ్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

సెమీకండక్టర్స్ రూపకల్పనపై దృష్టిపెట్టాలి



సాఫ్ట్‌వేర్ బూమ్ కారణంగా మనవాళ్లు సెమీ కండక్టర్లు, చిప్‌ల తయారీపై ఇంతకాలం దృష్టి పెట్టలేదు. ఇప్పుడా అవసరం ఏర్పడింది. స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ రూపకల్పనకు అవసరమైన తోడ్పాటు అందించి.. యువతరాన్ని ప్రోత్సహించాలి.

- డాక్టర్ కేపీ సుప్రీతి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధికారి, జేఎన్టీయూహెచ్



ఘనంగా ముజ్గి మల్లన్న జాతర

నిర్మల్ రూరల్: నిర్మల్ జిల్లా ముజ్గి గ్రామంలో బుధవారం మల్లన్న జాతర ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జాతర జరగనుంది. వివిధ గ్రామాల నుంచి బుధవారం సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో చల్ల కుండలతో పాదయాత్రగా వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



వైభవంగా శ్రీచక్ర తీర్థం

యాదగిరిగుట్ట: పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీస్వామి అమ్మవార్లకు శ్రీచక్ర తీర్థం వేడుకలను ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్య పూజలు నిర్వహించిన అనంతరం మహా పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లకిపై అలంకరించి తిరువీధుల్లో ఊరేగించి, పుష్కరిణిలో శ్రీచక్ర స్నానం చేశారు. ఈ వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. కాగా భక్తులు పుష్కరిణిలో శ్రీచక్ర తీర్థాన్ని తీసుకునేందుకు పోటీపడ్డారు. ఇక రాత్రి దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం వేడుకలను జరిపించారు. గురువారం శతఘటాభిషేకంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

సర్పంచ్‌గా పోటీ చేయాలని అమెరికా నుంచి వచ్చేశాడు..



చిన్నశంకరంపేట(మెదక్): అమెరికాలో ఉద్యోగం చేస్తున్న యువకుడు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్వగ్రామానికి తరలివచ్చాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన కంజర్ల చంద్రశేఖర్ అమెరికాలో పదేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గతంలో 25 ఏళ్ల చిన్నశంకరంపేట సర్పంచ్‌గా పనిచేసిన తన తాత శంకరప్ప స్ఫూర్తితో.. త్వరలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలని సంకల్పించారు. దీంతో చంద్రశేఖర్ దంపతులు అమెరికా నుంచి బుధవారం చిన్నశంకరంపేట చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు అనంత పద్మనాభస్వామి గుట్ట నుంచి సోమేశ్వరాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి వారికి స్వాగతం పలికారు. అనంతరం చంద్రశేఖర్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన తాత స్ఫూర్తితో గ్రామానికి సేవ చేసేందుకు స్వగ్రామానికి వచ్చానని చంద్రశేఖర్ తెలిపారు.

సీసీఎస్ ఠాణాలో నిందితుడి ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: సీసీఎస్ పోలీసుల కస్టడీలో ఉన్న ఓ నిందితుడి ఆత్మహత్యాయత్నం స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 10వ తేదీన నిజామాబాద్ జిల్లా బోధన్ రూరల్ మండలం కల్దుర్కి గ్రామానికి చెందిన రాజు-లక్ష్మి దంపతులు తమ బంధువైన లక్ష్మణ్ కుమారుడి పెళ్లికి వెళ్లారు. పెళ్లి సమయంలో లక్ష్మణ్ ఇంట్లో డబ్బుల దొంగతనం జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును సీసీఎస్‌కు అప్పగించారు. విచారణ జరిపిన సీసీఎస్ పోలీసులు నిజామాబాద్‌రూరల్ మండలం గూపన్‌పల్లిలోని ఓ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న రాజును సోమవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న రాజు భార్య లక్ష్మి తన బంధువులతో కలిసి అదేరోజు బోధన్ రూరల్ ఠాణాకు వెళ్లింది. అయితే రాజు ఇక్కడ లేడని నిజామాబాద్‌లోని సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లు చెప్పారు. మంగళవారం లక్ష్మి తన బంధువులతో కలిసి సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రాత్రి 9 గంటల వరకు అక్కడే ఉంది. పోలీసులు రాజును తర్వాత పంపిస్తామని చెప్పడంతో లక్ష్మి అక్కడి నుంచి వెనుదిరిగింది. ఇదిలాఉండగా బుధవారం ఉదయం రాజు జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసీయూలో ఉన్నాడని లక్ష్మికి పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే లక్ష్మి తన బంధువులతో కలిసి ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్లతో మాట్లాడగా రాజు పురుగు మందు తాగినట్లు చెప్పారని లక్ష్మి పేర్కొంది. పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత రాజు ఎలా ఆత్మహత్యాయత్నం చేసుకుంటాడని ఆమె ప్రశ్నించింది. పోలీసులు ఇబ్బందులకు గురిచేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేసింది. రాజుకు పురుగు మందు ఎలా వచ్చిందని, పురుగు మందు తాగినప్పుడు పోలీసులు ఏం చేస్తున్నారో స్పష్టత ఇవ్వాలంది. ఈ విషయమై సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారికి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

మొక్కలు నాటిన 'కడియం' రైతులు

సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్ పిలుపు మేరకు వృక్షార్చనలో భాగంగా రాజమండ్రిలోని కడియం నర్సరీల రైతుల ఆధ్వర్యంలో బుధవారం వెయ్యి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రైతులతో కలిసి మొక్కలు నాటారు.

కలిసి నడుద్దాం.. కలిమి సాధిద్దాం

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ నిర్ణయం

పారిస్ నుంచి మాసే సిటీకి వెళ్తూ విమానంలో ద్వైపాక్షిక చర్చలు

పారిస్: వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులతోపాటు కీలక రంగాల్లో భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధ బాంధవ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ నిర్ణయించుకున్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంతోపాటు అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాల నడుమ పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయానికొచ్చారు. ఇరుదేశాలు కలిసికట్టుగా ముందుకు సాగుతూ బలీయమైన శక్తులుగా ఎదగాలన్నదే తమ ఆశయమని పేర్కొన్నారు. ప్రజా బాహుళ్యానికి సామాజికంగా, ఆర్థికంగా లబ్ధి చేకూర్చడానికి, పర్యావరణ పరిరక్షణకు కృత్రిమ మేధ(ఏఐ)ను సవ్యదిశలో ఉపయోగించుకొనేలా చర్యలు తీసుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని ఇద్దరు నేతలు ఉద్ఘాటించారు. నరేంద్ర మోదీ, ఇమ్మానుయేల్ మాక్రాన్ బుధవారం సమావేశమయ్యారు. ఇరువురు నేతలు ఫ్రాన్స్ రాజధాని పారిస్ నుంచి మాసే నగరానికి విమానంలో వెళ్తూ చర్చల్లో పాల్గొన్నారు. భారత్, ఫ్రాన్స్ మధ్య సుదృఢమైన సంబంధాలే లక్ష్యంగా విస్తృత స్థాయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ద్వైపాక్షిక అంశాలతోపాటు కీలక ప్రాంతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు సైతం ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. ఈ ఏడాది ద్వైపాక్షిక సహకారం విషయంలో డిజిటల్ హెల్త్, యాంటీ–మైక్రోబియల్ రెసిస్టెన్స్, రెండు దేశాల మధ్య ఆరోగ్య నిపుణుల మార్పిడిని ప్రాధాన్య అంశాలుగా గుర్తించారు.

2026లో 'ఇండియా–ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణమే సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని మోదీ, మాక్రాన్ తేల్చిచెప్పారు. ఈ అంశంతోపాటు అంతర్జాతీయ వ్యవహారాలపై పరస్పరం సమన్వయంతో పని చేయాలని అంగీకారానికి వచ్చారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్‌కు గట్టిగా మద్దతు ఇస్తున్నామని మాక్రాన్ ఈ సందర్భంగా స్పష్టంచేశారు. భారత్, ఫ్రాన్స్ మధ్య బంధం గత 25 ఏళ్లుగా నానాటికీ బలపడుతోందని, బహుముఖ భాగస్వామ్యంగా రూపాంతరం చెందుతోందని ఇరువురు నేతలు హర్షం వ్యక్తంచేశారు. రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. రక్షణ, పౌర అణు ఇంధనం, అంతరిక్షం వంటి కీలక వ్యూహాత్మక రంగాల్లో భారత్, ఫ్రాన్స్ మధ్య సహకారాన్ని మోదీ, మాక్రాన్ సమీక్షించారు. వచ్చే సంవత్సరాన్ని 'ఇండియా–ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'గా జరుపుకోబోతున్న నేపథ్యంలో నవీన ఆవిష్కరణల్లో పరస్పర సహకారానికి అత్యధిక ప్రాధాన్యం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ గౌరవార్థం అధ్యక్షుడు మాక్రాన్ మాసే సమీపంలోని కసీస్ పట్టణంలో రాత్రి విందు ఇచ్చారు. త్వరలో భారత్‌లో పర్యటించాలని మాక్రాన్‌ను మోదీ ప్రత్యేకంగా ఆహ్వానించారు.

ఉమ్మడిగా అణు రియాక్టర్ల అభివృద్ధి

ఇంధన భద్రత, కర్బన రహిత ఆర్థిక వ్యవస్థకు అణు విద్యుత్ ఉత్పత్తి చాలా ముఖ్యమని నరేంద్ర మోదీ, ఇమ్మానుయేల్ మాక్రాన్ అభిప్రాయపడ్డారు. అత్యాధునిక న్యూక్లియర్ రియాక్టర్లను ఉమ్మడిగా అభివృద్ధి చేసుకోవడానికి వారు అంగీకారానికి వచ్చారు. ఈ మేరకు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు(ఎస్ఎంఆర్), అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ రియాక్టర్లు(ఏఎంఆర్)ల అభివృద్ధికి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై ఇరుదేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు.

భారతీయ జవాన్లకు నివాళులు

మాసే సిటీకి చేరుకున్న మోదీ, మాక్రాన్‌లకు ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాసేలోని చరిత్రాత్మక మజర్గిస్ శ్మశాన వాటికను మోదీ, మాక్రాన్ సందర్శించారు. 1914 నుంచి 1918 వరకు జరిగిన మొదటి ప్రపంచయుద్ధంలో ప్రాణత్యాగాలు చేసిన భారతీయ సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడి ఇండియన్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచారు.

సావర్కర్‌కు మోదీ నివాళులు

భారత స్వాతంత్య్ర సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌కు మాసే సిటీలో ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. సముద్ర తీర ప్రాంత నగరమైన మాసే నుంచే సావర్కర్ సాహసోపేతంగా తప్పించుకొనేందుకు ప్రయత్నించారని వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. సావర్కర్‌ను బ్రిటిషర్ల కస్టడీకి అప్పగించవద్దంటూ అప్పట్లో మాసే ప్రజలు, ఫ్రెంచ్ కార్యకర్తలు ఉద్యమించారని వివరించారు. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఉద్ఘాటించారు. సావర్కర్ ధైర్యసాహసాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని కొనియాడారు. 1910 జూలై 8న మాసేలో బ్రిటిషర్ల ఓడలో బందీగా ఉన్న సావర్కర్ అక్కడి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించారు. కానీ, ఫ్రెంచ్ అధికారులు ఆయనను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మళ్లీ బ్రిటిషర్లకు అప్పగించారు. తర్వాత సావర్కర్‌కు బ్రిటిష్ పాలకులు జీవిత ఖైదు విధించారు. అండమాన్ నికోబార్ దీవుల్లోని సెల్యులార్ జైలుకు తరలించారు.



బుధవారం మాసేలో భారత కాన్సులేట్ కార్యాలయంలో మాక్రాన్‌తో మోదీ

ఇండియన్ కాన్సులేట్ ప్రారంభం

ప్రధాని మోదీ, అధ్యక్షుడు మాక్రాన్ బుధవారం మాసే సిటీలో భారత నూతన కాన్సులేట్‌ను సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భారతీయులు, ఫ్రాన్స్ పౌరులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ దేశ జాతీయ జెండాలు చేతబూని సందడి చేశారు.

మా యువ శక్తిపై పందెం కాయొచ్చు

ప్రధాని మోదీ పారిస్‌లో గూగుల్ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్‌తో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ(ఏఐ)తో భారత్‌కు లభించే అవకాశాలపై వారు చర్చించారు. ఇండియాలో డిజిటల్ పరివర్తన కోసం గూగుల్, ఇండియా ఎలా కలిసి పని చేయాలన్నదానిపై మాట్లాడుకున్నారు. మోదీతో సమావేశమైన ఫొటోలను సుందర్ పిచాయ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. దీనిపై మోదీ ప్రతిస్పందించారు. ప్రజా ప్రయోజనాల కోసం కృత్రిమ మేధను సమర్థంగా ఉపయోగించుకొనే విషయంలో ఇండియా వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అవకాశాల గనిగా మారిన భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వ్యాపారవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ''మా యువ శక్తిపై మీరు పందెం కాయొచ్చు'' అని పెట్టుబడిదారులకు సూచించారు.

అమెరికాకు పయనమైన మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఫ్రాన్స్ పర్యటన ముగించుకొని అమెరికాకు బయలుదేరారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆయన సమావేశం కానున్నారు. మెర్సియిల్ ఎయిర్‌పోర్టులో మోదీకి మాక్రాన్ వీడ్కోలు పలికారు. 'థాంక్యూ ఫ్రాన్స్' అంటూ మోదీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఫ్రాన్స్ పర్యటన ఫలవంతంగా జరిగిందన్నారు.

మాక్రాన్ దంపతులకు మోదీ బహుమతులు

న్యూఢిల్లీ: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ దంపతులకు ప్రధాని మోదీ అరుదైన బహుమతులు అందజేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని గిరిజన కళాకారులు లోహాలతో రూపొందించిన డోక్రా ఆర్ట్‌వర్క్, రాజస్తాన్ హస్తకళాకారులు వెండితో తయారు చేసిన టేబుల్ మిర్రర్‌ను బహూకరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఉషా వాన్స్ దంపతులు కుమారులు వివేక్ వాన్స్, ఎవాన్ బ్లెయిన్ వాన్స్, కుమార్తె మీరాబెల్ రోజ్ వాన్స్ కూడా బహుమతులు ఇచ్చారు. కలపతో తయారు చేసిన రైలు బొమ్మ, జిగ్‌సా పజిల్, భారత జానపద పెయింటింగ్స్, కలపతో రూపొందించిన ఆంగ్ల అక్షరాల బొమ్మలను వారికి అందజేశారు. ఇవి పూర్తిగా పర్యావరణ హితమైనవి. తయారీలో ఎలాంటి రసాయనాలు ఉపయోగించలేదు.

మహా కుంభ్‌కి 2 కోట్ల మంది

ప్రశాంతంగా ముగిసిన మాఘి పూర్ణిమ స్నానాలు

ప్రయాగ్‌రాజ్: మహా కుంభ మేళాలో మాఘి పూర్ణిమను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి సుమారు 2 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం తెలిపింది. జనవరి 29వ తేదీన పుణ్యస్నానాల సమయంలో చోటుచేసుకున్న విషాదం నేపథ్యంలో ఈసారి ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేశామని తెలిపింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఉదయం 4 గంటల నుంచే లక్నోలోని తన నివాసంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారని వివరించింది. త్రివేణీ సంగమంతోపాటు ఇతర ఘాట్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని తెలిపింది. హెలికాప్టర్ ద్వారా భక్తులపై పూలవాన కురిపించామంది. మాఘి పూర్ణిమ స్నానంతో నెలపాటు కఠోర దీక్షలు చేసిన కల్పవాసీలు సుమారు 10 లక్షల మంది మహాకుంభ్‌ను వీడి వెళ్లనున్నారు. ట్రాఫిక్ నిబంధనలను అనుసరిస్తూ, నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాలను ఉపయోగించుకోవాలని వీరికి సూచించింది. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు కుంభ్ ఎస్ఎస్‌పీ రాజేశ్ ద్వివేదీ చెప్పారు. ఆపరేషన్ చతుర్భుజ్‌లో భాగంగా 2,750 హైటెక్ కెమెరాలు, డ్రోన్లు, యాంటీ డ్రోన్ వ్యవస్థలను ఉపయోగించుకుని 24 గంటలూ నిఘా కొనసాగించినట్లు వివరించారు. మహాకుంభ్ ప్రాంతాన్ని మంగళవారం 4 గంటల నుంచే నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రయాగ్‌రాజ్ నగరాన్ని సైతం నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు. ఇందులో అత్యవసర, ఎమెర్జెన్సీ సేవలకు మాత్రం మినహాయింపు కల్పించారు. పబ్లిక్, ప్రైవేట్ వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించారు. అన్ని టోల్‌ప్లాజాల వద్ద రాకపోకలను క్రమబద్ధీకరించారు. భక్తుల కోసం ప్రతి 10 నిమిషాలకొకటి చొప్పున అదనంగా 1,200 బస్సులను అందుబాటులోకి తెచ్చారు. 26వ తేదీ వరకు కొనసాగే మహాకుంభ్‌లో చిట్టచివరి అమృత్ స్నాన ఘట్టం మహాశివరాత్రి రోజున ఉంటుంది.



బుధవారం మహా కుంభ్ మేళాలో సంగమం వద్దకు అసంఖ్యాకంగా తరలివచ్చిన భక్తజనం

పలువురు ప్రముఖుల రాక

మాఘి పూర్ణిమ సందర్భంగా బుధవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, తల్లి కోకిలా బెన్, కుమారులు, కోడళ్లు, మనవడు, మనవరాలు తదితరులతో కలిసి త్రివేణీ సంగమంలో స్నానాలు చేశారు. అదేవిధంగా, దిగ్గజ క్రికెటర్ అనిల్ కుంబ్లే, ఆయన భార్య పుణ్యస్నానాలు చేశారు. వీఐపీ ప్రొటోకాల్స్‌ను బుధవారం నిలిపివేయడంతో కుంబ్లే దంపతులు మిగతా భక్తుల మాదిరిగానే పడవలో త్రివేణీ సంగమానికి పడవలో చేరుకుని, పూజలు చేశారు.

మోదీ విమానంపై ఉగ్రవాదుల గురి!

ముంబై పోలీసులకు ఫోన్‌కాల్స్

ముంబై: ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన సందర్భంగా ఆయన ప్రయాణించే విమానంపై ఉగ్రవాదులు దాడి చేసే అవకాశం ఉందని ఓ వ్యక్తి ముంబై పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి చెప్పడం కలకలం సృష్టించింది. మంగళవారం ఒకే నెంబర్ నుంచి పలు ఫోన్‌కాల్స్ వచ్చాయని పోలీసులు బుధవారం వెల్లడించారు. వెంటనే అప్రమత్తమయ్యాయని, దర్యాప్తు సంస్థలకు విషయం చేరవేశామని అన్నారు. ఫోన్ ఎవరు చేశారన్నది గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఫోన్ చేసిన వ్యక్తి మానసిక స్థితి సక్రమంగా ఉండకపోవచ్చని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాని మోదీ తొలుత ఫ్రాన్స్‌లో పర్యటించారు. అక్కడి నుంచి అమెరికాకు బయలుదేరారు.

సమాంతర పాలన ఉత్తిదే: మస్క్

వాషింగ్టన్: వందల కోట్ల రూపాయల సొంత డబ్బును ఎన్నికల్లో ట్రంప్ కోసం ఖర్చు చేసి, ఆయనను గెలిపించి చివరకు ఆయన చేతుల్లోంచి అమెరికా పాలనాపగ్గాలను తీసుకుని సమాంతర పాలనను సాగిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తొలిసారిగా ట్రంప్ సమక్షంలో స్పందించారు. డోజ్‌కు అదనపు అధికారాలు కట్టబెడుతూ సంబంధిత కార్యనిర్వాహక ఉత్తర్వుపై మంగళవారం ట్రంప్ సంతకం చేస్తున్న సందర్భంగా డోజ్ చీఫ్ హోదాలో మస్క్ సైతం అక్కడే ఉన్నారు. వెంట ఆయన కుమారుడు అ– గిజీజీ ను సైతం తీసుకొచ్చారు. అమెరికా అధ్యక్షభవనంలోని ప్రఖ్యాత ఓవెల్ రూమ్‌లో రెజల్యూట్ డెస్క్ వద్ద ఆసీనులైన ట్రంప్ పక్కనే నిల్చుని మస్క్ కొద్దిసేపు మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ప్రభుత్వ వ్యయాలు, సిబ్బందిని కుదించే లక్ష్యంతో ఏర్పాటైన డోజ్ విభాగ సారథిగా మాత్రమే పనిచేస్తున్నానని, అధ్యక్ష అధికారాల్లోకి వేలు పెట్టలేదని తొలిసారిగా అధికారికంగా సమాధానమిచ్చారు. '' ప్రభుత్వ విభాగాల రోజువారీ పనుల్లో నేను, నా డోజ్ బృంద సభ్యులు జోక్యం చేసుకుంటున్నారనేది పచ్చి అబద్ధం. నాపై ఆరోపణలు ఫైల్స్, అర్షమొలల రోగిపై చేసే పరీక్షలా ఉన్నాయి. నేను ఒక తెరచిన పుస్తకం. అంతా పారదర్శకం. ప్రభుత్వ ఖర్చులను తగ్గించే విషయంలో మేం క్రూరమైన, విప్లవకారుల మనస్తత్వంతో పనిచేయట్లేము. ఇంగితజ్ఞానంతో పనిచేస్తున్నాం. ఓటర్లు ప్రజాపాలనలో భారీ సంస్కరణలను కోరుకుంటూ ట్రంప్ బృందానికి ఓటేశారు. మేం ఇప్పుడు అదే సంస్కరణలు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజాస్వామ్యం అంటే ఇదేకదా. మేం చేస్తున్న పని మొత్తం డోజ్ వెబ్‌సైట్‌లో అందరికీ కనిపిస్తుంది'' అని అన్నారు. అయితే డోజ్ వెబ్‌సైట్‌లో అలాంటి వివరాలేవీ లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ పథకాలు, వాటి కయ్యే ఖర్చులను డోజ్ తప్పుగా ప్రచురిస్తోందన్న ప్రశ్నకు మస్క్ బదులిచ్చారు. '' కొన్ని సార్లు తప్పులు దొర్లుతుంటాయి. వాటిని సరిచేయాల్సి ఉంది. ఇచ్చిన లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయాలన్న తొందరలో మేం చాలా వేగంగా పనిచేస్తున్నాం. ఈ క్రమంలో కొన్ని పొరపాట్లు జరుగుతున్నాయి. వాటిని సరిచేసుకుంటూ ముందుకెళ్తాం. ఎవరూ 1,000 శాతం సరిగా ఉండరుగా'' అని మస్క్ అన్నారు. '' ప్రజల ద్వారా ఎన్నికైన వ్యవస్థల కంటే ప్రభుత్వ అధికారుల యంత్రాంగం అత్యంత శక్తివంతమైంది. ప్రభుత్వ అధికారుల్లో కొందరు చాలా మంచి వ్యక్తులున్నారు. అయితే చేసే పనికి వారిని జవాబుదారీగా మార్చాల్సి ఉంది'' అని ఆయన అన్నారు.



వైట్‌హౌస్‌లో ట్రంప్ సమక్షంలో కుమారుడు ఎక్స్‌ను భుజాలకెత్తుకొని మాట్లాడుతున్న మస్క్

ఉక్రెయిన్‌పై పుతిన్‌తో మాట్లాడా

- చర్చలకు అంగీకరించిన రష్యా అధ్యక్షుడు
- ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఉక్రెయిన్ అధ్యక్షుడితోనూ సుదీర్ఘ మంతనాలు

వాషింగ్టన్/మాస్కో: రష్యా దురాక్రమణతో దండెత్తిన దరిమిలా దాదాపు నాలుగేళ్లుగా రావణకాష్టంగా రగిలిపోతున్న ఉక్రెయిన్ భూభాగాల్లో శాంతిపవనాలు వీచే అవకాశాలు మెరుగుపడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధానికి చరమగీతం పాడటమే లక్ష్యంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలతో ఫోన్‌లో విడివిడిగా సుదీర్ఘంగా మంతనాలు జరిపినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రకటించారు. మంగళవారం ఉదయం పుతిన్‌తో ట్రంప్ సుదీర్ఘంగా దాదాపు 90 నిమిషాలపాటు ఫోన్‌లో మంతనాలు జరిపినట్లు అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఏఏ అంశాలు ప్రస్తావనకు వచ్చాయనే వివరాలను వాళ్లు బయటపెట్టలేదు. కానీ ట్రంప్ మాత్రం తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో మంతనాల వివరాలను పంచుకున్నారు. '' ఇకనైనా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోకుండా యుద్ధం ముగిసిపోవాలని ఇరువురం కోరుకున్నాం. ఉక్రెయిన్ అంశంతోపాటు పశ్చిమాసియాలో అనిశ్చితి, ఇంధన రంగం, కృత్రిమ మేధ, అంతర్జాతీయంగా డాలర్ ఆధిపత్యం.. ఇలా కీలకమైన అంశాలపై పుతిన్‌తో సుదీర్ఘంగా మాట్లాడా. కలిసి పనిచేయాలని మేమిద్దం నిర్ణయించుకున్నాం. ఎంతో ఫలవంతమైన చర్చలు జరిపాం. మా స్నేహానికి గుర్తుగా త్వరలో నేను రష్యాలో పర్యటిస్తా. పుతిన్ సైతం అమెరికా పర్యటనకు వస్తారు. ఇందుకు పుతిన్ కూడా అంగీకరించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని తక్షణం ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, రష్యా తరఫున మధ్యవర్తిత్వ బృందాలు వెంటనే చర్చలు జరిపాలని మేమిద్దరం నిర్ణయించుకున్నాం. పుతిన్‌తో చర్చల సారాంశాన్ని తెలిపేందుకు తర్వాత నేను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఫోన్ చేశా. పుతిన్ కూడా జెలెన్‌స్కీకి ఫోన్ చేస్తారేమో'' అని బుధవారం ట్రూత్‌సోషల్‌లో ట్రంప్ ఒక పోస్ట్‌చేశారు. తమ అధ్యక్షుడితో ట్రంప్ దాదాపు గంటపాటు ఫోన్‌లో మంతనాలు జరిపారని ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో సజ్జన్ దోషే

- మాజీ కాంగ్రెస్ ఎంపీ కేసులో తీర్పు చెప్పిన ఢిల్లీ కోర్టు
- కనిష్టంగా జీవితఖైదు, గరిష్టంగా మరణశిక్ష పడే చాన్స్



సజ్జన్ కుమార్ (ఫైల్)

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ హత్యోదంతం తర్వాతి రోజు ఢిల్లీలో చెలరేగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో తండ్రీకొడుకులను సజీవ దహనం చేసిన కేసులో కాంగ్రెస్ మాజీ పార్లమెంట్ సభ్యుడు సజ్జన్ కుమార్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు దోషిగా తేల్చింది. ఈ మేరకు స్పెషల్ జడ్జి కావేరీ బవేజీ బుధవారం తీర్పును వెలువరించారు. గత ఏడాది నవంబర్ 8వ తేదీనే ఈ కేసుపై వాదోపవాదనలు విన్న జడ్జి ఆనాడు తీర్పును రిజర్వ్‌లో ఉంచి బుధవారం తీర్పు వెలువర్చారు. అయితే ఫిబ్రవరి 18వ తేదీన శిక్షాకాలాన్ని ఖరారుచేసే అవకాశం ఉంది. ఈ కేసులో 79 ఏళ్ల సజ్జన్‌కు కనిష్టంగా యావజ్జీవ కారాగార శిక్ష లేదంటే గరిష్టంగా మరణశిక్ష పడే వీలుంది. మూకదాడి, హత్య, హత్యాయత్నం, దాడి, తీవ్రంగా గాయపరచడం, పేలుడు పదార్థాల వినియోగం, ఆస్తుల దహనం తదితర నేరాలకు పాల్పడినందుకుగాను పలు ఐపీసీ సెక్షన్ల కింద సజ్జన్‌ను కోర్టు దోషిగా నిర్ధారించిందని జడ్జి కావేరీ తన తీర్పులో ప్రస్తావించారు. 1984 నవంబర్ ఒకటో తేదీన పశ్చిమ ఢిల్లీలోని సరస్వతీ విహార్ ప్రాంతంలో జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌లను వాళ్ల ఇంట్లోనే సజ్జన్ సారథ్యంలోని ఒక అల్లరిమూక సజీవదహనం చేసిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుల ఇంటిని లూటీచేసి, ఆ తర్వాత ధ్వంసంచేసి తగలబెట్టారని కేసు నమోదైంది. ఈ దాడిలో జస్వంత్ భార్యసహా కుటుంబసభ్యులు, బంధువులు తీవ్రంగా గాయపడ్డారు. ''ఇనుప కడ్డీలు, లాఠీలు, ఇటుకలు, పేలుడు పదార్థాలతో ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి ఇది. తన భర్తను, కుమారుడిని చంపిన వ్యక్తి ముఖాన్ని ఆ ఇల్లాలు జీవితంలో మర్చిపోదు. ఏన్నాళ్లయినా గుర్తుపట్టగలదు'' అని జడ్జి అన్నారు. ఉదంతం జరిగిన దాదాపు రెండునెలల తర్వాత ఆమె సజ్జన్ పేరును కేసులో ప్రస్తావించారన్న సజ్జన్ తరఫు లాయర్ల వాదనలను జడ్జి తోసిపుచ్చారు.

ఉచితాలు అనుచితం: సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల క్రతువు వేళ ఉచిత వాగ్దానాలను రాజకీయ పార్టీలు గంపగుత్తగా గుమ్మరించడాన్ని సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్రంగా తప్పుబట్టింది. ఉచిత పథకాలు ఇస్తూ ప్రజల్లో ఒక వర్గాన్ని కష్టపడి పనిచేయకుండా కేవలం పరాన్నజీవులుగా మార్చట్లేముకదా? అని కోర్టు ఒక ధర్మ సందేహాన్ని లేవనెత్తింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల సుప్రీం కోర్టు ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఉచిత పథకాలపై కోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. '' ఉచిత పథకాలు ఇచ్చే బదులు సంబంధిత వర్గాలకు అంతే స్థాయిలో మరో రూపంలో ప్రయోజనాలు కల్పించాలి. అప్పుడు ఆయా ఉచిత పథకాల లబ్ధిదారులంతా దేశాభివృద్ధిలో క్రియాశీలక భాగస్వాములుగా మారతారు. కానీ ఇప్పుడు దేశంలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. కేవలం ఎన్నికలవేళ రాజకీయ పార్టీలు ప్రకటించే 'లడ్కీ బెహన్' తదితర ఉచిత పథకాలతో జనం కష్టపడి పనిచేసేందుకు ఇష్టపడట్లేరు. ఎలాంటి పనిచేయకుండానే ఆయా లబ్ధిదారులకు ఉచితంగా రేషన్ వస్తోంది. ఉచితంగా నగదు బదిలీ జరుగుతోంది. పేద ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్న సదుద్దేశంతో ప్రకటించే ఉచిత పథకాలు మంచివే కానీ ఆ పథకాల లబ్ధి అనేది దేశ అభివృద్ధి స్రవంతిలో భాగంగా జరగాలి'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ''దేశంలో పని దొరికినాసరే పనిచేయబోం అనే జనం ఉండరు'' అని పిటిషనర్లలో ఒకరి తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలను జడ్జి గవాయ్ తప్పుబట్టారు. '' మీరు కేవలం ఒకవైపు మాత్రమే చూస్తున్నారు. నేను రైతు కుటుంబం నుంచి వచ్చా. ఎన్నికలకు ముందు ఉచిత పథకాలను ప్రకటించిన కారణంగా మహారాష్ట్రలో ఉచిత లబ్ధి పొందుతున్న రైతు కూలీలు పనులకు వెళ్లట్లేరు. దీంతో పొలాల్లో రైతులకు కూలీలు దొరకట్లేదు. కూలీల కొరత తీవ్రంగా ఉంది. అయితే ఈ అంశంలో మరింత లోతుల్లోకి మేం వెళ్లదల్చుకోలేదు'' అని న్యాయమూర్తి అన్నారు. '' అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి చెప్పినట్లు ఇల్లులేని వాళ్లకు ఆశ్రయం కల్పించాల్సిందే. అదే సమయంలో ఇలాంటి అంశాల్లో సమతూకంతో వ్యవహరించాలికదా'' అని ధర్మాసనం అభిప్రాయపడింది. పట్టణాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తూనే పట్టణప్రాంత పేదరిక నిర్మూలన కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు అటార్నీ జనరల్ చెప్పగా, ఇంకెన్నాళ్లు ఈ పథకం కొనసాగుతుందని కోర్టు ప్రశ్నించింది. నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్‌ను సైతం ఇంకెన్నాళ్లు అమలుచేస్తారని ప్రశ్నించింది.

'అయోధ్య' ప్రధాన పూజారి మహంత్ దాస్ కన్నుమూత



లక్నో: అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయం ప్రధాన పూజారి మహంత్ సత్యేంద్ర కుమార్ దాస్ బుధవారం పరమపదించారు. ఆయన వయస్సు 85 ఏళ్లు. ఈ నెల 3వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన మహంత్ దాస్‌ను లక్నోలోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్‌జీపీజీఐ)లో చేర్చారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో అప్పటి నుంచి న్యూరాలజీ వార్డులో చికిత్స అందిస్తున్నామని, బుధవారం తుదిశ్వాస విడిచారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గురువారం మధ్యాహ్నం జల సమాధి చేయనున్నామని మహంత్ దాస్ వారసుడు ప్రదీప్ దాస్ మీడియాతో చెప్పారు. మహంత్ సత్యేంద్ర కుమార్ దాస్ మృతికి ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. ఆయన తన జీవితాన్ని ఆ శ్రీరామునికే అంకితం చేశారన్నారు. 20 ఏళ్ల వయస్సులోనే సన్యాసం స్వీకరించిన దాస్ 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో తాత్కాలికంగా ఏర్పాటైన రామ్‌లల్లా ఆలయ పూజారిగా ఉన్నారు. అనంతరం ఆ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నాక ప్రధాన పూజారి బాధ్యతలను చేపట్టారు.

ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం అసాధ్యం

- ఆ దేశం చర్చలు, శాంతి ఒప్పందానికి సిద్ధపడాలి
- రష్యా స్వాధీనమైన భూభాగం తిరిగి రాదు
- అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ సంచలన వ్యాఖ్యలు



బ్రస్సెల్స్: రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని వెంటనే ఆపుతానంటూ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ఆ దిశగా స్పష్టమైన సంకేతాలిస్తున్నారు. రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మొదటిసారిగా బుధవారం నాటో ప్రధాన కార్యాలయంలో 'ఉక్రెయిన్ డిఫెన్స్ కాంటాక్ట్ గ్రూప్'సమావేశంలో ఇందుకు సంబంధించిన కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం అసాధ్యమన్నారు. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వంతో శాంతి ఒప్పందం కార్యరూపం దాలుస్తుందనే విశ్వాసం తనకు లేదన్నారు. అంతర్జాతీయ బలగాల దన్నుతో ఆ దేశం రష్యాతో చర్చలకు, శాంతి ఒప్పందానికి సిద్ధ పడాలని సూచించారు. అంతేకాదు, 2014 తర్వాత రష్యా ఆక్రమించుకున్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలను వదులు కోవాల న్నారు. ట్రంప్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు ఏ మేరకు సైనిక, ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధంగా ఉందో తెలుసుకోవాలనుకున్న నాటో దేశాలకు ఈ వ్యాఖ్యలు మింగుడు పడటం లేదు. అంతేకాదు, ఉక్రెయిన్ రక్షణ, ఆర్థిక, సైనిక పరమైన అంశాలను ఇకపై యూరప్ దేశాలే చూసుకోవాలని ట్రంప్ భావిస్తున్నారని కూడా హెగ్సెత్ బాంబు పేల్చారు. ఒక వేళ శాంతి పరిరక్షక బలగాల అవసరముంటే అందులో అమెరికా బలగాల పాత్ర ఉండబోదని కూడా తేల్చేశారు. ఈ బలగాలతో రష్యా ఆర్మీకి ఘర్షణ తలెత్తే సందర్భాల్లో అమెరికా లేదా నాటో దేశాల నుంచి ఎటువంటి రక్షణలు కల్పించలేమన్నారు. ఉక్రెయిన్ కోరుతున్న భూభాగంలో కొంత ప్రాంతాన్ని రష్యా ఉంచుకుంటుందన్నారు. ' బదులుగా సమర్థమైన యూరప్, లేదా నాన్ యూరప్ బలగాలతో భద్రత కల్పించడం మంచిది. ఏదేమైనా, ఎలాంటి భద్రతా ఒప్పందం కుదిరినా ఉక్రెయిన్‌లో అమెరికా బలగాలను మోహరించబోం. ఉక్రెయిన్‌లో భవిష్యత్తులో చేపట్టే ఎలాంటి మిలటరీ మిషన్‌కైనా నాటోకు, సభ్య దేశాలకు ఎలాంటి పాత్రా ఉండదు. నాటోలోని ఏ దేశంపై దాడి జరిగినా మిగతా దేశాలన్నీ రక్షణగా నిలవాలన్న ప్రాథమిక సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి. ఉక్రెయిన్‌కు భవిష్యత్తులో అవసరమయ్యే సైనిక, ఇతరత్రా సాయంలో ఎక్కువ భాగాన్ని యూరప్ దేశాలే చూసుకోవాల్సి ఉంటుంది'అని కుండబద్దలు కొట్టారు. అయితే, హెగ్సెత్ చెప్పిన అంశాలు త్వరలోనే మూనిక్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ఇతర అధికారులతో జరిగే సదస్సులో జరిగే చర్చలను మరింత సంక్లిష్టంగా మారు స్తాయని భావిస్తున్నారు.



అలా అరెస్టు... ఇలా బెయిల్!
తెలుగు రాష్ట్రాలకు వాంటెడ్‌గా ఉన్న సుప్రీతన్ దత్తాను పోలీసులు కోల్‌కతాలో అరెస్టు చేశారు. కాగా.. అతడి వద్ద నకిలీ కరెన్సీ లభించకపోవడంతో న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. -8లో



వాలెంటైన్స్.. ఫ్యాషన్ టైమ్స్..
లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనేది ఎంత వరకూ నిజం అనేది అలా ఉంచితే.. ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ బెస్ట్ ఇంప్రెషన్ అనేది మాత్రం ప్రేమికుల విషయంలో ఎప్పుడూ నిజమవుతూనే ఉంటుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0/20.0
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

శోకసంద్రం..

జబల్‌పూర్ రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు



మల్లారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న ఆయన భార్య, కుటుంబ సభ్యులు




రవికుమార్ మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న భార్య, కూతురు

మల్లాపూర్/గాంధీఆస్పత్రి: మహా కుంభ మేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు నగరవాసులు దుర్మరణం పాలైన విషాద ఘటన విదితమే. వీరిలో పలువురు మృతదేహాలకు బుధవారం నగరంలో అశ్రు నివాళి మధ్య అంత్యక్రియలు జరిగాయి. నాచారం కార్తికేయనగర్ కాలనీకి మల్లారెడ్డి, రాంపల్లి రవికుమార్ మృతదేహాలకు మల్లాపూర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. రెండు మృత దేహాలు మల్లాపూర్ శ్మశాన వాటికకు రావడంతో కన్నీటి పర్యంతమయ్యారు. సంతోష్ కుమార్ అంత్యక్రియలను గోల్నాకలో జరిగాయి. మినీ బస్సు డ్రైవర్ రాజు మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బంగ్లాలోని స్వగ్రామానికి తరలించారు. నాచారం రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన సోమవారం శశికాంత్ మృతదేహం గాంధీ మార్చురీలోనే ఉంది. శశికాంత్ చెల్లెలు శ్వేత అమెరికాలో ఉండండంతో బుధవారం రాత్రి 10 గంటలకు నగరానికి చేరుకోనున్నారు. చెల్లెలి చివరి చూపు కోసం శశికాంత్ అంత్యక్రియలను గురువారం మల్లాపూర్ శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా.. అంతకుముందు ప్రత్యేక అంబులెన్స్‌ల్లో బుధవారం గాంధీ మార్చురీ వద్దకు మృతదేహాలు చేరుకోవడంతో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



డ్రైవర్ రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న జనం



అమర దీపం!

నిండు పున్నమి.. పండు వెన్నెల.. అమరుల స్తూపానికి దీపశిఖలా అమరింది. మాఘ పౌర్ణమి వేళ బుధవారం రాత్రి హుస్సేన్ సాగర్ తీరంలోని అమరుల స్తూపంపై జాబిలమ్మ జాలువారింది. స్తూపంపై ఆకాశ దీపంలా ఇలా తొణికిసలాడింది.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

విన్నపాలు వినాల్సిందే..


అందుబాటులో ఉండాల్సిందే

- సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య.. ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాల్సిందే
- అధికారులకు బల్దియా కమిషనర్ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: కోటిమందికి పైగా ప్రజలకు సేవలందించాల్సిన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో, జోనల్ కార్యాలయాల్లో అధికారులు సందర్శకులకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఉస్సూరుమంటున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సందర్శకుల సమయం అని కార్యాలయాల వద్ద బోర్డుల మీద ఉంటున్నప్పటికీ, అధికారులు మాత్రం అందుబాటులో ఉండటం లేదు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీలోని అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులను సందర్శకులు కలిసేందుకు వీలుగా సాయంత్రం 4–5 గంటల మధ్య తమ కార్యాలయాల్లో ఉండాల్సిందేనని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సర్క్యులర్ జారీ చేశారు. అన్ని పని దినాల్లో (ప్రజావాణి ఉన్న రోజు మినహా) ప్రజల వేదనలు వినేందుకు, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు కార్యాలయాల్లో ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా అనివార్య కారణాలతో, ఇతర పనులతో ఉండటం సాధ్యం కాని పక్షంలో ముందస్తుగానే ఆ విషయాన్ని అడిషనల్ కమిషనర్(కోఆర్డినేషన్)కు తెలియపర్చాలని ఆదేశించారు. ఫిర్యాదులను తీసుకోవడంతో పాటు వాటిని వెంటనే పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ప్రతిరోజూ తమ వద్దకు ఎంతమంది వస్తున్నారో, ఎన్ని ఫిర్యాదులందుతున్నాయో, వాటిలో ఎన్ని పరిష్కరించారో తనకు ప్రతి వారం నివేదిక అందజేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులందరికీ విజిటర్స్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తేవాల్సిందిగా ఐటీ విభాగానికి సూచించారు. తద్వారా ఏయే అధికారిని ప్రతి వారం ఎంతమంది సందర్శకులు కలుస్తున్నారో తెలుస్తుందని, ప్రజలకు ఏయే అంశాల్లో ఎక్కువ సమస్యలున్నాయో తెలుసుకోవచ్చని కమిషనర్ భావిస్తున్నారు.

అయినా.. వారు మారలేదు.. !

కమిషనర్ ఈ సర్క్యులర్‌జారీ చేసి వారం రోజులైనప్పటికీ, ఇప్పటికీ ఇంకా పలువురు అధికారులు సందర్శకుల సమయాల్లో తమ కార్యాలయంలో ఉండటం లేదు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆరు అంతస్తుల్లో ఉండాల్సిన వివిధ విభాగాలకు చెందిన అడిషనల్ కమిషనర్లు, విభాగాధిపతుల్లో కనీసం ఇరవై శాతం మంది కూడా బుధవారం కనిపించకపోవడం గమనార్హం.



విద్య ఒక మిషన్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, సిటీబ్యూరో: విద్య కేవలం వృత్తిపరమైనది కాదని.. అది ఒక మిషన్ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్–ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఎడ్యుకేషనల్ ప్రమోషన్ అవార్డు–2025 కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, జ్ఞానంతో పాటు దృఢ సంకల్పాన్ని పెంపొందిస్తుందన్నారు. విద్యావంతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురికి ఎక్సలెన్స్ అవార్డులను బహూకరించారు. కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ సూరత్ సింగ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ మితేష్‌లోహియా, భీమ్‌రెడ్డి, హుస్సేనీ బక్తియార్ తహురా మహీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసుల్లో తీర్పు రిజర్వు

ఈ నెల 28కి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టు: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సంబంధించిన 6 కేసుల్లో నాంపల్లి కోర్టు తీర్పును రిజర్వు చేస్తూ ఈ నెల 28కి వాయిదా వేసింది. శ్రీరామనవమి ర్యాలీ, గత ఎన్నికల్లో చేపట్టిన ప్రచార ర్యాలీలతో పాటు సిటీలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పలువురు ఫిర్యాదు చేశారు. నగరంలో పలు పోలీస్ స్టేషన్‌లలో ఐపీసీ 295–ఏ, 188, 298తో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌లో మొత్తం 6 కేసులకు సంబంధించి కోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసుల్లో రాజాసింగ్ తరఫు న్యాయవాది కరుణసాగర్ వాదనలు వినిపిస్తూ పోలీసుల తప్పుడు సాక్ష్యాల్లో నిజం లేదని తెలిపారు. రాజాసింగ్ శ్రీరామనవమి ర్యాలీ చేపట్టినప్పుడు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. ఇది కేవలం ఆయనను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే కేసులు పెట్టారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీదేవి తీర్పును రిజర్వు చేస్తూ ఈ నెల 28కి వాయిదా వేశారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

ప్రాణాలు పోతున్నాయ్

స్కూల్ ఫీజు చెల్లించలేదని ప్రిన్సిపాల్ మందలింపు

- టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యా యత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మేడ్చల్ పట్టణంలో ఘటన
- బాచుపల్లిలో ఉరేసుకున్న ఇంటర్ విద్యార్థిని
- హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి
- గోప్యంగా ఉంచిన కళాశాల యాజమాన్యం
- విద్యార్థి సంఘాల ఆందోళనలు



అఖిల (ఫైల్)



పూజిత (ఫైల్)

కార్పొరేట్ విద్యా సంస్థలు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తూ ఫీజుల కోసం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. కుటుంబ ఆర్థిక పరిస్థితి, విద్యార్థుల మానసిక స్థితి గురించి ఆలోచించకుండా ప్రవర్తిస్తున్నాయి. కొంచెం కూడా మానవత్వాన్ని చూపడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభకు గురై చావు నోట్లో తలపెడుతున్నారు. స్కూల్ ఫీజు చెల్లించలేదని పాఠశాల ప్రిన్సిపాల్ తోటి విద్యార్థుల ముందే మందలించడంతో మనస్తాపానికి గురైన టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. కాగా.. ఇంటర్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

మేడ్చల్ రూరల్:

మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో కమల, వెంకటేశ్వర్లు దంపతుల కవల పిల్లలు అఖిల, విక్రమ్‌లు 10వ తరగతి చదువుతున్నారు. వీరిరువురి ఫీజు రూ.30 వేలు చెల్లించాల్సి ఉంది. అందులో రూ.10 వేలు చెల్లించారు. మిగతా మొత్తం చెల్లించడంలో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 8న అఖిల పాఠశాలకు వెళ్లగా ప్రిన్సిపాల్ రమాదేవి తోటి విద్యార్థినుల ముందే అవమానకరంగా మాట్లాడింది. తెలిసిన వారితో ఫీజు కోసం తనను ప్రిన్సిపాల్ టార్చర్ చేస్తున్నారని చెప్పుకొని ఏడ్చింది. సోమవారం పాఠశాలకు వెళ్లలేదు. మంగళవారం తల్లి ఇంట్లో ఉండగానే అఖిల వేరే గదిలోకి వెళ్లి గడియ వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వెంటనే స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆందోళన

పాఠశాల యాజమాన్యం తీరుతో విద్యార్థిని అఖిల ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆందోళన దిగారు. పాఠశాల ముందు బైఠాయించి విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేధింపులు నిజం కాదు..

ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, నిర్వాహకులు వివరణ ఇస్తూ తాము అఖిలను వేధించలేదని తెలిపారు. అందరితో పాటు తనకు ఫీజు చెల్లించాలని గుర్తు చేశామన్నారు. కాగా ఘటనకు కారణమైన పాఠశాల ప్రిన్సిపాల్‌పై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

హాస్టల్ గదిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నిజాంపేట్ : ఇంటర్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా కృష్ణాపురంనకు చెందిన బైసు శ్రీనివాస్, దేవి దంపతులు నగరంలోని బోరబండ ఫేజ్– 3లో నివాసం ఉంటున్నారు. వీరి కూతురు పూజిత (17) బాచుపల్లిలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. బుధవారం ఉదయం హాస్టల్ రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కాలేజీ సిబ్బంది వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పూజిత అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా.. మొదట కాలేజీ సిబ్బంది పూజిత బాత్రూంలో జారిపడిందని ఆమె తల్లిదండ్రులకు చెప్పారు. వారిని హాస్పిటల్‌కు రావాలని సూచించారు. కొద్ది సేపటి తర్వాత చనిపోయింది గాంధీ ఆసుపత్రికి రావాలని చెప్పడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తమ కూతురు మృతి అనుమానాస్పదంగా ఉందని పూజిత తల్లిదండ్రులు ఆరోపించారు. కాలేజీ యాజమాన్యం ఒత్తిడితోనే విద్యార్థిని మృతి చెందిందని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి.



కళాశాల ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

ప్రారంభోత్సవాలకు సిద్ధమవ్వండి

- పీఎం విశ్వకర్మ పథకం కింద రుణాలు అందించాలి
- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం, ప్రత్యేక అభివృద్ధి నిధులతో పూర్తిచేసిన పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం కావాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీడీపీ, ఎస్‌డీఎఫ్, దిశ, పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని, పూర్తయిన పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద రుణాలు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు అందించాలని సూచించారు. త్వరలో జరిగే దిశ సమావేశానికి పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ, బ్యాంకు లింకేజీ, హౌసింగ్ రుణాల కచ్చితమైన సమాచారంతో సమావేశంలో పాల్గొనాలని కలెక్టర్ అధికారుల ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వెంకటాచారి, యూడీసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం, అధికారులు జీఎం ఇండస్ట్రీ పవన్ కుమార్, డీఈఓ రోహిణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటి, ప్రణాళికా శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సురేందర్, డీటీడబ్ల్యూ ఓ ఆర్ కోటజీ, డీఎండబ్ల్యూఓ ఇలియాజ్ అహ్మద్, ఈఈ షఫీమియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆ రోజు నిర్ణయించి చెబుతాం..

బీఆర్ఎస్ పోటీ చేసేదీ లేనిదీ 17న వెల్లడి

- స్టాండింగ్ కమిటీ ఎన్నికపై తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్య



సమావేశంలో మాట్లాడుతున్న తలసాని

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ కోసం పార్టీ కార్పొరేటర్లు పోటీ చేసేదీ, లేనిదీ ఈ నెల 17వ తేదీన వెల్లడించనున్నట్లు బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆ రోజు మరోసారి నిర్వహించే సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నగర అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజలకు అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీపై, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్లు ముక్తకంఠంతో ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పోటీ చేయనట్లేనా ?

15 మంది సభ్యులు కలిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ కాలపరిమితి సంవత్సరం. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన జీహెచ్ఎంసీ పాలకమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎక్కువ మంది కార్పొరేటర్లు గెలవడంతో ఆ పార్టీ వారే మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఎంఐఎం కూడా అందుకు సంఘీభావం ప్రకటించింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్–ఎంఐఎం పరస్పర సహకారంతో పోటీలో దిగేవి. దాంతో పోలింగ్ దాకా రాకుండా ఏకగ్రీవంగానే బీఆర్ఎస్ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఏడుగురు ఎన్నికవుతూ వచ్చారు. ప్రస్తుతం సీన్ మారింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ స్థానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మేయర్, డిప్యూటీ మేయర్ కాంగ్రెస్‌లో కలిశారు. ఎంఐఎం సైతం ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తోంది. ఈనేపథ్యంలో ఎంఐఎంతో ఈసారి బీఆర్ఎస్‌కు పొత్తు ఉండదు. ఇప్పటికీ బీఆర్ఎస్ కార్పొరేటర్లే అధికసంఖ్యలో ఉన్నప్పటికీ, ఎంఐఎం పార్టీ ఈసారి కాంగ్రెస్‌తో పరస్పర సహకారంతో స్టాండింగ్ కమిటీలో పోటీ చేసే అవకాశం ఉన్నందున బీఆర్ఎస్ ఒంటరిగా బరిలో దిగినా గెలుపు సాధ్యం కాదు. అందుకే నామినేషన్ల గడువు ముగిసే నాటికి పరిస్థితులెలా ఉంటాయో పరిశీలించి బీఆర్ఎస్ తమ అభ్యర్థులను పోటీ చేయించాలా? లేదా? అనేది నిర్ణయించనుంది. నామినేషన్ల దాఖలుకు 17వ తేదీ చివరి తేదీ కావడంతో ఆ రోజు నిర్ణయం తీసుకుంటామని తలసాని తెలిపినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పోటీలో ఉండకపోవచ్చనే అభిప్రాయాలున్నాయి. ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి.

రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఆరుగురి అరెస్ట్

- శ్రీకాకుళంలో ఐదుగురు, వరంగల్‌లో ఒకరిని పట్టుకున్న పోలీసులు
- భద్రాచలం వద్ద మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడిపై జరిగిన దాడి కేసును పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డితోపాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు బుధవారం మరో ఆరుగురిని అరెస్టు చేశారు. వీరితో పాటు భద్రాచలం సమీపంలో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రామరాజ్యం సైన్యం పేరుతో 26 మంది ఈ నెల 7న చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆయన ఫిర్యాదుతో మొయినాబాద్ పీఎస్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రెండు బృందాలతో గాలింపు చేపట్టి 8న ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని అరెస్టు చేయగా మరుసటిరోజు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న 20 మంది కోసం రెండు బృందాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వీరబాబు, మూర్తి, గోవిందరావు, ఎల్.వెంకటరమణ, ఎం.వెంకటరమణను బుధవారం అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. మరో బృందం తెలంగాణలో చేపడుతున్న గాలింపు చర్యల్లో భాగంగా నగరంలోని బోడుప్పల్‌కు చెందిన శ్రీనివాస్ అలియాస్ సేనను వరంగల్‌లో అరెస్టు చేశారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించి రిమాండ్‌కు తరలించారు.

పరారీలో మరో 14 మంది

అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ఇప్పటి వరకు పోలీసులు మొత్తం 12 మందిని అరెస్టు చేశారు. మరో 14 మంది పరారీలోనే ఉన్నారు. వీరిలో భద్రాచలం వద్ద మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారికోసం గాలింపు కొనసాగుతోంది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- గుర్తు తెలియని రెడీమిక్స్ వాహనం ఢీకొన్నట్లు కేసు నమోదు
- అనుమానాలున్నాయన్న బంధువులు


మృతి చెందిన మమత (ఫైల్)

మూసాపేట: చిన్ననాటి స్నేహితునితో కలిసి స్కూటీపై వెళ్తున్న యువతిని రెడీమిక్స్ లారీ ఢీకొనడంతో దుర్మరణం పాలైంది. కూకట్‌పల్లి పోలీసులు, స్థానికులు తెల్పిన మేరకు..శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం గ్రామానికి చెందిన కుమారి తన కుమార్తె మమత, కుమారుడితో కలిసి మూసాపేటలోని ముష్కిపేటలో ఉంటోంది. కుమారి కూతురు మమత(17) మంగళవారం రాత్రి తన స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. రాత్రి 11 గంటల సమయంలో మమత తన చిన్ననాటి స్నేహితుడైన నరేశ్‌తో కలిసి మూసాపేట నుంచి కూకట్‌పల్లి వైపు స్కూటీపై వెళ్తుండగా మూసాపేట మెట్రో స్టేషన్ పిల్లర్ 878 వద్ద గుర్తు తెలియని రెడీమిక్స్ లారీ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ కింద పడిపోగా రెడీమిక్స్ వాహనం మమత నడుం మీద నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఇద్దర్నీ స్థానిక ఆస్పత్రికి తరలించగా మమత మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. తల్లి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి..మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా ఢీకొట్టిన రెడీమిక్స్ లారీ వివరాలు తెలియవని, సీసీ ఫుటేజీలు పరిశీలించాక వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా..మమత మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ కస్టడీకి ప్రిజం పబ్ కాల్పుల నిందితుడు

గచ్చిబౌలి: ప్రిజం పబ్‌లో కాల్పులకు తెగబడ్డ ప్రధాన నిందితుడు బత్తుల ప్రభాకర్‌ను గచ్చిబౌలి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కూకట్‌పల్లి పదో మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి షాలిని ఈ నెల 14వ తేదీ వరకు ప్రభాకర్‌ను పోలీసు కస్టడీకి అనుమతించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ నెల 1న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌లో సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డికి బుల్లెట్ గాయమైనప్పటికీ బౌన్సర్ల సహాయంతో హెడ్ కానిస్టేబుళ్లు వీరస్వామి, ప్రదీప్‌రెడ్డిలు ప్రభాకర్‌ను చాకచక్యంగా పట్టుకున్నారు. 80కి పైగా కేసుల్లో నిందితుడుగా ఉన్న ప్రభాకర్ 23 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నారు. మొయినాబాద్ పీఎస్ పరిధిలో వీజేఐటీ, కేజీ ఇంజనీరింగ్ కాలేజీల్లో రాత్రి సమయంలో చోరీలకు పాల్పడి దాదాపు రూ.24 లక్షల నగదును చోరీ చేశాడు. ఈ కేసుల్లోనే పట్టుకునేందుకు సీసీఎస్ పోలీసులు ప్రయత్నించగా రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. నిందితుడి వద్ద మూడు కంట్రీ మేడ్ గన్‌లు, 451 బుల్లెట్లు లభించడం గమనార్హం. చోరీల సొత్తు ఎక్కడ దాచాడు, మూడు గన్‌లు ఎందుకు..ఎక్కడ కొనుగోలు చేశాడనే కోణంలో విచారించనున్నారు.

అలా అరెస్టు.. ఇలా బెయిల్!

తెలుగు రాష్ట్రాలకు వాంటెడ్‌గా సుప్రీతన్ దత్తా

- నకిలీ కరెన్సీ ముద్రణకు పేపర్ సరఫరాలో దిట్ట
- ఇతగాడిని కోల్‌కతాలో పట్టుకున్న ఏపీ పోలీసులు
- పీటీ వారెంట్ దాఖలు చేసిన రాచకొండ అధికారులు
- బెయిల్ ఇచ్చి పంపిన అలిపోరేలోని న్యాయస్థానం


నవీన్‌కుమార్ అరెస్టు చూపించిన పోలీసులు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: కోల్‌కతాకు చెందిన గ్రాఫిక్ డిజైనర్ సుప్రీతన్ దత్తా నకిలీ నోట్ల తయారీలో కీలకంగా మారాడు. రాచకొండతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ నమోదైన కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. దీంతో ఈ రెండు పోలీసు విభాగాలకు చెందిన అధికారులు గత వారం అక్కడకు వెళ్లారు. అతికష్టమ్మీద పట్టుకుని అలిపోరే కోర్టులో హాజరుపరిచారు. అయితే న్యాయస్థానం అతడికి వెంటనే బెయిల్ మంజూరు చేయడంతో రాచకొండ పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్ సైతం నిష్ప్రయోజనం అయింది. నిందితుడు వద్ద ఎలాంటి నకిలీ నోట్లు లభించకపోవడంతోనే బెయిల్ ఇస్తున్నట్లు ఆ న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

లాక్‌డౌన్ దెబ్బకు నేరబాట..

మహబూబ్‌నగర్ జిల్లా డివిటిపల్లికి చెందిన కర్లీ నవీన్‌కుమార్ 2017లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో డిప్లమో చేయడానికి మహబూబ్‌నగర్ వెళ్లాడు. దాంతో పాటు గ్రాఫిక్ డిజైనింగ్, వెబ్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్ కూడా నేర్చుకున్నాడు. ఆపై నగరానికి వచ్చి వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేశాడు. అయితే కోవిడ్ లాక్‌డౌన్ ప్రభావంతో ఉద్యోగం కోల్పోయి రోడ్డునపడ్డాడు. 2022లో ఫ్రీలాన్స్ గ్రాఫిక్ డిజైనర్‌గా, బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేశాడు. ఈ సంపాదన చాలకపోవడంతో తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించాడు. తనకు ఉన్న గ్రాఫిక్ డిజైనింగ్ ప్రతిభను వినియోగించి నకిలీ నోట్లు తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు.

కోల్‌కతా, గుజరాత్‌లకు సరఫరా..

ఇలా నవీన్ ఏ4 సైజ్ పేపర్ పైన నకిలీ రూ.500 నోట్లను ప్రింట్ తీయడం మొదలెట్టాడు. వీటిలో 300 షీట్లను సుప్రీతన్ దత్తాకు పంపి రూ.45 వేలు, అతడు చెప్పడంతో మరో 100 షీట్లు గుజరాత్‌కు చెందిన మోష్మీకి పంపి రూ.17 వేలు తీసుకున్నాడు. మరికొన్ని షీట్లను నోట్లుగా కట్ చేసి నగరంలో మార్చడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాల్లో ఉన్న ఇతడిని రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు గత నెల 24న తుక్కుగూడలో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన నకిలీ రూ.500 నోట్లు, తయారీ సామాగ్రి స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో సుప్రీతన్ దత్తా, మోష్మీ, వినోద్‌లను నిందితులుగా చేర్చిన అధికారులు గాలింపు చేపట్టారు. సుప్రీతన్ దత్తా నవీన్‌కు పేపర్లు సరఫరా చేసి.. ఇతడి నుంచి తీసుకున్న నకిలీ నోట్ల షీట్లను ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు చెందిన వారికి అందించి సొమ్ము చేసుకున్నాడు.

ఆన్‌లైన్‌లో పరిచయమైన ఆ ఇద్దరూ..

యూట్యూబ్ ద్వారా నకిలీ నోట్ల తయారీ విధానాన్ని అధ్యయనం చేసిన నవీన్‌కు... దానికోసం ప్రత్యేకమైన పేపర్ కావాలని గుర్తించాడు. దీన్ని సరఫరా చేసే వారి కోసం ఇండియా మార్ట్ వెబ్‌సైట్‌లో సెర్చ్ చేస్తుండగా... కోల్‌కతాకు చెందిన వ్యాపారి సుప్రీతన్ దత్తాతో పరిచయం ఏర్పడింది. ఇరువురూ వాట్సాప్ ద్వారా సంప్రదింపులు జరపగా..నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన 45 జీఎస్ఎం పేపర్‌ను తాను సరఫరా చేస్తానని అతడు అంగీకరించాడు. ఫేస్‌బుక్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు వాసి వినోద్ ప్రింటర్ తదితరాలను సమకూర్చాడు. డివిటిపల్లిలోని తన ఇంట్లోనే ఈ ప్రెస్ ఏర్పాటు చేసిన నవీన్...అక్కడే సుప్రీతన్ దత్తా సరఫరా చేసిన పేపర్ పైన తాను డిజైన్ చేసిన నకిలీ కరెన్సీని ప్రింట్ చేయడం మొదలెట్టాడు.

కస్బా ప్రాంతంలో గాలించిన పోలీసులు..

గుంటూరు గ్యాంగ్‌ను ఏపీ పోలీసులు పట్టుకోగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇతగాడు రెండు రాష్ట్రాల పోలీసులకు సుప్రీతన్ దత్తా వాంటెడ్‌గా మారాడు. ఇతడి కోసం గుంటూరు, రాచకొండ పోలీసులు గత వారం కోల్‌కతా చేరుకున్నారు. అక్కడి కస్బా ప్రాంతంలో ఏపీ పోలీసులకు ఇతగాడు గత గురువారం చిక్కాడు. ఈ విషయం తెలియడంతో రాచకొండ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వీళ్లద్దరూ సుప్రీతన్ దత్తాను అక్కడి అలిపోరేలోని న్యాయస్థానంలో హాజరుపరిచారు. తమ ప్రాంతానికి తరలించడానికి పీటీ వారెంట్ కోరారు. అయితే నిందితుడి వద్ద నకిలీ కరెన్సీ దొరక్కపోవడంతో వారెంట్ ఇవ్వడానికి తిరస్కరించిన కోర్టు బెయిల్ ఇచ్చి పంపింది. దీంతో పోలీసులు అతడిని తీసుకువచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు.

మూసీ కూల్చివేతలతో హైడ్రాకు సంబంధం లేదు

సాక్షి, సిటీబ్యూరో: కూల్చివేతలు ఎక్కడ జరిగినా వాటిని హైడ్రాకు ముడి పెట్టవద్దని సంబంధిత అధికారులు మీడియాకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మూసీ కూల్చివేతలు హైడ్రా జరపలేదని స్పష్టం చేశారు. అసలు మూసీతో హైడ్రాకు సంబంధం లేదని పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ఈ విషయాన్ని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని ఒక ప్రకటనలో కోరారు.

స్టార్ హోటల్‌లో బంగారు నగల చోరీ

ఫిలింనగర్: నిశ్చితార్థ కార్యక్రమానికి విచ్చేసిన ఓ కుటుంబం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-92లోని తాజ్‌మహల్ హోటల్‌లో బస చేయగా పెళ్లి కూతురుకు సంబంధించిన నగలు చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మాదాపూర్ ఖానామెట్‌కు చెందిన రాజవరం దీపిక తన కూతురి నిశ్చితార్థం సందర్భంగా రోడ్డు నెంబర్-92లోని తాజ్‌మహల్ హోటల్‌లో రెండు గదులు బుక్ చేసుకున్నారు. హోటల్ యాజమాన్యం ఆమెకు 201, 209 గదులు కేటాయించింది. ఈ నెల 8వ తేదీన నిశ్చితార్థానికి పెళ్లి కూతురు ఆభరణాలు ధరించి..కార్యక్రమం ముగిసిన తరువాత రాత్రి హోటల్ గదికి వచ్చి బ్యాగ్‌లో సర్దుకుంది. ఆ తెల్లవారి ఇంటికి వెళ్లి చూసుకోగా బ్యాగ్‌లో కొన్ని ఆభరణాలు కనిపించలేదు. ఇల్లంతా వెతికినా ఫలితం లేకపోవడంతో తాము బస చేసిన తాజ్‌మహల్ హోటల్‌కు వచ్చి గదిలోనూ, ఆవరణలోనూ గాలించారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తామని హోటల్ యాజమాన్యానికి చెప్పగా సీసీ కెమెరాలు మరమ్మతులో ఉన్నాయని తెల్పారు. గుర్తుతెలియని వ్యక్తులు తాము బస చేసిన హోటల్ గదిలోకి ప్రవేశించి ఆభరణాలు దొంగిలించి ఉంటారని అనుమానిస్తూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇంత పెద్ద హోటల్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

బ్యాంకు ఖాతాలు అందించిన నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాదితో పాటు విదేశాల్లో ఉండి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితులకు సహకరించిన ఇద్దరు నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. నగరంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరిని వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసినట్లు అధికారులు బుధవారం ప్రకటించారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన పి.ఉమామహేష్ సైబర్ నేరగాళ్లకు తన బ్యాంకు ఖాతా ఇవ్వడంతో పాటు మరికొన్ని ఎకౌంట్ల వివరాలు ఇచ్చాడు. వీటిని వినియోగించి ప్రధాన సూత్రధారులు తెలంగాణలో మూడింటితో సహా దేశ వ్యాప్తంగా ఎనిమిది నేరాలు చేశారు. నగరానికి చెందిన ఓ 55 ఏళ్ల ఉద్యోగికి సోషల్ మీడియా ద్వారా ఎర వేశారు. గోల్డ్ ట్రేడింగ్‌లో సహకరిస్తామంటూ నమ్మబలికి ప్రత్యేక యాప్‌లో ఖాతా తెరిపించారు. బాధితుడి నుంచి దఫదఫాలుగా రూ.43.36 లక్షలు కాజేసిన నేరగాళ్లు ఆపై యాప్‌లోని ఖాతా పని చేయకుండా చేశారు. బాధితుడి నుంచి డబ్బు డిపాజిట్/బదిలీ చేయించుకోవడానికి వాడిన ఖాతాల్లో ఉమామహేష్ ఖాతా ఉంది. బాధితుడి ఫిర్యాదుతో నమోదైన కేసులో పోలీసులు ఉమా మహేష్‌ను అరెస్టు చేశారు. అలానే నగరానికి చెందిన మరో ప్రైవేట్ ఉద్యోగికీ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా ఎర వేశారు. గూగుల్ రివ్యూలు, టాస్కులు పూర్తి చేస్తే నగదు ఇస్తామని నమ్మించారు. ఆయన నుంచి రూ.25.36 లక్షలు కాజేసి మోసం చేశారు. ఇతడి నుంచి డబ్బు వెళ్లిన ఖాతాల్లో నగరానికి చెందిన సీహెచ్ నవీన్ ఖాతా కూడా ఉందని పోలీసులు గుర్తించారు. కమీషన్లకు ఆశపడి సైబర్ నేరగాళ్లతో కలిసి పని చేసినట్లు తేల్చారు. దీంతో ఇతగాడినీ అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రంగరాజన్‌పై దాడి బాధాకరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


రంగరాజన్‌ను పరామర్శించి మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై కల్తీ రామ భక్తులు దాడి చేయడం బాధాకరమని.. అలాంటి దొంగ భక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. ఆయనతో మాట్లాడి దాడి విషయాలను తెలుసుకున్నారు. దేవుడి సేవలో ఉన్న రంగరాజన్ నిజమైన రామ భక్తుడన్నారు. నిజమైన రామ భక్తుడిపై రాముడి పేరుతో వచ్చిన దొంగ భక్తులు దౌర్జన్యాలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర చారి తదితరులు ఉన్నారు. కాగా రంగరాజన్‌పై దాడికి పాల్పడిన ధర్మద్రోహులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. బుధవారం వీహెచ్‌పీ ప్రతినిధుల బృందం చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లి అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించింది.

జైలర్ బదిలీ

కుషాయిగూడ: చర్లపల్లి సెంట్రల్ జైలులో జైలర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సత్తయ్యపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. సంగారెడ్డి జిల్లా జైలు అధికారి చింతల దశరథంతో కలిసి మద్యం మత్తులో గొడవ పడటంతో, హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్ రావు విచారణ జరిపి, జైలర్ సత్తయ్యను చర్లపల్లి జైలు నుండి సంగారెడ్డి కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు. చింతల దశరథంపై విచారణ కొనసాగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే చర్లపల్లి జైలు వార్డెన్లుగా పనిచేస్తున్న రహీముద్దీన్, లింగయ్యలకు గంజాయి సరఫరాలో ప్రమేయం ఉందనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, జైలు సూపరింటెండెంట్ రామచంద్రం వారిని జైలు బయట విధులు నిర్వహించాలని ఆదేశించారు.

క్రీడలతో మానసికోల్లాసం

కవాడిగూడ: క్రీడలు ఐక్యతకు, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం హైదరాబాద్-1 ప్రిన్సిపల్ కమిషనర్ శివాజీ మోరే అన్నారు. బుధవారం ఇందిరాపార్కులోని టెన్నిస్ కోర్టులో సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్, కల్చరల్ బోర్డు ఆధ్వర్యంలో 54వ సౌత్‌జోన్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన టెన్నిస్ పోటీలలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి, గోవా, తదితర రాష్ట్రాలకు చెందిన ఇన్‌కమ్‌ట్యాక్స్ ఉద్యోగులు పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి శివాజీ మోరే సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సుబ్బారెడ్డి, విజువల్ కట్టాతోపాటు ఉద్యోగులు ఐదు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.


విజేతలతో ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ శివాజీ మోరే

కరీంనగర్ జిల్లాలో ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సేవలు

నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రముఖ గాయని మధుప్రియ



సాక్షి, సిటీబ్యూరో: టూర్స్ అండ్ ట్రావెల్స్ రంగంలో 25 సంవత్సరాల అనుభవమున్న ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ కరీంనగర్ జిల్లాలో తమ సేవలను అందించనుంది. ఈ సందర్భంగా తమ నూతన కార్యాలయాన్ని కరీంనగర్ జిల్లాలో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ గాయని మధుప్రియ విచ్చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇప్పటికే హైదరాబాద్, బెంగుళూరు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో సేవలందిస్తున్న ఆర్.వీ. టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ఇప్పుడు ఉత్తర తెలంగాణ ప్రజలకు మరింత అందుబాటులోకి రావడం చాలా సంతోషకరమన్నారు. అతి తక్కువ ధరలలో చక్కటి సౌకర్యాలతో యాత్రలు చేసేవిధంగా దాదాపు వందకు పైగా దేశ విదేశీ యాత్రలకు సంబంధించిన టూర్ ప్యాకేజీలను అందించడం శుభపరిణామమని అన్నారు. సంస్థ చైర్మన్ ఆర్.వి.రమణ మాట్లాడుతూ కాశీ - అయోధ్య రూ.21,999, బ్యాంకాక్-33,999, మలేషియా 49,999, యూరప్ 3.25,000లకు టూర్ ప్యాకేజీలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా చార్ధామ్, అమర్నాథ్ ముక్తినాథ్, కర్ణాటక, కాశ్మీర్, కేరళ, తమిళనాడు వంటి అనేక దేశీయ యాత్రలతో పాటు దుబాయ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి విదేశీ యాత్రలపై కూడా భారీ డిస్కౌంట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం ఫిబ్రవరి 15వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉందన్నారు.

ఆటోలో మరిచిపోయిన ఆభరణాల బ్యాగు అప్పగింత


బ్యాగు, ఆభరణాలను అప్పగించిన పోలీసులు

కుషాయిగూడ: ఓ ప్రయాణికుడు ఆటోలో మరిచిపోయిన బ్యాగును..అందులో ఉన్న బంగారు ఆభరణాలను పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఈ సంఘటన బుధవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చంద్రశేఖర్ అనే వ్యక్తి ర్యాపిడోలో ఆటో బుక్ చేసుకొని (టీజీ 26 టీ 2030) డిఫెన్స్‌కాలనీ నుంచి ఈసీఐఎల్ వరకు ప్రయాణించాడు. ఆటో దిగిన సమయంలో తన వెంట తీసుకువచ్చిన బ్యాగును ఆటోలోనే మరిచిపోయాడు. దీంతో ఆందోళన చెందిన చంద్రశేఖర్ సమీపంలోని కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన డిఐ జి.వెంకటేశ్వర్లు ర్యాపిడో కార్యాలయ సిబ్బందితో మాట్లాడి చంద్రశేఖర్ ప్రయాణించిన ఆటో వివరాలు, డ్రైవర్ ఫోన్ నెంబర్లు తీసుకొని..ఆటో డ్రైవర్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఆటోలో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌లో ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలను గుర్తించిన పోలీసులు బాధితుడికి అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన ఆటో డ్రైవర్‌కు డిఐ వెయ్యి రూపాయల నగదు పారితోషికం అందజేసి అభినందించారు.

అంబేడ్కర్ భవన్ పునరుద్ధరణకు చర్యలు

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


కేలండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని పునరుద్ధరించేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్, డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఫోన్ నంబర్లతో పాటు దళితులకు ఉపయోగపడేలా ఉన్న చట్టాలను పొందుపరిచి డైరీ, కేలండర్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. దళితుల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాలని ఆయన సూచించారు. డైరీ, కేలండర్ రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించిన కె. వినోద్ కుమార్, రుద్రారం శంకర్, కె. పరుశురాముడులను మంత్రి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్‌బాబు, ఆర్ నర్సింహారావు, గణేష్ భూపాల్‌రావు, ఏపీఎస్సీ ఆర్‌పీఎస్ అధ్యక్షుడు దాసరి యాదగిరి, నాయకులు డి. శంకర్, కృష్ణవేణి, స్టాలిన్, శివశంకర్, అశోక్, విజయ్‌శంకర్, కవిత, ప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయంలో ఊడిన పెచ్చులు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా నిర్మించిన రాష్ట్ర సచివాలయంలోని ఆరవ అంతస్తు నుంచి జీఆర్‌సీ ఫ్రేం బుధవారం సాయంత్రం ఊడిపడిపోయింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా మరమ్మతులు చేస్తుండడంతో ఊడిపడినట్లు సమాచారం. ఆరవ అంతస్తు నుంచి బయటకు వచ్చే మెయిన్ ఎంట్రెన్స్ వద్ద పార్టీషన్ ఫ్రేమ్ కూలిందని చెబుతున్నారు. కూలిన ఆ ఫ్రేమ్ రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ కారుపై పడింది. కాగా సెక్రటేరియట్ పెచ్చులు ఊడిన ఘటనపై స్పందించిన షాపూర్ జి పల్లోంజి నిర్మాణ సంస్థ ప్రతినిధులు రెగ్యులర్‌గా జరిగే కేబుల్, లైటింగ్ పనుల సమయంలో జీఆర్‌సీ ఫ్రేమ్ ఊడిందని, నిర్మాణ సమస్య కానీ, కాంక్రీట్ కానీ కాదని పేర్కొన్నారు. ఇటీవల లైటింగ్ కోసం, కొత్త కేబుల్స్ కోసం జీఆర్‌సీని డ్రిల్ చేస్తున్నారని, ఆ సమయంలో అది దెబ్బతిన్నట్లు తెలిపారు. నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లోపం లేదని, దీనిపై తాము సమీక్షిస్తున్నట్లు కూడా తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..



వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా..

బంజారాహిల్స్: వాటర్ ట్యాంకర్ డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, ఎక్కడైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా హెచ్చరించారు. బుధవారం వెస్ట్‌జోన్ పరిధిలోని వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేస్తామన్నారు. ప్రతి వాటర్ ట్యాంకర్ డ్రైవర్ విధిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని ధృవపత్రాలు కలిగి ఉండాలని, వెహికల్ నెంబర్ స్పష్టంగా రాసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ దూసుకుపోయే ట్యాంకర్లను తమ సిబ్బంది ఫొటోలు తీసి ఇ-చలాన్‌లు పంపుతారని గుర్తుచేశారు.

హంపీ విద్యారణ్య మహా సంస్థానం పరిధిలోకి దైవ సన్నిధానం



ఫిలింనగర్ దైవ సన్నిధానం..

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవ సన్నిధానం శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాస్వామి ఆశీస్సులతో హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచలిత ఫిలింనగర్ దైవ సన్నిధానంగా కొనసాగనుంది. గురువారం ఉదయం దైవ సన్నిధానంలో విద్యారణ్య భారతీస్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి నేతృత్వంలో విద్యారణ్య మహా సంస్థాన పీఠార్చన, హారతి అనంతరం కమిటీ సభ్యులకు, భక్తులకు అనుగ్రహ భాషణ, ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.



మాఘమాస మహోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీ సాయిబాబాకు బుధవారం సపోటా రసంతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని సేవించారు.
– బంజారాహిల్స్

మొండి బకాయిలపై నజర్

- పన్ను చెల్లించని ఆస్తుల జప్తు..
- యజమానులకు వారెంట్లు జారీ..
- స్పందించకపోతే ఆస్తుల సీజ్



పన్ను చెల్లించని ఆస్తులను సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు..

బంజారాహిల్స్: ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులను గుర్తిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు వారెంట్లు జారీ చేసి ఆస్తులను జప్తు చేస్తున్నారు. పలు మార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకుండా ఏళ్ల తరబడి బకాయి పడుతున్న వారిని గుర్తించి వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-18 పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షేక్‌పేట డివిజన్ల పరిధిలో గత రెండు రోజులుగా ముగ్గురు మొండి బకాయిదారుల ఆస్తులను అధికారులు జప్తు చేశారు. పన్నుల విభాగం అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా వీరు స్పందించకుండా మొండిగా వ్యవహరిస్తుండడంతో కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. సర్కిల్-18 పరిధిలో మొండి బకాయిదారులు సుమారుగా 80 వరకు ఉండగా, మరో 150 మందికి రెడ్ నోటీసులు జారీ చేశారు. అలాగే 27,000 మందికి పన్నులు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. సర్కిల్-18 పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.213 కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.145 కోట్లు వసూలు చేశారు. మార్చి 31 నాటికి ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో బకాయిదారులందరూ పన్నులు చెల్లించాలని డీసీ ప్రశాంతి సూచించారు. ఇప్పటికే వారెంట్లు ఉన్నవారందరికీ అవగాహన కల్పించామని, సూచిస్తున్నామని, గుర్తుచేస్తున్నామన్నారు. అయినా కొందరు పన్నులు చెల్లించకుండా మొండికేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయన్నారు.

ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధిలో..

ఆస్తి పన్ను వసూళ్లపై ఖైరతాబాద్ సర్కిల్-17 అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే పలు మార్లు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో డీసీ రజనీకాంత్‌రెడ్డి సమావేశమై లక్ష్యాన్ని చేరుకునే విధంగా దిశా నిర్దేశం చేసి మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సర్కిల్-17 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ. 203 కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటివరకు రూ.108 కోట్లు వసూలయ్యాయి. సర్కిల్ పరిధిలో 66 వేల మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఉండగా ఇందులో ఇప్పటివరకు 40 వేల మంది చెల్లించారు. 26 వేల మందికి పన్నులు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అలాగే 106 మంది మొండి బకాయిదారులకు వారెంట్లు జారీ అయ్యాయి. సకాలంలో చెల్లించకపోతే వీరి ఆస్తులను జప్తు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే మరో 103 మంది పన్ను చెల్లింపుదారులకు రెడ్‌నోటీసులు జారీ చేశారు. మార్చి 31వ తేదీ లోగా ఆస్తి పన్ను చెల్లించాలని, వీరికి అధికారులు ప్రతిరోజూ సందేశాలు పంపుతున్నారు.

18న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42శాతం కోటా ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, పార్టీ పరంగా 42శాతం ఇస్తే బీసీలకు న్యాయం జరగదన్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డీఓ, మండల తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించనున్నట్లు తెలిపారు. బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నందగోపాల్, మోదీరాందేవ్, శివ, మట్ట జయంతి గౌడ్, కీర్తిలత, రవియాదవ్, శివకుమార్, ఉదయ్, బాలస్వామి పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఎమ్మెల్సీ టికెట్టా..?



రఘోత్తం రెడ్డి

పంజగుట్ట: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మెల్సీ టికెట్‌ను పీఆర్‌టీయూ అధ్యక్షుడు అమ్ముకున్నాడని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఆరోపించారు. ఉపాధ్యాయుడికి టికెట్ ఇవ్వకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారి, కార్పొరేట్ వ్యక్తికి అమ్ముకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..30 వేల ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయని, వాటిలో ఆరు నుంచి ఏడువేల ఓట్లు కొనుగోలు చేస్తే ఆరేళ్లు ఎమ్మెల్సీగా పెత్తనం చెలాయించవచ్చుననే ఆలోచనతో పెట్టుబడిదారులు ఎన్నికల్లోకి వస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయ సంఘంలో పని చేయని వ్యక్తులకు, ఉపాధ్యాయుల సమస్యలు తెలియని వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారన్నారు. పీఆర్‌టీయూ తనకు మద్దతు ఇవ్వకపోయినా 32 ఉపాధ్యాయ సంఘాలు తనకు మద్దతు తనకు ఉందని, 36 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తనకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థుల సమస్యలు తెలుసన్నారు. తాను ఎమ్మెల్సీగా ఎన్నికైనా ఆరేళ్లలో పలు మార్లు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల సమస్యలపై శాసనమండలిలో గళమెత్తానని ఉపాధ్యాయులు మరోమారు అవకాశం కల్పిస్తే నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేస్తానని తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు...

వెంగళరావునగర్ : విద్యుత్ శాఖ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (1104) నేతలు అన్నారు. యూనియన్ ఏర్పడి 75 ఏళ్ల పూర్తి చేసుకున్న నేపథ్యంలో బుధవారం వెంగళరావు నగర్ డివిజన్, జీటీఎస్ కాలనీలోని బంజారాహిల్స్ డివిజన్ కార్యాలయం వద్ద ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సాయిబాబు, శ్రీనివాస్, జనార్థన్‌రెడ్డి తదితరులు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ యూనియన్ నాయకులు సమష్టిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ డిస్కం అధ్యక్షుడు వేణు, రీజనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.సర్వేశ్వర్, టి.రమేష్, ఎస్.వర్ధన్‌నాయక్, కె.మల్లిఖార్జున్, డివిజన్ నేతలు సంతోష్ కుమార్, ఖాన్, నవీన్‌కుమార్, మల్లారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్..లోకేష్..



లోకేష్‌ను సన్మానిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి

పంజగుట్ట: బస్తీలో పేద కుటుంబంలో పుట్టి చార్టెడ్ అకౌంటెంట్ కోర్సు (సీఏ) పూర్తి చేసిన యువకుడిని హైదరాబాద్ నగర మేయర్ బుధవారం అభినందించారు. ప్రేమ్‌నగర్ బస్తీకి చెందిన దొడ్డమని లక్ష్మప్ప ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో క్యాంటీన్‌లో పనిచేసేవాడు. అతడి కుమారుడు దొడ్డమని లోకేష్ ఈ నెల 6న సీఏ పూర్తిచేశాడు. విద్య పూర్తికాగానే అతడికి పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు వచ్చినా ఇన్ఫోసిస్‌లో ఉద్యోగంలో చేరాడు. ప్రేమ్‌నగర్ బస్తీ ప్రధాన కార్యదర్శి కొండ భగవాన్‌దాస్ ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె లోకేష్‌ను పిలిపించుకుని ఘనంగా సన్మానించారు.

బీఆర్ఎస్ నేతలకు రోజులు దగ్గర పడ్డాయి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

బంజారాహిల్స్: మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర ప్రజలకు తెలుసునన్నారు. బుధవారం ఆయన బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని నిలోఫర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు చేసే ముందు ఎన్నికల్లో పోటీ చేసి చూపాలన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత వారికి లేదన్నారు. ఓటమి భయంతో ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నారన్నారు. ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. తెలంగాణను వారు ఎంత దోచుకున్నారో ప్రజలకు తెలుసునన్నారు. బీఆర్ఎస్‌ను వెనకేసుకొస్తే బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి..

బంజారాహిల్స్: నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఇందులో భాగంగా రోడ్లు, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బుధవారం ఆమె బంజారాహిల్స్ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13, మినిస్టర్ క్వార్టర్స్ రోడ్డులో రూ.80 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన ప్రేమ్‌నగర్ పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, వీటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా రహదారుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా పార్కులను అభివృద్ధి చేయడం ముఖ్యమని, నగరంలోని వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్‌స్పేస్‌లు, పార్కులకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పార్కులను వినియోగించుకోవాలని సూచించారు. నగరాభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశం

15న మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ దహనం

కాచిగూడ: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోకపోవడం దారుణమని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటేశం అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్యాయం చేసిందని ఆరోపించారు. హామీల అమలుకు గత కొంత కాలంగా జేఏసీ ఆందోళన చేస్తున్నా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించుకోకపోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12వేల ఆర్థిక సహాయం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంపు, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే రవాణా యాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్కూల్ వ్యాన్లు, ఓలా, రాపిడో, ఉబెర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15న నారాయణగూడ ఫ్లైఓవర్ కింద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేయనున్నట్లు తెలిపారు. 24న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ నేతలు శ్రీకాంత్, ఎంఏ సలీం, ఎండి నజీర్, నిరంజన్, వి.ప్రవీణ్, రాంరెడ్డి, సిహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, ఎం.శ్రీనివాస్, ఎం.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఓ యువతి వెంట పడి వేధిస్తున్న ఆమె సహచర ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఎస్సార్ నగర్‌లోని హాస్టల్‌లో ఉండే యువతి బంజారాహిల్స్ పార్క్‌వ్యూ ఎన్‌క్లేవ్‌లోని ఓ ప్రైవేటు కార్యాలయంలో పనిచేస్తుంది. అక్కడే పనిచేసే మెట్టు విల్సన్ అనే వ్యక్తి తరచూ ఆమె వెంట పడి వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాధితురాలు తమ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లగా అతను మందలించాడు. అయినా తన వైఖరి మార్చుకోని విల్సన్ ఆమెను వేధిస్తూనే ఉన్నాడు. ఈ విషయాన్ని బాధితురాలు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా అతను విల్సన్‌ను నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన విల్సన్ అతడిపై చేయి చేసుకున్నాడు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవింగ్‌స్కూల్ ట్రైనర్‌పై కేసు నమోదు

వెంగళరావునగర్ : మహిళను వేధిస్తున్న డ్రైవింగ్‌స్కూల్ ట్రైనర్‌పై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు ప్రాంతానికి చెందిన మహిళ వెంగళరావునగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ సీ.ఏ. చదువుతోంది. స్థానిక విజయ్ కార్ డ్రైవింగ్ స్కూల్‌లో కారు డ్రైవింగ్ నేర్చుకుంటోంది. ఈ నేపథ్యంలో కారు డ్రైవింగ్ ట్రైనర్ జీవన్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో అతడిని హెచ్చరించింది. అయినా అతడి వైఖరి మార్చుకోకపోవడంతో షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. తిరిగి గత పదిరోజులుగా వేర్వేరు నెంబర్లతో ఫోన్లు చేసి అసభ్యంగా మాట్లాడుతుండటంతో బాధితురాలు బుధవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

పంజగుట్ట: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడకు చెందిన శ్రీకాంత్ (31) ఓ ప్రైవేట్ సంస్థలో పని చేసేవాడు. ఏడాదిగా ఉద్యోగం మానేసిన అతను ఇంటివద్దే ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో అతడి భార్య కుమార్తెను తీసుకుని వేరుగా ఉంటోంది. అప్పటి నుంచి శ్రీకాంత్ ఒక్కడే ఉంటున్నాడు. అతడి తల్లిదండ్రులు మౌలాలిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి అతడి తల్లి దుర్గాంబ పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించింది. అతను శ్రీకాంత్ ఫ్లాట్‌కు వెళ్లి తలుపుకొట్టినా స్పందించలేదు. దీంతో బుధవారం ఉదయం అక్కడికి వచ్చిన దుర్గాంబ వాచ్‌మెన్ సాయంతో కిటికీ తెరిచి చూడగా శ్రీకాంత్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. పంజగుట్ట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ద్విచక్ర వాహనం మాయం..

వెంగళరావునగర్ : పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రహమత్‌నగర్‌లో నివసించే మల్లేష్‌గౌడ్ ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈనెల 11న తన ఆఫీసు వద్ద బైక్ పార్క్ చేసి తాళం వేయకుండా నిర్మాణంలో ఉన్న భవనంలోకి వెళ్లి గంట తర్వాత తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

వెంగళరావునగర్ : గంజాయి వినియోగిస్తున్న ఓ యువకుడిని మధురానగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్ బంగారుమైసమ్మ దేవాలయం ప్రాంతంలో కొందరు వ్యక్తులు గంజాయి తాగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. బుధవారం పోలీసులు అక్కడికి చేరుకోగా కార్తీక్ అనే యువకుడు వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి 2 ఓసీబీ రోల్స్, గ్రాము గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు...

వెంగళరావునగర్ : విద్యార్థినీ, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటీ డ్రగ్స్ నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు నిరంతరం తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణపై యూసుఫ్‌గూడ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం పరమేశ్వరమ్మ, ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్, పీడీలు విశ్వేశ్వరరావు, మద్దీశ్వర్, నాగరాజు, టీచర్లు గోవర్ధన్‌మణి, కృష్ణప్రియ, ప్రమీలారాణి, ఎన్‌సీసీ కేడెట్స్ తేజ, పార్వతి, స్వాతి, పార్థు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నందనవనం



అటు పూలమొక్కలు.. ఇటు ఆకుకూరలు!

- టెర్రస్‌పై పెంపకం
- ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు
- అభినందించిన జీహెచ్ఎంసీ అధికారులు



పచ్చదనంతో కనువిందు చేస్తున్న టెర్రస్ గార్డెన్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-5 దేవరకొండ బస్తీవైపు వెళ్లే రోడ్డులో ఓ ఇల్లంతా సువాసనలు వెదజల్లుతూ మరోవైపు పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. ఆ ఇంటి యజమాని వల్లపురెడ్డి సుమన్‌రెడ్డి, వింధ్య దంపతులు కోవిడ్ సమయంలో ఇంటికే పరిమితం కాగా, అప్పుడు టెర్రస్ గార్డెన్‌పై దృష్టిపెట్టారు. మొదట్లో కొన్ని కూరగాయల మొక్కలు, ఆకు కూరలు పెంచడం ప్రారంభించారు. క్రమంగా పూల మొక్కలు, ఆకుకూరల గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీరింట్లో 500 వరకు మొక్కలు కనువిందు చేస్తున్నాయి. వీరి కుమారుడు సాధ్వి, కుమారుడు అధర్వ్ కూడా వాటిపై ఆసక్తి పెంచుకుని తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటి పెంచడం నేర్చుకున్నారు. వీరి కృషిని గుర్తించిన సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి, యూబీడీ అధికారి బాలయ్యతో పాటు స్థానిక ఎస్ఎఫ్ఏలు సుమన్‌రెడ్డి, వింధ్య దంపతులను అభినందించి శాలువాతో సత్కరించారు.



ఒమెగాలో జన్యు ఆరోగ్య స్క్రీనింగ్ సెంటర్

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే మొదటిసారిగా జన్యు పరమైన ఆరోగ్య స్క్రీనింగ్ కేంద్రాన్ని (లాంగ్విటీ లాంజ్) హైదరాబాద్‌లో అందుబాటులోకి తీసుకు వచ్చామని ఒమెగా ఆస్పత్రి వ్యవస్థాపకుడు మోహన వంశీ తెలిపారు. బుధవారం గచ్చిబౌలి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేన్సర్ సైలెంట్ కిల్లర్ అని, దాన్ని త్వరితగతిన గుర్తించినప్పుడే నష్ట నివారణ చర్యలు చేపట్టగలమని తెలిపారు. ఇందుకు జన్యుపరీక్షలు ఎంతో దోహదపడతాయని, అందుకే తమ ఆస్పత్రిలో ఆరోగ్య స్క్రీనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇది దేశంలోనే మొదటిదని చెప్పారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న రవిగుప్త, డీజీ సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: జైళ్ల శాఖ రాష్ట్రస్థాయి 7వ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్త, డీజీ సౌమ్య మిశ్రాతో కలిసి చంచల్‌గూడలోని సీకా మైదానంలో ప్రారంభించారు. దీనిలో వివిధ జైళ్ల నుంచి 250 మంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సౌమ్య మిశ్రా మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్‌లో 26 పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు ఈ పోటీలు కొనసాగుతాయని తెలిపారు. స్పోర్ట్స్ మీట్ ద్వారా శారీరక ధారుఢ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఐజీలు యెర్రంశెట్టి రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీకి కేంద్రం మొండిచేయి

– రాజ్యసభ సభ్యుడు శివదాసన్



మాట్లాడుతున్న ఎంపీ శివదాసన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలకు కోత విధించి కార్పొరేట్ శక్తులకు పన్నుల మినహాయింపు ఇచ్చిందని రాజ్యసభ సభ్యుడు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి శివదాసన్ విమర్శించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'కేంద్ర బడ్జెట్ గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివదాసన్ మాట్లాడుతూ ఉపాధి హామీకి కేంద్రం మొండిచేయి చూపిందని ధ్వజమెత్తారు. మధ్యతరగతి ప్రజలకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు అనేది ప్రచారానికే సరిపోతుందన్నారు. జీఎస్‌టీ పన్నుల నుంచి నిత్యావసరాలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు భారీగా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే లాజరస్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్, బి.పద్మ, రాళ్లబండి శశిధర్, రవీందర్, జంగయ్య, బీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇంటి ముట్టడికి యత్నం



బంజారాహిల్స్: మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గె శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. పోలీసులు భారీ సంఖ్యలో మోహరించి మార్గమధ్యంలోనే ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపుల పేరు చివర పటేల్ అని ప్రభుత్వమే గెజిట్ చేయాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపులకు మంత్రి పదవి ఇవ్వాలని, ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5 వేల కోట్లు కేటాయించాలన్నారు. తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' హవా

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ సెషన్–1 పరీక్షా ఫలితాల్లో దిల్‌సుఖ్‌నగర్ నారాయణ డే డివిజన్ నుంచి ఉత్తమ పర్సంటైల్ మార్కులతో విద్యార్థులు విజయభేరి మోగించారు. ఈ ఫలితాల్లో భాగంగా శ్రీనిధ్‌రెడ్డి 99.94 పర్సంటైల్, చేతన్ 99.93, పునీత్ రాపోలు 99.92, చరితార్థ్ రెడ్డి 99.91 పర్సంటైల్ సాధించారు. అంతేకాకుండా 99 పర్సంటైల్ పైబడి సాధించిన విద్యార్థులు 26 మంది, 98 పర్సంటైల్ పైబడి 51 మంది, 97పైగా 82 మంది, 90కిపైగా 276 మంది విద్యార్థులు ఉన్నారని యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నారాయణ డీ డివిజన్ కోర్ డీన్ రాధాకృష్ణ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీవోఎం రాజు, డీన్ అమరేందర్, ఏజీఎం గోవర్ధన్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరలు దడదడ.. గిరాకీ వెలవెల

- ఆటంకాలుగా మారిన ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్య
- మరోవైపు ఆకాశాన్నంటుతున్న పసిడి ధరలు..
- 1965లో తులం రూ.71.75.. 2025లో రూ.88,500

చార్మినార్: నాడు 'స్వర్ణ'యుగం.. నేడు గడ్డుకాలం.. అప్పుడు కొనుగోలుదారులతో కిటకిటలాడి.. ఇప్పుడు గిరాకీ లేక వెలవెల.. నాడు అందుబాటులో ధరలు.. నేడు ఆకాశాన్ని అంటుతున్న తీరు.. ఇదీ పాతబస్తీ బంగారం వ్యాపారాల పరిస్థితి. ఎటు చూసిన కళ తప్పిన షాపులే. కోటి రూపాయలకుపైగా పెట్టుబడితో షో రూంలను నిర్వహిస్తున్న వ్యాపారులు పసిడి అమ్మకాల్లేక తల్లడిల్లిపోతున్నారు. అసలే ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్‌సమస్యలతో సతమతమవుతుండగా అనూహ్యంగా పెరుగుతున్న ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. 24 క్యారెట్ల తులం (10 గ్రాముల) బంగారం ధర దాదాపు రూ.88,500 గా ఉంది. 22 క్యారెట్ల(91.6) ఆభరణాల బంగారం తులం(10 గ్రాముల) రూ.82,400. దీంతో బంగారం గిరాకీలు బాగా తగ్గిపోయాయి. 40 ఏళ్ల క్రితం అంటే.. 1965లో 10 గ్రాముల(తులం) బంగారం ధర కేవలం రూ.71.75 ఉండగా.. 2025లో రూ.88,428కు ఎగబాకింది. ఇలా ఏడాదికేడాది బంగారం ధరలు పెరుగుతున్నాయి.

❖ ప్రస్తుతం ధరల పెరుగుదలకు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, యుఎస్ ఫెడ్ రేటు, ద్రవ్యోల్బణం కూడా కారణమంటున్నారు వ్యాపారులు. ప్రస్తుతం వివాహాది శుభకార్యాలు జోరుగా కొనసాగుతుండటంతో బంగారానికి డిమాండ్ పెరిగింది.

పాతబస్తీలో కళ తప్పిన బంగారం వ్యాపారాలు

అయితే ధరలే సామాన్య, మధ్యతరగతి కుటుంబాల హడలెత్తిస్తున్నాయి. 10 తులాలు కొనాలని అనుకునేవారు ఒకటి, రెండు తులాలతో సరిపెట్టుకుంటున్నారు.



గిరాకీ లేక వెలవెలబోతున్న పాతబస్తీలోని ఓ బంగారం దుకాణం

40 ఏళ్లుగా పెరుగుతున్న ధరలిలా..

1965 నుంచి ఇప్పటి వరకు 10 గ్రాముల(తులం) బంగారం ధరలు ఇలా..

❖ 1965	రూ. 71.75
❖ 1970	రూ. 184
❖ 1975	రూ. 540
❖ 1980	రూ. 1,330
❖ 1990	రూ. 3,200
❖ 2000	రూ. 4,400
❖ 2005	రూ. 7,000
❖ 2010	రూ. 18,500
❖ 2015	రూ. 26,343
❖ 2020	రూ. 48,720
❖ 2024	రూ. 77,913

వేధిస్తున్న పార్కింగ్ సమస్య

చార్మినార్‌కు వచ్చే పర్యాటకులకు చార్‌కమాన్‌లోని నగల దుకాణాలు ముందుగా దర్శనమిస్తాయి. పాతబస్తీ సంస్కృతికి, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే విధంగా ఇక్కడి బంగారు, వెండి, ముత్యాల నగల దుకాణాలు ప్రసిద్ధి. పెరుగుతున్న బంగారం ధరల తాకిడి ఒకవైపుండగా, మరోవైపు ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్ సమస్య వ్యాపారులను వేధిస్తోంది. దాదాపు 200 వరకు జ్యువెలరీ దుకాణాలున్న పాతబస్తీలో పార్కింగ్ సమస్య కారణంగా నగల కొనుగోలుదారులు ఇటువైపు రావడానికి ఆసక్తి చూపడంలేదు. చిరు వ్యాపారాలను సైతం బంగారం షోరూమ్‌ల ముందు అధికారులు అనుమతించడంతో బంగారం అమ్మకాలకు ఆటంకంగా మారాయి.

షాపుల వరకు వాహనాలు రాలేకపోతున్నాయి



పాతబస్తీలోని దుకాణాల ముందు కొనుగోలుదారుల వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి సరైన స్థలాలు లేకపోవడంతో అటు వ్యాపారులతో పాటు ఇటు వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో పాతబస్తీ వ్యాపారులు తమ వ్యాపారాన్ని నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడ తమ బ్రాంచీలను నామమాత్రంగా కొనసాగిస్తున్నారు.

– డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి–భవానీ జ్యువెల్లర్స్, గుల్జార్‌హౌస్

ఆర్థిక ఇబ్బందుల్లో వలస కార్మికులు...

బంగారు, వెండి ఆభరణాలను తయారు చేసే కార్మికులు సరైన ఆర్డర్లు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. బెంగాలీ కార్మికులు గుల్జార్ హౌస్, కోకర్‌వాడీ, మామాజుమ్లా ఫాటక్, మూసాబౌలి, ఘాన్సీబజార్, జూలా, బండికా అడ్డా తదితర ప్రాంతాల్లో చిన్న, చిన్న కార్ఖానాలను ఏర్పాటు చేసుకొని బంగారు ఆభరణాలను తయారు చేస్తున్నారు. ఇలా చార్‌కమాన్‌లోని నగల దుకాణాలు ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి.

విద్యతోనే మహిళల జీవితాల్లో మార్పు



గన్‌ఫౌండ్రీ: విద్య ద్వారానే మహిళల జీవితాల్లో సమూల మార్పులు సాధ్యమని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. బుధవారం లక్డీకాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'దళిత, ఆదివాసీ స్త్రీలపై హింస, మానసిక ఆరోగ్యం– వివిధ కోణాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మనువాద భావజాలంతో స్త్రీలను, దళిత ఆదివాసీ వర్గాలను విద్యకు దూరంగా ఉంచారని తెలిపారు. ఆదివాసీ స్త్రీలపై, బాలికల హక్కులపై దళిత స్త్రీ శక్తి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దళిత స్త్రీ శక్తి 19వ వార్షిక నివేదికను విడుదల చేశారు. కార్యక్రమంలో డిక్కి జాతీయ అధ్యక్షుడు నర్రా రవికుమార్, జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, విశ్రాంత ప్రొఫెసర్ రమా మేల్కొటే, రాష్ట్ర ట్రాన్స్‌కో డీఈ మాణిక్యం, దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

బంజారాహిల్స్: 'రిఫ్లెక్షన్ ఆన్ సొసైటల్ చాలెంజెస్' పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీలో జరిగింది. ఇక్రిసాట్‌లోని కార్టోగ్రఫీ డివిజనల్ హెడ్‌గా పదవీ విరమణ చేసిన కనగిరి ఎస్ఎన్ ప్రసాద్ రచించిన ఈ పుస్తకాన్ని టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు టి.వివేక్, సుహాస్ వాని, వరల్డ్ బ్యాంక్ మాజీ మేనేజర్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ కమ్యూనికేషన్ ఎరిక్ చిన్జీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనతో పాటు ఎన్నో సామాజిక అంశాలను ఈ పుస్తకంలో ప్రస్తావించినట్లు తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వివేక్ తదితరులు...

మహిళా సాధికారత, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఆకలి చావులు, పేదరికం, ఆర్థిక విషయాల గురించి విపులంగా చర్చించినట్లు చెప్పారు. చిన్న, చిన్న మార్పులను పద్ధతిగా చేస్తే దేశం ఎంతో ముందుకు వెళ్తుందని అన్నారు.

పోలీసులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండర్ సంతానకృష్ణన్

రాయదుర్గం: పోలీసులు బాహ్య సవాళ్లను పరిష్కరించడానికి అంతర్గత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండర్ సంతాన కృష్ణన్ సూచించారు. బుధవారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 'స్వయం సాధికారత నుంచి జాతీయ సాధికారత' అనే అంశంపై సెక్యూరిటీ సర్వీస్ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరిగింది. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, సీఆర్‌పీఎఫ్, తెలంగాణ పోలీస్ అకాడమీ, విమెన్స్ సేఫ్టీ వింగ్, 1వ బెటాలియన్, సైబరాబాద్‌లోని హోం గార్డులు, ఇతర విభాగాల నుంచి పోలీసులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మనసు దృఢంగా ఉన్నప్పుడే మన దేశానికి మంచి మద్దతుదారులుగా మారగలమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ అకాడమీ అదనపు ఎస్పీ భూపాల్, విశ్రాంత వైస్‌అడ్మిరల్ ఎస్ఎస్ ఘోర్మాడే, కల్నల్ సతీ, బ్రహ్మకుమారీస్ సంస్థ మౌంట్‌అబూ ప్రతినిధి బీకే కమల, శాంతిసరోవర డైరెక్టర్ కుల్‌దీప్ దీదీ, 800 మంది వివిధ విభాగాల పోలీసులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో రెసోనెన్స్ సత్తా

మాదాపూర్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అద్భుత విజయంతో రెసోనెన్స్ విద్యా ప్రామాణికత, ఉత్తమ బోధన విధానాలపై ఉన్న నిబద్ధత మరోసారి రుజువైందని రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. మాదాపూర్‌లో రెసోనెన్స్ కళాశాలలో బుధవారం జేఈఈ మెయిన్స్‌లో విజయం సాధించిన విద్యార్థులను సన్మానించారు. 2025 సెషన్ వన్‌లో విద్యార్థులు జాతీయస్థాయిలో పలు సబ్జెక్టుల్లో 100 పర్సంటైల్ సాధించినట్టు తెలిపారు. హైదరాబాద్ రెసోనెన్స్ విద్యార్థుల్లో 53 మంది 99 ప్లస్ పర్సంటైల్ సాధించారని, 265 మంది విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో 99 ప్లస్ పర్సంటైల్ స్కోర్ సాధించినట్టు పేర్కొన్నారు.



వేదాంత్(99.94), హరితేజ్ (99.92) హైదరాబాద్ టాపర్లుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్స్‌పై వాటర్‌బోర్డు దృష్టి

- మరమ్మతులతో వినియోగంలోకి..
- 300 ప్రాంతాల్లో గుర్తింపు
- వేసవిలో నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



సాక్షి,సిటీబ్యూరో: వేసవిలో నీటిఎద్దడిని అధిగమించేందుకుగాను జలమండలి ముందు జాగ్రత్తలు చేపట్టింది. ఈ మేరకు బోర్‌వెల్స్‌పై దృష్టి సారించింది. సుమారు 300 ప్రాంతాల్లో చేతిపంపులు, పవర్ బోర్లను గుర్తించింది. వాటి మరమ్మతుకు చర్యలు చేపడుతోంది. ప్రధాన జలాశయాల నుంచి నగరానికి నీటిని తరలించి రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నా పెరిగిన జనాభాకు సరిపోని పరిస్థితి నెలకొంది. నగర పరిధిలో భూగర్భ జలాల పెంపు కోసం 'ప్రతి ఇంటా ఇంకుడు గుంత' పేరిట స్పెషల్ డ్రైవ్ చేపట్టినా పెద్దగా స్పందన లభించలేదు. దీంతో వేసవి కంటే ముందే ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. వాన చినుకు భూమిలోకి ఇంకే పరిస్థితి లేక భూగర్భజలాలు పాతాళానికి చేరాయి.

3,222 బోర్‌వెల్స్ గుర్తింపు

భూగర్భ జలాల పెంపు కోసం సుమారు 3,222 నిరుపయోగ బోర్‌వెల్స్‌ను జలమండలి గుర్తించింది. నగర వ్యాప్తంగా పవర్ బోర్‌వెల్స్ మొత్తం 1,045 కాగా, కోర్ సిటీ పరిధిలో 246, శివారుల్లో 7,99 బోర్లు ఉన్నట్లు గుర్తించింది. చేతిపంపులు మొత్తం 2,177 కాగా, కోర్‌సిటీలో 1,665, శివార్లలో 1,557 బోర్లు ఉన్నాయని సర్వేలో వెల్లడైంది.

పవర్‌బోర్లు టాప్

జలమండలి పరిధిలో సుమారు 2,796 పవర్ బోర్లు ఉన్నాయి. అందులో 1,770 బోర్లు వినియోగంలో ఉండగా, 942 బోర్లు పనిచేయడం లేదు. మిగిలిన 84 బోర్లు దెబ్బతిన్నాయని జలమండలి గుర్తించింది. మొత్తం 3,070 చేతి పంపుల్లో వినియోగంలో 954, పనిచేయని బోర్లు 1717, ఎండిన, కూలిపోయిన బోర్లు 339 ఉన్నాయి.

సెలబ్రిటీ క్రికెట్ మ్యాచ్‌కు బందోబస్తు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు తదితరులు

ఉప్పల్: ఈ నెల 14, 15 తేదీల్లో ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించే సెలబ్రిటీల లీగ్ మ్యాచ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మ్యాచ్ భద్రతకు సంబంధించిన వివరాలను నిర్వాహకులతో కలిసి వెల్లడించారు. ప్రేక్షకులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నిఘాను పటిష్టం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌బీ డీసీపీ జి.నర్సింహారెడ్డి, ఎస్‌వోటీ డీసీపీ రమణారెడ్డి, హెడ్ క్వార్టర్స్ డీసీపీ శ్యామ్, మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు, సెలబ్రెటి లీగ్ ఫౌండర్ విష్ణువర్ధన్ ఇందూరి తదితరులు పాల్గొన్నారు.

నేతకాని, మహర్‌లకు ప్రత్యేక గ్రూప్ అవసరం



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: రాష్ట్రంలోని మహర్‌లకు న్యాయం జరిగేవరకు ముందుండి పోరాడతానని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మహర్, నేతకాని కులస్తుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మహర్, నేతకాని ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహర్, నేతకాని కులస్తులకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బతికి ఉంటే రిజర్వేషన్ వర్గీకరణ సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేదని అన్నారు. మహర్‌లు ఆర్డీవో దగ్గర కులం సర్టిఫికెట్ తీసుకోలేక ఎమ్మార్వోల వద్దకు వెళ్లి మాలల పేరిట తీసుకుంటున్నారని అన్నారు. మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత మాట్లాడుతూ 64 లక్షల జనాభా ఉన్న నేతకాని, మహర్‌లకు ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసి రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

యునానీ వైద్యసేవల విస్తరణకు కృషి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో యునానీ వైద్యసేవల విస్తరణకు కృషి చేస్తానని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్ అన్నారు. బుధవారం ప్రపంచ యునానీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రహబర్ సొసైటీ ఆధ్వర్యంలో మలక్‌పేట డాన్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాదాపు వెయ్యి ఏళ్లుగా యునానీ వైద్యం కొనసాగుతోందని, ప్రాచీన వైద్య విధానంలో ధనికుల కంటే నిరుపేదలకే చికిత్సను అందిస్తూ ప్రత్యేక గుర్తింపును సాధించిందన్నారు. హైదరాబాద్ నగరంలో మరిన్ని యునానీ చికిత్సా కేంద్రాలు స్థాపించే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉర్దూ భాషాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందన్నారు.



ప్రసంగిస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్

కార్యక్రమంలో ప్రభుత్వ నిజామియా కళాశాల ప్రొఫెసర్ హెచ్‌వోడీ డాక్టర్ అహస్సాన్ ఫారూఖీ, యునానీ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫజల్ అహ్మద్, డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రహ్మాన్ ఖుర్రం తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట ఆలయ ట్రస్టు సభ్యుల ప్రమాణస్వీకారం

కీసర: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కీసరగుట్ట దేవాలయ నూతన ట్రస్టుబోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. మొదటగా ట్రస్టుబోర్డు సభ్యులు జూపల్లి సాయిలు, పోచబోయిన రాజు, రెడ్డబోయిన ప్రవీణ్‌కుమార్, మొర్గు ముత్యాలు, కొకుట్ల కృష్ణారెడ్డి, దుండిగల్ల ప్రసాద్, సామల అమరేందర్, నల్లోల్ల కుమార్, కందాడి రాజిరెడ్డి, సగ్గు అనిత, శంకరయ్యలతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధి, మహాశివరాత్రి బ్రహోత్సవాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నేతలు నక్కా ప్రభాకర్‌గౌడ్, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణ పాల్గొన్నారు.

కార్టూన్లతోనే పత్రికలకు నిండుదనం

చిక్కడపల్లి: కార్టూన్లు పత్రికలకు నిండుదనం ఇస్తాయని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలో బుధవారం రాత్రి కేవీ రమణాచారి 74వ జన్మదినం సందర్భంగా హాస్యానందం పత్రిక నిర్వహించిన కార్టూన్ పోటీల్లో గెలుపొందిన పదిమంది విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కార్టూనిస్ట్ సరసి, శ్రీనివాస్‌రావు, దామరాజు, నాట్యగురువు నిర్మల ప్రభాకర్, లంక లక్ష్మీనారాయణ, పెద్దూరి వెంకట దాసు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ అభివృద్ధికి నిధుల లేమి!

- వేతనాలు.. పింఛన్లకే నెలకు రూ.50 కోట్లు
- అధిక వేతనాలే కొత్త నియామకాలకు అడ్డంకి
- పార్ట్‌టైం అధ్యాపకులతోనే బోధన
- నోటిఫికేషన్ కోసం 6 వేల మంది అర్హుల ఎదురుచూపులు



ప్రొ.బాలకిష్టారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న స్కాలర్స్ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధికి నిధుల లేమి అడ్డంకిగా మారింది. వర్సిటీ ఆదాయం ఉద్యోగుల వేతనాలు, పింఛన్లకే సరిపోవడం లేదు. నెలకు రూ.50 కోట్ల మేర వేతనాలు, పింఛన్లకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో వర్సిటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కుంటుపడ్డాయి. అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంపు, కొత్తగా 375 మంది గ్రూప్–4 ఉద్యోగుల రాకతో మరో రూ.50 కోట్లు అదనంగా అవసరమవుతున్నాయి. నెలకు మొత్తం రూ.100 కోట్లు వేతనాలకు పింఛన్లకు కావాల్సి ఉంటుంది. కొత్తగా పర్మనెంట్ అధ్యాపకులను నియమిస్తే వేతన చెల్లింపులు రెట్టింపయ్యే అవకాశముంది. కేవలం ఒక్క వర్సిటీకే ఇంత పెద్ద మొత్తంలో వేతనాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేనట్లు తెలిసింది. వేతన భారాన్ని తట్టుకోలేక గత 15 ఏళ్లుగా ఓయూలో పార్ట్‌టైం అధ్యాపకులతోనే నెట్టుకొస్తున్నారు. మరోవైపు పరిశోధనలు కుంటుపడ్డాయి. ఓయూలో 375 మంది పర్మనెంట్ అధ్యాపకులు, వెయ్యి మంది కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారు. వీరికి పీహెచ్‌డీ గైడ్‌షిప్ లేనందున విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. కోట్లాది రూపాయలు వెచ్చించినా ఆశించిన మేరకు పరిశోధనలు జరగడం లేదనే విషయం ప్రభుత్వ పరిశీలనలో తేలినట్లు సమాచారం.

నిధుల నిలిపివేత

గతంలో సైన్స్, మెడిసిన్, ఇంజినీరింగ్, సోషల్ సైన్స్, గణిత శాస్త్రాల్లో విస్తృతమైన పరిశోధనలు జరిగేవి. కాలక్రమేణా ప్రభుత్వ వర్సిటీల్లో పరిశోధనలు తగ్గాయి. రాష్ట్ర యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలలో జరిగే పరిశోధనల్లో నాణ్యతా ప్రమాణాలు, కొత్తదనం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. కాగా, ఓయూలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలు అందుకొని సుమారు ఆరు వేల మంది పర్మనెంట్ అధ్యాపక ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

పార్ట్‌టైం అధ్యాపకులతోనే బోధన

ప్రభుత్వ వర్సిటీల్లో పార్ట్‌టైం అధ్యాపకులతోనే బోధన కొనసాగిస్తున్నారు. నెలసరి వేతనం కాకుండా ప్రతి తరగతికి కోర్సులను బట్టి రూ.700 నుంచి రూ.వెయ్యి చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో వారికి నెలకు రూ.25 నుంచి రూ. 30 వేల చొప్పున వెచ్చించాల్సి వస్తోంది. భవిష్యత్తులో కేవలం ప్రైవేటు వర్సిటీలకే పరిశోధనలు పరిమితం కానున్నాయి. ప్రాథమిక విద్యపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలతో గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తోంది. డిగ్రీ, పీజీ, పరిశోధనల కోసం ప్రైవేటు విద్యాసంస్థలు, యూనివర్సిటీలను ప్రోత్సహిస్తోంది. మన రాష్ట్రంలో గత 11 ఏళ్లలో 14 ప్రైవేటు వర్సిటీలు వచ్చాయి.

సాక్షి
11
హైదరాబాద్, గురువారం, 13, ఫిబ్రవరి, 2025

సిటీ ప్లస్



లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనేది ఎంత వరకూ నిజం అనేది అలా ఉంచితే.. ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ బెస్ట్ ఇంప్రెషన్ అనేది మాత్రం ప్రేమికుల విషయంలో ఎల్లప్పుడూ నిజమవుతూనే ఉంటుంది. అలా మంచి ఇంప్రెషన్ సాధించే విషయంలో టాక్స్ నుంచి లుక్స్ దాకా దేని ప్రాధాన్యతనూ తీసి పారేయలేం. ఈ నేపథ్యంలో పరస్పరం ఇంప్రెస్డ్ అనిపించుకోవాలనే తహతహలాడే ప్రేమికుల కోసం నగరానికి చెందిన హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాకల్టీలు అందిస్తున్న సూచనలివి..

- సాక్షి, సిటీబ్యూరో

ప్రేమికుల దినోత్సవం కోసం ప్రత్యేక ఫ్యాషన్స్

సరికొత్త డిజైన్లతో పరస్పరం మెప్పించేందుకు ఆసక్తి

కొంత కాలంగా లవర్స్ డే రోజున రెడ్ కలర్‌దే ఆధిపత్యం

ఫ్యాషన్లను, యాక్సెసరీస్‌ను సూచిస్తున్న డిజైనర్స్

గుర్తుంచుకోవాల్సినవి..

- సౌకర్యంగా అనిపించే దుస్తులను ఎంచుకోవడం మేలు.
- రెస్టారెంట్ లేదా క్యాజువల్ అవుటింగ్ అయినా అందుకు అనుగుణంగా దుస్తులు ధరించాలి. అందుకు మీదైన వ్యక్తిగత టచ్‌ను జోడించాలి. డ్రెస్సింగ్‌లో వీలైనంత వరకూ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే అంశాలను చేర్చాలి. అందులో ఇష్టమైన రంగు, సిగ్నేచర్ యాక్సెసరీ లేదా ప్రత్యేకమైన స్టైల్ ట్విస్ట్ ఇలా ఏదో ఒక స్పెషల్ ఉండాలి.
- మోనోక్రోమటిక్ దుస్తులు ఈ యేడాది ట్రెండింగ్. విభిన్న టెక్స్చర్‌లతో కూడిన ఆల్–బ్లాక్ ఎన్సెంబుల్‌ని ప్రయత్నించడం మేలు. బ్లాక్ టర్టిల్ నెక్, టైలర్డ్ ప్యాంటు, స్లీక్ లెదర్ వంటివి ఉండేలా చూసుకోవాలి.



వాలెంటైన్స్.. ఫ్యాషన్ టైమ్స్..

ప్రేమికుల రోజున ధరించడానికి రెడ్ కలర్‌ను మించిన డ్రెస్ మరొకటి ఉండదు. అయితే, ఈ ఏడాది కొంచెం భిన్నంగా ప్రయత్నించవచ్చు. లేస్‌తో డిజైన్ చేసిన యాసెంట్స్, రఫ్లెస్ లేదా స్లిట్స్ ఉన్న ఫిగర్–హగ్గింగ్ సిల్హౌట్స్, ఫ్లోయీగా ఉండే మిడి డ్రెస్‌లను ఎంచుకోవచ్చు. టైమ్‌లెస్‌గా, సొగసైన లుక్ కోసం స్ట్రాపీ హీల్స్, లైట్ వెయిట్ సింపుల్ జ్యువెలరీని ఈ డ్రెస్‌కు జత చేయవచ్చు.

- మేకప్‌కి సాఫ్ట్ బ్లష్ పింక్, మ్యూట్ రోజ్ టోన్స్ రొమాంటిక్ మీట్స్‌కి సరైనవి. మ్యాచింగ్ స్కర్ట్‌లు, శాటిన్ స్లిప్ డ్రెస్‌లు లేదా పేస్టెల్ రంగులలో నిట్‌సెట్‌తో బ్లేజర్లను ఎంచుకోవచ్చు. ఈ షేడ్స్ ఆధునికతకు అద్దం పడతాయి. హృదయాకారపు ఇయర్ హ్యాంగింగ్స్, అందమైన నెక్‌పీస్, చిక్ క్లచ్‌తో లుక్ కంప్లీట్ అవుతుంది. భాగస్వామి హృదయంలో శాశ్వతమైన ముద్ర వేయడానికి ఇష్టమైన పెర్ఫ్యూమ్ జోడించడం మర్చిపోవద్దు
- సీక్వెన్స్, మెటాలిక్ ఫాబ్రిక్‌లు ఈ సీజన్‌లో ఇప్పటికీ ట్రెండింగ్‌లో ఉన్నాయి. మెరిసే వెండి లేదా బంగారు రంగు దుస్తులు.. వాలెంటైన్స్ డే సందర్భంగా నిర్వహించే ఈవెనింగ్ పార్టీలలో లుక్స్‌ని ప్రత్యేకంగా చూపుతాయి.
- ఆహ్లాదకరమైన వైబ్ కోసం, హార్ట్ ప్రింట్లు, పోల్కా డాట్స్ లేదా పూల నమూనాలను ప్రయత్నించవచ్చు. హై–వెయిస్టెడ్ ప్యాంటు లేదా స్కర్ట్‌తో జత చేసిన హార్ట్–ప్రింటెడ్ బ్లౌజ్ ఫన్నీగా అదే సమయంలో స్టైలిష్‌గానూ ఉంటుంది. ప్రత్యామ్నాయంగా, లగ్జరీ టచ్ కోసం వెల్వెట్ ఫర్ వంటి అల్లికలతో ప్రయోగాలు చేయచ్చు.



ఇద్దరు కాదు ఒక్కరే.. అనిపించేలా..

భాగస్వామితో కలిసి మ్యాచింగ్ డ్రెస్ ధరించాలని ప్లాన్ చేసుకుంటే.. ఒకేలాంటి దుస్తుల కంటే కాంప్లిమెంటరీ కలర్స్ లేదా థీమ్‌లపై దృష్టి పెట్టడం మంచిది. ఉదాహరణకు, ఇద్దరిలో ఒకరు రెడ్ కలర్ దుస్తులు ధరిస్తే మరొకరు టై, పాకెట్ స్క్వేర్ లేదా యాక్సెసరీల ద్వారా రెడ్ కలర్‌ను చేర్చవచ్చు.

అబ్బాయిల కోసం..

టైమ్‌లెస్ సూట్: వాలెంటైన్స్‌డే రోజున మ్యాన్లీగా కనిపించడానికి పాలిష్డ్ లుక్ కోసం క్లాసిక్ బ్లాక్ లేదా నేవీ సూట్‌ను ఎంచుకోవాలి. రొమాంటిక్ ట్విస్ట్ జోడించాలనుకుంటే, బర్గండి లేదా డార్క్ రెడ్ కలర్ సూట్‌ను ఎంచుకోవచ్చు. ఇది స్టైలిష్‌గా కనిపించడమే కాదు ఈ సందర్భానికి సరైనది.



స్మార్ట్ క్యాజువల్ వైబ్స్

ముదురు జీన్స్ లేదా చినోస్‌తో క్రిస్పీ వైట్ షర్ట్‌ను జత చేయవచ్చు. మోడర్న్ లుక్ కోసం టైలర్డ్ బ్లేజర్ లేదా స్టైలిష్ లెదర్ జాకెట్‌తో లుక్‌ని పూర్తి చేయవచ్చు. ఈ లుక్ క్యాజువల్ డిన్నర్ లేదా డే టైమ్ డేట్‌కి అనువైనది.

మోనోక్రోమాటిక్ మ్యాజిక్

ఈ సంవత్సరం మోనోక్రోమ్ దుస్తులు ఒక భారీ ట్రెండ్. విభిన్న టెక్స్చర్‌లతో ఆల్–బ్లాక్ ఎన్సెంబుల్‌ను ప్రయత్నించండి. బ్లాక్ టర్టిల్‌నెక్, టైలర్డ్ ట్రౌజర్లు, సొగసైన లెదర్ షూలు ఎంచుకోండి. ప్రత్యామ్నాయంగా, మృదువైన, ఆధునిక లుక్ కోసం బూడిద లేదా లేత గోధుమ రంగు షేడ్స్ ఎంపిక చేసుకోండి.

- ప్యాటర్న్‌లు, టెక్స్చర్‌లతో ఆడుకోవచ్చు. చారలు లేదా పూల ప్రింట్లు వంటి ప్యాటర్న్ షర్టులతో దుస్తులకు అందమైన లుక్‌ను తీసుకురావచ్చు. ఆ లుక్‌ను సమతుల్యంగా ఉంచడానికి సాలిడ్–కలర్ ప్యాంటుతో జత చేయాలి.

ఆత్మవిశ్వాసంతో యాక్సెసరైజ్

స్టైలిష్ వాచ్, లెదర్ బెల్ట్ లేదా పాకెట్ స్క్వేర్‌తో లుక్‌ను బ్రైట్‌గా మార్చేయవచ్చు. సందర్భానికి తగ్గట్టు టై లేదా సాక్స్ వంటి యాక్సెసరీలలో రెడ్ కలర్‌ను జోడించడానికి వెనుకాడవద్దు.



రారండోయ్.. రక్తదానం చేద్దాం

సాక్షి, సిటీబ్యూరో: 'జీవితాన్ని పంచుకున్నప్పుడు జీవితం బాగుంటుంది' అనే సందేశంతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా భారీ స్థాయిలో రక్తదాన శిబిరాలను కేర్ టుడే ఫండ్, యునైటెడ్ వే (ముంబై) సక్షమ్ భారతి ఫౌండేషన్‌లతో కలిసి నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉపకరణాల సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఎండీ హాంగ్ జ్యు జియాన్ తెలిపారు. యువతను సమీకరించి నగరంతో సహా 70 నగరాల్లో 400 రక్తదాన శిబిరాలు, 30వేల రిజిస్ట్రేషన్లు(ఇప్పటి దాకా 17, వేలకి పైగా రిజిస్ట్రేషన్స్) లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. రక్తదానంపై ప్రజల్లో పూర్తిస్థాయి చైతన్యం తీసుకురావడమే అంతిమ లక్ష్యంగా పేర్కొన్నారు. శిబిరాల్లో పాల్గొనదలచిన వారు మరింత సమాచారం కోసం.. https://lg-india.com/blood-donation.



క్యు అండ్ ఐ టుడే

విద్యా రంగం భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి

కార్యక్రమంలో ప్రముఖ విద్యా సంస్థల ప్రతినిధులు

గచ్చిబౌలి వేదికగా చర్చా కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక విద్యా కార్యక్రమం క్యు అండ్ ఐ టుడే విద్యా రంగపు భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించింది. నగరంలోని గచ్చిబౌలి వేదికగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నగరంలోని 50కి పైగా ప్రముఖ పాఠశాల ప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఇందులో భాగంగా 'వ్యక్తిగతీకరించిన అభ్యాసం భవిష్యత్తు.. సాంకేతికత తరగతి గదులను ఎలా మారుస్తోంది' అనే అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌వీకేఎం స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎబినేజర్, నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ డైరెక్టర్ డా.స్నేహ నల్ల, విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ అరుణ కుమారి, కెనరీ ది స్కూల్ ప్రిన్సిపాల్ డా.ఇమ్మడి నవీన్ కుమార్, శివగంగ గ్రూప్ డైరెక్టర్ తోట నివేదిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.ఎబినేజర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కస్టమైజ్డ్ ప్రపంచంలో బతుకుతున్నాం.. మన మొబైల్స్ మాత్రమే కాదు ఆలోచనలు కూడా కస్టమైజ్డ్ అవుతున్న వేళ.. విద్య మాత్రం ఎందుకు కాకూడదు అని ప్రశ్నించారు. దీన్ని అ లా కార్ట్ అభ్యాసంగా, ఎం.వై.ఓ.ఎస్(మేక్ యువర్ ఓన్ సబ్ వే మోడల్)గా చెబుతున్నామన్నారు. ఇప్పుడు అడాప్టివ్ లెర్నింగ్ పట్ల మక్కువ పెరుగుతోందని వివరించారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఎంత మేరకు పోటీ పడగలరనే దాన్ని విశ్లేషించడం కూడా ముఖ్యమేని స్నేహ తెలిపారు.

నగరవాసికి మోస్ట్ రెస్పెక్టెడ్ పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఆర్థిక సంబంధ సాంకేతిక సేవలు అందించే జాగిల్ సంస్థ చైర్మన్ డా.రాజ్.పి. నారాయణమ్‌కు జాతీయస్థాయిలో ఆర్థిక అధ్యయనాలకు పేరొందిన హురున్ ఇండియా సంస్థ పురస్కారం లభించింది. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఇండియాస్ మోస్ట్ రెస్పెక్టెడ్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డ్స్ కార్యక్రమంలో ఈ అవార్డ్‌ను ఫైనాన్షియల్ సొల్యూషన్స్ విభాగంలో జాగిల్ సంస్థ చైర్మన్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలవాలనే తమ లక్ష్య సాధనలో ఈ అవార్డ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.





కొత్త మోడల్స్.. బజాజ్ ఈవీ వాహనాలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ టూవీలర్ తయారీ కంపెనీ బజాజ్ చేతక్ తమ సరికొత్త ఎలక్ట్రానిక్ స్కూటర్స్ 3501, 3502 మోడల్స్‌ను సిటీ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. బేగంపేట్‌లోని సిద్ధి వినాయక బజాజ్ షోరూమ్‌లో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో బజాజ్ సంస్థ రీజనల్ మేనేజర్ కె.మంజునాథ్, ఎండి కె.వి. బాబుల్‌రెడ్డి పాల్గొని టచ్ స్క్రీన్/ఎల్‌సీడీ స్క్రీన్‌తో కూడిన కలర్డ్ టీఎఫ్‌టీ కన్సోల్, బ్లూటూత్ కనెక్టివిటీ, అల్లాయ్ వీల్స్.. తదితర కొత్త మోడళ్ల విశేషాలను వివరించారు.





వావ్.. ఆకృతులు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం ఏర్పాటు చేసిన స్కల్పర్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోంది. కళాకారుడు మధుబాబు మంగళగిరి తయారు చేసిన స్కల్పర్స్ సందర్శకులను ఆలోచింపజేస్తున్నాయి. 17 ఆకృతులను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రదర్శనను ఆర్టిస్ట్ ఈ.అన్నపూర్ణ ప్రారంభించారు. ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రేమతో.. ప్రేమికులకు..



సాక్షి, సిటీబ్యూరో: ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అగ్రగామి కేఫ్స్ గ్రూప్ యమ్మీ బీ ఆరోగ్యకరమైన బెంటీ కేక్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కేక్స్‌లో మైదా, గ్లూటెన్, నిల్వ చేసేందుకు అవసరమైన పదార్థాలను మేళవించలేదని, మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అందిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకులు సందీప్ జంగాల తెలిపారు.

దౌమ్..

లగ్జరీ క్రిస్టల్ ఆర్ట్ ప్రపంచం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎలైట్ ఆర్ట్, డిజైన్ అభిమానులు గ్లామరస్ మోన్ అమోర్ ప్యాలెస్ వేదికగా ప్రతిష్టాత్మక దౌమ్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విలాసవంతమైన ఫ్రెంచ్ క్రిస్టల్ దిగ్గజం దౌమ్ ఈవెంట్‌ను ప్రముఖ సామాజికవేత్త, వ్యాపారవేత్త సుధారెడ్డి నిర్వహిస్తున్నారు. 1878లో స్థాపించబడిన దౌమ్., పేట్ డి వెర్రే టెక్నిక్‌కు ప్రసిద్ధి చెందింది. అరుదైన, సంక్లిష్టమైన గాజు తయారీ ప్రక్రియ అయిన ఈ టెక్నిక్ లగ్జరీ క్రిస్టల్ ఆర్ట్ ప్రపంచంలో బ్రాండ్‌గా ప్రశస్తి చెందింది. 20, 21వ శతాబ్దాలకు చెందిన గొప్ప కళాకారుల వారసత్వంతో దౌమ్ కళాఖండాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగింది. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ.. కళ ఎల్లప్పుడూ తన జీవితంలో ఒక భాగమని, అదే సమయంలో నూతన ఆవిష్కరణలు చేస్తూనే సంప్రదాయ చేతి పనులను కాపాడేందుకు బ్రాండ్ నిబద్ధతను కొనసాగిస్తున్నానని అన్నారు. ఈ వారసత్వ బ్రాండ్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పింకీరెడ్డి, కామిని సరాఫ్, కళా నిపుణురాలు అంజు మోదీ, ఆర్కిటెక్ట్ సుప్రజారావుతో పాటు ప్రముఖ ఆర్ట్ కలెక్టర్లు, ఆర్కిటెక్ట్‌లు, డిజైన్ నిపుణులు పాల్గొన్నారు.





అందాల కశ్మీరం.. అందిస్తోంది ఆహ్వానం..

సాక్షి, సిటీబ్యూరో: ఈ వేసవి కాలంలో 33 శాతం సబ్సిడీతో 'కశ్మీర్ టూర్' విహార యాత్రికులకు మధురానుభూతి కలిగిస్తుందని భారతీయ రైల్వే సౌత్‌స్టార్ రైల్ ప్రతినిధి విఘ్నేష్ తెలిపారు. ఇండియన్ రైల్వేలు, భారత్ గౌరవ్ ట్రైన్ ఆపరేటర్ సౌత్‌స్టార్ రైల్, టూర్ టైమ్స్ ఇండియాతో కలిసి కశ్మీర్, ఆగ్రా, ఢిల్లీ, అమృత్‌సర్ వంటి స్థలాలకు వేసవి సెలవుల ప్రత్యేక రైలు టూర్ ఉందన్నారు. 15 రోజుల ప్రత్యేక ప్యాకేజీ ఏప్రిల్ 2, 2025న ప్రారంభమవుతుందని తెలిపారు. బుకింగ్‌లు ఓపెన్ అయ్యాయని అన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, హౌస్ కీపింగ్, భద్రతా సిబ్బందితో అత్యంత సురక్షితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. సైట్‌సీయింగ్, హోటల్ వసతి, రాత్రి బస ఉంటుంది. ఈ పర్యటన వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యం ఉందన్నారు. ప్యాకేజీ 3ఏసీ రూ.49,900, 2ఏసీ రూ.60,100, 1ఏసీ రూ.65,500 కలదన్నారు. బుకింగ్ కోసం www.traintour.in ఫోన్: 7305 858585.

చంద్రబాబు చీటర్ కాదా?

ప్రజలను మోసం చేసిన బాబుపై 420 కేసు పెట్టకూడదా?.. పార్టీ నేతలతో భేటీలో వైఎస్ జగన్ ధ్వజం



“ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త తరఫున చంద్రబాబుకు చెబుతున్నా... మళ్లీ వచ్చేది జగన్ 2.0 పాలన. అన్యాయాలు చేసే వారెవరినీ వదిలిపెట్టేది లేదు. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతాం. కార్యకర్తలకు అన్నలా ఉంటా...

సాక్షి, అమరావతి: ''ఎన్నికల ప్రచారంలో... ముసలమ్మ కూడా బటన్ నొక్కుతుంది అని చంద్రబాబు నాయుడు చెప్పారు. మరి ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ, ప్రతివ్యక్తీ ఎందుకు బటన్ నొక్కలేదని చంద్రబాబును అడుగుతున్నారు. చంద్రబాబు ఇప్పుడు బటన్ ఎలా నొక్కాలో తన చెవిలో చెప్పమంటున్నారు. మొహమాటం లేకుండా నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. మరి ఈ వ్యక్తి చీటర్ కాదా?.. ప్రజలను మోసం చేసిన వ్యక్తిపై 420 కేసు పెట్టకూడదా..?'' అని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'మీరూ, మేమూ.. మనందరం కలిసికట్టుగా నిలబడి ఈ అరాచక ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపే పరిస్థితిలోకి తీసుకెళదాం..' అని పార్టీ నేతలకు, శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, మేయర్, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఏమన్నారంటే..

చరిత్రను మార్చిన జగన్ 1.0 పాలన..

2019–2024 మధ్య జగన్ 1.0 నడిచింది. చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా, చరిత్రను మార్చిన పాలన వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగింది. మన ప్రభుత్వం రాకమునుపు మేనిఫెస్టో అంటే.. చక్కటి అబద్ధాలను రంగు రంగుల కాగితాల్లో ముద్రించి ఎన్నికల్లో పంచడం..! ఎన్నికలు అయినపోయిన తర్వాత ఆ మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం..! అలాంటి పరిస్థితుల నుంచి పాలనలో తులసి మొక్కలా వ్యవస్థను మార్చిన పాలన కేవలం వైఎస్సార్ సీపీ హయాంలోనే జరిగింది. సంక్షేమ క్యాలెండర్‌ను కూడా బడ్జెట్‌తోపాటు ప్రవేశపెట్టి ఏ నెలలో ఏ పథకం అమలవుతుందో చెప్పి.. అలా చెప్పిన తేదీకి బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన చరిత్ర రాష్ట్రంలోనే కాకుండా దేశంలో మన పార్టీ హయాంలోనే జరిగింది. అంతగా వ్యవస్థలో మార్పులు చేశాం.

కూటమి పాలనలో వ్యవస్థలు తిరోగమనం..

ఇవాళ ఈ ప్రభుత్వ హయాంలో ఒకవైపు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికి ఎగిరిపోయాయి. ఎన్నికలప్పుడు చెప్పిన మేనిఫెస్టో చెత్తబుట్టలోకి వెళ్లిపోయింది. ప్రజలకిచ్చిన మాటలు మోసాలుగా తేలిపోయాయి. మరోవైపు విద్య, వైద్యం, వ్యవసాయం, గవర్నెన్స్.. ఇలా అన్ని వ్యవస్థలూ తిరోగమనంలో కనిపిస్తున్నాయి. కేవలం.. ముఖ్యమంత్రి మారాడు..! వైఎస్సార్‌సీపీ పక్కకు వెళ్లి టీడీపీ వచ్చింది..! అంతే తేడా...! ఈ ప్రభుత్వంలో ప్రతి వ్యవస్థ తిరోగమనంలోకి పోయింది. వైఎస్సార్ సీపీ హయాంలో ఇచ్చిన ప్రతి పథకాన్ని రద్దు చేశారు. చంద్రబాబు అమలు చేస్తామన్న ప్రతి పథకం మోసం.. అబద్ధం! కేవలం 9 నెలల కాలంలోనే కనిపిస్తున్న మోసాలివి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మన లెగసీ కంటిన్యూ కావాలంటే..
ఈసారైనా అబ్బాయిని కనాలి

- మళ్లీ చరణ్ అమ్మాయిని కంటాడేమోనని భయంగా ఉంది
- ఓ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి వ్యాఖ్యలు
- చిరు వ్యాఖ్యలపై జాతీయ మీడియా, సోషల్ మీడియాలో విమర్శలు



సాక్షి, హైదరాబాద్: ''ఇంట్లో ఉంటే చుట్టూ అమ్మాయిలే.. నాకు లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉన్నట్టు ఉంటుంది. నా కుమారుడు రామ్‌చరణ్‌కు మళ్లీ అమ్మాయి పుడుతుందేమోనని భయం. మన లెగసీ కంటిన్యూ చేయాలంటే ఈసారి ఒక్క అబ్బాయిని కనాలని చెప్పా..'' అంటూ మెగాస్టార్ చిరంజీవి వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఓ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి ఈ వ్యాఖ్యలు చేశారు. స్టార్ హీరో అయిన చిరంజీవి నోట ఇలాంటి వ్యాఖ్యలు రావడంపై జాతీయ మీడియాలో తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. వారసత్వం (లెగసీ) కావాలంటే అబ్బాయే కావాలా, అమ్మాయిలను తక్కువగా చూడటం ఏమిటంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి.

అల్లు అర్జున్‌ని అన్‌ఫాలో చేసిన రామ్‌చరణ్

- మెగా, అల్లు కుటుంబాల మధ్య గ్యాప్ బయటపడిందనే ప్రచారం





సాక్షి, అమరావతి: మెగా, అల్లు కుటుంబాల మధ్య గ్యాప్ పెరిగినట్టుగా జరుగుతున్న చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. తాజాగా హీరో రామ్‌చరణ్ తన ఇన్‌స్టాగామ్ అకౌంట్‌లో అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేశారు. దీనితో అల్లుఅర్జున్, రామ్‌చరణ్ మధ్య ఏం జరిగింది? ఎందుకు ఆయన అన్‌ఫాలో అయ్యారనేది చర్చనీయాంశంగా మారింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప2: ది రూల్' సినిమా ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు, వసూళ్ల సృష్టించింది. మరోవైపు రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' మాత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీనితో వీరి మధ్య విభేదాలు బయటపడ్డాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల అల్లు అరవింద్ ఓ వేడుకలో చేసిన వ్యాఖ్యలు.. రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని తక్కువ చేసినట్టుగా ఉన్నాయనే ప్రచారం జరిగింది. దీనిపై అల్లు అరవింద్ స్పందిస్తూ.. ''రామ్‌చరణ్ నాకు కొడుకులాంటి వాడు. ఏకైక మేనల్లుడు. మా మధ్య మంచి అనుబంధం ఉంది. ఇందులో ఎలాంటి వదంతులకు తావులేదు'అని పేర్కొన్నారు. మరోవైపు రామ్‌చరణ్ అన్‌ఫాలో చేసినప్పటికీ.. ఆయన భార్య ఉపాసన అల్లు అర్జున్‌ను ఇన్‌స్టాగామ్‌లో ఫాలో అవుతున్నారు. అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన రామ్‌చరణ్.. అల్లు శిరీష్‌ను మాత్రం ఫాలో అవుతుండటం గమనార్హం. రామ్‌చరణ్ కంటే ముందు హీరో సాయిదుర్గా తేజ్ ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసిన సంగతి తెలిసిందే. తాజా పరిణామంపై అల్లు అర్జున్, రామ్‌చరణ్ ఎలా స్పందిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

ఆ సెక్షన్లు సరికాదు..
కాదు సబబే!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు
- 11 క్రిమినల్ కేసులున్న చక్రధర్‌గౌడ్‌కు ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది
- హరీశ్ తరఫున న్యాయవాది వెల్లడి
- మంత్రిగా అధికారులను వాడుకుని నమ్మక ద్రోహానికి పాల్పడ్డారన్న ప్రభుత్వం తరఫు న్యాయవాది

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు మాజీ మంత్రి హరీశ్‌రావుకు వర్తించవని ఆయన తరఫు న్యాయవాది.. లేదు ఆ సెక్షన్లు సరైనవే అని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణను వాయిదా వేస్తూ, గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. ఈ నెల 19 వరకు పిటిషనర్లు హరీశ్‌రావు, రాధాకిషన్ రావును పోలీసులు అరెస్టు చేయరాదని, ఎలాంటి కఠినచర్యలు తీసుకోరాదంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించారు. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజగుట్ట పీఎస్‌లో నమోదు చేసిన ట్యాపింగ్ కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే ఇదే కేసులో మరో నిందితుడైన రాధాకిషన్‌రావు కూడా మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది దామ శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ.. 'చక్రధర్‌గౌడ్‌కు నేర చరిత్ర ఉంది. అత్యాచారం, మోసం సహా 11 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాంటి ఫిర్యాదుదారుడికి ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. క్రిమినల్ కేసుల నుంచి కాపాడుతోంది. సెక్షన్ 120(బీ), 386, 409, 506తోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. ఈ సెక్షన్లు ఏవీ హరీశ్‌రావుకు వర్తించవు. దోపిడీ జరగలేదు.. ప్రలోభపెట్టి ఆస్తిని దోచుకోలేదు. ఆపిల్ కంపెనీ నుంచి అలర్ట్ మెసేజ్ వచ్చిందన్న ఈ మెయిల్ తప్ప ఎలాంటి ఆధారం పిటిషనర్ వద్ద లేదు (అలాంటి సందేశం తనకూ వచ్చిందని న్యాయమూర్తి చెప్పారు)'అని పేర్కొన్నారు.

వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసే చర్య

ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. 'హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేయాలి. ఫోన్ ట్యాపింగ్ చేయించడమంటే రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత హక్కులను హరించడమే. చక్రధర్ ఫోన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. చక్రధర్ ఫోన్ ట్యాప్ అయ్యిందని ఆపిల్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా హెచ్చరించింది. మంత్రిగా ప్రజలకు రక్షకుడిగా ఉండాల్సిన హరీశ్.. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల భక్షకుడిగా మారారు. ట్యాపింగ్ యంత్రాలను, అధికార యంత్రాంగాన్ని వినియోగించుకున్నారు. అధికారులను వాడుకుని నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. చక్రధర్‌గౌడ్‌ను బెదిరించారు. హరీశ్‌రావుపై పెట్టిన సెక్షన్లన్నీ సమర్థనీయమే. ఇది రాజకీయ కక్ష కాదు'అని నివేదించారు.

డీజీపీని కోర్టుకు పిలుస్తాం

- పోలీసుల తీరుపై ఏపీ హైకోర్టు ఫైర్
- కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు
- పరిధి దాటి వ్యవహరిస్తున్నారు
- పౌరులను అక్రమంగా నిర్బంధిస్తారా?
- రాష్ట్రంలో పరిస్థితులు ఉండాల్సింది ఇలాగేనా?...

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలీసులు న్యాయస్థానాల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని, దీనిపై డీజీపీని కోర్టుకు పిలిపించి వివరణ కోరతామని ఏపీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పౌరులను అక్రమంగా నిర్బంధిస్తుండటమే కాక, నిర్బంధంలో ఉన్న వారిని తమ ముందు హాజరు పరచాలంటూ తామిస్తున్న ఆదేశాలను పోలీసులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదని నిప్పులు చెరిగింది. పోలీసులు పరిధి దాటి వ్యవహరిస్తున్నారని స్పష్టంగా కనిపిస్తోందని మండిపడింది. చాలా దూరం వెళుతుండటం సరికాదని హెచ్చరించింది. రాష్ట్రంలో పరిస్థితులు ఉండాల్సింది ఇలాగేనా.. అంటూ నిలదీసింది. ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు అతన్ని చట్ట ప్రకారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచకుండానే విడుదల చేయడంపై విస్మయం వ్యక్తం చేసింది. అంతేకాక నిర్బంధించిన వ్యక్తిని తమ ముందు హాజరు పరచాలన్న ఆదేశాలను సైతం పోలీసులు పట్టించుకోలేదంటే ఏమనుకోవాలని ప్రశ్నించింది. ఈ కేసు చాలా చిన్నదని, ఇలాంటి కేసులు ఎన్నో ఉన్నాయని.. దీనిపై కోర్టు సమయం వృథా చేసుకోరాదంటూ ఇచ్ఛాపురం ఇన్‌స్పెక్టర్ చిన్నం నాయుడు తరఫు న్యాయవాది చెప్పడంపై హైకోర్టు ఒకింత విస్మయం వ్యక్తం చేసింది. పోలీసుల చర్యలు మీకు చిన్న విషయంగా కనిపిస్తోందా? అంటూ నిలదీసింది. మీరు మొన్నటి వరకు ఆ వైపు (కక్షిదారులు) ఉన్నారని, ఇప్పుడు ఈ వైపు (అధికారుల వైపు) ఉన్నారని, అయితే న్యాయం అందరికీ ఒక్కటేనన్న విషయం మర్చిపోవద్దని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని డీజీపీ, ప్రకాశం జిల్లా ఎస్పీ ముందు ఉంచాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వాంగ్మూలం నమోదు చేశాక మళ్లీ నోటీసా?

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంపవన్ కళ్యాణ్ తదితరులను విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారంటూ విశాఖపట్నం జిల్లా మద్దిపాలెంలోని చైతన్యనగర్‌కు చెందిన బొసా రమణను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో రమణ భార్య బొసా లక్ష్మీ తన భర్తను ప్రకాశం జిల్లా పొదిలి, దర్శి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, ఆయన్ను కోర్టు ఎదుట హాజరు పరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.
- ఈ వ్యాజ్యంపై జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. రమణను తాము అరెస్ట్ చేయలేదని పొదిలి, దర్శి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)లు హైకోర్టుకు నివేదించారు. అయితే పిటిషనర్ తరఫు న్యాయవాది పొపిడిప్పు శశిధర్‌రెడ్డి మాత్రం రమణ పోలీసుల అక్రమ నిర్బంధంలోనే ఉన్నారని వివరించారు. దీంతో హైకోర్టు తదుపరి విచారణ సమయంలో రమణను తమ ముందు హాజరు పరచాలంటూ గత ఏడాది నవంబర్ 11న ప్రకాశం జిల్లా ఎస్పీ, పొదిలి, దర్శి స్టేషన్ హౌజ్ ఆఫీసర్లను ఆదేశించింది.
- నవంబర్ 13న కేసు విచారణకు రాగా, రమణను ఇచ్ఛాపురం పోలీసులు అరెస్ట్ చేశారని, ఆయన్ను స్థానిక కోర్టు ముందు హాజరు పరచగా, కోర్టు జుడీషియల్ రిమాండ్ విధించినట్లు ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీంతో హైకోర్టు ఈ కేసులో ఇచ్ఛాపురం ఎస్‌హెచ్‌వోను ప్రతివాదిగా చేర్చింది. అలాగే పొదిలి, ఇచ్ఛాపురం ఎస్‌హెచ్‌వోలను స్వయంగా కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ఇద్దరు ఎస్‌హెచ్‌వోలు ధర్మాసనం ముందు హాజరై వివరణ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినట్లు అంగీకరిస్తూ రమణ వాంగ్మూలం ఇచ్చారన్నారు. ఆ తర్వాత సెక్షన్ 41ఏ నోటీసు తీసుకోవడానికి రమణ నిరాకరించడంతో ఆయన్ను అరెస్ట్ చేసి, అనంతరం విడిచిపెట్టామని పొదిలి ఎస్‌హెచ్‌వో చెప్పారు.
- తాజాగా బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. పొదిలి ఎస్‌హెచ్‌వో తీరుపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ఓ వ్యక్తిని అలా ఎలా అరెస్ట్ చేస్తారని, ఓసారి వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత సెక్షన్ 41ఏ నోటీసు ఇవ్వాల్సిన అవసరం ఏముందో అర్థం కావడం లేదంది. బాధ్యతాయుతమైన అధికారి అయి ఉండి, ఓ వ్యక్తిని అలా అరెస్ట్ చేసి, ఇలా వదిలేశామని ఎలా చెబుతారంటూ ప్రశ్నించింది. అరెస్ట్, విడుదల విషయంలో ఎలాంటి రికార్డు నిర్వహించక పోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో నివేదికలు ఇవ్వాలని ప్రకాశం జిల్లా ఎస్పీ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌లను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.


నిర్మాణ పనులు నిలిపివేయండి

వ్యర్థాల నిర్వహణ కేంద్రంపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో 152 ఎకరాల్లో చేపడుతున్న మున్సిపల్ వ్యర్థాల నిర్వహణ కేంద్రం నిర్మాణ పనులు నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రోడ్డు నిర్మాణం, సర్వే పనులు మాత్రం యథావిధిగా కొనసాగించవచ్చంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులైన అధికారులను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. ప్యారానగర్‌లో వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించాలన్న జీహెచ్ఎంసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాదాపూర్‌కు చెందిన ఎ.స్వర్ణలత హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కైలాశ్‌నాథ్ పీఎస్ఎస్ వాదనలు వినిపిస్తూ.. 'ప్యారానగర్ గ్రామం దుండిగల్ ఎయిర్ బేస్ నుంచి 15 కి.మీ. దూరంలో ఉంది. వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి అధికారులు పర్యావరణ అనుమతులు పొందలేదు. దీనిపై ఎయిర్ ఫోర్స్ విభాగం అభ్యంతరాలు లేవనెత్తింది. ఇక్కడికి పెద్దసంఖ్యలో పక్షులు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ స్థలం నల్లవల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఆనుకుని ఉన్నందున వాయు, నీటి కాలుష్యానికి దారితీస్తుంది'అని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఈ కేంద్రంతో పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లదు. అందువల్ల పర్యావరణ అనుమతి అవసరం లేదు. ఎయిర్‌బేస్ లేవనెత్తిన అభ్యంతరాలు నిరాధారమైనవి'అని వివరించారు. వాదనలు విన్న జడ్జి.. ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించారు.

18న ఆమనగల్‌లో బీఆర్ఎస్ ధర్నాకు అనుమతి

మూడు వేల మంది మాత్రమే పాల్గొనాలన్న హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలంటూ రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఈ నెల 18న బీఆర్ఎస్ తలపెట్టిన ధర్నాకు హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ కార్యక్రమంలో 3,000 మంది మాత్రమే పాల్గొనాలని, నేర చరితులు పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే దానికి పార్టీ బాధ్యత వహించాల్సి ఉంటుందని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించింది. నిరసన సమయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, రాజకీయ, మతపరమైన, ఇతర వివాదాస్పద నినాదాలు చేయకూడదని షరతు విధించింది. ఆమనగల్‌లో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈ నెల 13న (తర్వాత 18కి మార్చారు) శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నామని, దానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన షాద్‌నగర్ ఏసీపీకి వినతిపత్రం ఇచ్చినా నిరాకరించారంటూ బీఆర్ఎస్ నాయకుడు నేనావత్ పత్యా నాయక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.వి జయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జీపీ మహేశ్ రాజే వాదనలు వినిపిస్తూ.. జూనియర్ కాలేజీ గ్రౌండ్ లేదా అయ్యప్ప కొండ గ్రౌండ్‌లో ధర్నాకు అభ్యంతరం లేదన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది రూపేందర్ వాదిస్తూ.. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను, మేనిఫెస్టోలోని ఆరు హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైనందున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాదాపు 5 వేల మంది వచ్చే అవకాశం ఉందని, ఈ నెల 18న ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఆమనగల్‌లోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి జీపీ అభ్యంతరం చెబుతూ.. వెయ్యి మందికే పరిమితం చేయాలని, పలు గ్రామాలకు వెళ్లే రహదారి కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి, 18న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నాకు అనుమతి ఇచ్చారు.

బర్డ్‌ఫ్లూ భయం.. తగ్గిన చికెన్ అమ్మకాలు

- సోషల్‌మీడియా ప్రచారంతో చికెన్ తినేందుకు ప్రజల వెనుకంజ
- హైదరాబాద్‌లో బుధవారం 40 శాతం తగ్గిన చికెన్ విక్రయాలు
- రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ లేదని పశు సంవర్ధక శాఖ ప్రకటన
- రెండుమూడు రోజుల్లో చికెన్ మేళా: మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాపించటంతో, ఆ భయం తెలంగాణకు కూడా పాకింది. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవని ఓవైపు ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, ప్రజలు మాత్రం చికెన్ తినేందుకు జంకుతున్నారు. చికెన్, గుడ్లు తినకూడదని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం జరగటంతో ప్రజల్లో భయాలు మరింత పెరుగుతున్నాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ వంటి ఏపీ సరిహద్దు జిల్లాల్లో బుధవారం చికెన్ అమ్మకాలు తగ్గిపోయాయి. హైదరాబాద్‌లో డ్రెస్డ్ చికెన్ రూ.170, స్కిన్‌లెస్ రూ.200 వరకు విక్రయించారు. ప్రతిరోజు 6 లక్షల కిలోల వరకు చికెన్ అమ్మకాలు జరిగే హైదరాబాద్‌లో బుధవారం 40 శాతం వరకు అమ్మకాలు తగ్గినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. జిల్లాల్లో కూడా సోషల్ మీడియా ప్రచారంతో చికెన్ తినడానికి ప్రజలు భయపడుతున్నారు. కాగా బర్డ్‌ఫ్లూ తెలంగాణలో లేదని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి 'సాక్షి'మీడియాకు తెలిపారు. ఏపీలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకి చనిపోతున్న నేపథ్యంలో అక్కడి కోళ్లు తెలంగాణకు రాకుండా 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల్లో కోళ్ల ఫారాల యాజమానులతో సమావేశాలు ఏర్పాటుచేసి తగిన జాగ్రత్తలు సూచించామని, రాష్ట్రంలో కోళ్లకు వైరస్ రాకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

ఉడికించి తింటే ప్రమాదం లేదు

తెలంగాణలో చికెన్‌ను బాగా ఉడికించే తింటుంటారు. కోళ్లలో వైరస్ లక్షణాలు ఉన్నా ఆ వేడికి చనిపోతాయని, మనుషులకు ఎలాంటి సమస్య ఉండదని పశు సంవర్ధక శాఖతో పాటు పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. తెలంగాణలోని కోళ్ల ఫారాలన్నీ సురక్షిత వాతావరణంలో ఉంటాయని పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ మల్లీశ్వరి తెలిపారు. వాతావరణంలో ఏపీకి, తెలంగాణకు ఉన్న తేడా దృష్ట్యా ఇక్కడ బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం లేదని చెప్పారు.

త్వరలో చికెన్ మేళా: మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి

తెలంగాణలో కోళ్లు, చికెన్ అమ్మకాల విషయంలో అనవసర భయాలు సృష్టిస్తున్నారని మాజీ ఎంపీ, పౌల్ట్రీ పరిశ్రమకు చెందిన రంజిత్‌రెడ్డి అన్నారు. కోళ్లకు సోకే బర్డ్‌ఫ్లూ వైరస్ ఇప్పటివరకు మనుషులకు సోకలేదని తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారం నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండుమూడు రోజుల్లో చికెన్ మేళా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన వెల్లడించారు.

ఫిర్యాదుదారును ప్రతివాదిగా చేర్చండి

సునీతా లక్ష్మారెడ్డిని ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: మెదక్ జిల్లా వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌లో డీ ఫాక్టో కంప్లైనెంట్ (ఫిర్యాదుదారు)ను ప్రతివాదిగా ఎందుకు చేర్చలేదని పిటిషనర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని హైకోర్టు ప్రశ్నించింది. అఫిడవిట్‌ను మార్చి మళ్లీ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణ ఈనెల 18కి వాయిదా వేసింది. వెల్దుర్తి అంబేడ్కర్ క్రాస్‌రోడ్ వద్ద అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం చేపట్టి వాహన రాకపోకలను అడ్డుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారంటూ సునీతతో పాటు మరో తొమ్మిది మందిపై 2018, జూన్ 2న స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని, దర్యాప్తు నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తాజాగా ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు.

నిషేధిత భూమిని 'ప్రైవేట్'కు ఎందుకిచ్చారు?

నాగారం భూములపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వేనంబరు 181లో 103.35 ఎకరాల విస్తీర్ణంలోని భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా అప్పగించారో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆ సర్వేనంబరు రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్నా, భూమిని ప్రైవేట్ పార్టీలకు అప్పగించడంపై కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ భూమి భూదాన్ యజ్ఞ బోర్డుది అని కొందరు, కాదు ప్రైవేట్ భూమి అని కొందరు చెప్పడంతో వివాదం నెలకొంది. 2021లో సదరు భూమిని ప్రైవేట్ పార్టీలకు బదిలీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఎండీ ఫరూజ్ అలీఖాన్, మరికొందరు హైకోర్టులో తొలుత రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని సింగిల్ జడ్జి కొట్టివేయడంతో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ భూమిని నిషేధిత ఆస్తుల జాబితాలోకి తీసుకొస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని సమర్పించాలని అధికారులను ఆదేశించింది. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. అప్పటివరకు 2021 ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని అప్పీలెంట్ కోరగా, ధర్మాసనం నిరాకరించింది. కౌంటర్‌ను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

పిలిచి మాట్లాడండి.. సమస్యలు పరిష్కరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి టీఎన్జీఓ నేతల వినతి



మీడియాతో మాట్లాడుతున్న టీఎన్జీఓ నేత మారం జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) విజ్ఞప్తి చేసింది. ఈ సమస్యలపై చర్చించేందుకు ఉద్యోగ సంఘాల నేతలను పిలిచి మాట్లాడాలని సూచించింది. టీఎన్జీఓ అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న అన్ని ఉద్యోగ సంఘాలతో ప్రత్యేకంగా జేఏసీని ఏర్పాటు చేశామని, ఇందులో 300 మంది ఉద్యోగులతో కార్యవర్గం కూడా ఏర్పాటైందని వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయి ఆర్నెల్లకు పైగా కాలం గడిచిందన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ ఖరారు, అమలు లో ఆలస్యం జరగకుండా వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఆర్థికభారం లేని సమస్యలను ముందుగా పరిష్కరించాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగుల సమస్యలపై సీఎం వెంటనే స్పందించాలని, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలని విన్నవించారు.

బీఆర్ఎస్ వల్లే రీసర్వేకు ప్రభుత్వ ఆమోదం

బీఆర్ఎస్ ఎంపీ రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో జరిగిన కులగణన సర్వే అశాస్త్రీయంగా, తప్పులతడకగా ఉందని బీఆర్ఎస్ నిరూపించబట్టే ప్రభుత్వం దిగొచ్చి రీసర్వేకు అంగీకరించిందని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. సర్వే అశాస్త్రీయంగా జరిగిందనే విషయాన్ని బీఆర్ఎస్ లెక్కలతో సహా నిరూపించిందని తెలిపారు. రీసర్వే సమయంలోనైనా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని బుధవారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. వివరాలను క్రోడీకరించి సరైన లెక్కలు వెల్లడించాలని సూచించారు.

మాఫియా గుప్పిట్లో తెలంగాణ భవన్

- రాష్ట్ర బీజేఎల్పీ చీఫ్ విప్ పాల్వాయి హరీశ్ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్ మాఫియా గుప్పిట్లో ఉందని రాష్ట్ర బీజేఎల్పీ చీఫ్ విప్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందుగా సమాచారం ఇచ్చి వెళ్లినా అర్ధరాత్రి గది ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు. మంగళవారం రాత్రి తెలంగాణ భవన్‌కు వెళ్లి గది కావాలని అడిగితే.. ' గదులు ఖాళీగా లేవు. దగ్గర్లోనే ఒక ప్రైవేట్ హోటల్ ఉంది. అక్కడ గది తీసుకోండి. కావాలంటే వాళ్లకు ఫోన్ చేసి చెప్తాం'అని ఉచిత సలహా ఇచ్చారని మండిపడ్డారు. ఈ అంశంపై బుధవారం భవన్ రెసిడెంట్ కమిషనర్‌కు ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే తెలంగాణ భవన్ మాఫియాలా తయారైందని మండిపడ్డారు. భవన్‌లో గదులన్నీ ప్రైవేట్ వ్యక్తుల పేరుతో బుక్ అయ్యాయని ఆరోపించారు.

మార్చి 20న తుది వాదనలు వింటాం

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామక వ్యవహారంపై సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: 'ప్రస్తుతం ఎమ్మెల్సీ అయిన వారికి ఆరు నెలల సమయమే కదా అయ్యింది. ఇంకా ఐదేన్నరేళ్ల గడువు ఉంది కదా'అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో మార్చి 20న తుది వాదనలు వింటామంటూ విచారణను వాయిదా వేసింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామక కేసులో గవర్నర్ కార్యాలయం దాఖలు చేసిన సివిల్ అప్పీల్‌పై బుధవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రతివాదులుగా ఉన్న బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణల తరఫు న్యాయవాదులు అర్థేందు మౌళి ప్రసాద్, కృష్ణకుమార్ సింగ్, ఉమర్ అహ్మద్‌లు వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో ముందుగా తాము పిటిషన్ దాఖలు చేశామని, అయితే, ఇప్పుడు తమకు వ్యతిరేకంగా గవర్నర్ కార్యాలయం పిటిషన్ దాఖలు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇద్దరి పేర్లను ప్రతిపాదించిందని, వాళ్లు ఎమ్మెల్సీలుగా ప్రమాణం కూడా చేశారని నివేదించారు. ఈ వాదనలపై గవర్నర్ తరఫు న్యాయవాదులు వెంకటరమణి, మహేష్‌బాబు, భారతి రెడ్డి అభ్యంతరం తెలిపారు. సమయానుగుణంగా ప్రతిపాదనలను గవర్నర్ ఆమోదించారని తెలిపారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీకి పదవీకాలం ఎంత ఉందని జస్టిస్ విక్రమ్ నాథ్ ప్రశ్నించారు. ఇందుకు ప్రతివాది న్యాయవాది బదులిస్తూ.. ఆరు నెలలు గడిచిందన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'కేవలం ఆరు నెలలే కదా అయ్యింది. ఇంకా ఐదున్నరేళ్ల గడువు ఉంది'అని జస్టిస్ విక్రమ్ నాథ్ వ్యాఖ్యానించారు. దాసోజు, సత్యనారాయణ నాలుగు వారాల్లోపు తమ కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ కౌంటర్ దాఖలయ్యాక రిజాయిండర్ దాఖలు చేసేందుకు గవర్నర్ కార్యాలయానికి రెండు వారాల సమయం ఇచ్చింది.




వరల్డ్ రేడియో డే

● రేడియో లేడీస్

గుండె గొంతుకలోన

గు... డ్మా... ర్నిం... గ్
అంటూ... కనపడకుండా వినిపించే
వారి గొంతులోని హుషారు
మన మదిలో ఉత్సాహాన్ని నింపుతుంది.
అప్పటివరకు నిశ్శబ్దంగా ఉన్న కాలం కూడా
పరుగులు పెడుతుందా అనిపిస్తుంది.
వారు నోరారా పలకరిస్తుంటే
క్షణాలలో ఆత్మీయ నేస్తాలైపోతారు.
గలగలా మాట్లాడేస్తూ
మనలో ఒకరిగా చేరిపోతారు.
'ప్రతిరోజూ మా వాయిస్‌ని కొత్తగా వినిపించాల్సిందే,
అందుకు కొత్త కొత్త కాన్సెప్ట్‌తో
మమ్మల్ని మేం సిద్ధం చేసుకోవాల్సిందే...'
అని చెబుతున్నారు రేడియో ఎఫ్.ఎమ్.లతో
తమ గళంతో రాణిస్తున్న
మహిళా రేడియో జాకీలు... వారితో మాటా మంతీ...

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



క్రియేటివిటీ అనుకున్నంత సులువు కాదు

నచ్చిన సినిమా పాటలు ఇంట్లో పాడుకుంటూ ఉండే నా గొంతు విని మాకు తెలిసినవారు రేడియోలో ట్రై చేయచ్చు కదా! అన్నారు. అంతే, ఆడిషన్స్‌కు వెళ్లి ఆఫర్ తెచ్చుకున్నాను. అయితే, అది అనుకున్నంత సులువు కాదు. ఇది చాలా క్రియేటివ్ ఫీల్డ్. చాలా మందితో డీల్ చేయాల్సి ఉంటుంది. చాలా స్మార్ట్‌గా ఉండాలి. ఏ రంగంలోనైనా మంచి, చెడు అనుభవాలు ఉంటాయి. కానీ, వాటిని మోసుకుంటూ వెళితే నిరూపించుకోలేం. ఒక వైపు ఉద్యోగం చేస్తూ, మరోవైపు రేడియో జాకీగా మార్నింగ్ షో చేస్తుంటాను. డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతూనే నటిగానూ పన్నెండు తెలుగు సినిమాల్లోనూ నటించాను. ఎక్కడ నా క్రియేటివిటీని చూపించగలనో అక్కడ నా బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ ఇస్తూ, నన్ను నేను మలుచుకుంటూ నా శ్రోతలను అలరిస్తున్నాను. నా ఫ్రెండ్స్ ద్వారా థియేటర్ ఆర్టిస్ట్‌గానూ వేదికల మీద ప్రదర్శనలలో పాల్గొంటున్నాను. ఏ వర్క్ చేసినా నా సోల్ రేడియోలో ఉంటుంది. అందుకని, ఎన్ని పనులు ఉన్నా రేడియో లైఫ్‌ను వదలకుండా నా క్రియేటివిటీకి పదును పెడుతుంటాను.

- ఆర్‌జె ప్రవళిక చుక్కల, ఆకాశవాణి



నవరసాలు గొంతులో పలికించాలి

రేడియో అనగానే క్యాజువల్‌గా మాట్లాడేస్తున్నారు అనుకుంటారు. కానీ, ఇందులో సృజనాత్మకత, ఉచ్చారణ, భావ ప్రకటనతో పాటు నవరసాలు పలికించాలి. కొన్ని సందర్భాలలో ఇంటి వాతావరణం సరిగా లేకపోయినా, ఎక్కడ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నా ఆ ప్రభావం వర్క్‌పై పడకూడదు. నా గొంతు వేల మంది వింటున్నారు అనే ఆలోచనతో అలెర్ట్‌గా ఉండాలి. హైదరాబాద్ బి కేంద్రంలో యువవాణి ప్రోగ్రామ్ నుంచి నేటి వరకు పద్దెనిమిదేళ్లుగా ఆకాశవాణిలో పని చేస్తున్నాను. ఇన్నేళ్ల నా అనుభవంలో సినీమాతారలు, సాహిత్యకారులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, వైద్యులు... ఇలా ఇంచుమించు అన్ని రంగాలలో ఉన్న ప్రముఖుల అంతరంగాలను ఆవిష్కరించాను. చిన్నవాళ్ల నుంచి పెద్దవాళ్ల వరకు అందిరినీ నా వాయిస్‌తో అలరించాను అని గర్వంగా ఉంది. ఆర్మీడే, ప్రధానమంత్రి యోజన పథకాలు, బ్యాంకు, వైద్యం, సమాజంలో బర్నింగ్ ఇష్యూస్... లాంటి వాటిని లైవ్ కవరేజీలుగా ఇచ్చాను. బెస్ట్ ఆర్.జె. అవార్డులూ అందుకున్నాను. రేడియో అంటే గలగల మాట్లాడటమే కాదు సాంకేతిక సామర్థ్యంతో పాటు అన్ని స్థాయుల వారిని కలుపుకుంటూ పనిచేయాలి.

- ఆర్‌జె దీప నిదాన కవి, ఆల్ ఇండియా రేడియో

నన్ను నేను మార్చుకున్నాను



ఈ రంగంలోకి రాకముందు ఎప్పుడూ రేడియో వినలేదు. ఆడిషన్స్ జరుగుతున్నాయనే విషయం తెలిసి, ట్రై చేద్దామని వెళ్లాను. పదకొండేళ్లుగా రేడియోకి అంకితమైపోయాను. గుడ్ ఈవెనింగ్ ట్విన్‌సిటీస్ అని రెయిన్‌బోలో వర్క్ చేశాను. ఇప్పుడు వివిధ భారతిలో సాయంకాలం 5 గంటల నుంచి షో చేస్తున్నాను. సినిమా, వైరల్ న్యూస్, ట్రాఫిక్ అప్‌డేట్స్, యూత్ ట్రెండ్స్, గాసిపింగ్, కరెంట్ టాపిక్స్ .. ఇలా అన్నింటి గురించి చెబుతుంటాను. ఎలా మాట్లాడాలి, ఏం మాట్లాడాలి, ఎదుటివారిని మెప్పించేలా నన్ను నేను ఎలా మార్చుకోవాలనే విషయాలు రేడియోకి వచ్చాకే తెలుసుకున్నాను. ఏ చిన్న విషయమైనా తక్కువ సమయంలో క్రియేటివ్‌గా, ఆసక్తికరంగా అనిపించేలా చెప్పగలగడం రేడియో ఇచ్చిన వరంగా భావిస్తున్నాను.

- ఆర్‌జె కృష్ణ కీర్తి, వివిధభారతి



ఉన్నతంగా తీర్చిదిద్దింది

ప్రసారభారతిలో పద్దెనిమిదేళ్లుగా పని చేస్తున్నాను. రేడియో జాకీలు అనగానే నోటికివచ్చిందేదో వాగేస్తుంటారు అనుకుంటారు. కానీ, మేం ప్రతి రోజూ కొత్తదనంతో శ్రోతలకు పరిచయం అవుతాం. కంటెంట్‌ను సొంతంగా తయారు చేసుకోవడం, సృజనాత్మకతను జోడించడం, గొంతుతోనే కళ్లకు కట్టినట్టుగా వివరించడాన్ని ఓ యజ్ఞంలా చేస్తుంటాం. స్టూడియోలో కూర్చోనే కాకుండా అనాథశ్రమాలు, వృద్ధాశ్రమాలు, దివ్యాంగులు... ఇలా 52 వివిధ రకాల స్వచ్ఛందసేవా సంస్థలతో కలిసి కార్యక్రమాలు చేశాను. సినిమా కథ పేరుతో తెరవెనుక జరిగే ప్రతి కష్టాన్నీ వినిపించాను. రేడియో నన్ను ఉన్నతంగా మార్చింది. డబ్బింగ్ ఆర్టిస్ట్‌ని చేసింది. యాంకర్‌గా వేదికలపైనా, వివిధ కార్యక్రమాలను చేసే అవకాశాన్ని ఇచ్చింది. ఇన్ని అవకాశాలు ఇచ్చిన రేడియో నాకు దేవాలయంలాంటిది.

- ఆర్‌జె స్వాతి బొలిశెట్టి, ఆల్ ఇండియా రేడియో

ప్రతిరోజూ హుషారే!



నాకు నచ్చిన పనిని డబ్బులు ఇచ్చి మరీ చేయమంటుంటే ఎంత ఆనందంగా ఉంటుంది? ఆ ఆనందంతోనే పదేళ్లుగా రేడియో మిర్చిలో ఆర్.జె.గా చేస్తున్నాను. రోజూ చూసేవీ, వినేవీ.. నా ఫ్రెండ్స్‌కి ఎలాగైతే చెబుతానో... శ్రోతలతో కూడా అలాగే మాట్లాడుతుంటాను. కొన్నాళ్ల వరకు నా మాటలను మాత్రమే విన్నవారికి ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా కనిపిస్తున్నాను కూడా. ఆర్‌జె అంటే మాట్లాడటం ఒకటేనా.. నవ్వించడానికి ఏం చేయచ్చు నన్ను నేను ప్రూవ్ చేసుకుంటున్నాను. క్రియేటివిటీ ఉన్నవారే ఈ రంగంలో ఉండగలరు. ఎంత హ్యాపీగా మాట్లాడినా పర్సనల్ ఎమోషన్స్ అడ్డు పడుతుంటాయి. అలాంటప్పుడు ఆ విషయాన్ని కూడా శ్రోతలతో పంచుకుంటాను. 'ఈ రోజు అస్సలు బాగోలేదు, ఇంట్లో డిష్యూ డిష్యూం.. కానీ ఏం చేస్తాం, ముందుగా ఓ రెండుపాటలు వినేసి లైట్ తీసుకుందాం...' ఇలా రోజువారి అంశాలకు హ్యాపీనెస్‌ను జతచేసి శ్రోతలకు ఇవ్వడానికి తపిస్తూనే ఉంటాను. నవరాత్రుల టైమ్‌లో తొమ్మిది మంది విభిన్నరంగాలలో విజయాలు సాధించిన మహిళలతో షో చేశాను. శ్రోతల్లో కొందరిని స్టూడియోకి పిలిచి, ట్రెనింగ్ ఇచ్చి మరీ వారి చేత మాట్లాడించాం. ఆర్‌జె స్వాతి...తో... అని షోలో మొదలుపెట్టే మాటలు, మిర్చి శకుంతల డ్రామా.. చాలా పేరు తెచ్చాయి. కళ్లతో చూసినదాన్ని గొంతులో పలికిస్తా. అదే అందరినీ కనెక్ట్ చేస్తుంది.

- ఆర్‌జె స్వాతి, రేడియో మిర్చి



రేడియోతో ప్రేమలో పడిపోయా!

'సిరివెన్నెల' నైట్ షోతో నా రేడియో జర్నీ ప్రారంభించాను. మార్నింగ్, ఆఫ్టర్‌నూన్, ఈవెనింగ్ షోస్ అన్నీ చేస్తూ వచ్చాను. పదిహేనేళ్లుగా నేర్చుకుంటూ, పని ద్వారా ఆనందాన్ని పొందుతున్నాను. ముఖ్యమైన రోజుల్లో ప్రముఖులతో మాట్లాడుతూ షో చేస్తుంటాం. మారుతున్న ప్రేమల గురించి చర్చిస్తుంటాను. ఆధ్యాత్మిక విషయాల గురించి మాట్లాడుతుంటాను. ఈ రోజు ఇంత ఆనందంగా ఉన్నానంటే అది రేడియో. ఒక వ్యక్తి గొంతు మాత్రమే విని, అభిమానించడం అనేది మామూలు విషయం కాదు. ఒకమ్మాయి కొన్నేళ్లుగా నా షోస్ వింటూ ఉంది. కుటుంబపరిస్థితుల కారణంగా చనిపోవాలనుకున్న ఆ అమ్మాయి, నాతో చివరిసారిగా మాట్లాడుదామని ఫోన్ చేసింది. షో మధ్యలో ఆపేసి, ఆమెతో మాట్లాడి, ఇచ్చిన భరోసాతో ఇప్పుడు వారి కుటుంబ సభ్యురాలిగా మారిపోయాను. రేడియో సిటీలో నా జీవితాన్ని మలుపుతిప్పిన ఇలాంటి సంఘటనలు ఎన్నో.

- ఆర్‌జె సునీత, రేడియో సిటీ

క్రమశిక్షణ నేర్పించింది



చిన్నప్పుడు రేడియో వింటూ మా అమ్మను 'ఆ రేడియోలోకి ఎలా వెళ్లాలమ్మా!' అని అడిగేదాన్ని. కానీ, నిజంగానే రేడియో స్టేషన్‌కి వెళ్లడం, అక్కడ నుంచి నా వాయిస్‌ను శ్రోతలకు వినిపించేలా మార్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. అందరికీ అవకాశాలు రావు. వచ్చినప్పుడు మాత్రం నిలబెట్టుకోవడానికి చాలా కృషి చేయాలి. రేడియో స్టేషన్‌లో అడుగుపెడుతూనే బయట ప్రపంచాన్ని మరచిపోతాను. అంతగా నన్ను ఆకట్టుకుంది రేడియో. ఎఐఆర్ పరిధులను దాటకుండా మేం పనిచేయాల్సి ఉంటుంది. కరోనా టైమ్‌లో అయితే ఎక్కువ షోస్ చేసేవాళ్లం. ప్రజలను చైతన్యవంతం చేయడానికి, భరోసా ఇవ్వడానికి భయాలను పక్కనపెట్టేశాం. ప్రముఖులను ఇంటర్వ్యూ చేయడం, మల్టీటాలెంట్ ఉన్నవారితో పరిచయాలు ఏర్పడటం.. ఇలాంటివెన్నో రేడియో ద్వారానే సాధ్యమయ్యాయి. కాన్సెప్ట్ రాసుకోవడం, తడబాటు లేకుండా మాట్లాడటం, టైమ్ ప్రకారం షోలో పాల్గొనడం.. ఒక క్రమశిక్షణను నేర్పించింది రేడియో.

- ఆర్‌జె లక్ష్మీ పెండ్యాల, ఆల్ ఇండియా రేడియో

హెయిర్ టిప్స్ - కేశ మర్దన



తలకు మసాజ్ చేసేటప్పుడు ఒకసారి మొత్తంగా వలయాకారంగా మర్దన చేసిన తర్వాత క్రాస్ స్ట్రోక్స్ ఇవ్వాలి. దీనికి బొటన వేలు – చూపుడు వేలిని మాత్రమే వాడాలి. రెండు వేళ్లలో ఇమిడేటంత జుట్టును కుదుళ్లకు దగ్గరగా పట్టుకుని ఇంగ్లిష్ అక్షరం 'X' ఆకారంలో అటూ ఇటూ లాగి వదలాలి. ఇలా నుదుటి దగ్గర నేరుగా పాపిడి తీసే దగ్గర మొదలు పెట్టి తల వెనుక వరకు వెళ్లి తర్వాత పక్కనే మరొక వరుస... ఇలా తలంతా చేయాలి.

● ఇక పించింగ్ స్ట్రోక్స్ ఇవ్వాలి. దీనికి అన్ని వేళ్లనూ వాడాలి. రెండు వేళ్లతో గిచ్చడం కాకుండా అన్నివేళ్లతో పుర్రెను గిచ్చుతున్నట్లు (గోళ్లు తగలకూడదు) ఒత్తిడి కలిగించాలి.

● చివరగా మరొకసారి తలంతా వలయాకారంగా మర్దన చేయాలి. ఇంతటితో తలకు మసాజ్ పూర్తవుతుంది. మసాజ్ పూర్తయిన తర్వాత పది నిమిషాలకు తలస్నానం చేస్తే ఆహాయి రెండు– మూడు రోజులు ఉంటుంది. ఈ మసాజ్ కేశ సౌందర్యానికి మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా మంచిది. కొన్ని రకాల తలనొప్పులు, ఒత్తిడి కారణంగా వచ్చే చికాకులు మాయమవుతాయి. ఇలా వారానికి ఒకసారి చేస్తుంటే మంచి ప్రయోజనం ఉంటుంది.

● క్రమం తప్పకుండా జుట్టుకు ట్రీట్‌మెంట్ జరుగుతుంటే జుట్టు రాలడం, చిట్లిపోవడం, చుండ్రు మొదలైన సమస్యలు తలెత్తడానికి అవకాశం ఉండదు. వంశపారంపర్యంగా కాక పోషకాహార లోపం వల్ల, సంరక్షణలోపం వల్ల చిన్న వయసులోనే తెల్లబడడాన్ని సమర్థంగా నివారించవచ్చు.



● వాలెంటైన్స్ వాణి

ప్రేమానుగ్రహం రాశి పెట్టుందా?

జన్మ జాతకం ఎలా ఉన్నా ప్రేమ జాతకం బాగుంటే మంచి ఆత్మిక భాగస్వామి దొరుకుతారు. సవాళ్లు విసిరే జీవితంలో ప్రేమ నిండిన బంధం చాలా అవసరం. స్త్రీ, పురుషుల మధ్య ప్రేమ వారిని ఉత్సాహంగా ముందుకు నడవడానికి కారకం అవుతుంది. జీవితాన్ని అర్థవంతం చేస్తుంది. **ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే.** సౌరమానం ప్రకారం ఆ రోజు దిన ఫలితాలు ఇక్కడ ఇస్తున్నాం. ఈ ఫలితాలు సంవత్సరమంతా ప్రభావం చూపిస్తాయి...

మేషం (21 మార్చి-19 ఏప్రిల్)

ఈ రాశి వారికి ప్రాకృతిక శక్తి సహకరిస్తుంది. అంగారక గ్రహ ప్రభావం వలన ప్రేమ వృద్ధి చెందుతుంది. వీరు తాము ప్రేమించినవారి కోసం ఏదైనా ప్రత్యేకమైన ఫంక్షన్ ఏర్పాటు చేసి వారి మన్ననలు అందుకుంటారు. చాలా రొమాంటిక్ గా కాలం గడుస్తుంది. ఈ రాశి ప్రేమికులు ఈ సంవత్సరం దంపతులవుతారు. దంపతులుగా ఉన్నవారు తల్లి దండ్రులవుతారు.

వృషభం (20 ఏప్రిల్-20 మే)

శుక్ర గ్రహ ప్రభావం వల్ల రొమాంటిక్ భావాలు పెరుగుతాయి. ప్రేమించిన వారి పట్ల ప్రేమ ఆప్యాయతలు అధికమవుతాయి. స్థిరపడుతాయి. ప్రేమ విషయంలో కొత్త విధానాలు అవలంబిస్తారు. ఆ కొత్త విధానాల వలన ప్రేమ సఫలీకృతం అవుతుంది. పెద్దలు మీ ప్రేమను అంగీకరిస్తారు. ఈ సంవత్సరం మంచి జీవితాన్ని గడుపుతారు.

మిథునం (21 మే-20 జూన్)

బుధ గ్రహ ప్రభావం వల్ల మీరు ప్రేమించిన వారి పట్ల ప్రేమను సూటిగా చక్కగా అర్థవంతంగా తెలుపగలుగుతారు. మీ మాటలకు మీరు ఇష్టపడినవారు ప్రభావితులవుతారు. మిథునం అంటేనే జంట, ఈ సంవత్సరం ప్రేమికుల జంట పంట పండినట్టే. ఆదర్శమైన జంటగా పేరు పొందుతారు.

కర్కాటకం (21 జూన్-22 జులై):

చంద్ర గ్రహ ప్రభావం వల్ల మీలో ప్రేమాభిమానాలు ఉప్పొంగి మీ ప్రేమికుల పట్ల సుహృద్భావం కలిగిస్తుంది. వ్యక్తిగత సంబంధాలు మెరుగుపడతాయి. చిన్న నాటి స్నేహితులను కలుసుకుంటారు. గతంలో తెగిన బంధాలు ఇప్పుడు అతుకుతాయి.

సింహం (23 జులై-22 ఆగస్టు)

సూర్యగ్రహ ప్రభావం వల్ల మీ ఆకర్షణ శక్తి పెరుగుతుంది. మీరు ప్రేమించినవారికి ఆకర్షించగలుగుతారు. అందరూ మిమ్మల్ని అభిమానిస్తారు. మీ ప్రేమను స్పష్టంగా తెలియజేయగలుగుతారు. ఈ సంవత్సరం మీకు తిరుగు ఉండదు. అన్నిటిలో విజయమే లభిస్తుంది. మీ ప్రేమ ఫలిస్తుంది.

కన్య (23 ఆగస్టు-22 సెప్టెంబర్)

ఆత్మ పరిశీలన చేసుకొని సంబంధ బాంధవ్యాలను విశ్లేషిస్తారు. మీ భావాలను బాగా తెలియజేస్తారు. ప్రేమికుల మధ్య బంధాలు బలపడతాయి. ఈ సంవత్సరం మీకు మహోన్నతంగా ఉంటుంది. విదేశీ ప్రయాణాలు చేస్తారు. చేతిలో ధనం బాగా నిలుస్తుంది. దైవబలం మీకు తోడుగా ఉంది.

తుల (23 సెప్టెంబర్.....22 అక్టోబర్)

శుక్ర గ్రహ ప్రభావం వల్ల ప్రేమికుల మధ్య సంబంధ బాంధవ్యాల సమతుల్యత పెరిగి ప్రేమ వికసిస్తుంది. ఆరోపణలు, ప్రత్యారోపణలు, డిమాండ్‌లు తగ్గుతాయి. ప్రేమికులు సామరస్యంగా ఉంటారు. ప్రేమలోను, వ్యాపార రంగంలోను మీదే పైచేయి అవుతుంది. పట్టిందల్లా బంగారం అవుతుంది. నూతన వ్యాపారాలు ఈ సంవత్సరం ప్రారంభించి లాభాలు పొందుతారు.

వృశ్చిక (23 అక్టోబర్- 21 నవంబర్)

అంగారక ప్రభావం వల్ల ప్రేమాభిమానాలు వృద్ధి చెందుతాయి. మీరు ప్రేమించిన వారిని ఈ రోజు మీరు అయస్కాంతంలా ఆకర్షిస్తారు. లోతైన ప్రేమ గొప్ప అనుభవాలను తీసుకొస్తుంది. ఈ సంవత్సరం మీ కష్టాలు తొలగిపోయి, ఆనందం ఐశ్వర్యం లభిస్తాయి. మీరు చాలా సంతోషంగా ఉంటారు.

ధనుస్సు (22 నవంబర్.....21 డిసెంబర్)

గురు గ్రహ ప్రభావం వల్ల మీలో ఆశావాదం పెరుగుతుంది. దాంతో సాహస ప్రవృత్తి పెరిగి అది ప్రేమించినవారిని ఆకర్షించి కట్టిపడేసేలా చేస్తుంది.. ఆనందం వెల్లివిరుస్తుంది. సింగిల్‌గా ఉన్నవారికి ఈ సంవత్సరం మంచి ప్రేమైక భాగస్వామి తారసపడతారు. ఈ సంవత్సరం గొప్ప అభివృద్ధిని సాధిస్తారు. ప్రేమించిన వారి వల్ల మంచి జరుగుతుంది.

మకరం (22 డిసెంబర్-19 జనవరి)

శనిగ్రహ ప్రభావం వల్ల మీ ప్రేమ వ్యవహారం బలపడుతుంది. ప్రేమలో మీరు గతంలో ఇచ్చిన మాట, హామీలు నెరవేరుస్తారు. సింగిల్‌గా ఉన్నవారికి తగిన జోడు లభిస్తుంది. స్త్రీ వల్ల పురుషులు, పురుషుల వల్ల స్త్రీలు లాభం పొందుతారు. ఈ సంవత్సరం ఏలిననాటి శని తొలగి గొప్ప ఉన్నతిని సాధిస్తారు.

కుంభం (20 జనవరి-18 ఫిబ్రవరి)

శుక్ర, యురేనస్ గ్రహ ప్రభావం వల్ల రొమాంటిక్ భావాలు ఉద్దీప్తమవుతాయి. మీలోని అసాధారణ శక్తి బంధాలను బలపరుస్తుంది. ప్రేమ విషయంలో కొత్త ఆలోచనలు కలిగిస్తుంది. సింగిల్‌గా ఉన్నవారు సంప్రదాయేతర స్థలాలలో వింత పరిచయాలను ఎదుర్కొంటారు. ప్రేమికుల వల్ల ఈ సంవత్సరం మీకు వృత్తి పరంగా మంచి అవకాశాలు వచ్చి రాణిస్తారు.

మీనం (19 ఫిబ్రవరి-20 మార్చి)

నెప్ట్యూన్ ప్రభావం వల్ల అసాధారణ భావోద్వేగం మీ హృదయానికి సరైన దారి చూపిస్తుంది. ఈరోజు మీలో సున్నితమైన ప్రేమ సానుకూల వాతావరణాన్ని కలిగిస్తుంది. ప్రేమికుల మధ్య బంధం పెరిగి కలలు సాకారమవుతాయి. సింగిల్‌గా ఉన్నవారు అనుకోకుండా సోల్‌మేట్‌ను కలుసుకుంటారు. ఎంతో కాలంగా ఉన్న అభిలాషలు ఈ సంవత్సరం తీరుతాయి. పది సంవత్సరాల వరకు మీకు తిరుగు ఉండదు.



- డా. మహమ్మద్ దావూద్,
ఆస్ట్రో న్యూమరాలజిస్ట్



మన(సు)లో మాట

పారిపోవాలని అనిపిస్తోంది!

నాకు పెళ్ళయి 3 నెలలు అవుతోంది. నా భార్య బాగా చదువుకుంది. ఉద్యోగం చేస్తుంది. పెళ్ళి చేసుకుంటే సంతోషంగా ఉండొచ్చు అని ఇద్దరం ఇష్టపడి పెద్దలను ఒప్పించి పెళ్ళి చేసుకున్నాం. పెళ్ళి సమయంలో మా అత్త, మామ వాళ్ళు ఇష్టపూర్వకంగానే నాకు కొంత కట్నం కూడా ఇచ్చారు. పెళ్ళైన ఒక నెల వరకూ చాలా బాగుంది. కానీ అంతలోనే బాగా మారిపోయింది. ప్రతిదానికి అలక, ఏ విషయాన్నైనా సాగదీయడం, నా జీతం నీకు ఇవ్వను, నా ఇష్టం వచ్చినట్టు ఖర్చు పెట్టుకుంటాననడం, మా అమ్మానాన్నకు డబ్బులు ఇవ్వొద్దు అనడం, వాళ్ళు మన ఇంట్లో ఉండకూడదు అని తరచూ గొడవలు చేయడం, గొడవ అయిన ప్రతిసారి తన కట్నం డబ్బులు తనకు ఇచ్చేయమని రచ్చ చేస్తుంది. గంటలు గంటలు మేకప్ వేసుకోవడం, తయారయి ఫోటోలు దిగడం, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం, తెలియని వాళ్ళతో కూడా గంటలు గంటలు చాటింగ్ చేయడం... వద్దంటే ఏడుస్తోంది. తల గోడకేసి కొట్టుకుంటుంది. మమ్మల్ని బెదిరించడం కోసం తనకు తానే చిన్న చిన్న గాయాలు చేసుకుంటుంది. నేను తనతో ఎంతోమంచి జీవితాన్ని ఊహించుకున్నాను. నా కలల ప్రపంచం ఒక్కసారిగా కూలిపోయింది. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. నన్ను ఈ సమస్య నుంచి బయటకు తీసుకువచ్చే సలహా ఇవ్వగలరు.

- ఆదినారాయణ, హైదరాబాద్

ముందుగా మీరు ఒక విషయం గ్రహించాలి. ప్రపంచంలో ఏ ఇద్దరు వ్యక్తులు ఒకేలా ఆలోచించరు. అలాగే కలహాలు లేని కాపురాలు కూడా ఉండవు. తల్లిదండ్రుల నుండి వచ్చే వారసత్వ లక్షణాలు, పెరిగిన వాతావరణం ఒక మనిషి వ్యక్తిత్వాన్ని, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. అతిగా అలగడం, మొండితనం, ఓర్వలేనితనం, తరచు మానసిక సంయమనం కోల్పోవడం, విపరీతమైన కోపం, తమని తాము గాయపరచుకోవడం అనేవి సాధారణంగా 'బార్డర్‌లైన్ పర్సనాలిటీ' అనే ఒక ప్రత్యేకమైన మనస్తత్వం ఉన్న వాళ్ళలో చూస్తాం. ఈ సమస్యతో బాధపడే వాళ్ళు ఇతరులతో అంత సులభంగా సర్దుకుపోలేరు. తమ చుట్టూ ఉన్న వాళ్ళని ఏదో ఒకరకంగా కంట్రోల్ చేయాలని అనుకుంటారు. మీ అత్తమామల సహాయం తీసుకుని మీ భార్యాభర్తలిద్దరూ, మంచి సైకియాట్రిస్ట్ లేదా క్లినికల్ సైకాలజిస్ట్‌ని సంప్రదించండి. మీ ఇద్దరితో వివరంగా మాట్లాడి అవసరమైన సలహాలు, సూచనలు మానసిక వైద్యులు అందిస్తారు. ఆమె మనస్తత్వాన్ని ముందు మీరు అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. తన పరిస్థితి గురించి మీకు అవగాహన వస్తే, తనతో ఎలా మసులుకోవాలో తెలిసే అవకాశం కూడా ఉంటుంది. అలాగే మీరూ మానసికంగా చాలా ఒత్తిడిలో ఉన్నారు కాబట్టి మీరు కూడా కౌన్సెలింగ్ తీసుకుంటే మంచిది. మీరు తొందరపడి ఎలాంటి తీవ్ర నిర్ణయమూ తీసుకోకండి. మీ బంధాన్ని తెంచుకోవటం సులభం కావచ్చు. దాన్ని జాగ్రత్తగా పదికాలాల పాటు నిలబెట్టుకోవాలంటే ఇరువైపుల నుండి కొంత సర్దుబాటు, సహనం, నిరీక్షణ, త్యాగం అవసరం. మీరు విడాకులు తీసుకున్నా ఇంతకంటే మంచి జీవిత భాగస్వామి దొరుకుతుందన్న గ్యారెంటీ కూడా ఉండకపోవచ్చు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:sakshifamily3@gmail.com

బ్యూటిప్



చర్మం మృదువుగా మారాలంటే...

టేబుల్ స్పూన్ మినప్పప్పు, నాలుగు బాదంపప్పులు కలిపి నీటిలో రాత్రంతా నాబెట్టాలి. ఉదయాన్నే ఈ రెండింటిని మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు పట్టించి, మెల్లగా రుద్దాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. చర్మం మృదువుగా, తాజాగా కనిపిస్తుంది.



తెలంగాణ జిమ్నాస్ట్ నిష్కా అగర్వాల్‌కు స్వర్ణ పతకం

జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో మూడో పసిడి పతకం చేరింది. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో బుధవారం జరిగిన మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో తెలంగాణ అమ్మాయి నిష్కా అగర్వాల్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో నిష్కా విజేతగా నిలిచింది. ఎనిమిది మంది పోటీపడ్డ ఫైనల్లో నిష్కా 12.717 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకొని బంగారు పతకాన్ని హస్తగతం చేసుకుంది. ఈ జాతీయ క్రీడల్లో నిష్కాకిది రెండో పతకం. మంగళవారం జరిగిన ఆల్ అరౌండ్ ఈవెంట్‌లో నిష్కా కాంస్య పతకాన్ని సాధించింది. మరోవైపు పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ 65 కేజీల విభాగంలో తెలంగాణ రెజ్లర్ నిఖిల్ యాదవ్ కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. బుధవారం పోటీలు ముగిశాక తెలంగాణ 16 పతకాలతో (3 స్వర్ణాలు, 3 రజతాలు, 10 కాంస్యాలు) 25వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 14 పతకాలతో (7 స్వర్ణాలు, 1 రజతం, 6 కాంస్యాలు) 18వ స్థానంలో నిలిచింది.

వన్డేల్లో భారత జట్టు మరోసారి తమ బలాన్ని ప్రదర్శించింది. సొంతగడ్డపై తమ స్థాయిని చూపిస్తూ ఇంగ్లండ్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. గత రెండు మ్యాచ్‌ల తరహాలో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన టీమిండియా చివరి పోరులోనూ ఘన విజయాన్ని అందుకుంది. కెరీర్‌లో 50వ వన్డే ఆడిన శుబ్‌మన్ గిల్ శతకానికి తోడు శ్రేయస్ అయ్యర్, విరాట్ కోహ్లి రాణించడంతో భారీ స్కోరు సాధించిన టీమిండియా ఆ తర్వాత బలమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టి పడేసింది. ‘బజ్‌బాల్’ మాయలో ‘బ్యాడ్‌బాల్’గా మారిపోయిన ఆటతో ఇంగ్లండ్ మరో భారీ ఓటమిని మూటగట్టుకుంది. మరోవైపు కోహ్లి సహా ప్రధాన బ్యాటర్లంతా ఫామ్‌లోకి వచ్చిన సానుకూలతతో ఇక చాంపియన్స్ ట్రోఫీ సమరానికి రోహిత్ బృందం సన్నద్ధమైంది.





శుబ్‌మన్ గిల్ సెంచరీ అభివాదం

ఘనమైన ముగింపు

చివరి వన్డేలోనూ భారత్ విజయం

- 142 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
- 3–0తో సిరీస్ టీమిండియా సొంతం
- శుబ్‌మన్ గిల్ సెంచరీ
- రాణించిన అయ్యర్, కోహ్లి

అహ్మదాబాద్: ఇంగ్లండ్‌పై టి20 సిరీస్‌ను 4–1తో గెలుచుకున్న భారత్ జట్టు ఇప్పుడు వన్డే సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో భారత్ 142 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ శుబ్‌మన్ గిల్ (102 బంతుల్లో 112; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... శ్రేయస్ అయ్యర్ (64 బంతుల్లో 78; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కోహ్లి (55 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు చేశారు. కోహ్లితో 116 పరుగులు జోడించిన గిల్, అయ్యర్‌తో 104 పరుగులు జత చేశాడు. అనంతరం ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది. అట్కిన్సన్ (19 బంతుల్లో 38; 6 ఫోర్లు, 1 సిక్స్), బాంటన్ (41 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్లుగా నిలిచారు. సిరీస్‌లో 259 పరుగులు చేసిన గిల్‌కే ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డు దక్కింది.

శతక భాగస్వామ్యాలు...

గత మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ (1) ఈసారి రెండో బంతికే వెనుదిరిగాడు. అయితే గిల్, కోహ్లి భాగస్వామ్యంలో భారత్ ఇన్నింగ్స్ సరైన దిశలో సాగింది. 7 పరుగుల వద్ద సమన్వయ లోపంతో కోహ్లి రనౌట్ ప్రమాదంలో పడినా వుడ్ త్రో నేరుగా వికెట్లను తగలకపోవడంతో బతికిపోయాడు. తొలి 10 ఓవర్లలో భారత్ 52 పరుగులు చేసింది. ఆ తర్వాత వీరిద్దరు కొన్ని చక్కటి షాట్లతో అలరించారు. ఐదు బంతుల వ్యవధిలో గిల్ (51 బంతుల్లో), కోహ్లి (50 బంతుల్లో) అర్ధ సెంచరీలు పూర్తయ్యాయి. అయితే తర్వాతి ఓవర్లో రషీద్ వేసిన చక్కటి బంతిని ఆడలేక కోహ్లి వెనుదిరిగాడు. అనంతరం ఫామ్‌లో ఉన్న అయ్యర్...గిల్‌తో జత కలిశాడు. ఈ జోడీ కూడా పదునైన బ్యాటింగ్‌తో అలవోకగా పరుగులు సాధించింది. వుడ్ ఓవర్లో డీప్ మిడ్‌వికెట్ మీదుగా ఫోర్ కొట్టి 95 బంతుల్లోనే గిల్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఆ వెంటనే 43 బంతుల్లో అయ్యర్ హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే తక్కువ వ్యవధిలో వీరిద్దరిని ఆదిల్ రషీద్ వెనక్కి పంపించాడు. గత రెండు వన్డేల్లో విఫలమైన కేఎల్ రాహుల్ (29 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్) ఈసారి మెరుగ్గా ఆడగా... రషీద్ ఓవర్లో వరుసగా 6, 6 బాది తర్వాతి బంతికి హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 17) అవుటయ్యాడు. తర్వాత వచ్చిన బ్యాటర్లందరూ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వరుసగా వికెట్లు కోల్పోయినా... భారత్ 350 పరుగుల స్కోరును దాటగలిగింది. ఆఖరి 7 బంతుల్లో 3 వికెట్లు కోల్పోయి ఆలౌటైంది. భారత తుది జట్టులో వరుణ్ చక్రవర్తి, షమీ, రవీంద్ర జడేజా స్థానాల్లో కుల్దీప్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ తుది జట్టులోకి వచ్చారు.

సమష్టి వైఫల్యం...

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (21 బంతుల్లో 23; 4 ఫోర్లు), బెన్ డకెట్ (22 బంతుల్లో 34; 8 ఫోర్లు) సరైన ఆరంభాన్ని అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 6.2 ఓవర్లలోనే 60 పరుగులు జోడించారు. రాణా తన తొలి 2 ఓవర్లలో 5 ఫోర్లతో 22 పరుగులు ఇవ్వగా... అర్ష్‌దీప్ ఓవర్లో డకెట్ వరుసగా 4 బంతుల్లో 4 ఫోర్లు కొట్టాడు. అయితే ఈ భాగస్వామ్యం విడిపోయిన తర్వాత ఇంగ్లండ్ తడబడింది. బాంటన్, రూట్ (29 బంతుల్లో 24; 2 ఫోర్లు) కొద్దిసేపు నిలబడినా వీరిద్దరు ఎనిమిది పరుగుల వ్యవధిలో వెనుదిరిగారు. ఆ తర్వాత జట్టు కోలుకోలేకపోయింది. టపటపా వికెట్లను కోల్పోయి ఓటమి దిశగా పయనించింది. రాణా వరుసగా రెండు ఓవర్లలో బట్లర్ (6), బ్రూక్ (26 బంతుల్లో 19; 1 ఫోర్, 1 సిక్స్)లను బౌల్డ్ చేయడంతో జట్టు ఆశలు కోల్పోయింది. మిగతా లాంఛనం ముగిసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. మరో 15.4 ఓవర్లు మిగిలి ఉండగానే జట్టు కుప్పకూలింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) సాల్ట్ (బి) వుడ్ 1; గిల్ (బి) రషీద్ 112; కోహ్లి (సి) సాల్ట్ (బి) రషీద్ 52; అయ్యర్ (సి) సాల్ట్ (బి) రషీద్ 78; రాహుల్ (ఎల్బీ) (బి) మహమూద్ 40; పాండ్యా (బి) రషీద్ 17; అక్షర్ (సి) బాంటన్ (బి) రూట్ 13; సుందర్ (సి) బ్రూక్ (బి) వుడ్ 14; రాణా (సి) బట్లర్ (బి) అట్కిన్సన్ 13; అర్ష్‌దీప్ (రనౌట్) 2; కుల్దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 356.** **వికెట్ల పతనం:** 1–6, 2–122, 3–226, 4–259, 5–289, 6–307, 7–333, 8–353, 9–353, 10–356. **బౌలింగ్:** సాఖిబ్ మహమూద్ 10–0–68–1, మార్క్ వుడ్ 9–1–45–2, అట్కిన్సన్ 8–0–74–1, రూట్ 5–0–47–1, ఆదిల్ రషీద్ 10–0–64–4, లివింగ్‌స్టోన్ 8–0–57–0.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 23; డకెట్ (సి) రోహిత్ (బి) అర్ష్‌దీప్ 34; బాంటన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 38; రూట్ (బి) అక్షర్ 24; బ్రూక్ (బి) రాణా 19; బట్లర్ (బి) రాణా 6; లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) రాహుల్ (బి) సుందర్ 9; అట్కిన్సన్ (బి) అక్షర్ 38; రషీద్ (బి) పాండ్యా 0; వుడ్ (సి) అయ్యర్ (బి) పాండ్యా 9; మహమూద్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (34.2 ఓవర్లలో ఆలౌట్) 214.** **వికెట్ల పతనం:** 1–60, 2–80, 3–126, 4–134, 5–154, 6–161, 7–174, 8–175, 9–193, 10–214. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 5–0–33–2, హర్షిత్ రాణా 5–1–31–2, వాషింగ్టన్ సుందర్ 5–0–43–1, అక్షర్ పటేల్ 6.2–1–22–2, పాండ్యా 5–0–38–2, కుల్దీప్ యాదవ్ 8–0–38–1.

ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడకుండానే..

చాంపియన్స్ ట్రోఫీ బరిలో టీమిండియా

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీకి ముందు సన్నాహకంగా భారత జట్టు ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడటం లేదు. బుధవారం వరకు స్వదేశంలో ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడిన టీమిండియా... తమకు ప్రాక్టీస్ మ్యాచ్‌ల అవసరం లేదని తేల్చేసింది. టోర్నీలో ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఫిబ్రవరి 14–17 మధ్య జరుగుతాయి. 19న టోర్నీ ప్రారంభం కానుండగా, భారత జట్టు 15న దుబాయ్ చేరుకుంటుంది. మరోవైపు అఫ్గానిస్తాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ టీమ్‌లు మాత్రం పాక్ గడ్డపైనే ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడబోతున్నాయి. ఈ మూడు మ్యాచ్‌లలో తలపడేందుకు ప్రత్యర్థులుగా పాకిస్తాన్ మూడు వేర్వేరు జట్లను ఎంపిక చేసింది. మరో ప్రాక్టీస్ పోరులో న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్ తలపడతాయి.

1 ఒకే మైదానంలో మూడు ఫార్మాట్‌లలోనూ (టెస్టు, వన్డే, టి20) సెంచరీలు చేసిన తొలి భారతీయ క్రికెటర్‌గా శుబ్‌మన్ గిల్ గుర్తింపు పొందాడు. నరేంద్ర మోదీ స్టేడియంలో గిల్ టి20ల్లో (న్యూజిలాండ్‌పై 126 నాటౌట్; 2023లో), టెస్టుల్లో (ఆస్ట్రేలియాపై 128 ; 2023లో), వన్డేల్లో (ఇంగ్లండ్‌పై 112 ; 2025లో) ఒక్కో సెంచరీ సాధించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● శ్రీకాంత్ పేరేపు, రానా, సిద్ధు జొన్నలగడ్డ

సోషల్ మీడియాలో రిక్వెస్ట్‌లు వచ్చేవి

– నటుడు–నిర్మాత రానా

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలినీ వడ్నికట్టి హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘కృష్ణ అండ్ హిజ్ లీల’. రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం 2020లో డైరెక్ట్‌గా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో రిలీజైంది. కాగా ఈ సినిమాను ‘ఇట్స్ కాంప్లికేటెడ్’ టైటిల్‌తో ఈ 14న థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో రానా మాట్లాడుతూ– ‘‘సోషల్ మీడియాలో ఈ సినిమా గురించి ఎప్పుడూ రిక్వెస్ట్‌లు వచ్చేవి. ఒక రోజు సిద్ధు ఈ సినిమా గురించి చెప్పారు. ఈ సినిమా రిలీజ్‌కి వేలంటైన్స్ డే పర్ఫెక్ట్ టైమ్. నేను ఆడియన్స్‌కు డిఫరెంట్ కథలు చూపించేందుకు ఇష్టపడతాను. కథ ఎంత కొత్తగా ఉంది? ఆడియన్స్‌కు మనం ఏం చెబుతున్నాం? అనేది కూడా చూస్తాను’’ అని తెలిపారు. ‘‘థియేటర్స్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన మూవీ ఇది. ఈ సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేసి ఉంటే సిక్స్ టైమ్స్ ఎక్కువ వచ్చేది’’ అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ‘‘లాక్‌డౌన్ సమయంలో ఈ సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేయడం కుదర్లేదు. ఈ సినిమాతో అందరూ రిలేట్ అవుతారు’’ అని పేర్కొన్నారు రవికాంత్.

రాజకీయం మాట్లాడేంత పెద్దవాణ్ణి కాదు – విశ్వక్ సేన్



‘‘నా కెరీర్ స్టార్టింగ్‌లో కాస్త అగ్రెసివ్‌గా ఉన్నాను. ఆ వయసులో అలానే ఉండాలి కూడా. అప్పట్లో చేయాల్సినంతా చేశాను... కావాలనే చేశాను. అయితే వయసు పెరుగుతున్న కొద్దీ నా ఆలోచనా ధోరణిలో మార్పులు వస్తున్నాయి. ఇంత కన్నా కూడా సైలెంట్ అయిపోతానేమో అనే భయం కలుగుతోంది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. అమ్మాయి కోసం ఎదురు చూస్తున్నాను’’ అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా రామ్ నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన చిత్రం ‘లైలా’. ఈ నెల 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో విశ్వక్ సేన్ చెప్పిన సంగతులు.

● డిఫరెంట్ రోల్స్ చేయాలనే ఆకాంక్ష ప్రతి నటుడికీ ఉంటుంది. ‘భామనే సత్యభామనే, మేడమ్, చిత్రం భళారే విచిత్రం, రెమో’ వంటి సినిమాలు చూశాను. ఆ సినిమాల్లో హీరోల్లా లేడీ గెటప్ వేసే చాన్స్ వస్తే చేయాలనుకున్నాను. ‘లైలా’ చిత్రానికి కుదిరింది. ఈ తరంలో ఒక తెలుగు హీరో అమ్మాయి పాత్ర వేయడం అనేది రెండు దశాబ్దాలుగా మనం చూడలేదు. ఆ లోటును ‘లైలా’ సినిమా భర్తీ చేస్తుందని అనుకుంటున్నాను. ఈ సినిమాకు మంచి కథ కుదిరింది.

● సినిమాలో సోను మోడల్, లైలాగా కనిపిస్తాను. ఫస్ట్ హాఫ్‌లో వచ్చే సోను మోడల్ క్యారెక్టర్‌ని కూడా ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు. లైలా పాత్ర కోసం చాలా కష్టపడ్డాను. గెటప్ కోసం సెట్స్‌లో రోజూ రెండున్నర గంటలు పట్టేది. శివ కార్తికేయన్ ‘రెమో’ సినిమాకు వర్క్ చేసిన నిక్కీయే ఈ సినిమాకూ మేకప్ ఆర్టిస్టుగా చేశారు. లేడీ గెటప్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ఈ సినిమా చాలా నేచురల్‌గా ఉంటుంది. సెకండాఫ్‌లో లైలా గెటప్‌తో ఓ యాక్షన్ సీక్వెన్స్ కూడా ఉంది. మా సినిమాలో ఉన్నది అడల్ట్ కామెడీ కాదు. యూత్‌ఫుల్ కంటెంట్. రామ్ నారాయణ్ ఈ సినిమాను బాగా తీశాడు.

● ఇటీవల నేను ఇండస్ట్రీ అంతా ఒకే కాంపౌండ్ అని మాట్లాడాను. ఈ మాటలను చిరంజీవిగారు ‘లైలా’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రస్తావించడం హ్యాపీగా అనిపించింది. సినిమా మీద ప్రేమతోనే అందరం ప్రయాణిస్తున్నాం. అందరం అందర్నీ సపోర్ట్ చేసుకోవాలి. ఇంకా చిరంజీవిగారు తన సొంత తమ్ముడు గురించి మాట్లాడారు. నేను రాజకీయం మాట్లాడేంత పెద్దవాణ్ణి అయితే కాదు.

● నా తర్వాతి మూవీ ‘కల్ట్’ గురించి ఈ నెలాఖర్లో అప్‌డేట్స్ ఇస్తాను. ‘ఫంకీ’ మూవీ షూటింగ్ స్టార్ట్ అవుతుంది. మరో ఐదేళ్ల వరకు డైరెక్షన్ చేయకూడదని అనుకుంటున్నాను. నటుడిగానే చేస్తాను. నేను నాలుగు రాళ్లు వెనకేసుకోవాలి కదా (నవ్వుతూ..).

ఏమైనా చేస్తా సార్!



● విజయ్ దేవరకొండ

‘అలసట లేని భీకర యుద్ధం... అలలుగా పారే ఏరుల రక్తం...’ అంటూ హీరో ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది ‘కింగ్‌డమ్’ మూవీ టీజర్. విజయ్ దేవరకొండ హీరోగా ‘జెర్సీ’ మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రానికి ‘కింగ్‌డమ్’ అనే టైటిల్‌ని ఖరారు చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 30న విడుదల కానుంది. ఈ చిత్రం టైటిల్, టీజర్‌ని రిలీజ్ చేశారు. ‘కింగ్‌డమ్’ టీజర్ తెలుగు వెర్షన్‌కి ఎన్టీఆర్, తమిళ వెర్షన్‌కి సూర్య, హిందీ వెర్షన్‌కి రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ అందించారు. ‘వలస పోయినా అలసిపోయినా ఆగిపోనిది ఈ మహా రణం’, ‘నేలపైన దండయాత్రలు... మట్టి కింద మృతదేహాలు... ఈ అలజడి ఎవరి కోసం’, ‘ఇంత బీభత్సం ఎవరి కోసం.. అసలు ఈ వినాశనం ఎవరి కోసం.. రణ భూమిని చీల్చుకుని పుట్టే కొత్త రాజు కోసం’, ‘కాలచక్రాన్ని బద్దలు కొట్టి పునర్జన్మనెత్తిన నాయకుడి కోసం..’ అంటూ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో విడుదలైన డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ‘ఏమైనా చేస్తా సార్.. అవసరమైతే మొత్తం తగలబెట్టేస్తా సార్’ అంటూ విజయ్ దేవరకొండ చెప్పే డైలాగ్‌తో టీజర్ ముగిసింది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమేరా: జోమోన్ టి. జాన్, గిరీష్ గంగాధరన్.

తల సినిమా సవాల్‌గా అనిపించింది

– ‘అమ్మ’ రాజశేఖర్



● రాగిన్ రాజ్, ‘అమ్మ’ రాజశేఖర్

‘‘జీవితంలో చాలా ఇబ్బందులు పడ్డాను. మా అబ్బాయి రాగిన్‌తో తీసిన ‘తల’ సినిమా నాకు సవాల్‌గా అనిపించింది. శ్రీనివాస్ గౌడ్‌గారి ప్రోత్సాహం జీవితాంతం మరచిపోను. ఆయన లాంటి మంచి వారికోసమైనా ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని డైరెక్టర్ ‘అమ్మ’ రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన తనయుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా అంకిత నాన్సర్ హీరోయిన్‌గా రోహిత్, ఎస్తేర్ నోరోన్హా, ‘సత్యం’ రాజేశ్, రాజీవ్ కనకాల, ఇంద్రజ కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం ‘తల’. ‘అమ్మ’ రాజశేఖర్ దర్శకత్వంలో పి. శ్రీనివాస్ గౌడ్ నిర్మించారు. రాధా రాజశేఖర్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ 14న తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ– ‘‘పాత తరంలో తల తాకట్టుపెట్టి అయినా పిల్లలను ప్రయోజకులను చేయాలంటారు. రాజశేఖర్ మాస్టర్ తల పెట్టి కొడుకును మంచి హీరోని చేశాడు. ఈ మూవీ సూపర్ సక్సెస్ కావాలి’’ అన్నారు. రాగిన్ రాజ్ మాట్లాడుతూ– ‘‘పద్దెనిమిదేళ్ల కుర్రాడు అమ్మ సెంటిమెంట్‌తో ఏ స్థాయికి వెళతాడు? అనేది ‘తల’ ప్రధాన కథాంశం’’ అని చెప్పారు. ‘‘అన్ని రకాల భావోద్వేగాలు ఉన్న ఈ సినిమా అందర్నీ కచ్చితంగా అలరిస్తుంది’’ అని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

నిద్ర చుట్టూ...



● రోష్నీ సాహోతా, ఆనంద్ వర్ధన్

‘‘నేను హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో పెరిగాను. రెండు వందల మందితో కలిసి సినిమా చూడటం అనేది ఒక భావోద్వేగం. ప్రస్తుతం చిన్న సినిమాలకు ప్రేక్షకులు రావడం తగ్గించారు. మీరు ఆదరిస్తేనే మేము మరో అడుగు ముందుకు వేస్తాం. దయచేసి అందరూ థియేటర్స్‌కి వచ్చి ‘నిదురించు జహాపన’ లాంటి చిన్న సినిమాని చూసి, ఆదరించాలి’’ అని ఆనంద్ వర్ధన్ కోరారు. ‘ప్రేమించుకుందాం రా, సూర్యవంశం, మనసంతా నువ్వే’ వంటి పలు హిట్ చిత్రాల్లో నటించిన బాల నటుడు ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం ‘నిదురించు జహాపన’. ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నవమీ గయాక్, రోష్నీ సాహోతా హీరోయిన్లుగా నటించారు. సామ్, వంశీకృష్ణ వర్మ నిర్మించిన ఈ చిత్రం ఈ 14న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో ప్రసన్న కుమార్ దేవరపల్లి మాట్లాడుతూ– ‘‘ఈ సినిమా కథ మొత్తం నిద్ర చుట్టూ ఉంటుంది’’ అన్నారు. ‘‘మా సినిమా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది’’ అని సామ్, వంశీకృష్ణ వర్మ తెలిపారు. ‘‘ఇది చాలా వైవిధ్యమైన చిత్రం’’ అని మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ చెప్పారు.

వాస్తవ ఘటనలతో...



● సత్య యాదు, ఆరాధ్యా దేవి

ఆరాధ్యా దేవి, సత్య యాదు జంటగా గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘శారీ’. ఆర్‌జీవీ డెన్ ప్రొడక్ట్ ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీపై వ్యాపారవేత్త రవిశంకర్ వర్మ నిర్మించారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ నెల 28న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్‌ని బుధవారం విడుదల చేశారు. దర్శక–నిర్మాత రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ‘‘సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకుని, వాళ్ల నేపథ్యం తెలియకుండా నమ్మేయడంతో ఎదురయ్యే ప్రమాదాలు, భయంకర సంఘటనలు మనం చాలా చాలా విన్నాం... చూశాం. అలాంటి నిజ జీవిత ఘటనల ఆధారంగా తీసిన సినిమా ఈ ‘శారీ’’ అన్నారు. రవిశంకర్ వర్మ మాట్లాడుతూ – ‘‘సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘శారీ’’ అన్నారు.

తకిట తదిమి...



● ప్రియ, ఆదిత్య

ఘన ఆదిత్య, ప్రియ జంటగా రాజ్ లోహిత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘తకిట తదిమి తందాన’. చందన్ కుమార్ కొప్పుల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విడుదల చేసి, ‘‘మంచి కంటెంట్ ఉన్న ఫీల్‌గుడ్ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి’’ అని అన్నారు. ‘‘సినెటేరియా మీడియా వర్క్స్ వెంకట్ బులెమోని ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు’’ అని చందన్‌కుమార్ తెలిపారు

స్వచ్ఛమైన వినోదంతో...



● మహేశ్ చింతల, శంకర్ చేగూరి, విద్యాసాగర్

మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం ‘బద్మాషులు’. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, సి. రామశంకర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన నటుడు రాగ్ మయూర్ మాట్లాడుతూ– ‘‘బద్మాషులు’ టీజర్ చాలా ఆర్గానిక్‌గా ఉంది. స్వచ్ఛమైన వినోదంతో రూపొందుతోన్న ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలి’’ అన్నారు. శంకర్ చేగూరి మాట్లాడుతూ– ‘‘టీజర్ జస్ట్ ఒక ఫ్లేవర్ మాత్రమే. సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది’’ అని చెప్పారు. ‘‘ఈ సినిమాలో లీడ్ రోల్ చేసే చాన్స్ ఇచ్చిన శంకర్‌గారికి కృతజ్ఞతలు. మా చిత్రాన్ని అందరూ సపోర్ట్ చేయాలి’’ అన్నారు మహేశ్ చింతల. ‘‘ఈ చిత్రంలో ఆరోగ్యకరమైన వినోదం పండించాం. తప్పకుండా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు’’ అని విద్యాసాగర్ కారంపురి తెలిపారు. ‘‘నాకు ఈ మూవీ చేసే చాన్స్ ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్’’ అని కెమేరామేన్ వినీత్ పబ్బతి చెప్పారు.

సాక్షి బిజినెస్

గురువారం
13-2-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
123	27
76,171	23,045

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,586	▽	58
డోజోన్స్	44,143	▽	450
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,808	△	31
డాక్స్	22,132	△	105
షాంఘై	3,304	△	86
నికాయ్	38,787	▽	280

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	84,845	▽	636
బంగారం (99.5 స్వచ్ఛత)	84,505	▽	634
వెండి (కిలో)	94,189	▽	19

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		85.06	88.74
£	బ్రిటన్ పౌండ్		105.18	110.16
€	యూరో		87.57	92.07
¥	జపాన్ ఎన్ (100)		45.00	67.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్		51.81	56.72
S$	సింగపూర్ డాలర్		61.69	66.39
SAR	సౌదీ రియాల్		22.27	23.83
UAE D	యూఏఈ దిర్హామ్		22.77	24.55
¥	చైనా యువాన్		11.01	12.83



కార్పొరేట్లకు రెడ్ కార్పెట్

- కంపెనీలకు విమానయాన సంస్థల స్పెషల్ ఆఫర్లు
- కొత్త సర్వీసులు, ఫీచర్లు అందుబాటులోకి
- ఎస్‌ఎంఈల కోసం ఎయిరిండియా ప్రత్యేక పోర్టల్
- ఇండిగో కూడా బిజినెస్ క్లాస్ విభాగంలోకి ఎంట్రీ
- ట్రావెల్ ఏజెంట్లకు ఎయిర్ మారిషస్ ప్రోత్సాహకాలు

ప్రపంచంలోనే అతి పెద్ద విమానయాన మార్కెట్లలో భారత్‌ది మూడో స్థానం. పదేళ్ల వ్యవధిలో (2024 ఏప్రిల్ నాటికి) సీటింగ్ సామర్థ్యం 79 లక్షల నుంచి 1.55 కోట్లకు పెరిగింది. విమానయానం మరింతగా వృద్ధి చెందుతున్న అంచనాల మధ్య వేల కొద్దీ విమానాలకు ఆర్డర్లిచ్చిన ఎయిరిండియా, ఇండిగో లాంటి దిగ్గజాలు.. గణనీయంగా పెరుగుతున్న కార్పొరేట్ ప్రయాణికులపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాయి. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ నివేదిక ప్రకారం 2023 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా కార్పొరేట్ ట్రావెల్ మార్కెట్ (హోటళ్లు, విమానయాన సంస్థలు, రైళ్లు, క్యాబ్‌లు కలిపి) దాదాపు 10.6 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో ఎయిర్‌లైన్స్ మార్కెట్ వాటా 53 శాతంగా (5.6 బిలియన్ డాలర్లు) ఉంది. కార్పొరేట్ల ప్రయాణాలు మరింతగా పెరుగుతాయన్న అంచనాల నేపథ్యంలో విమానయాన సంస్థలు కూడా ఈ విభాగంపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. ప్రత్యేక ఆఫర్లతో కార్పొరేట్, సంపన్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు దేశ విదేశ ఎయిర్‌లైన్స్ పోటీపడుతున్నాయి. ఈ క్రమంలోనే చిన్న, మధ్య తరహా సంస్థలపై (ఎస్‌ఎంఈ) ఎయిరిండియా దృష్టి సారించింది. సాధారణంగా మార్కెటింగ్‌పరంగా వాటిని చేరుకోవడం కొంత కష్టతరం కావడంతో, అవే నేరుగా బుకింగ్ చేసుకునేందుకు వీలు కల్పిస్తూ విడిగా పోర్టల్ ఏర్పాటు చేసింది. దీని ద్వారా బుక్ చేసుకుంటే ఆకర్షణీయమైన చార్జీలను కూడా ఆఫర్ చేస్తోంది. దీంతో పాటు విస్తారా ను విలీనం చేసుకున్న తర్వాత కార్పొరేట్ బిజినెస్ పెంచుకునేందుకు ఎయిరిండియాకు ఉపయోగపడుతున్నాయి. గత కొన్నాళ్లుగా కంపెనీ సుమారు 1,700 పైచిలుకు కార్పొరేట్ క్లయింట్లను దక్కించుకుంది. మరోవైపు బడ్జెట్ విమానయాన సంస్థగా పేరొందిన ఇండిగో కూడా కార్పొరేట్ క్లయింట్లను ఆకట్టుకునేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కొన్ని కీలక రూట్లలో బిజినెస్ క్లాస్‌ను ప్రవేశపెడుతోంది. గతేడాది నవంబర్‌లో ప్రారంభించిన ఈ కొత్త సర్వీసులకు మంచి స్పందన రావడంతో ఢిల్లీ–చెన్నై రూట్లో కూడా ఈ కేటగిరీని ప్రవేశపెట్టడంపై కసరత్తు చేస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. 2025 ఆఖరు నాటికి 45 విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లు ఉంటాయని కంపెనీ సీఈవో పీటర్స్ ఎల్బర్స్ పేర్కొన్నారు. 2025 జూన్ నాటికే ఇలాంటి 94 విమానాలను సమకూర్చుకోవాలని ఎయిరిండియా లక్ష్యంగా పెట్టుకుంది.

అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ కూడా..

ఆర్థిక పరిస్థితులపై సానుకూల దృక్పథంతో ప్రయాణాలు మరింతగా పుంజుకుంటాయన్న అంచనాల నేపథ్యంలో బిజినెస్ క్లాస్‌లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ కూడా పోటీపడుతున్నాయి. మలేసియా ఎయిర్‌లైన్స్ కొన్నాళ్ల క్రితమే తమ కార్పొరేట్ ట్రావెల్ ప్రోడక్ట్‌ను సరికొత్తగా తీర్చిదిద్దింది. అప్‌గ్రేడేషన్, అదనపు బ్యాగేజ్ అలవెన్స్ మొదలైన వాటికి రివార్డు పాయింట్లను అందించడంతో పాటు వాటిని రిడీమ్ కూడా చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. అలాగే ఎస్‌ఎంఈలకు ప్రత్యేక చార్జీలు, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన తోడ్పాటు అందిస్తోంది. తమ దేశంలో సమావేశాలు, కాన్ఫరెన్సులు, ఈవెంట్లను నిర్వహించుకునేందుకు క్లయింట్లను ప్రోత్సహించేలా ట్రావెల్ ఏజెంట్లకు ఎయిర్ మారిషస్ ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఈ స్కీము కింద గ్రూప్ సైజు, ప్రయాణించిన ప్యాసింజర్లను బట్టి ఒక్కొక్కరి మీద రూ. 500–1,000 వరకు కమీషన్లు ఇస్తోంది. అజర్‌బైజాన్, జార్జియా, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ తదితర ప్రాంతాలకు డైరెక్ట్ కనెక్టివిటీ పెరగడంతో, ఆయా దేశాలకు ప్రయాణం చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోందని థామస్ కుక్ ఇండియా వర్గాలు తెలిపాయి. థామస్ కుక్ ఇండియాకి సంబంధించి బిజినెస్ ట్రావెల్ సెగ్మెంట్ వార్షికంగా సుమారు 13 శాతం పెరిగింది. సేల్స్ టీమ్ పటిష్టం కావడం, నెట్‌వర్క్ విస్తరించడం వంటి అంశాలు

ప్రత్యేక సదుపాయాలు..

బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు లగ్జరీ అనుభూతిని అందించేందుకు విమానయాన సంస్థలు పోటీపడుతున్నాయి. ఇండిగోలో సీట్ల వరుసల మధ్య స్థలం 38 అంగుళాలుగా ఉంటే, ఎయిరిండియాకు 40 అంగుళాల స్థాయిలో ఉంటోంది. ఇండిగో సీట్లు అయిదు అంగుళాల మేర రిక్లైన్ అయితే, ఎయిరిండియావి 7 అంగుళాల వరకు రిక్లైన్ అవుతాయి. ఇక రెండు ఎయిర్‌లైన్స్ చెకిన్, బోర్డింగ్, బ్యాగేజ్ హ్యాండ్లింగ్ విషయాల్లో బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఆరో రోజూ నష్టాలే

- ఆయిల్, ఐటీ షేర్లలో అమ్మకాలు
- సెన్సెక్స్ నష్టం 123 పాయింట్లు




ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో స్టాక్ సూచీలకు ఆరోరోజూ నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 123 పాయింట్లు కోల్పోయి 76,171 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27 పాయింట్లు పతనమై 23,045 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. జాతీయ అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల ప్రభావంతో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 905 పాయింట్లు కోల్పోయి 75,388 వద్ద, నిఫ్టీ 274 పాయింట్లు నష్టపోయి 22,798 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. మిడ్ సెషన్‌లో ఫైనాన్స్, మెటల్ షేర్లకు కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో రికవరై లాభాల బాటపట్టాయి. అయితే చివర్లో ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ షేర్లలో మరోసారి అమ్మకాలతో స్వల్ప నష్టాల్లో ముగిశాయి. రూపాయి 3 రోజుల ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. డాలర్ మారకంలో 16 పైసలు బలహీనపడి 86.95 వద్ద స్థిరపడింది. అమెరికా కరెన్సీ బలపడటం, దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు రూపాయి బలహీనతకు కారణమయ్యాయి.

- మార్కెట్ పతనాలతో 6 రోజుల్లో రూ.18.04 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. దీంతో బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.407.46 లక్షల కోట్ల(4.69 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది.

కొత్త పన్ను చట్టం.. ఎంతో సులభతరం!

- నేడే లోక్‌సభకు సమర్పణ
- నిరుపయోగ నిబంధనలకు గుడ్‌బై
- అర్థం కాని పదబంధాలకు స్వస్తి
- 622 పేజీలకు కుదింపు



న్యూఢిల్లీ: అర్థం చేసుకునేందుకు, ఆచరణకు సులభతరంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న కొత్త ఆదాయపన్ను బిల్లును (ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు, 2025) ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభకు సమర్పించనున్నట్టు సమాచారం. ఇందులో ఎలాంటి కొత్త పన్నుల్లేవు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఇతరులకు సంబంధించిన ఆదాయపన్ను ముసాయిదా చట్టం ఇది. చిన్న వ్యాక్యాలతో, చదివేందుకు వీలుగా, టేబుళ్లు, ఫార్ములాలతో ఉంటుంది. ఆదాయపన్ను చట్టం, 1961 స్థానంలో తీసుకువస్తున్న ఈ నూతన బిల్లు స్టాండింగ్ కమిటీ పరిశీలన, పార్లమెంట్ ఆమోదం అనంతరం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ''1961 నాటి ఆదాయపన్ను చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి ఎన్నో సవరణలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రాథమిక నిర్మాణమే మారిపోయింది. భాష సంక్లిష్టంగా ఉండడంతో, నిబంధనల అమలు విషయంలో పన్ను చెల్లింపుదారులపై వ్యయ భారం పెరిగింది. ఇది పన్ను యంత్రాంగం సమర్థతపైనా ప్రభావం చూపిస్తోంది'' అని కొత్త బిల్లు తీసుకురావడానికి గల కారణాలను ప్రభుత్వం వివరించింది.

బిల్లులోని అంశాలు..

ట్యాక్స్ ఇయర్: గడిచిన ఆర్థిక సంవత్సరానికి (పీవై) రిటర్నులు దాఖలు చేసే సంవత్సరాన్ని అసెస్‌మెంట్ సంవత్సరంగా (ఏవై) ప్రస్తుతం పిలుస్తున్నారు. ఇకపై పీవై, ఏవై పదాలు ఉండవు. వీటి స్థానంలో ఏప్రిల్ 1 నుంచి 12 నెలల కాలాన్ని (ఆర్థిక సంవత్సరాన్ని) 'ట్యాక్స్ ఇయర్'గా సంభాషిస్తారు. ప్రస్తుత చట్టం ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ఆదాయానికి 2024–25 అసెస్‌మెంట్ సంవత్సరం అవుతుంది.

సైజు కుదింపు: 1961 నాటి చట్టం 880 పేజీలు, 298 సెక్షన్లు, 23 చాప్టర్లు, 14 షెడ్యూళ్లతో ఉంది. కొత్త బిల్లును 622 పేజీలకు కుదించారు. అదే సమయంలో సెక్షన్లను 526కు, షెడ్యూళ్లను 16కు పెంచారు. చాప్టర్లు 23గానే ఉన్నాయి.

టేబుళ్ల రూపంలో: టీడీఎస్, ప్రిజంప్టివ్ ట్యాక్స్, వేతనాలు, మినహాయింపులకు సులభంగా అర్థం చేసుకునేందుకు టేబుళ్లను ఇచ్చారు. టీడీఎస్ సెక్షన్లు అన్నింటికీ ఒకే క్లాజు కిందకు తీసుకొస్తూ అర్థం చేసుకునేందుకు సులభమైన టేబుళ్ల రూపంలో ఇచ్చినట్టు నాంజియా ఆండర్సన్ ఎల్ఎల్‌పీ ఎంఅండ్ఏ ట్యాక్స్ పార్ట్‌నర్ సందీప్ ఝున్‌ఝున్‌వాలా తెలిపారు.

- వేతనాల నుంచి స్టాండర్డ్ డిడక్షన్, గ్రాట్యుటీ, ఎల్‌టీసీ తదితర తగ్గింపులన్నింటినీ వేర్వేరు సెక్షన్ల కింద కాకుండా ఒకే చోట ఇచ్చారు.
- 'నాత్ విత్ స్టాండింగ్' (అయినప్పటికీ) అన్న పదం ప్రస్తుత చట్టంలో చాలా సందర్భాల్లో కనిపిస్తుంది. దీని స్థానంలో ఇర్రెస్పెక్టివ్ (సంబంధం లేకుండా) ప్రవేశపెట్టారు. ఇలా అనవసర పదాలు తొలగించారు.
- ఎంప్లాయీస్ స్టాక్ ఆప్షన్లకు (ఈసాప్) సంబంధించి పన్నులో స్పష్టత తీసుకొచ్చారు.
- పన్ను చెల్లింపుదారుల చాప్టర్‌లో.. పన్ను చెల్లింపుదారుల హక్కులు, బాధ్యతలను వివరంగా పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఈక్విటీల్లోకి రిటైలర్ల నుంచి రూ.39,688 కోట్లు	ఓఎన్‌జీసీఎల్ చేతికి అయానా రెన్యూవబుల్

దిగొస్తున్న ధరలు

జనవరిలో 4.3 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. కూరగాయలు, గుడ్లు, పప్పు ధాన్యాల ధరల క్షీణతతో జనవరిలో మరికాస్త తగ్గి 4.31 శాతానికి పరిమితమైంది. ఇది అయిదు నెలల కనిష్టం. చివరిసారిగా 2024 ఆగస్టులో ఇది 3.65 శాతంగా నమోదైంది. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం గతేడాది జనవరిలో 5.1 శాతంగాను, డిసెంబర్‌లో 5.22 శాతంగాను ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం జనవరిలో ఆహార పదార్థాల బాస్కెట్ ద్రవ్యోల్బణం 6.02 శాతంగా ఉంది. గత ఆగస్టులో నమోదైన 5.66 శాతం తర్వాత ఇది కనిష్టం. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్, ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గినట్లు ఎన్‌ఎస్‌వో తెలిపింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండటంతో ఆర్‌బీఐ త్వరలో మరోసారి కీలక వడ్డీ రేట్లను మరో పావు శాతం తగ్గించే అవకాశాలు ఉన్నాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎఫ్‌డీడీఐలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) దేశవ్యాప్తంగా 12 క్యాంపస్‌లలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఆలిండియా సెలక్షన్ టెస్ట్–2025 (ఏఐఎస్‌టీ–2025)లో సాధించిన స్కోరు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

- **ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లు:** నోయిడా, కోల్‌కతా, రోహతక్, ఫుర్సత్‌గంజ్, జోధ్‌పూర్, చెన్నై, ఛింద్వారా, చండీగఢ్, గుణ, అంక్లేశ్వర్, హైదరాబాద్, పాట్నా.
- **మొత్తం సీట్ల సంఖ్య:** 2,390.

కోర్సుల వివరాలు:

- **బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఎస్): బీడీఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్ –ప్రొడక్షన్), బీడీఈఎస్(ఫ్యాషన్ డిజైన్), బీడీఈఎస్(లెదర్, లైఫ్ స్టైల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్).
- **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు(8 సెమిస్టర్లు).
- **బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ):** బీబీఏ(రిటైల్–ఫ్యాషన్ మర్చండైజ్)
- **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు(8 సెమిస్టర్లు).
- **మాస్టర్ డిగ్రీ కోర్సులు:** మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఎండీఎస్): ఎం.డిఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్–ప్రొడక్షన్), ఎం.డిఈఎస్(ఫ్యాషన్ డిజైన్); కోర్సు వ్యవధి: రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
- **మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ):** ఎంబీఏ(రిటైల్–ఫ్యాషన్ మర్చండైజ్)
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. 10+2, మాస్టర్ డిగ్రీ కోర్సులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు 25 ఏళ్లు మించకూడదు. పీజీ కోర్సులకు వయసు లేదు.
- **ఎంపిక విధానం:** ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్ (ఏఐఎస్‌టీ–2025) ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2025
- **ఏఐఎస్‌టీ ప్రవేశ పరీక్ష తేది:** 11.05.2025.
- **వెబ్‌సైట్:** https://www.fddiindia.com

బెల్ బెంగళూరులో 137 ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. తాత్కాలిక ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్–1, ప్రాజెక్ట్ ఇంజనీర్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 137.
- **పోస్టుల వివరాలు:** ట్రైనీ ఇంజనీర్1–67, ప్రాజెక్ట్ ఇంజనీర్1–70.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** ట్రైనీ ఇంజనీర్ పోస్టుకు 28 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుకు 32ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు ట్రైనీ ఇంజనీర్‌కు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.35,000, మూడో ఏడాది రూ.40,000, ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు మొదటి ఏడాది రూ.40,000, రెండో ఏడాది రూ.45,000, మూడో ఏడాది రూ.50,000, నాలుగో ఏడాది రూ.55,000.
- **ఎంపిక విధానం:** ట్రైనీ ఇంజనీర్ పోస్టులకు రాత పరీక్ష, షార్ట్‌లిస్టింగ్ ద్వారా ఎంపికచేస్తారు. ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ జనరల్ మేనేజర్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ప్రొఫెసర్ యూఆర్ రావు రోడ్, నాగాలాండ్ సర్కిల్ దగ్గర, జలహళ్లి పోస్టు, బెంగళూరు–560013, కర్ణాటక చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.02.2025.
- **వెబ్‌సైట్:** https://bel-india.in

మెయిన్స్‌లో మెరవాలంటే!

- మే 3 నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్ ఎగ్జామ్స్
- పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష
- సబ్జెక్ట్‌పై పట్టు, సమకాలీన పరిజ్ఞానంతో విజయం

81 ఏపీపీఎస్సీ గ్రూప్–1 మొత్తం పోస్టులు.	**91,163** గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు హాజరైనవారి సంఖ్య.
4,496 ప్రిలిమ్స్‌లో విజయం సాధించి మెయిన్స్‌కు అర్హత పొందిన వారు.	

అంటే.. వేలల్లో పోటీ ఉన్న ప్రిలిమ్స్‌లో విజయం సాధించి, 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు.. ఇందులో సత్తా చాటితేనే తదుపరి దశ ఇంటర్వ్యూకు అర్హత లభిస్తుంది.



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అత్యున్నత పోటీ పరీక్ష.. గ్రూప్ 1. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, సీటీఓ వంటి ఉన్నతమైన పోస్ట్‌ల్లో కొలువుదీరొచ్చు. మూడంచెల గ్రూప్–1 ఎంపిక ప్రక్రియలో.. అత్యంత కీలకమైనది రెండో దశ మెయిన్!! ఇటీవల ఏపీపీఎస్సీ గ్రూప్–1(2023) మెయిన్ పరీక్ష తేదీల షెడ్యూల్‌ను ప్రకటించింది. మే 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ.. పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో మెయిన్స్ పరీక్షలో రాణించడానికి అనుసరించాల్సిన ప్రిపరేషన్ వ్యూహాలు..

మే 3 నుంచి పరీక్షలు

ఏపీపీఎస్సీ తాజా ప్రకటన ప్రకారం– మే 3వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు మెయిన్ పరీక్షలను నిర్వహించనున్నారు. అంటే ఇప్పటి నుంచి అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయం దాదాపు రెండున్నర నెలలు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసే ఇంటర్వ్యూ దశకు చేరుకునే అవకాశం లభిస్తుంది.

అయిదు పేపర్లలో స్కోరే కీలకం

గ్రూప్–1 మెయిన్స్‌ను మొత్తం ఏడు పేపర్లుగా నిర్వహించనున్నారు. ఇందులో తొలి రెండు పేపర్లు (తెలుగు లాంగ్వేజ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్) అర్హత పేపర్లు మాత్రమే. వీటిలో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధిస్తేనే పేపర్–1 నుంచి పేపర్–5 వరకు మూల్యాంకన చేస్తారు. లాంగ్వేజ్ పేపర్లలో ఓసీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు సాధించాలి.

పేపర్–1 జనరల్ ఎస్సే

ఈ పేపర్‌లో సమకాలీన అంశాలపై మూడు వ్యాసాలు రాయాల్సి ఉంటుంది. ఇందులో రాణించాలంటే.. అభ్యర్థులు తాజా పరిణామాలపై పూర్తి స్థాయి అవగాహనతోపాటు విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. నిర్దిష్ట సమయంలో సంబంధిత అన్ని అంశాలు ఎస్సేలో పొందుపరిచేలా ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, లక్షిత వర్గాలు తదితర వివరాలను ఔపోసన పట్టాలి. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో ప్రవేశ పెట్టిన ఇతర ఆర్థిక విధానాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం.. ఇజ్రాయెల్– హమాస్ ఘర్షణలు.. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికతోపాటు జీ 20, జీ 7, బ్రిక్స్ వంటి ముఖ్య సదస్సులను అధ్యయనం చేయాలి. జాతీయ స్థాయిలో తాజా రాజ్యాంగ సవరణలు, బిల్లులు, నూతన జాతీయ విద్యా విధానం, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఒక దేశం–ఒక ఎన్నిక తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఇటీవల కాలంలో కీలకమైన తీర్పుల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.

పేపర్–2 (భారత, ఏపీ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం)

ముందుగా ఏపీ చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. చరిత్రకు సంబంధించి ప్రాచీన ఏపీ చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ.. ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలి. జాతీయోద్యమంలో ఆంధ్రదేశ పాత్ర గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

పేపర్–3 (పాలిటీ, రాజ్యాంగం, పాలన, లా, ఎథిక్స్)

ఇందులో స్కోర్ కోసం రాజ్యాంగం ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాల (రాజ్యాంగ సవరణలు వాటి ప్రభావం) వరకూ తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజా సేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలి. వాస్తవానికి దీనికి సంబంధించి ప్రత్యేక పుస్తకాలు లేనప్పటికీ.. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు కొంత మేలు చేస్తాయి. వీటితోపాటు స్ఫూర్తిదాయక నేతల వివరాలు, వారు పాలించిన తీరు తదితర సమాచారాన్ని సేకరించుకోవాలి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు.. వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా సివిల్ అండ్ క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్ గురించి తెలుసుకోవాలి.

పేపర్–4 (ఎకానమీ, భారతదేశ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి)

ఈ పేపర్ కోసం అభ్యర్థులు ఎకానమీకి సంబంధించి మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటి ద్వారా లబ్ధి చేకూరే వర్గాలు, అదే విధంగా జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తాజాగా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పెంచుకోవాలి.

పేపర్–5 (సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.

రోజు వారీ ప్రణాళిక

అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో పేపర్ వారీగా రోజు వారీ ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రతి రోజు అన్ని పేపర్లను చదివే విధంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రతి పేపర్‌కు సగటున రెండున్నర గంటల సమయం కేటాయించేలా చూసుకోవాలి. తమకు సులభం అనిపించే పేపర్లకు కొంత తక్కువ సమయం కేటాయించి, మిగతా సమయాన్ని క్లిష్టంగా భావించే పేపర్లకు కేటాయించాలి.

పునశ్చరణకే అధిక ప్రాధాన్యం

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు పునశ్చరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటికే పట్టు సాధించిన అంశాలపై మరింత అవగాహన పొందేందుకు కృషి చేయాలి. పరీక్షకు ముందు వారం రోజుల నుంచి అభ్యర్థులు పుస్తకాల జోలికి వెళ్లకుండా రెడీ రెకనర్స్‌ను వినియోగించి ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో రాసుకున్న సొంత నోట్స్ మేలు చేస్తుంది.

రైటింగ్ ప్రాక్టీస్

మెయిన్స్ పరీక్షల్లో రాణించేందుకు రైటింగ్ ప్రాక్టీస్ తప్పనిసరని గుర్తించాలి. ప్రతి రోజు తాము చదివిన టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం రాయడం అలవర్చుకోవాలి. అదే విధంగా పరీక్ష హాల్లో ప్రతి ప్రశ్నకు సగటున లభించే సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ.. వేగంగా రాయడం ప్రాక్టీస్ చేయాలి. ఆ తర్వాత వాటిని మూల్యాంకన చేసుకుని అన్ని పాయింట్లు రాశామా? లేదా? అని తెలుసుకోవాలి.

స్పష్టత ముఖ్యం

మెయిన్స్ సమాధానాల్లో భావ వ్యక్తీకరణ కీలకంగా మారుతుంది. అదే విధంగా సంబంధిత అంశంపై సూటిగా, స్పష్టంగా సమాధానమిచ్చే నేర్పు అవసరం. అభ్యర్థులు నమూనా ప్రశ్నలను సాధన చేయాలి. సమాధానాలు రాసేటప్పుడు ముఖ్యమైన అంశాలు హైలెట్ అయ్యేలా చూసుకోవాలి. దీంతోపాటు ప్రశ్నను ఏ ఉద్దేశంతో అడిగారో గ్రహించి.. దానికి అనుగుణంగా సమాధానం ఇచ్చేందుకు సిద్ధం కావాలి.

ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నలు

ఈసారి మెయిన్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నలను ఆన్‌లైన్‌లో అప్పటికప్పుడు (పరీక్ష సమయానికి) ఇవ్వాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది. అభ్యర్థులకు ట్యాబ్‌లను కూడా అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఈ ట్యాబ్ ఆధారిత.. ఆన్‌లైన్ ప్రశ్న పత్రాలు, సమాధానాలు ఇచ్చే విషయంలో నమూనాను కూడా ఏపీపీఎస్సీ అందుబాటులోకి తెచ్చింది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– కంప్యూటర్ అవేర్‌నెస్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

‘చెప్పు’కోలేని బాధలు

సైదాపూర్ (హుజూరాబాద్): యూరియా తదితర ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్దకు రైతులు బుధవారం ఉదయమే చేరుకున్నారు. ప్రస్తుతం యాసంగి నేపథ్యంలో ఉదయం 7 నుంచి 8 గంటల సమయంలో ఎరువులు తీసుకెళ్తుంటారు. కానీ ఆ సమయంలో గేటు తీయకపోవడంతో.. గోడపై నుంచి లోపలికి దూకి చెప్పులను క్యూలో పెట్టారు. గోడపై ఉదయం 10 గంటల వరకు కూర్చుని నిరీక్షించారు. అధికారులు ఎరువుల కొరత తీర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.



ఎరువుల కోసం క్యూలో చెప్పులు పెట్టిన రైతులు


పీఏసీఎస్ గేటు తీయకపోవడంతో కాంపౌండ్ వాల్‌పై నిరీక్షిస్తున్న రైతులు

ఊరంతా ఉద్యోగులే

అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు పలు హోదాల్లో ఉద్యోగాలు

- ప్రతి ఇంట్లో ఓ ప్రభుత్వ ఉద్యోగి.. ప్రైవేట్ రంగంలోనూ రాణిస్తున్న వైనం
- స్వాతంత్య్రం రాక ముందు నుంచే ఆ గ్రామంలో పలువురు విద్యావంతులు
- ఒకప్పుడు మారుమూల తండా.. నేడు పట్టణాన్ని తలపించేలా ఎదిగిన తీరు
- ఆదర్శంగా నిలుస్తున్న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండధర్మారం


స్వాతంత్య్ర సమరయోధుడు, బడిపంతులు గుగులోతు వెంకన్ననాయక్ (ఫైల్)


ట్రైఫెడ్ అసిస్టెంట్ మేనేజర్‌గా ఇటీవల రిటైర్డ్ అయిన కోబల్ సింగ్


తండధర్మారం గ్రామ వ్యూ..



తండధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయం

మరిపెడ రూరల్: ఒకప్పుడు మారుమూల గిరిజన తండా.. ఆపై సౌకర్యాల లేమి. అయితేనేం సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఉన్నత చదువులు చదివారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇంటికొకరు ప్రభుత్వ కొలువుల్లో ఉన్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు అన్ని హోదాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఆ గ్రామంలో ఉన్నారు. చిన్న, సన్నకారు రైతులు కష్టపడి తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించి ప్రభుత్వ కొలువుల్లో స్థిరపడేలా చేశారు. మరికొందరు ప్రైవేట్ రంగాల్లోనూ రాణిస్తున్నారు. ఇంతకీ ఆ గ్రామం ఏంటి అనుకుంటున్నారా.. అదే మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండధర్మారం.

పట్టణాన్ని తలపించేలా..

మారుమూల తండా అయిన తండధర్మారం.. నేడు పట్టణాన్ని తలపిస్తోంది. అన్నీ డాబాలు, రెండు, మూడు బహుళ అంతస్తుల భవనాలున్నాయి. తాత ముత్తాతల నుంచి గ్రామంలో వ్యవసాయమే ప్రధాన ఆధారంగా కుటుంబాలు జీవిస్తుండేవి. ఊరి పేరులో తండా అని ఉన్నప్పటికీ అక్కడ అన్ని వర్గాల కుటుంబాలు నివసిస్తున్నారు. గ్రామంలో 267 గృహాలు, 1,160 మంది జనాభా ఉన్నారు. కానీ ఇప్పుడు ప్రతి ఇంట్లో ప్రభుత్వ కొలువుతో ఆ పల్లె విలసిల్లుతోంది. తామేమీ తక్కువ కాదంటూ ఒకరికంటే ఒకరు పోటీ పడి ఉన్నత చదువులు చదువుతూ ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నారు. పూర్వ కాలంలోనే ఈ గ్రామంలో బడి పంతుళ్లు, పోలీస్ పటేల్‌గా కొలువు దీరారు. వివిధ ప్రాంతాల్లో కొలువు దీరిన ఉద్యోగులంతా సంక్రాంతి పండుగకు స్వగ్రామంలో కలుసుకొని గ్రామంలోని మహిళలు, యువతకు వివిధ పోటీలు నిర్వహిస్తుంటారు.

100 మందికిపైగా ప్రభుత్వోద్యోగులు

గ్రామంలో 10, 15 ప్రభుత్వ కొలువులు ఉంటేనే గొప్ప. అలాంటిది తండధర్మారంలో 100 మందికి పైగా ప్రభుత్వ కొలువుల్లో స్థిరపడ్డారంటే మామూలు విషయం కాదు. గ్రామానికి చెందిన గుగులోతు రవినాయక్ (ఐఏఎస్) తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) మెంబర్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా కొనసాగారు. అలాగే గుగులోతు వసంత్‌నాయక్ ఆర్ అండ్ బీ ఎస్సీగా విధులు నిర్వహిస్తున్నారు. గుగులోతు సుమలత ఇటీవల ఆర్టీఏ కొలువు సాధించి ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు, ఫారెస్ట్, ఎక్సైజ్, పోలీస్ ఇలా అన్ని శాఖల్లోనూ కొలువై ఉన్నారు.

స్వాతంత్య్రం రాకముందే..

స్వాతంత్య్రం రాక ముందే గ్రామంలో పదుల సంఖ్యలో విద్యావంతులున్నారు. ఈ క్రమంలోనే గ్రామంలోని గుగులోతు సక్రునాయక్ మొదటి బడి పంతులుగా కొలువుదీరినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే హన్మంతునాయక్, స్వాతంత్య్ర సమరయోధుడు వెంకన్ననాయక్, గుగులోతు భగ్గునాయక్ తర్వాత బడిపంతులుగా నియమితులయ్యారు. గుగులోతు సిరినాయక్ అనే వ్యక్తి పోలీస్ పటేల్‌గా విధులు నిర్వహించారు. వీరిని ఆదర్శంగా తీసుకునే గ్రామంలోని రైతులు, కూలీలు కష్టపడి పిల్లలను ఉన్నత చదువులు చదివించారు.


గామంలోని సంక్రాంతి ముగ్గుల పోటీలో కలెక్టర్ హోదాలో బహుమతులు ప్రదానం చేస్తున్న రవి నాయక్, ఇతర ఉద్యోగులు (ఫైల్)


గ్రామంలోని ఐఏఎస్ గుగులోతు రవినాయక్ స్వగృహం

ఏపీ నుంచి వచ్చిన ఉద్యోగులకు పోస్టింగులు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రిపోర్ట్ చేసిన 44 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు పలు శాఖల్లో పోస్టింగులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఆగస్టులో తెలంగాణ ప్రభుత్వానికి రిపోర్ట్ చేసిన ఈ 44 మందిని సర్కిల్స్ సిబ్బందిగా నోటిఫై చేసింది. వారిని పలు శాఖల్లో నియమిస్తూ ఆర్థిక శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు గతంలో ఏపీలో పనిచేసిన ప్రభుత్వ శాఖల్లోనే తెలంగాణలోనూ పోస్టింగులు ఇచ్చారు. వారి సీనియారిటీని కూడా నిర్ధారించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వంలో ఆయా శాఖల్లో వారివారి హోదాల్లో పనిచేస్తున్న వారి కంటే చివరి స్థానంలో వీరి సీనియారిటీ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా వీరి అంతర్గత సీనియారిటీ వారి ఒరిజినల్ సీనియారిటీ ప్రకారం వర్తిస్తుందని తెలిపారు. ఈ 44 మంది ఉద్యోగుల్లో ఆఫీస్ సూపరింటెండెంట్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరిని రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, నీటిపారుదల, హోం, పశు సంవర్ధక తదితర శాఖలకు పంపారు. వీరిని వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారు.

వనపర్తి జిల్లాకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ టవర్

రూ.22 కోట్లు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: వనపర్తి జిల్లాలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ టవర్ నిర్మాణానికి రూ.22 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆయన బుధవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఐటీ రావడం వల్ల.. అక్కడ సామాజిక, ఆర్థికాభివృద్ధితో పాటు యువత ఉపాధికి అవకాశం ఉంటుందన్నారు. ఐటీ టవర్ నిర్మాణం వనపర్తి జిల్లాకు శుభవార్తని పేర్కొన్నారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల.. ఐటీ టవర్ మంజూరైందని చిన్నారెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్, మంత్రి దామోదర చిత్రపటాలకు పాలాభిషేకం

కృతజ్ఞతలు తెలిపిన మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణను అమలు చేయడానికి శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అందుకు కృషి చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం చేశారు. మాదిగ, మాదిగ అనుబంధ కులాలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ ఫలాలు అందేటట్లు సుప్రీంకోర్టులో కేసు వేసి దేశంలోనే అణగారిన వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందేటట్లు చేసిన దవీందర్‌సింగ్‌కి, సుప్రీంకోర్టు ధర్మాసనానికి, ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీం అక్తర్‌లకు ఈ సందర్భంగా ఐక్యవేదిక కృతజ్ఞతలు తెలిపింది. మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక చైర్మన్ మేడి పాపయ్య నేతృత్వంలో రాష్ట్ర కోఆర్డినేటర్ చింత స్వామి మాదిగ, ముంజగల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ఏ కులానికి, ఏ వర్గానికి వ్యతిరేకం కాదన్నారు. సామాజిక అసమానతలు తగ్గించి రిజర్వేషన్ ఫలాలను అందరికీ చేరేలా ఎస్సీ కులాల పెద్దలు పెద్దన్న పాత్ర పోషించాలని, ఎవరూ అడ్డు తగిలే విధంగా ప్రకటనలు చేయవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఆలయాల అభివృద్ధికి నిధులివ్వండి

కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఎంపీ అరుణ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు బీజేపీ ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అలంపూర్‌లో అయిదో శక్తి పీఠంగా కొలువుదీరిన జోగులాంబ ఆలయం, కురుమూర్తి, మన్నెంకొండ, మల్దకల్ తిమ్మప్ప దేవాలయాల ప్రాధాన్యం, ప్రాశస్త్యం గురించి కేంద్రమంత్రికి వివరించారు. ఈ ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘ప్రసాద్’ పథకం కింద నిధులు ఇవ్వాలని కోరారు. తన విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని డీకే అరుణ వెల్లడించారు.

సంకినేని మధుసూదన్ గెలుపునకు కృషి చేస్తాం



సాక్షి, హైదరాబాద్: మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎస్‌జీటీ సంఘం బలపరిచిన సంకినేని మధుసూదన్ గెలుపునకు కృషి చేస్తామని ఎస్‌జీటీ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పించడమే కాకుండా ఎక్కువ సంఖ్యలో ప్రమోషన్లు ఇప్పించడంలో తమ సంఘం కృషి చేసిందన్నారు. తమ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు.

మహిళా పోలీసులు అరకొరే!

- జనాభాకు అనుగుణంగా లేని పోలీసు సిబ్బంది
- రాష్ట్రంలో మహిళల జనాభా 1,87,47,391..
- మహిళా పోలీసులు 4,782 మంది
- మహిళా పోలీసుల సంఖ్య పెంచాలంటున్న సంఘాలు



సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణలో జనాభాకు అనుగుణంగా పోలీసుల సంఖ్య పెరగడం లేదు. ప్రధానంగా మహిళా పోలీసులు, అధికారులు అరకొరగా ఉన్నారని గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఏటా నేరాల సంఖ్య పెరుగుతుండగా, అందుకు అనుగుణంగా తగినంత మంది పోలీసు సిబ్బంది నియామకాలు లేకపోవడంతో ఉన్నవారితోనే సరిపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మహిళల పోలీసుల కొరత పోలీసు విభాగాన్ని వేధిస్తోంది.

1.87 కోట్ల మహిళలకు 4,782 మంది మహిళా పోలీసులు

ప్రభుత్వం వెల్లడించిన ‘తెలంగాణ ఎట్ఏ గ్లాన్స్–2021’ నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభా 3,77,25,803. ఇందులో పురుషులు 1,89,78,412 కాగా, మహిళలు 1,87,47,391 మంది ఉన్నారు. తెలంగాణ క్రైం రికార్డు బ్యూరో ప్రకారం రాష్ట్రంలో 9 పోలీసు కమీషనరేట్‌లు, 20 జిల్లాలు, ఒక రైల్వే యూనిట్‌లలో 58,504 మంది సివిల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ విభాగాలకు చెందిన పోలీసులు (పోలీసు కానిస్టేబుల్ నుంచి డీజీ వరకు) ఉన్నారు. అలాగే 763 శాంతి భద్రతల స్టేషన్లు, 18 మహిళా పోలీసుస్టేషన్‌లు ఉండగా, ప్రతి లక్ష మంది జనాభాకు 141 మంది పోలీసులు ఉన్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. కాగా 2024 జనవరి 1 నాటికి తెలంగాణ మొత్తం పోలీసుల సంఖ్య 76,292 మందికి చేరినట్లు సమాచార హక్కు చట్టం కింద వివరాలు వెల్లడించిన డీజీ కార్యాలయం.. మహిళా పోలీసులు 4,782 మంది ఉన్నట్లు తెలిపింది. దీనిని బట్టి తెలంగాణలో మహిళల జనాభాకు అనుగుణంగా మహిళా పోలీసుల సంఖ్య లేదని వెల్లడవుతోంది. ఇంటా, బయటా జరుగుతున్న వేధింపుల గురించి చాలామంది యువతులు, మహిళలు పురుష పోలీసుల దగ్గర చెప్పుకోలేని పరిస్థితి ఉంది. మహిళలపై ఏదైనా సంఘటన జరిగినప్పుడు వారికి మహిళా పోలీసులే ధైర్యం చెబుతూ, అండగా నిలబడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జనాభాకు అనుగుణంగా మహిళా పోలీసులను నియమించాలని వివిధ మహిళా సంఘాలు కోరుతున్నాయి.

ఆర్‌టీఐ కింద 2024 జనవరి 1న డీజీ కార్యాలయం ఇచ్చిన సమాచారం ప్రకారం..

తెలంగాణలో మొత్తం పోలీసుల సంఖ్య : (పోలీసు కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు)	76,292
మహిళా పోలీసుల సంఖ్య : (కానిస్టేబుల్ నుంచి డీజీ వరకు)	4,782
ఎస్పీ నుంచి డీజీ వరకు:	67
సివిల్ కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకు:	3,642
ఏఆర్ మహిళా పోలీసులు:	1,073
మహిళా హోంగార్డులు:	868
మహిళా పోలీసుస్టేషన్లు:	18

నియోజకవర్గస్థాయిలో మహిళా స్టేషన్‌లు ఉండాలి..



జిల్లా కేంద్రాల్లోనే కాకుండా నియోజకవర్గస్థాయిలో కూడా మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి. హక్కుల కోసం ఆందోళనలు చేపడుతున్న మహిళలను అరెస్ట్ చేసే సమయంలో మహిళా పోలీసు అధికారులు మాత్రమే ఉండేలా చూడాలి.

– రాజేంద్ర పల్నాటి, ఫౌండర్, యూత్ ఫర్ యాంటీ కరప్షన్

మహిళా పోలీస్‌స్టేషన్ల సంఖ్య పెంచాలి..



మహిళలపై రోజు రోజుకూ హింస పెరిగిపోతోంది. అత్యాచారాలు, హత్యలు, యాసిడ్ ఘటనలు, గృహహింస దాడులు.. ఇలా అనేకం జరుగుతున్నాయి. రాష్ట్రంలో మహిళా పోలీస్‌స్టేషన్లు తక్కువగా ఉన్నాయి. మహిళల భద్రత కోసం ప్రతీ మండలంలో ఒక మహిళా పోలీస్ స్టేషన్, జనాభా ప్రాతిపదికన మహిళా ఎస్సై, కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ జరగాలి.

– ఇర్రి అహల్య, జిల్లా అధ్యక్షురాలు, ఐద్వా, జనగామ

కులగణన పొడిగింపుపై హర్షం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కులగణన నివేదికలో తప్పులు దొర్లాయన్న తమ ఆవేదనకు అనుగుణంగా.. ప్రభుత్వం కులగణన కోసం గడువు పొడిగించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులగణన సర్వేలో నమోదు చేసుకోని ప్రజలు.. మళ్లీ తమ వివరాలను పొందుపరిచేందుకు ప్రభుత్వం 10 రోజుల గడువు ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.


రాజాపేటలో వరిచేనులో గొర్రెలను మేపుతున్న రైతు కాకల్ల ఎల్లయ్య

పంటలు తడారి.. పొలాలు ఎడారి

రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పలు గ్రామాల్లో వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయి. వరినాట్లు వేసిన రైతులు పంట పొలాలకు నీరు సరిపోకపోవడంతో ఎండుతున్న పొలాలను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు పంట పొలాల్లో గొర్రెలను మేపుతున్నారు. మండల కేంద్రానికి చెందిన కాకల్ల ఎల్లయ్య, గొల్లపల్లి శ్రీనులు తమకున్న భూమిలో ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు వరి సాగు చేశారు. వర్షాలు సరిగ్గా లేకపోవడం.. వారం రోజులుగా ఎండలు తీవ్రం కావడంతో భూగర్భ జలాలు అడుగంటి పొలాలకు నీరు అందడం లేదు. దీంతో ఎండిపోయిన వరి పొలంలో మూగజీవాలను తోలి మేపుతున్నారు.


రాజాపేటలో ఎండిపోయిన గొల్లపల్లి శ్రీను పొలం

పెళ్లి వద్దు.. సంపాదన ముద్దు



- మారిన యూత్ మైండ్ సెట్
- లేటు వయసులో పెళ్లితో ఆరోగ్య సమస్యలు
- ఐవీఎఫ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్న జంటలు

ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి అంటుంటారు. అయితే ఇప్పుడు పెళ్లి వయసు దాటిపోతున్నా.. యువత మాత్రం అప్పుడే పెళ్లి వద్దు.. జీవితంలో సెటిల్ అయ్యాక చేసుకుంటాం అంటున్నారు. ఇంతలో మూడు పదుల వయసు దాటిపోతోంది. ఉద్యోగాల వేట, డాలర్ల భ్రమతో లేటు వయసు పెళ్లిళ్లకు మొగ్గు చూపుతున్నారు. జీవితంలో ఎంజాయ్ చేశాకే పెళ్లి అన్న ధోరణితో అసలుకే మోసం వస్తోంది. సరైన సమయంలో పెళ్లి చేసుకోకపోవడంతో సంతానం కోసం ఐవీఎఫ్ కేంద్రాలకు పరుగు పెడుతున్నారు. పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక అబ్బాయిలకైతే అమ్మాయిలు దొరక్క అవివాహితులుగా మిగిలిపోతున్నారు.

–తాడేపల్లిగూడెం

అమ్మాయిల ట్రెండ్ మారింది

తరం మారింది. అబ్బాయిలే కాదు.. అమ్మాయిలు కూడా మూడు పదులు దాటినా పెళ్లి చేసుకోవడం లేదు. 35 ఏళ్ల దాటే వరకు యువతకు పెళ్లి ఆలోచనలు లేకపోవడం చాలా అనర్థాలకు దారితీస్తోంది. పెళ్లి చేసుకుంటాను.. ఇపుడే కాదు .. ఉద్యోగంలో స్థిరపడ్డాక చేసుకుంటాం.. ఇలా అనుకొనేసరికి వయస్సు 35 సంవత్సరాలు దాటుతోంది. అప్పుడు మేరేజ్ బ్యూరోలో వివరాల నమోదు చేయించుకుంటున్నారు. తీరా పెళ్లయ్యాక పిల్లలను కనే వయసు దాటిపోతుంది. మహిళల్లో ఆధునిక జీవన విధానాలతో 40 ఏళ్లకే మెనోపాజ్ వస్తుంది. రక్త హీనత, ఐరన్ లోపం, విటమిన్ డీ లోపాలు ఏర్పడుతున్నాయి. దీంతో జంటలు ఐవీఎఫ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

61 శాతం జంటల్లో హార్మోన్ సమస్యలు

పిల్లలు వద్దు.. ఆదాయమే ముద్దు అనే పాశ్చాత్య దేశాల కల్చర్ మన యువతను కమ్మేస్తోంది. ముందు జీవితాన్ని ఎంజాయ్ చేద్దాం అన్న ధోరణి పెరుగుతోంది. అనధికారిక లెక్కల ప్రకారం వివాహమైన నేటి తరం జంటల్లో 61 శాతం హార్మోన్ సమస్యలు ఉంటున్నాయి.

పెళ్లికాని ప్రసాదులే కాదు.. అమ్మాయిలు కూడా

పశ్చిమ గోదావరి జిల్లాలో 18 నుంచి 39 సంవత్సరాల వయసున్న యువత	6,88,555 మంది
18 నుంచి 19 ఏళ్లు ఉన్నవారు	32,277 మంది
20 నుంచి 29 ఏళ్లు ఉన్నవారు	2,57,495 మంది
30 నుంచి 39 ఏళ్లు ఉన్నవారు	3,98,783 మంది
యువకులు	3,42,643 మంది
యువతులు	3,45,912 మంది

వీరిలో సుమారు నాలుగు లక్షల మందికి ఇంకా వివాహాలు కాలేదని లెక్కలు చెబుతున్నాయి.

పెళ్లి ట్రెండ్ మారింది



జీవితంలో వివాహం ముఖ్య ఘట్టం. ఇప్పుడు ఉద్యోగ వ్యవస్థ వివాహ స్వరూపాన్ని మార్చేసింది. ఇగోలు పెరిగి వివాహ బంధం విచ్ఛిన్నమవుతుంది. వయసు రాగానే పెళ్లి చేసుకోవడం మేలు. అనురాగం, ఆప్యాయతల నడుమ ఈ పెళ్లిళ్లు సాగాలి.

– భోగిరెడ్డి ఆదిలక్ష్మి, స్పందన ఫౌండేషన్

లేటు వివాహాలు అనర్థదాయకం



పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం అనర్థం. ఇన్‌ఫెర్టిలిటీ పెరుగుతుంది. స్పెర్మ్ వైటాలిటీ తగ్గుతుంది. బీపీ, మధుమేహం వంటివి వస్తున్నాయి. బర్త్ రేటు తగ్గుతుంది. పుట్టిన పిల్లల్లో క్రోమోజోముల అసమతుల్యంతో వైకల్యం రావచ్చు. సహజీవనం, ఇతర మార్గాలలో సంబంధాలు పెట్టుకోవడం వల్ల సుఖ వ్యాధులు, హెచ్‌ఐవీ రిస్క్ పెరుగుతుంది. జనరేషన్ గ్యాప్ ఏర్పడి ఇబ్బందులు తలెత్తుతాయి. 23 నుంచి 30 సంవత్సరాలలోపు పెళ్లిళ్లు చేసుకోవాలి.

– డాక్టర్ తాతారావు, గూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా...

23న జనసేన శాసనసభా పక్ష సమావేశం

- గతంలో కూటమి పార్టీల శాసనసభాపక్ష సమావేశం నిర్వహణ
- ఈసారి జనసేన వేరుగా సమావేశం

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలకు ముందు జనసేన పార్టీ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించుకోవాలని నిర్ణయించింది. గతంలో కూటమి పార్టీలన్నీ కలిసి శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటు చేసుకోగా, ఈసారి జనసేన వేరుగా భేటీ ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనుండగా, 23వ తేదీన పార్టీ శాసనసభా పక్ష సమావేశాన్ని నిర్వహించాలని అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నిర్ణయించినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 23 సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం జరుగుతుందని పేర్కొంది.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు సాధించేందుకు జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సూచించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని, దీనికి అనుగుణంగా అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమగ్ర శిక్షా ఏపీసీల రాష్ట్ర సదస్సులో బుధవారం ఆయన అధికారులనుద్దేశించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించి, పాఠశాలలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సోషల్ ఆడిట్ ఎంతో కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సోషల్ ఆడిట్ బృందాలు తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రి వోఎస్డీ ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, భవిష్యత్‌లో ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అత్యవసర శాఖగా పాఠశాల విద్య: ఏపీటీఎఫ్

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యలో ఏ రోజు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని, ఇది అత్యవసర శాఖగా మారిపోయిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నట్టుండి మూడో శనివారం సగం రోజు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు పెట్టడం, సెలవులను వినియోగించుకోకూడదని షరతు విధించడం సబబు కాదన్నారు. రోజు మొత్తం పాఠశాలకు సెలవు ప్రకటించి కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: ఏపీ టీచర్స్ గిల్డ్

రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 3,010 మంది ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. టీచర్లకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, 2000 నుంచి ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ మరణించిన కుటుంబ సభ్యులు 150 మందికి కారుణ్య నియామకం చేపట్టాలని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఐదు లక్షల మంది రైతులకు విశిష్ట సంఖ్య జారీ

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతులకు విశిష్ట సంఖ్య జారీ ప్రక్రియ (ఫార్మర్ రిజిస్ట్రీ) ముమ్మరంగా సాగుతోందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు తెలిపారు. కేవలం మూడు రోజుల్లోనే 5లక్షల మంది రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్యను జారీ చేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నీ ఈ విశిష్ట సంఖ్య ఆధారంగానే రైతులకు వర్తింపచేస్తారని స్పష్టం చేశారు. సాగుదారులందరూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు.

లంకమల అరణ్యం.. వర్ధిల్లిన శైవం



కొండూరు బీటులో పదికిపైగా శివాలయాలు

- ఆలయాల పక్కనే వెలుగులోకి వచ్చిన గుహలు
- 4వ శతాబ్దిలో శైవం వర్ధిల్లిన ఆనవాళ్లు
- పక్కనే రాతిబండపై ఆయుధాల గుర్తులు
- ఇక్కడే శివుని పాదముద్రలు, బండపై శాసనాలు
- ఈ ప్రాంతమే కైలాసకోనగా ప్రాచుర్యం



ఆలయాల పక్కనే బండపై నాటి ఆయుధాల ఆకృతి

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలోని సిద్దవటం అటవీ ప్రాంతమైన లంకమల అభయారణ్యంలో 4వ శతాబ్ది నాటి మానవుల ఆనవాళ్లు వెలుగులోకి వచ్చాక.. ఈ ప్రాంతంలో ఇంకా ఎలాంటి విశేషాలు, చరిత్ర దాగున్నాయన్న ఉత్సుకత పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగా రోజుకో కొత్త విషయం బయటికి వస్తోంది. కొత్తగా సిద్దవటం అటవీశాఖ క్షేత్రాధికారిణి బి.కళావతి.. వెలుగులోకి తెచ్చిన ఫొటోల ఆధారంగా మరిన్ని విషయాలు బాహ్య ప్రపంచంలోకి వచ్చాయి. సాక్షిలో 'ఆధ్యాత్మిక క్షేత్రం.. లంకమల' కథనం ద్వారా పలు ఆసక్తికర అంశాలను వెలుగులోకి తేవడం తెలిసింది. ప్రస్తుతం ఆ కథనానికి మరింత బలం చేకూర్చే మరిన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. ఒకే చోట గుహ, బండపై శాసనం, శిథిలమైన శివాలయాల ఆనవాళ్లు, శివుని పాద ముద్రలు, అక్కడే పైనుంచి కిందికి దూమికే జలపాతం.. ఇలా అన్నీ ఆధారాలు వెలుగులోకి వచ్చిన ఈ ప్రాంతానికి కైలాసకోనగా ప్రాచుర్యం ఉంది. అంటే శివుడు నివసించిన ప్రాంతమని అర్థం. కాబట్టి శైవం ఏ స్థాయిలో ఇక్కడ వర్ధిల్లిందో దీన్ని బట్టి స్పష్టంగా అర్థమవుతోంది. అందిన ఆధారాలను పురావస్తుశాఖ క్షుణ్ణంగాపరిశీలిస్తోంది.

బండలపై ఆధారాలు



శివాలయ శిథిల గోడ, పేర్చిన బండరాయి

ఈ ప్రాంతంలో శైవ క్షేత్రం వర్ధిల్లిందని.. ఆనాటి శైవులు బండలపై శాసనాలు, ఇతర గీతల ద్వారా వెల్లడవుతోంది. శాసనాలను బట్టి 4వ శతాబ్దినాటి శైవులు ఇక్కడ ఉన్నట్టు నిర్ధారిస్తున్నారు. అప్పట్లో ఎలాంటి ఆయుధాలు వినియోగించారో.. తెలిపేలా బండలపై వాటి ఆకృతి తెలిపేలా చెక్కారు. మరోచోట శాసనం, పక్కనే శివలింగ ఆకారం ఉన్నాయి. ఇక్కడి శిథిల ఆలయాల నిర్మాణం కోసం చతురస్రాకారంలో ఉండే బండలను వినియోగించారని, వాటిని బట్టి స్పష్టం అవుతోంది.

పై కైలాసం.. జారే జలపాతం



ఎగువ కైలాసకోన జలపాతం

శైవ క్షేత్రాలున్నట్టు గుర్తించిన ప్రాంతానికి సమీపంలోనే పై కైలాసకోన ఉంది. ఇది అద్భుతమైన జలపాతం. పై నుంచి జలపాతం కిందకు దూకే ప్రాంతం అత్యంత భయంకరంగా కనిపిస్తుంది. కొండనడుమ దూకే జలపాత ప్రాంతం ప్రకృతి సౌందర్యాన్ని తలపిస్తుంది. ఈ జలపాతంపై నుంచి కిందకు జారితే కైలాసానికి చేరినట్టే. అందుకనే దీన్ని పై కైలాసంగా ప్రాచుర్యంలో ఉంది. జలపాతం దిగువన గుహలు, ఆలయాలతో కూడిన ప్రదేశమే దిగువ కైలాసకోన.

అక్కడే గుహ.. ఆలయాలు



కొండూరు బీటులో గుహ

లంకమల మొత్తం 36 వేల హెక్టార్ల మేర విస్తరించి ఉండగా.. అందులో సిద్దవటం రేంజి పరిధిలో 26 వేల హెక్టార్ల అభయారణ్యం ఉంది. అడవిలోని కొండూరు బీటులో శైవ క్షేత్ర ఆనవాళ్లు విస్తృతంగా లభ్యమయ్యాయి. దిగువ కైలాసకోనగా పిలువబడే.. ఈ ప్రదేశంలో అర ఎకరం విస్తీర్ణంలో పదికిపైగా శివాలయాల శిథిలాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన పునాదుల బండరాళ్లు, వాటి నిర్మాణం కనిపిస్తున్నాయి. పడిపోయిన గోడలు, వాటి శిథిలాలు ఉన్నాయి. దీన్ని ఆధారంగా చేసుకుంటే వాటిని ఆలయాలుగా భావిస్తున్నారు. ఈ చోటనే గుహను కూడా గుర్తించారు. ఆలయాల వద్ద పూజల నిర్వహణ, గుహలో సిద్ధులు, యోగులు తపస్సు చేసుకునే వారు. ఇక్కడే శివుడ్ని ఆరాధిస్తున్న వీరుడి విగ్రహం లభ్యమైంది. ఈ ప్రాంతం దిగువ కైలాసకోనగా ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. ఈ అడవికి సమీపంలో సిద్దవటం గ్రామం ఉంది. అంటే సిద్ధులకు ఈ ప్రాంతం నివాసమని భావిస్తున్నారు. దీనివల్లె సిద్దవటం అని పేరొచ్చిందని చెబుతారు.

చిత్తడి నేలలు.. పర్యావరణ నేస్తాలు

- తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు



కొల్లేరులో సంప్రదాయ దోనెపై వేట



కొల్లేరులో చిత్తడి నేలల ప్రాంతం

కైకలూరు: ఉపరితలంపై ఏడాది పొడవునా ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారు. ఇవి జీవరాశుల మనుగడకు అనువైనవి. ఇరాన్‌లోని రామ్‌సర్ నగరంలో 1971 ఫిబ్రవరి 2న నిర్వహించిన అంతర్జాతీయ చిత్తడి నేలల సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వీటి ఆవశ్యతను గుర్తించారు. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రల్లో 85 రామ్‌సర్ సైట్లలో 13,688.0903 హెక్టర్లలో చిత్తడి నేలలు ఉండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 3,719.08 హెక్టర్లలో విస్తరించి ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే చిత్తడి నేలలగా రామ్‌సర్ గుర్తించిన ఏకైక కొల్లేరు సరస్సు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వ్యాపించి ఉంది.

కొల్లేరు నిలయం

కొల్లేరు ప్రాంతంలో 2,22,689 ఎకరాల విస్తీర్ణాన్ని 2002 ఆగస్టు 19న రామ్‌సర్ సైట్‌గా గుర్తించారు. చిత్తడి నేలల నిలయమైన కొల్లేరుకు ఆస్ట్రేలియా, నైజీరియా, ఈజిప్టు, ఇండోనేషియా వంటి దేశాల నుంచి వలస పక్షులు విడిదికి వస్తున్నాయి. ప్రపంచ పెలికాన్ పక్షుల్లో 40 శాతం శీతాకాలంలో కొల్లేరుకు రావడానికి చిత్తడి నేలలే కారణం. కొల్లేరులో దాదాపు 182 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. కృష్ణా, గోదావరి, తుంగభద్ర, కావేరి, హిమాలయాలు వంటి ప్రాంతాల్లో సరస్సులు, మడ అడవులు, పరీవాహక ప్రాంతాలు చిత్తడి నేలల కోవలోకి వస్తాయి. ఈ ఏడాది 'భవిష్యత్తు కోసం చిత్తడి నేలలను రక్షించడం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడు తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 56.25 హెక్టార్లు పైగా విస్తీర్ణంలో 1,943 చిత్తడి నేలలు 3,719.08 చరుపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

ప్రమాదంలో చిత్తడి నేలలు

ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్–పాలసీ ప్లాట్‌ఫాం ఆన్ బయోడైవర్సిటీ అండ్ ఎకో సిస్టమ్ సర్వీసెస్ (ఐపీబీఈఎస్) గ్లోబల్ అంచనా ప్రకారం చిత్తడి నేలలు అడువుల కంటే మూడు రెట్లు వేగంగా కనుమరుగవుతున్నాయి. చిత్తడి నేలలు భూ ఉపరితలంపై 6 శాతం మాత్రమే ఉన్నా మొత్తం వృక్ష, జంతు జాతులలో 40 శాతం చిత్తడి నేలల్లోనే నివసిస్తున్నాయి. అడవుల నరికివేత, రసాయనాల వాడకం, ఆక్రమణలు వల్ల చిత్తడి నేలలు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కొల్లేరు సరస్సులో ఆక్రమణలను మూడు నెలల్లో తొలగించాలని సుప్రీంకోర్టు రాష్ట్రం ప్రభుత్వానికి ఆదేశించడానికి కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం కావడమే ప్రధాన కారణం.

పరిరక్షణ అందరి బాధ్యత



చిత్తడి నేలల ప్రాంతమైన కొల్లేరును పరిరక్షించుకోవడం అందరి బాధ్యత. కొల్లేరు ప్రాంతానికి ఈ ఏడాది ఎక్కువగా వలస పక్షులు వచ్చాయి.

– బి.విజయ, జిల్లా అటవీశాఖ అధికారి, ఏలూరు

చిత్తడి నేలలు.. ఉపయోగాలు



కొల్లేరులో పక్షులు

- వరదలను నియంత్రిస్తాయి.
- ఫిల్టర్ మాదిరిగా నీటిని శుద్ధి చేస్తాయి. అందుకే వీటిని ప్రకృతి మూత్ర పిండాలుగా వర్ణిస్తారు.
- మట్టిలోని ఉత్పాదక సారాన్ని పెంచుతాయి.
- సున్నితమైన ప్రకృతి వనరులతో పాటు, జీవరాశులన్నింటికీ అనువైన వాతావరణం.
- ఔషధ గుణాలున్న మొక్కల పెరుగుదలకు తోడ్పడతాయి.
- రసాయనిక, జెనెటిక్ పదార్థాలను ఇముడ్చుకుని, తిరిగి నేలను మార్పు చేస్తాయి.
- అత్యధిక జీవరాసులకు ప్రధాన ఆవాస కేంద్రంగా ఉంటాయి.
- ఎక్కువ కాలం నీటి నిల్వకు, భూమి లోపలి నీటి శాతాన్ని పెంచేందుకు దోహదపడతాయి.
- సున్నితమైన ప్రకృతి వనరులకు, పక్షులకు నిలయాలుగా ఉన్నాయి.
- చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత అని రామ్‌సర్ సదస్సు పిలుపునిచ్చింది.

తాళపత్ర గ్రంథ పరిష్కారానికి కేరాఫ్ చంద్రమౌళి

- రాష్ట్రంలో రెండో వ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు
- పదిపైగా తాళపత్రాలకు శుద్ధ ప్రతుల తయారీ
- తాళపత్ర మన్నిక 300 సంవత్సరాలకు పైమాటే
- తాళపత్రాల సేకరణకు ప్రోత్సాహం ఇవ్వాలంటున్న చంద్రమౌళి



తాళ పత్రాలను పరిశీలిస్తున్న జ్యోతి చంద్రమౌళి

అద్దంకి: తాళ పత్రాల గ్రంథాలను పరిష్కరించడంలో బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన జ్యోతి చంద్రమౌళి కేరాఫ్‌గా నిలుస్తున్నారు. ఈయన తాళపత్ర గ్రంథాలను పరిష్కరించడంలో కృష్ణా జిల్లాకు చెందిన తంగిరాల సుబ్బారావు తరువాత రాష్ట్రంలోనే రెండో వ్యక్తిగా నిలిచాడు. ఈయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా పనిచేసే సమయం నుంచి రిటైరైన తరువాత తాళపత్రాలను సేకరించి వాటిని శుభ్రం చేసి వాటికి పుస్తక రూపం ఇచ్చి భావితరాలకు అందేలా కృషి చేస్తున్నారు. ఆయన ఇప్పటికి పది తాళపత్రాల గ్రంథాలను పరిష్కరించి శుద్ధ ప్రతులను తయారు చేశారు. ఇప్పటికే ఒక గ్రంథం అచ్చయింది. మిగిలిన వాటికి పుస్తకం రూపం ఇవ్వడం ఖర్చుతో కూడుకున్న పని. ప్రభుత్వం ప్రోత్సాహమో, లేక ఏదైనా సంఘాల చేయూత ఉంటేనే అవి అచ్చు అవుతాయి.

ఇప్పటి వరకు పరిష్కరించిన తాళపత్ర గ్రంథాలు



ఒక ఆకుపై రాసిన అక్షరాలు

చంద్రమౌళి తన దగ్గరకు తెచ్చి ఇచ్చిన తాళపత్ర గ్రంథాల్లో ఇప్పటికి పోచయ్య బొంగరాలాట, కాటంరాజు కథ, వల్లురాజు కథ, ఆవుల మేపు, భట్టు రాయభారం, తరిగొండ వెంగమాంబ కథ, రాజయోగామృత సారం, గ్రామీణ వైద్యం అనే గ్రంథాలకు పుస్తకం రూపం ఇచ్చారు. పురాతన తాళపత్రాల గ్రంథాలను పరిష్కరించడం అంత తేలికైన పని కాదు. ఒక్కో ఆకు భద్రంగా బయటకు తీసి వాటికి రెండు రకాల రసాయనాలు పూస్తేనే అందులోని అక్షరాలు కనిపించి పరిష్కారానికి ఉపయోగిస్తాయి.

తాళపత్ర పూర్వ చరిత్ర..



తయారు చేసిన శుద్ధ ప్రతులు

జ్యోతి చంద్రమౌళి అందించిన వివరాల మేరకు ప్రస్తుతం, ఏదైనా రచన చేయాలన్నా ఉత్తరం రాయాలన్నా కాగితం అవసరం. అయితే అది ఇప్పటి మాట. ఒకప్పుడు కాగితాలు లేవు. అప్పుడు గ్రంథాలను రాయాలన్నా ఉత్తరాలు రాయాలన్నా తాళ (తాటి ఆకులు) పత్రాలను వాడేవారు. ప్రముఖంగా గ్రంథాలను రాయడానికి వీటిని ఎక్కువగా ఉపయేగించేవారు. అంతకు మునుపు తామ్ర పత్రాలు అంటే సన్నగా చేసిన రేకులపైన రాసేవారు. ఇవి 300 సంవత్సరాలకు పైగానే మన్నుతాయి.

తాళపత్రాల సేకరణకు ప్రోత్సహించాలి

తాళపత్ర గ్రంథాలు ఇప్పటికే వేటపాలెం, రాజమండ్రి, కడప వంటి గ్రంథాలయాల్లో ఉన్నాయి. అయితే ఇంకా చాలా గ్రంథాలు తరతరాల నుంచి ఇళ్లల్లో ఉన్నాయి. ఆయా గ్రంథాలను బయటకు తీసి వాటికి పుస్తక రూపం ఇస్తే ఆయా గ్రంథాలు వెలుగు చూస్తాయి.

– విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రచయిత, శాస్త్ర పరిశోధకుడు

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,192 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,825 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.15 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

శాస్త్రోక్తం.. త్రిశూల స్నానం



శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నదిలో బుధవారం శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. వ్యాసపౌర్ణమను పురస్కరించుకుని మహాశివరాత్రికి ముందు త్రిశూల స్నానం జరిపించడం ఆనవాయితీ. అందులో భాగంగా జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడు, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, త్రిశూలానికి ఆలయ అలంకార మండపంలో విశేష పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా స్వర్ణముఖి నదీ తీరానికి తీసుకెళ్లారు.

ఘనంగా శ్రీగోవిందరాజస్వామి తెప్పోత్సవాలు



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయ పుష్కరిణిలో ఏడు రోజుల పాటు జరిగిన స్వామివారి తెప్పోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామి వారు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పలపై ఏడు చుట్లు విహరించి భక్తులను కటాక్షించారు.

భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి ఆమె. పెళ్లిళ్లు చేసుకునే కొత్త జంటలకు ఆమె ఆశీస్సులు చాలని భక్తుల నమ్మకం. ఆ దేవత కొలువుంటే పవిత్ర పుణ్యక్షేత్రమే ఎన్టీఆర్‌జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి దేవస్థానం. ఇది ఉమ్మడి జిల్లాలో విజయవాడ శ్రీకనకదుర్గమ్మవారి ఆలయం తరువాత రెండవ స్థానంలో ఉంది. విజయవాడకు 70 కిలోమీటర్ల దూరంలో జగ్గయ్యపేట, నందిగామకు 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. నిత్యం ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రం నుంచి వచ్చే భక్తులతో అలరాలుతోంది.

● తిరునాళ్లు

కోర్కెలు తీర్చే కల్పవల్లి
తిరుపతమ్మ తల్లి

- నిత్యం భక్తులతో కళకళలాడుతున్న పెనుగంచిప్రోలు క్షేత్రం
- ఏటా రెండు తిరునాళ్ల ఉత్సవాలు
- ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు పెద్దతిరునాళ్ల పెనుగంచిప్రోలు


పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయం ఓవర్ వ్యూ



17వ శతాబ్దంలో పెనుగంచిప్రోలు సమీప గ్రామాల్లో సాక్షాత్తు శ్రీతిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి వర ప్రసాదినిగా జన్మించిన తిరుపతమ్మ బాల్యదశలోనే సకల శాస్త్రపారంగ మూర్తిగా పేరు గాంచింది. తల్లిదండ్రులు కొల్లా రంగమాంబ, శివరామయ్యలకు పేరు తెచ్చే విధంగా తోటి బాలబాలికలకు జ్ఞానమార్గం బోధిస్తూ యుక్త వయస్సు వచ్చిన తిరుపతమ్మను పెనుగంచిప్రోలులోని సమీప బంధువులైన కాకాని వంశీయులు కృష్ణయ్య, వెంగమాంబ దంపతుల కుమారుడు గోపయ్యకు ఇచ్చి వివాహం చేశారు. తిరుపతమ్మ రాకతో కాకాని వారి కుటుంబం సిరి సంపదలతో, భోగభాగ్యాలతో వర్ధిల్లినప్పటికీ తోటికోడలు చంద్రమ్మ అసూయ వల్ల అత్త వెంగమాంబ మనస్సు మారటంతో అత్తింటి ఆరళ్లు ఎక్కువయ్యాయి. అదే సమయంలో కరువు తాండవించటంతో గోవులకు మేతకోసం గోపయ్య జీతగాళ్లతో ఆవుల మందను తీసుకుని ఉత్తరారణ్యాలకు వెళ్లాడు. కాలమహిమ అన్నట్లుగా తిరుపతమ్మకు కుష్ఠువ్యాధి సోకింది. దాంతో అత్త, తోటికోడళ్లు పట్టించుకోకుండా పశువుల పాకలోకి నెట్టేశారు. ఆ సమయంలో ముదిరాజ్ వంశానికి చెందిన పాపమాంబ ఆమెకు సేవలు చేసింది. ఆమె వంశానికి చెందిన వారే నేటికీ ఆలయంలో పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆలయంలో జరిగే క్రతువుల్లో అన్ని కులాల వారికి ప్రాతినిధ్యం ఒక్క పెనుగంచిప్రోలు ఆలయంలోనే మనకు కనిపిస్తాయి.

గోవుల మేతకోసం అడవులకు వెళ్లిన గోపయ్య పులి రూపంలో వచ్చిన పెద్దమ్మ తల్లితో పోరాడి వీరమరణం పొందారు. భర్త మరణాన్ని ముందుగానే ఊహించిన తిరుపతమ్మ ప్రాయోపవేశానికి నిర్ణయించుకుంటుంది. ఆనాటి మునసబు కర్ల ముత్యాలనాయుడు, కరణం శ్రీశైలపతి సమక్షంలో మహిమలు చూపి భర్తతోపాటు సహగమనం చేస్తుంది. యోగాగ్నిలో తనువు చాలించిన చోట కాలక్రమం లో తన ప్రతిమతోపాటు గోపయ్య ప్రతిమ కూడా వెలుస్తుందని చెప్పింది. దానికిముందు ఆమె పతివ్రతా ధర్మాలను బోధించినట్లు చరిత్ర చెబుతోంది. తదుపరి పెద్దల సమక్షంలో ఆలయ నిర్మాణం జరగగా, నేడు కోట్లాది రూపాయలతో సుందర నిర్మాణం రూపు దాల్చింది. ఆలయం పక్కనే పవిత్ర మునేరు, మామిడి తోటలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.





పదుల సంఖ్యలో పెళ్లిళ్లు....

పెళ్లిళ్ల సీజన్‌లో ప్రతిరోజూ సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆలయ ప్రాంగణంలో పెళ్లిళ్ల చేసుకుంటారు. అమ్మవారికి ఆలయంలో నిత్య కల్యాణంతో పాటు ఏడాదికి ఒక సారి అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. యోగాగ్నిలో ప్రవేశించిన తరువాత చితిమంటలు నుంచి తన భర్త ప్రతిమ, తన ప్రతిమతోపాటు పసుపు–కుంకుమలు వస్తాయని ఆరోజు నుంచి తనను కొలిచిన వారికి నిత్య సుమంగళితనం, సంతానం, సిరిసంపదలు ప్రాప్తమవుతాయని తిరుపతమ్మ చెప్పింది. అందుకు తగినట్లుగా ప్రధానాలయం లోని అమ్మవారి విగ్రహం చేతిలో కుంకుమ భరిణ ఉంటుంది. అందుకే ఆమె సమక్షంలో కల్యాణం చేసుకుంటే మంచిదని భక్తులు విశ్వసిస్తారు. సంతానం లేనివారు అమ్మ సన్నిధిలో ముడుపులు కడతారు. నిత్యం అన్నప్రాశనలు, కుంకుమపూజలు నిర్వహిస్తారు.


శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య

ఏటా ఉత్సవాలు..

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అన్ని కులాల వారికి సంబంధించిన క్రతువులతో, యజ్ఞ యాగాదులతో అలరారుతున్న తిరుపతమ్మవారి అమ్మవారి పెద్ద తిరునాళ్ల ఏటా మాఘశుద్ధ పౌర్ణమి నుంచి ఐదు రోజుల పాటు, చిన్న తిరునాళ్ల ఫాల్గుణమాసంలో ఐదు రోజుల పాటు విశేషంగా జరుగుతాయి. ఆ ఉత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఈ ఏడాది పెద్ద తిరునాళ్ల, కల్యాణ ఉత్సవాలు ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు జరగనున్నాయి. వీటితోపాటు ప్రతి రెండేళ్లకు ఒకసారి రంగుల ఉత్సవం వైభవంగా జరుగుతుంది. ప్రతినెలా చండీహోమం, నిత్యం గోపూజ, కుంకుమపూజ, అభిషేక పూజ వంటి పూజలు జరుగుతుంటాయి. నిత్యం అమ్మవారికి భక్తులు పాలు, పొంగళ్లతో బోనాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.



పులికొండ సాంబశివరావు, సాక్షి, పెనుగంచిప్రోలు

● ఆధ్యాత్మికత

పెరుమాళ్ కోసం...

అది తమిళనాడు రాష్ట్రం, రామేశ్వరం దగ్గరున్న ఓ చిన్న పల్లెటూరు. అక్కడ పెయింటింగ్ ని జీవనోపాధిగా చేసుకుని జీవించే ఓ పెయింటర్ ఉండేవాడు. అతడికి పెళ్ళి కావాల్సిన కూతురు ఉండేది.

బి.ఏ., డిగ్రీ మాత్రమే చదివిన ఆ అమ్మాయి అందం కూడా అంతంత మాత్రమే. అయినా పెద్ద మొత్తాల్లో జీతం తీస్తున్న ఇంజినీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పెళ్ళి చేసుకుంటామని ముందుకు వచ్చారు. పెళ్ళి కూతురు, ఆమె తల్లి వచ్చిన సంబంధాల పట్ల ఆసక్తి ప్రదర్శించినా పెయింటర్ ఒప్పుకోలేదు.

''వయసైపోతోంది, మీరు బిడ్డకి పెళ్ళి చేయాలని ఉన్నారా, లేదా?'' అని భర్తని గట్టిగా అడిగింది పెయింటర్ భార్య. అతడు నవ్వి ఊరకున్నాడు. వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి పంపించేస్తున్నాడన్న విషయం తెలిసి బంధువులు అతడిని తిట్టిపోశారు. అయినా అతడు పట్టించుకోలేదు.

చివరికి మిత్రుల ద్వారా తిరుపతి నుంచి ఓ సంబంధం వచ్చింది. పెళ్ళికుమారుడు చిన్న వ్యాపారి. ఆదాయం అంతంత మాత్రమే. అయినా దానికి వెంటనే అంగీకరించాడు పెయింటర్. ఆశ్చర్యపోయారు పెయింటర్ కుటుంబ సభ్యులు.

'ఇక్కడ పెళ్ళికుమారులు దొరక్కనా, పది గంటలకు పైగా ప్రయాణ దూరమున్న తిరుపతి సంబంధం చేసుకుంటున్నాడు' అని బంధువులు ముక్కు మీద వేలు వేసుకున్నారు. పెయింటర్ ఎవ్వరి మాటలకీ స్పందించలేదు. పెళ్ళి పనుల్లో పడ్డాడు.

పెళ్ళి కూడా తిరుపతిలోనే పెట్టుకున్నారు. పెళ్ళిరోజు రానే వచ్చింది.



అమ్మగారి ఇంటినుంచి వెళ్ళిపోతున్నామనే బాధతో కన్నీళ్లు పెట్టుకుంటూ పెళ్ళికూతురు తండ్రిని ఇలా అడిగింది.

''నాన్నా... మన రామేశ్వరం పక్కనే ఎన్నో మంచిమంచి సంబంధాలు వచ్చాయి. వాటికి నువ్వు ఒప్పుకోలేదు. రాష్ట్రం కాని రాష్ట్రం. పరిచయం లేని ప్రాంతం, దూరాభారం. తెలియని భాష. అయినా ఈ కొత్త సంబంధానికి సుముఖత చూపావు, కారణమేమి?'' అని. ఎదురుగా కనిపిస్తున్న శేషాచలం కొండల్ని చూపిస్తూ ఇలా చెప్పాడు అతడు– ''ఏడాదికి ఒక్కసారైనా, పెరుమాళ్ ని చూడాలని ఉంటుంది నాకు. అయితే... నోట్లోకి నాలుగేళ్ళు పోయే సంపాదన నాది. ఆ సంపాదన కోసమే నా సమయమంతా సరిపోయేది. ఉన్న ఊరు వదిలేదానికి కుదిరేది కాదు. స్వామి వారి దర్శనభాగ్యం వాయిదాలు పడేది. కూతురైన నువ్వు తిరుపతిలో ఉంటే నిన్ను చూడాలని అనిపించినప్పుడల్లా తిరుపతి వస్తాము. అలాగైనా అప్పుడప్పుడూ స్వామి దర్శన భాగ్యం చేసుకోవచ్చని నా ఆశ. అందుకే ఈ సంబంధం ఒప్పుకున్నాను''అని.

తండ్రికి స్వామివారి పట్ల ఉన్న భక్తికి ఆశ్చర్యపోయింది పెళ్ళికూతురు. అక్కడే ఉన్న బంధుమిత్రులందరూ శేషాచలం కొండల వైపు తిరిగి గోవిందలు పలికారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

● నిర్మల వాణి

ధ్యానం
నిత్యజీవితంలో భాగం కావాలి

ధ్యానం అనేది మీ దైనందిన జీవితంలో భాగం కావాలి. దీనికి ప్రత్యామ్నాయం ఏమీ లేదు. ధ్యానం చేయకుండా మిమ్మల్ని మీరు సమతుల్యతలో వుంచుకోలేరు. మీరు మీ చుట్టూ వున్న ప్రకృతితో మమేకం కాలేరు. మీరు ఆరాధిస్తున్న దైవానికి దగ్గర కాలేరు. దైవం పట్ల మీలో భక్తి, శ్రద్ధ వుండాలి. అది కేవలం ధ్యానం ద్వారానే మీలో సమకూరుతుంది.

మీరు చేసే ప్రతి కార్యం, నిర్వహించే ప్రతి బాధ్యత, నిర్విచార స్థితిలో నిర్వహించడం అలవాటు చేసుకోవాలి. ఇది వినడానికి అతిశయం గా అనిపించవచ్చు. కానీ ఇదే వాస్తవం. అప్పుడు మీరు చేస్తున్న ఆ కార్యం ఎంతో సుందరంగా, అలవోకగా నిర్వహించబడడం చూసి మీరు ఆశ్చర్యపోతారు. ధ్యానానికి ఉన్న శక్తి అటువంటిది.

ధ్యానమూలం గురు మూర్తిః పూజామూలం గురు పదం మంత్ర మూలం గురు వాక్యం మోక్ష మూలం గురు కృప

అని ఆది శంకరాచార్యులు చెప్పినట్లుగా –మీరు మీ గురువు దగ్గర, మీరు ఆరాధించే దైవం దగ్గర మోకరిల్లి మీరు ధ్యానం చేసుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని, పరిస్థితులను, మానసిక స్థితిని ప్రసాదించమని వేడుకోవాలి.



మీ అహంకారానికి అతీతంగా భగవంతునితో ఒకటిగా అయి, మిమ్మల్ని మీరు తెలుసుకున్నప్పుడే మీరు ధ్యానంలో ప్రవేశిస్తారు. ధ్యానం ఉదయమూ, సాయంత్రం రెండు పూటలా చేయటం మంచిది. ఉదయం పూట చేసుకునే ధ్యానంలో మనల్ని మనం అంతర్ముఖంగా పరిశీలించుకోవాలి. నేను ఎంతవరకు ఆధ్యాత్మికంగా లోతులకు వెళ్లగలిగాను? నేను ఆధ్యాత్మికంగా ఎదగడానికి నాలో ఆటంక పరుస్తున్నవేమిటి... అని పరిశీలించుకోవాలి. అలాగే సాయంత్రం ధ్యానంలో – నేను ఎంతవరకు ఇతరులకు సహాయపడ గలిగాను? భగవత్ కార్యంలో ఎంతవరకు పాలుపంచుకోగలిగాను? అని గమనించుకోవాలి. ధ్యానంలో ఎటువంటి ఆలోచనలూ లేని నిర్విచార స్థితికి చేరుకునే మార్గంలో ఈ ఆత్మ పరిశీలన అవసరం.

ధ్యానంలో మనం చేరుకునే ఆ ఆలోచనా రహిత స్థితే, అది కొద్దిసేపు అయినా సరే, భగవంతునితో మనల్ని అనుసంధానిస్తుంది. తద్వారా మన ప్రార్థనలు భగవంతుని చేరతాయి. ప్రార్థనలో మనం కోరుకునే ప్రశ్నలకు, సందేహాలకు, భగవంతుడు ఇచ్చే సమాధానం, పరిష్కారం, ధ్యానం ద్వారానే మనకు చేరుతుంది. అది మనసుకు ఆహ్లాదాన్ని, ఓర్పును ఇస్తుంది. మన సమస్యలను తీరుస్తుంది.

క్రమం తప్పని ధ్యానం ద్వారా మిమ్మల్ని కిందకు దిగజార్చే విషయాలన్నీ క్రమంగా మాయమవుతాయి. కారణం షడ్రిపులకు అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలకు అతీతంగా ఆత్మగా మారుతారు. మిమ్మల్ని మీరు అదుపు చేసుకోగలుగుతారు.

ధ్యానం వల్లే మీరు కుడి, ఎడమ పార్శ్వాల లోని సమస్యలను వదలి మధ్యస్థంలో వుంటారు. అంటే గతానికి సంబంధించిన, భవిష్యత్తుకు సంబంధించిన అనవసరమైన ఆలోచనలను వదలి వేసి, వర్తమానంలో వున్నప్పుడే మీ వివేకాన్ని, ఆనందాన్ని అనుభూతి చెందుతారు. అదే 'విలంబ్' స్థితి.

డా. పి. రాకేశ్
(శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రసంగాల ఆధారంగా)


పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి

● ఇస్లాం వెలుగు

తలాక్ అంటే..?

దివ్య ఖుర్‌ఆన్ ఇలా చెబుతోంది...
తమ భార్యలను ముట్టుకోము అని ఒట్టు పెట్టుకునే వారికి నాలుగు నెలల గడువు ఉంటుంది. 2:226

వివరణ: పండితుల ప్రకారం షరిఅత్ పరిభాషలో దీనిని 'ఈలా' అని అంటారు. భార్యాభర్తల మధ్య సంబంధాలు ఎల్లప్పుడూ సుహృద్భావ పూర్వకంగా ఉండవు. అపశ్రుతులు ఏర్పడుతూనే ఉంటాయి. కానీ ఉభయలు చట్టబద్ధంగానైతే దాంపత్య బంధంలోనే ఉంటూ క్రియాత్మకంగా ఇద్దరు భార్యాభర్తలు కానట్టుగానే వేరుగా మసులుకునేటువంటి విధానాన్ని దైవ శాసనం (షరిఅత్) ఇష్టపడదు. ఇలాంటి అపసవ్యత కొరకు అల్లాహ్ నాలుగు నెలలు గడువు నిర్ణయించాడు. ఈ మధ్యకాలంలో వారు తమ సంబంధాలను సరి చేసుకోవాలి లేదా దాంపత్య బంధాన్నైనా తెంచి వేయాలి. అప్పుడైనా ఆ ఇరువురు పరస్పరం స్వేచ్ఛ పొంది తమకు కుదురుగా ఉన్న వారితో పెళ్లి చేసుకోగలరు.

తన భార్యతో దాంపత్య సంబంధం కలిగి ఉండనని భర్త ఒట్టు పెట్టుకున్న సందర్భానికే ఈ ఆదేశం వర్తిస్తుంది. పోతే ఒట్టు పెట్టుకోకుండా భార్యతో సంబంధాలను తెంచుకునే సందర్భంలోనయితే– అలా ఎంత కాలం సాగినా ఈ ఆదేశం దానికి అతకదని ఈ (ఆయత్) వాక్యం ఉద్దేశం.



మరొక విషయం ఏమిటంటే ప్రమాణం చేసినా, చేయకపోయినా రెండు సందర్భాల్లోనూ బంధాన్ని విరమించుకుంటే దానికి గడువు కాలం ఈ నాలుగు మాసాలే. ఈ ఆదేశం కేవలం ఏవైనా మనస్పర్థల వల్ల ఏర్పడే సంబంధాల ప్రతిష్టంబనకు వర్తిస్తుంది. కానీ మరేదైనా కారణంగా భర్త భార్యతో శారీరక సంబంధాన్ని విరమించుకుంటే సాధారణ సంబంధాలు సుహృద్భావ పూర్వకంగా కొనసాగే పక్షంలో ఈ ఆదేశం వర్తించదు.

అయితే కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం భార్యాభర్తల మధ్య శారీరక సంబంధాన్ని తెంచివేసే ఏ ప్రమాణమైన సరే అది ఇలా పరిగణించబడుతుంది. ఇది నాలుగు నెలలకు పైగా నిలవరాదు. ఇష్టంలేని పక్షంలోనైనా ఇష్టపూర్వకంగానైనా సరే.

ఒకవేళ వారు వెనక్కి మరలినట్లయితే అల్లాహ్ క్షమించేవాడు, దయ చూపేవాడు: 2:227

కొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం ఈ గడువు లోపల తమ ప్రమాణాన్ని భగ్నపరిచి తిరిగి దాంపత్య సంబంధాలను పునరుద్ధరించుకుంటే వారికి ప్రమాణ భంగం చేసినందుకు ప్రాయశ్చిత్తం లేదు. అల్లాహ్ అట్టే క్షమించి వేస్తాడు.

మరికొంతమంది పండితుల అభిప్రాయంలో ప్రమాణభంగానికి ప్రాయశ్చిత్తం చెల్లించవలసి ఉంటుంది. వారనేది ఏమిటంటే దేవుడు 'గఫూరుర్రహీం' (మన్నించేవాడు కరుణించేవాడు) అన్న విషయానికి భావం ప్రాయశ్చిత్తం మాఫీ జరిగిందని కాదు మీ ప్రాయశ్చితాన్ని స్వీకరిస్తాడని, సంబంధ విరామ కాలంలో ఇరువురు పరస్పరం చేసుకున్న అన్యాయాన్ని మన్నించి వేయడం జరుగుతుందని మాత్రమే.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

సువార్త

ప్రేమించుటకు అర్హతలు

ప్రేమించే వారికి తప్పక కొన్ని అర్హతలు ఉండే తీరాలని బైబిలు పదే పదే చెబుతుంది. ప్రేమ ఏనాడూ కీడు చేయక అది ఎప్పుడూ మేలే చేస్తుంది. కాబట్టి, ఆలస్యం చేయక ప్రేమించాలి. ఆతురతతో ప్రేమించాలి. ఆత్మసంబంధ ప్రేమతో ప్రేమాతురతతో వేగంగా ప్రేమను వ్యక్తం చేస్తూ ప్రేమించడం ఇరువురి ఆత్మలకు అది బహు మేలే. ప్రేమ పట్ల ఆతురత, క్రీస్తు ప్రేమాతురత ఎప్పుడూ మంచిదే. ఈ విధానం మంచే చేస్తుంది. క్రీస్తు మనస్సును ఆయుధంగా ధరించుకోవడం అంటే ఎలాంటి సమస్యనైనా, కీడునైనా, ప్రతికూలతలనైనా ప్రేమతో దీటుగా ఎదుర్కోవడం. యుక్తంగా, ఉన్నతంగా, అసాధారణ రీతిలో ఇలా సమాజాన్ని ప్రేమించడం. ఆత్రుతతో ప్రేమించే ముందు కొన్ని విషయాలు తెలుసుకోక తప్పదు. అయితే ప్రేమాతురతకు కొన్ని అర్హతలు, లెక్కలంటూ ఉన్నాయి.

అపొస్తలుల బోధను యెడతెగక వింటూ, వారి సువార్త ద్వారా రక్షించబడి, పరిశుద్ధాత్మను వరంగా పొందుకొని, లేఖనానుసార సంఘంతో అవినాభావ సహవాస బాంధవ్యం, భాగ్యం కలిగినవారే తమ తోటి వారిని, ఈ సమాజాన్ని, దేశాన్ని, ప్రపంచాన్ని ఇలా ఉన్నతంగా ప్రేమించగలుగుతారు. వారికి అవసరమైన పరిచర్యల విషయమై సకాలంలో స్పందించి కార్యరూపంలో వాటిని అందించగలుగుతారు. ప్రేమించే వారికే ఈ అర్హతలు తప్ప అవసరార్థులకు, లబ్ధిదారులకు, బాధితులకు ఈ అర్హతలు ఉండనవసరం లేదు. దేవుడు ప్రేమ స్వరూపి. ప్రేమ దేవునిది. ప్రేమ దేవుని నుండి వస్తుంది. ప్రేమ దేవ స్వభావం. నిజమైన ప్రేమ ఆత్మ సంబంధమైనది. ప్రేమ ఆత్మకు సంబంధించిన ఫలం. ఇలాంటి దైవిక ప్రేమ ఎప్పుడూ గుర్తింపు, గౌరవాలను ఆశించదు. మాటతో నాలుకతో కాక, క్రియతో సత్యంతో ప్రేమించాలి. పవిత్ర హృదయంతో, మంచి మనస్సాక్షితో, నిష్కపటమైన విశ్వాసంతో ప్రేమించాలి అనునదే క్రీస్తు వారి అపొస్తలుల బోధ.

ఒక్కటే క్రీస్తుశరీరం అను లేఖనానుసార సంఘంలో చేర్చబడి ఒక్కటే అను లేఖనానుసార బాప్తిస్మము ద్వారా పరిశుద్ధాత్మ వరం పొందుకొనునప్పుడే ఈ పై అర్హతలు అన్నీ సునాయాసంగా అందివస్తాయని గ్రంథం ఘోషిస్తోంది. వాస్తవమైన జీవాన్ని సంపాదించే క్రమంలో, నిజానికి ఆత్మసంబంధ ప్రేమను గూర్చి మాత్రమే ఇలా చెప్పబడుతూ ఉంది. లోకంలో ఎన్నో ప్రేమలు ఉండవచ్చు. రోజురోజుకు ఏదో ఒకటి కొత్తగా పుట్టుకురావచ్చు. ఆత్మప్రేమ ఇలాంటిది కాదు. ఈ అర్హతలు ఇప్పుడిప్పుడే తక్షణమే తాజాగా సంపాదించిన వ్యక్తికి తప్పక ఇక ప్రేమించకుండా ఉండలేని పరిస్థితులు తలెత్తుతాయి. అర్హతలు, అనుమతులు రాగానే అతడు ఒకచోట స్థిరంగా ఎలా ఉంటాడు? తనలోని ప్రేమను బట్టి హుందాగా పరదేశిలా, యాత్రికునిలా ప్రవర్తిస్తాడు.

'ఒకడు తాను చూచిన తన తోటి వానిని ప్రేమింపనివాడు తాను చూడని దేవుణ్ణి ఎట్లు ప్రేమింపగలడు?' అన్నది గ్రంథపు బోధవాక్యం. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమిస్తే దేవుణ్ణి ప్రేమించినట్టే. యావత్తూ ధర్మశాస్త్రాన్ని నెరవేర్చినట్టే అనేది గ్రంథపు విలువైన సమాచారం. యుక్తంగా దేవుణ్ణి ప్రేమించాలంటే అనగా సర్వమానవాళిని క్రీస్తు ప్రేమతో ఆ స్ఫూర్తితో ప్రేమించాలంటే మాత్రం ఇట్టి అర్హతలు కలిగి ప్రేమించక తప్పదు.



మొదటగా ఈ అర్హతలు సంపాదించకుండా ప్రేమిస్తే అది ఇరువురి మధ్య క్షేమాభివృద్ధి కలిగించదు. ఈ అర్హతలు కలిగి వాటిని ఉన్నతంగా అమలులో పెడుతూ, చేతల పరిచర్యలతో ప్రేమించేవారే దైవికంగా తమ ప్రేమను ఇతరులకు పంచగలుగుతారు. తన తోటివ్యక్తిని ప్రేమిస్తే ఆ దేవ దేవుణ్ణి ప్రేమించినట్టే. ప్రేమ కలిగి సత్యం చెప్పే క్రీస్తు ప్రేమ ప్రచారం అను సువార్త ప్రకటన పరిచర్యలకు అర్హులనే సంఘం నియమించి అనుమతిస్తుంది. అంతియొకయలో ఉన్న సంఘం సద్భక్తితో మార్పు చెందిన పౌలు అనబడిన సౌలును అన్యజనుల పరిచర్య నిమిత్తం ప్రత్యేకంగా కేటాయించి పంపింది. అతడు భూ దిగంతముల వరకు వెళ్ళి క్రీస్తుప్రేమను వ్యాప్తి చేయడం గమనార్హం. 'క్రీస్తు ప్రేమ మమ్మును బలవంతం చేయుచున్నది' అన్న పౌలు మహాశయుని మాటలో అర్హత, ప్రేమాతురత ఈ రెండూ ఉండుటను మనం తేటగా గుర్తిస్తాము. ఈ సమాజాన్ని ఉన్నతంగా ప్రేమించాలనే సదుద్దేశం కలిగినవారమై తేటగా క్రీస్తు అడుగు జాడలను గుర్తిస్తే అవే మనలను అర్హతల బాట పట్టిస్తాయి.

యేసు ప్రభువు వారి అసాధారణ బోధ ఏమంటే, 'నిన్ను ప్రేమించిన వారినే ప్రేమించిన యెడల నీ గొప్పతనం ఏముంది? నీకు కలిగే ఫలం ఏమిటీ?' అంటే సత్యవిషయమైన ప్రేమను అవలంబించుట ద్వారా దేవుని మెప్పు, సంఘ ప్రోత్సాహాలను పొందుకోగలుగుతాము. సత్యలేఖన ఆజ్ఞల ప్రేరేపణతో ఇక తప్పక అనుసరించదగిన రీతిలో ఉన్నట్టి దైవికప్రేమను చేతలపరంగా చూపుటే సత్యప్రేమ. అది క్రియలలో కనుపరచేదే తప్ప, అది ఏనాడూ తీయని నోటిమాటలతో వ్యక్తం చేయదగ్గది కానేకాదు. పవిత్ర హృదయం, మంచి మనస్సాక్షి, నిష్కపట విశ్వాసం వంటివి ఉన్నతంగా ప్రేమించడానికి కావలసిన అర్హతలు.

– జేతమ్

బిజినెస్ రీల్

మల్హోత్రా సంతకంతో రూ.50నోట్లు



ముంబై: గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.50 నోట్లను త్వరలో విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ బుధవారం తెలిపింది. శక్తికాంత దాస్ పదవీ విరమణ చేయడంతో 2024 డిసెంబర్‌లో మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. ఈ నోట్ల డిజైన్ అన్ని విధాలుగా మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లోని రూ.50 నోట్లను పోలి ఉంటుందని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో జారీ చేసిన రూ.50 విలువ కలిగిన అన్ని నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో కొనసాగుతాయని స్పష్టం చేసింది.

కోటక్ మహీంద్రాకు ఊరట

ఆంక్షలు ఎత్తివేసిన ఆర్‌బీఐ



ముంబై: ప్రైవేట్ రంగంలో ఉన్న కోటక్ మహీంద్రా బ్యాంక్‌పై 9 నెలలుగా ఉన్న ఆంక్షలను ఆర్‌బీఐ బుధవారం ఎత్తివేసింది. తద్వారా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవడానికి వీలు కల్పించింది. నూతన క్రెడిట్ కార్డులను జారీ చేయడానికి సైతం అనుమతి ఇచ్చింది. 2022, 2023 సంవత్సరాలకుగాను పలు అంశాల్లో తీవ్ర లోపాలు, ఉల్లంఘనలు గుర్తించడంతో ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ మార్గాల ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవడం, క్రెడిట్ కార్డులను జారీ చేయడాన్ని నిలిపివేయాలని కోటక్ బ్యాంక్‌ను 2024 ఏప్రిల్‌లో ఆర్‌బీఐ ఆదేశించింది.

స్పాం కట్టడికి ట్రాయ్ కఠిన చర్యలు



న్యూఢిల్లీ: ఇబ్బందికర కాల్స్, సందేశాల విషయంలో టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ కఠిన చర్యలను ముమ్మరం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం టెల్కోలు స్పామ్‌ల సంఖ్యను తప్పుగా నివేదించిన సందర్భాల్లో పదేపదే ఉల్లంఘనలకు పాల్పడితే రూ.2 లక్షల నుండి రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. అసాధారణ స్థాయిలో కాల్స్ అధికంగా చేయడం, కాల్ వ్యవధి తక్కువగా ఉండడం, ఇన్‌కమింగ్‌తో పోలిస్తే అవుట్‌గోయింగ్ కాల్స్ ఎక్కువగా ఉండడం వంటి పరిమితుల ఆధారంగా కాల్, ఎస్ఎంఎస్‌ల నమూనాలను విశ్లేషించి సంభావ్య స్పామర్లకు అడ్డుకట్ట వేయాలని టెలికం ఆపరేటర్లను ట్రాయ్ ఆదేశించింది. టెలికం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్ సవరణ ప్రకారం.. నిబంధనలు అమలు చేయడంలో విఫలమైతే టెలికం ఆపరేటర్లపై పెనాల్టీ విధిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-2-2025

విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJFINSV	1,792.25	2.72
SBILIFE	1,448.00	2.04
SHRIRAMFIN	548.6	1.87
HDFCLIFE	628.85	1.66
TATASTEEL	132.25	1.64

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,987.10	-3.2
EICHERMOT	4,855.00	-2.36
BEL	259.4	-2.13
POWERGRID	257.4	-1.55
INDUSINDBK	1,038.00	-1.53

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,067
ఎన్ఎస్ఈ	1,04,610
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,17,527
ఎఫ్ఐఐ	- 4,969
డీఐఐ	+ 5,929

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.56 (రాత్రి 11.30కు)	$ 73.32 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.35 (రాత్రి 11.30కు)	$ 77.00 (క్రితం ముగింపు)

రిటైల్ ఇన్వెస్టర్లు తగ్గేదేలే...

ఈక్విటీల్లోకి రూ.39,688 కోట్లు

- సిప్ రూపంలో రూ.26,400 కోట్లు
- డెట్ ఫండ్స్‌లోకి రూ.1.28 లక్షల కోట్లు
- జనవరి గణాంకాలు విడుదల చేసిన యాంఫి



న్యూఢిల్లీ: విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలతో కొన్ని నెలలుగా ఈక్విటీలు బేలచూపులు చూస్తుంటే.. దేశీ రిటైల్ ఇన్వెస్టర్లు 'తగ్గేదేలే' అంటూ కొత్త పెట్టుబడులతో పరిణతి చూపుతున్నారు. ఇన్వెస్టర్ల క్రమశిక్షణకు నిదర్శనంగా 'సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్' (సిప్) రూపంలో జనవరిలోనూ ఈక్విటీ పథకాల్లోకి రూ.26,400 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు డిసెంబర్ నెలలో వచ్చిన రూ.26,459 కోట్లతో పోల్చితే కేవలం రూ.59 కోట్లే తగ్గాయి. ఇక జనవరి నెలలో అన్ని రకాల ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన నికర పెట్టుబడులు రూ.39,688 కోట్లుగా ఉన్నాయి. 2024 డిసెంబర్ నెలలో వచ్చిన రూ.41,156 కోట్లతో పోల్చి చూస్తే 3.56% తగ్గినట్టు తెలుస్తోంది. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) జనవరి నెల గణాంకాలను తాజాగా విడుదల చేసింది. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని ఈక్విటీ పెట్టుబడుల విలువ డిసెంబర్‌తో చూస్తే 4% తగ్గి రూ.30.57 లక్షల కోట్లకు పరిమితమైంది. ఈక్విటీ, డెట్ ఇలా అన్ని రకాల నిర్వహణ ఆస్తుల విలువ జనవరి చివరికి రూ.67.25 లక్షల కోట్లకు చేరింది. డిసెంబర్ చివరికి ఈ విలువ రూ.66.93 లక్షల కోట్లుగా ఉంది.

దీర్ఘకాల దృక్పథం..

''మార్కెట్లలో అస్థిరతలు నెలకొన్నప్పటికీ సిప్ రూపంలో రూ.26,400 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అస్థిరతల్లోనూ పెట్టుబడులు కొనసాగించేందుకు, సంపద సృష్టికి క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాల విధానం అనుసరించే దిశగా ఇన్వెస్టర్లలో అవగాహనకు ఇక ముందూ మా ప్రయత్నాలు కొనసాగుతాయి''అని యాంఫి సీఈవో వెంకట్ చలసాని తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం సిప్ ఆస్తుల విలువ రూ.13.12 లక్షల కోట్లుగా ఉంది. మొత్తం ఈక్విటీ నిర్వహణ ఆస్తుల్లో సిప్‌కు సంబంధించే 40 శాతానికి పైగా ఉండడం గమనార్హం. జనవరిలో కొత్తగా 30.7 లక్షల ఫోలియోలు (ఒక పథకంలో పెట్టుబడికి గుర్తింపు సంఖ్య) నమోదయ్యాయని, మార్కెట్ దిద్దుబాటు నేపథ్యంలో పెట్టుబడుల అవకాశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాస్తవ తెలిపారు. ఈక్విటీ నిర్వహణ ఆస్తుల విలువ 4 శాతం తగ్గడానికి మార్కెట్లలో ఆటుపోట్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యూనియన్ బడ్జెట్ ముందు అప్రమత్తతను కారణాలుగా ఐటీఐ మ్యూచువల్ ఫండ్ సీఈవో జతిందర్ పాల్ సింగ్ పేర్కొన్నారు.

విభాగాల వారీగా..

- సెక్టోరల్, థీమ్యాటిక్ ఫండ్స్ అత్యధికంగా రూ.9,016 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. డిసెంబర్‌లో ఇదే విభాగంలోకి రూ.15,331 కోట్ల పెట్టుబడులు రావడం గమనార్హం.
- మిడ్‌క్యాప్ విభాగంలోకి రూ.5,148 కోట్లు వచ్చాయి. డిసెంబర్‌లో ఇదే విభాగం రూ.5,721 కోట్లను ఆకర్షించింది.
- అస్థిరతలు కాస్త తక్కువగా ఉండే లార్జ్‌క్యాప్ విభాగంలోకి పెట్టుబడులు పెరిగాయి. డిసెంబర్‌లో రూ.2,010 కోట్లు రాగా, జనవరిలో రూ.3,063 కోట్లకు చేరాయి.
- ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ సైతం అంత క్రితం నెలతో పోల్చితే జనవరిలో 20 %అధికంగా రూ.5,697 కోట్లను ఆకర్షించాయి.
- డెట్ ఫండ్స్‌లోకి నికరంగా రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. డిసెంబర్‌లో ఈ విభాగం నుంచి రూ.1.27 కోట్లను ఉపసంహరించుకున్న ఇన్వెస్టర్లు జనవరిలో మళ్లీ అంతే మేర తీసుకొచ్చినట్టు కనిపిస్తోంది.
- గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) ఇటీవలి కాలంలో ఎన్నడూలేనంత గరిష్ట స్థాయిలో రూ.3,751 కోట్లను ఆకర్షించాయి. ఇన్వెస్టర్లు సురక్షిత సాధనమైన బంగారంలో పెట్టుబడులకు ఆసక్తి చూపించినట్టు స్పష్టమవుతోంది.

ఓఎన్‌జీపీఎల్ చేతికి అయానా రెన్యూవబుల్

రూ. 19,500 కోట్ల విలువ • రెన్యూవబుల్ విభాగంలో రెండో అతి పెద్ద డీల్



న్యూఢిల్లీ: ఓఎన్‌జీసీ-ఎన్‌టీపీసీ గ్రీన్ (ఓఎన్‌జీపీఎల్) తాజాగా అయానా రెన్యూవబుల్ పవర్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం ఈక్విటీ, రుణభారాన్ని కూడా కలిపి కంపెనీ విలువను (ఎంటర్‌ప్రైజ్ వేల్యూ) రూ. 19,500 కోట్లుగా (2.3 బిలియన్ డాలర్లు) లెక్కగట్టారు. ఓఎన్‌జీపీఎల్ నిర్దిష్ట మొత్తాన్ని అయానా యజమానులకు చెల్లించి, కంపెనీ రుణాలను తనకు బదలాయించుకునే విధంగా ఒప్పందం కుదిరింది. అయితే, ఎంత మొత్తం చెల్లించేదీ వెల్లడి కాలేదు. దీనికి సంబంధించి అయానా ప్రస్తుత షేర్‌హోల్డర్లయిన నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (51 శాతం), బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్..దాని అనుబంధ సంస్థలు (32 శాతం), ఎవర్‌సోర్స్ క్యాపిటల్ (17 శాతం) నుంచి 100 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు ఓఎన్‌జీపీఎల్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 2024 నవంబర్‌లో ఏర్పాటైన తర్వాత తమ సంస్థకు ఇది తొలి వ్యూహాత్మక పెట్టుబడని ఓఎన్‌జీపీఎల్ తెలిపింది.

పునరుత్పాదక ఇంధన విభాగంలో ఇది రెండో అతి పెద్ద డీల్‌గా నిలవనుంది. 2021 అక్టోబర్‌లో సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్ కార్ప్, భారతి గ్రూప్ నుంచి ఎస్‌బీ ఎనర్జీ ఇండియాను అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) కొనుగోలు చేసింది. అప్పట్లో ఆ డీల్ విలువ ఏకంగా 3.5 బిలియన్ డాలర్లు. ఇక గతేడాది డిసెంబర్‌లో ఓ2 పవర్ పూలింగ్ అనే రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాట్‌ఫాంను జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ దక్కించుకుంది. ఇందుకోసం ఎంటర్‌ప్రైజ్ విలువను రూ. 12,468 కోట్లుగా (1.47 బిలియన్ డాలర్లు) లెక్కగట్టారు.

4.1 గిగావాట్ల సామర్థ్యం..

అయానాకు 4.1 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అసెట్లు ఉన్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే పని చేస్తుండగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. మరోవైపు, చమురు..గ్యాస్ దిగ్గజం ఓఎన్‌జీసీ, విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ కలిసి జాయింట్ వెంచర్‌గా ఓఎన్‌జీపీఎల్‌ను ఏర్పాటు చేశాయి. ఇందులో రెండు సంస్థలకూ చెరి 50 శాతం వాటాలు ఉన్నాయి. 2038 నాటికి కర్బన ఉద్గారాలను తటస్థ స్థాయికి తగ్గించుకునే దిశగా హరిత హైడ్రోజన్ ప్లాంట్లు, పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంపై రూ. 2 లక్షల కోట్లు వెచ్చించనున్నట్లు ఓఎన్‌జీసీ గతేడాది వెల్లడించింది.

నెమ్మదించిన ఐఐపీ


- డిసెంబర్‌లో వృద్ధి 3 నెలల కనిష్టానికి
- 3.2 శాతంగా నమోదు



న్యూఢిల్లీ: మైనింగ్, తయారీ రంగాల పేలవ పనితీరుతో డిసెంబర్‌లో పారిశ్రామికోత్పత్తి వృద్ధి మందగించింది. ఐఐపీ (పారిశ్రామికోత్పత్తి సూచీ) 3 నెలల కనిష్ట స్థాయి 3.2 శాతానికి పరిమితమైంది. 2023 డిసెంబర్‌లో ఇది 4.4 శాతంగా నమోదైంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) బుధవారం ఈ మేరకు గణాంకాలు విడుదల చేసింది. ఈ సందర్భంగా గతేడాది నవంబర్ గణాంకాలను 5.2 శాతం నుంచి 5 శాతానికి సవరించింది. అటు ఐఐపీ వృద్ధి సెప్టెంబర్‌లో 3.2 శాతంగా, అక్టోబర్‌లో 3.7 శాతంగా నమోదైంది. మరిన్ని వివరాల్లోకి

- డిసెంబర్‌లో తయారీ రంగ ఉత్పత్తి 4.6 శాతం నుంచి 3 శాతానికి నెమ్మదించింది. అలాగే మైనింగ్ ఉత్పత్తి సైతం 5.2 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది.
- విద్యుదుత్పత్తి 1.2 శాతం నుంచి 6.2 శాతానికి, కన్జూమర్ డ్యూరబుల్స్ 5.2 శాతం నుంచి 8.3 శాతానికి పెరిగింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగ ఉత్పత్తుల తయారీ 5.5 శాతం నుంచి 6.3 శాతానికి వృద్ధి చెందింది.

ఐఐటీ-మద్రాస్‌తో ఎస్ఈఐఎల్ ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో అతి పెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ తాజాగా ఐఐటీ మద్రాస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా కార్బన్ క్యాప్చర్ (బొగ్గు పులుసు వాయువును సంగ్రహించే) సాంకేతికతను అభివృద్ధి చేస్తారు. కార్బన్ క్యాప్చర్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే పేటెంట్ కలిగిన కీమోజెల్ అనే నానోపార్టికల్ ఆధారిత ద్రావకాన్ని ఐఐటీ మద్రాస్ ఇప్పటికే సృష్టించింది. ఇప్పుడు క్షేత్ర స్థాయిలో ఈ ద్రావకం పనితీరును పరీక్షించేందుకు ఒక పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ విప్లవాత్మక పరిశోధనకు మద్దతుగా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.71 లక్షల నిధులు సమకూరుస్తున్నట్టు ఎస్ఈఐఎల్ సీఈవో రాఘవ్ త్రివేది తెలిపారు.

భారత్‌లో ఇన్‌స్టాగ్రామ్ టీన్ అకౌంట్లు


మెటా వెల్లడి



న్యూఢిల్లీ: ఇన్‌స్టాగ్రామ్ టీన్ అకౌంట్లను భారత్‌లో కూడా ప్రవేశపెడుతున్నట్లు సోషల్ మీడియా దిగ్గజం మెటా వెల్లడించింది. గోప్యత సెట్టింగ్స్‌ను, తల్లిదండ్రుల పర్యవేక్షణను బలోపేతం చేసి, యుక్త వయస్సులోని యూజర్ల భద్రతను మెరుగుపర్చేలా డిఫాల్టుగా ఇందులో ఫీచర్లు ఉంటాయని పేర్కొంది. పిల్లలు తమ వయస్సు విషయంలో తప్పుడు వివరాలు ఇవ్వకుండా వయో ధృవీకరణ ప్రక్రియ పటిష్టంగా ఉంటుందని మెటా తెలిపింది. 16 ఏళ్ల లోపు టీనేజ్ యూజర్లకు సెట్టింగ్‌లను మార్చడం, ఇటీవలి కాంటాక్ట్‌లను పర్యవేక్షించడం, స్క్రీన్ టైమ్‌పైనా.. వినియోగించే సమయంపైనా పరిమితులు విధించడం మొదలైనవి తల్లిదండ్రుల చేతిలో ఉంటాయని వివరించింది. టీనేజర్ల మీద సోషల్ మీడియా హానికర ప్రభావాలపై దేశ, విదేశాల్లో ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో మెటా తమ ఇన్‌స్టాగ్రామ్ టీన్ అకౌంట్లను భారత్‌లో ప్రవేశపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

విశాఖలో పడిపోయిన ఇళ్ల అమ్మకాలు

- 2024లో 21 శాతం క్షీణత
- టాప్ 15 టైర్-2 పట్టణాల్లో అధిక అమ్మకాలు
- ప్రాప్ ఈక్విటీ సంస్థ నివేదిక



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విశాఖపట్నంలో ఇళ్ల అమ్మకాలు బేలచూపులు చూస్తున్నాయి. 2024లో మొత్తం మీద ఇళ్ల అమ్మకాలు అంతక్రితం సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 21శాతం తగ్గిపోయినట్టు రియల్ ఎస్టేట్ డేటా విశ్లేషణ సంస్థ 'ప్రాప్ ఈక్విటీ' వెల్లడించింది. ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 15 ప్రముఖ ద్వితీయ శ్రేణి (టైర్-2) పట్టణాలకు భిన్నమైన పరిస్థితి విశాఖలో నెలకొనడం గమనార్హం. అన్నింటిలోకి అమ్మకాలు ఎక్కువగా పడిపోయింది విశాఖలోనేనని ప్రాప్ ఈక్విటీ నివేదిక తెలిపింది.

– విశాఖతోపాటు అహ్మదాబాద్, సూరత్, వదోదర, గాంధీనగర్, నాసిక్, జైపూర్, నాగ్‌పూర్, భువనేశ్వర్, మొహాలి, లక్నో, కోయింబత్తూర్, గోవా, భోపాల్, త్రివేండ్రమ్‌లో 2024లో ఇళ్ల అమ్మకాలు సంఖ్యా పరంగా 4 శాతం పెరగ్గా, విలువ పరంగా 20 శాతం వృద్ధి కనిపించింది.

- ఈ 15 పట్టణాల్లో 1,78,771 యూనిట్ల విక్రయాలు నమోదు కాగా, వీటి విలువ రూ.1,52,552 కోట్లుగా ఉంది. 2023లో 1,71,903 యూనిట్లు అమ్ముడుపోగా, విలువ రూ.1,27,505 కోట్లుగా ఉండడం గమనార్హం.
- అత్యధికంగా కోయింబత్తూర్‌లో ఇళ్ల అమ్మకాలు 36 శాతం వృద్ధిని చూశాయి.
- అమ్మకాల విలువ పరంగా భువనేశ్వర్‌లో 47 శాతం వృద్ధి నమోదైంది.
- నాసిక్‌లో ఇళ్ల అమ్మకాలు 2 శాతం తగ్గాయి.
- అహ్మదాబాద్‌లో రూ.49,421 కోట్ల విలువైన ఇళ్ల అమ్మకాలు జరిగాయి. 15 పట్టణాల్లో ఎక్కువ అమ్మకాల విలువ ఇక్కడే నమోదైంది. 2023లో అమ్మకాల విలువ రూ.42,063 కోట్లతో పోల్చితే 17 శాతం పెరిగింది.

ధరల పెరుగుదల ఫలితం..

''2024లో ఇళ్ల అమ్మకాలు కేవలం 4 శాతమే పెరిగినప్పటికీ విలువలో 20 శాతం వృద్ధి నమోదైంది. నిర్మాణంలోకి వినియోగించే మెటీరియల్స్ ధరలు అధికం కావడం, స్పెక్యులేటివ్ పెట్టుబడుల (ఊహాజనిత) ఫలితంగా ఇళ్ల ధరలు గణనీయంగా పెరగడం వల్లే ఈ పరిస్థితి. ఇది రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ప్రభావం (అమ్మకాల పరంగా) చూపించి ఉండొచ్చు''అని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజ పేర్కొన్నారు.

క్యూ3 ఫలితాలు

నాట్కో ఫార్మా డివిడెండ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ నాట్కో ఫార్మా 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.1.50 మూడవ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 38 శాతం క్షీణించి రూ.132 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 86 శాతం పడిపోయి రూ.39 కోట్లుగా ఉంది. మార్జిన్ 35.3 నుంచి 8.2 శాతానికి వచ్చి చేరింది. టర్నోవర్ రూ.475 కోట్ల నుంచి రూ.758 కోట్లకు ఎగిసింది.

బీఎస్ఈలో కంపెనీ షేరు 1.97 శాతం క్షీణించి రూ.1,216.65 వద్ద స్థిరపడింది.

సువెన్ ఫార్మా ఆదాయం రూ. 307 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సువెన్ ఫార్మా ఆదాయం రూ. 307 కోట్లుగా, లాభం రూ. 32 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో ఆదాయం రూ. 234 కోట్లు కాగా, లాభం రూ. 47 కోట్లు. మరోవైపు, కోహ్యాన్స్ విలీన ప్రోఫార్మా ప్రాతిపదికన ఆదాయం 40 శాతం పెరిగి రూ. 676 కోట్లుగా ఉన్నట్లు సంస్థ తెలిపింది. అంచనాలకు అనుగుణంగా కంపెనీ వృద్ధి బాటలో ముందుకెడుతోందని సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వివేక్ శర్మ తెలిపారు. ఫార్మా సీడీఎంవో వ్యాపారం పటిష్టంగా ఉందని ఎండీ వి. ప్రసాద రాజు తెలిపారు. సీడీఎంవో, టెక్నాలజీపై పెట్టుబడులు, వ్యూహాత్మకంగా కంపెనీల కొనుగోళ్లు.. విలీనాల ద్వారా 1 బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు.

రామ్‌కీ లాభం 59 శాతం జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ నిర్మాణ సంస్థ రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 59 శాతం అధికమై రూ.59 కోట్లు సాధించింది. ఎబిటా రూ.116 కోట్ల నుంచి రూ.129 కోట్లుగా ఉంది. టర్నోవర్ 4.3 శాతం పెరిగి రూ.459 కోట్లు నమోదు చేసింది.

బీఎస్ఈలో కంపెనీ షేరు 5.69 శాతం దూసుకెళ్లి రూ.516.65 వద్ద స్థిరపడింది.

పటేల్ ఇంజినీరింగ్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 80 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక రంగ ఈపీసీ కంపెనీ పటేల్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం ఎగసి రూ. 80 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 70 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,076 కోట్ల నుంచి రూ. 1,265 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,031 కోట్ల నుంచి రూ. 1,125 కోట్లకు పెరిగాయి. కంపెనీ ఆర్డర్ బుక్ 2024 డిసెంబర్‌కల్లా రూ. 16,396 కోట్లను అధిగమించింది.

ఫలితాల నేపథ్యంలో పటేల్ ఇంజినీరింగ్ షేరు బీఎస్ఈలో 3% ఎగసి రూ. 46 వద్ద ముగిసింది.

జుబిలెంట్ ఫుడ్ లాభం ఓకే

క్యూ3లో రూ. 43 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో జుబిలెంట్ ఫుడ్ వర్క్స్ ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 43 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో దాదాపు రూ. 66 కోట్ల లాభం సాధించింది. అయితే గత క్యూ3లో మాతృ సంస్థకు చెందిన జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్ నెదర్లాండ్స్.. డీపీ యూరేషియా ఎన్‌వీలో నియంత్రిత వాటా కొనుగోలు చేసిన కారణంగా ఫలితాలు పోల్చి చూడతగదని కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం రూ. 1,378 కోట్ల నుంచి రూ. 2,151 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,312 కోట్ల నుంచి రూ. 2,090 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 640 వద్ద ముగిసింది.

పీఎఫ్‌సీ లాభం అప్

క్యూ3లో రూ. 7,760 కోట్లు



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 7,760 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 6,094 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3.5 చొప్పున మూడో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 28 రికార్డ్ డేట్. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 23,593 కోట్ల నుంచి రూ. 26,822 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో పీఎఫ్‌సీ షేరు బీఎస్ఈలో 0.6 శాతం క్షీణించి రూ. 373 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ లాభం జూమ్

క్యూ3లో రూ. 820 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం అశోక్ లేలాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 35 శాతం జంప్‌చేసి రూ. 820 కోట్లకు చేరింది. విదేశీ మార్కెట్లలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 609 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 11,066 కోట్ల నుంచి రూ. 11,995 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 10,155 కోట్ల నుంచి రూ. 10,938 కోట్లకు పెరిగాయి. ఎగుమతులు 33 శాతం ఎగసి 4,151 యూనిట్లను తాకాయి. కాగా.. క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు ఆర్జించినట్లు అశోక్ లేలాండ్ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు బీఎస్ఈలో 8% జంప్‌చేసి రూ. 220 వద్ద ముగిసింది.

సెయిల్ లాభం నేలచూపు

క్యూ3లో రూ. 142 కోట్లు



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 66 శాతం క్షీణించి రూ. 142 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు పెరగడం లాభాలను దెబ్బతీసింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 423 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 23,492 కోట్ల నుంచి రూ. 24,723 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 23,141 కోట్ల నుంచి రూ. 24,560 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో సెయిల్ షేరు బీఎస్ఈలో 6 శాతం జంప్‌చేసి రూ. 106 వద్ద ముగిసింది.

సీమెన్స్ లాభం డౌన్

క్యూ1లో రూ. 372 కోట్లు



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ దిగ్గజం సీమెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం క్షీణించి రూ. 372 కోట్లకు పరిమితమైంది. ఆదాయం క్షీణించడం లాభాలపై ప్రతికూల ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 412 కోట్లు ఆర్జించింది. కంపెనీ అక్టోబర్-సెప్టెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 3,710 కోట్ల నుంచి రూ. 3,587 కోట్లకు నీరసించింది. అయితే కొత్త ఆర్డర్లు రూ. 3,560 కోట్ల నుంచి రూ. 4,258 కోట్లకు ఎగశాయి.

ఫలితాల నేపథ్యంలో సీమెన్స్ షేరు బీఎస్ఈలో ఫ్లాట్‌గా రూ. 5,206 వద్ద ముగిసింది.

ఒక్క పరుగు ఆధిక్యం... కేరళకు సెమీస్ భాగ్యం



సల్మాన్ నిజర్

అజహరుద్దీన్

సల్మాన్ నిజర్, అజహరుద్దీన్ అజేయ అర్ధ సెంచరీలు ● జమ్మూ కశ్మీర్‌తో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ 'డ్రా'

పుణే: ఒక్క పరుగే కదా అని తేలిగ్గా తీసుకుంటే... ఆ ఒక్క పరుగే ఒక్కోసారి ఫలితాన్ని నిర్ణయిస్తుంది. దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో ఈ ఒక్క పరుగు విలువ ఎలాంటిదో అటు కేరళ జట్టుకు... ఇటు జమ్మూ కశ్మీర్ జట్టుకు తెలిసొచ్చింది. రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి సెమీఫైనల్ చేరుకోవాలని ఆశించిన జమ్మూ కశ్మీర్ జట్టుకు ఒక్క పరుగు నిరాశను మిగిల్చింది. మరోవైపు తొలి ఇన్నింగ్స్‌లో సంపాదించిన ఒక్క పరుగు ఆధిక్యం కేరళ జట్టుకు ఆరేళ్ల తర్వాత మళ్లీ రంజీ ట్రోఫీలో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసింది. వివరాల్లోకి వెళితే... జమ్మూ కశ్మీర్ నిర్దేశించిన 399 పరుగుల భారీ విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 100/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ జట్టు చివరి రోజు ఆట ముగిసేసరికి 126 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 295 పరుగులు సాధించి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. సల్మాన్ నిజర్ (162 బంతుల్లో 44 నాటౌట్; 8 ఫోర్లు), మొహమ్మద్ అజహరుద్దీన్ (118 బంతుల్లో 67 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) 43 ఓవర్లు ఆడి ఏడో వికెట్‌కు అజేయంగా 115 పరుగులు జోడించి జమ్మూ కశ్మీర్ విజయాన్ని అడ్డుకున్నారు. భారత్‌లోని పిచ్‌లపై చివరిరోజు 299 పరుగులు చేయాలంటే ఏ స్థాయి టోర్నీలోనైనా కష్టమే. ఈ నేపథ్యంలో కేరళ బ్యాటర్లు ఆఖరి రోజు క్రీజులో నిలదొక్కుకొని సాధ్యమైనన్ని బంతులు ఆడాలని... జమ్మూ కశ్మీర్ బౌలర్లకు వికెట్లు సమర్పించుకోరాదని... మ్యాచ్‌ను 'డ్రా' చేసుకోవాలనే ఉద్దేశంతోనే పోరాడారు. చివరకు తమ ప్రయత్నంలో కేరళ బ్యాటర్లు విజయవంతమయ్యారు. వెరసి కేరళ, జమ్మూ కశ్మీర్ జట్ల మధ్య ఐదు రోజుల రంజీ ట్రోఫీ చివరి క్వార్టర్ ఫైనల్ 'డ్రా'గా ముగిసింది. ఫలితం తేలకపోవడంతో నిబంధనల ప్రకారం తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన జట్టుకు సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది. జమ్మూ కశ్మీర్‌పై 1 పరుగు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న కేరళ జట్టుకు సెమీఫైనల్ బెర్త్ ఖాయమైంది. ఈనెల 17 నుంచి జరిగే సెమీఫైనల్లో మాజీ చాంపియన్ గుజరాత్ జట్టుతో కేరళ తలపడుతుంది.

ఆ ఇద్దరు అడ్డుగోడలా...

ఓవర్‌నైట్ స్కోరు 100/2తో ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ బుధవారం తొలి సెషన్‌లో నింపాదిగా ఆడి 46 పరుగులు జోడించి ఒక్క వికెట్ కోల్పోయింది. లంచ్ సమయానికి కేరళ 146/3తో ఉంది. రెండో సెషన్‌లోనూ కేరళ బ్యాటర్లు ఎలాంటి ప్రయోగాలకు పోలేదు. ఆచితూచి ఆడుతూ వికెట్లను కాపాడుకున్నారు. అయితే ఎనిమిది బంతుల వ్యవధిలో కేరళ సచిన్ బేబీ (162 బంతుల్లో 48; 7 ఫోర్లు), జలజ్ సక్సేనా (48 బంతుల్లో 18; 3 ఫోర్లు) వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత ఆదిత్య సర్వాతే (27 బంతుల్లో 8; 2 ఫోర్లు) కూడా అవుటయ్యాడు. దాంతో టీ విరామానికి కేరళ 216/6 స్కోరుతో వెళ్లింది. టీ బ్రేక్ తర్వాత ఆఖరి సెషన్‌లో మరో నాలుగు వికెట్లు తీస్తే జమ్మూ కశ్మీర్‌కు విజయంతోపాటు సెమీఫైనల్ బెర్త్ లభించేది. కానీ సల్మాన్ నిజర్, అజహరుద్దీన్ మొండి పట్టుదలతో ఆడి జమ్మూ కశ్మీర్ జట్టు ఆశలను వమ్ము చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో అజేయ సెంచరీ సాధించడంతోపాటు రెండో ఇన్నింగ్స్‌లోనూ నాటౌట్‌గా నిలిచిన నిజర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

సంక్షిప్త స్కోర్లు

జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్: 280; **కేరళ తొలి ఇన్నింగ్స్:** 281; **జమ్మూ కశ్మీర్ రెండో ఇన్నింగ్స్:** 399/9 **డిక్లేర్డ్; కేరళ రెండో ఇన్నింగ్స్:** 295/6 (126 ఓవర్లలో) (రోహన్ 36, అక్షయ్ 48, సచిన్ బేబీ 48, సల్మాన్ నిజర్ 44 నాటౌట్; అజహరుద్దీన్ 67 నాటౌట్, యుధ్వీర్ 2/61, సాహిల్ 2/50).

గుజరాత్ టైటాన్స్ కేరాఫ్ టోరెంట్

కంపెనీ చేతికి 67 శాతం వాటా

అహ్మదాబాద్: ఐపీఎల్ టీమ్ గుజరాత్ టైటాన్స్‌లో ప్రముఖ పారిశ్రామిక సంస్థ టోరెంట్ గ్రూప్ 67 శాతం వాటాను దక్కించుకుంది. ఈ ఒప్పందం గతంలోనే ఖాయమైనా... బుధవారం ఫ్రాంచైజీ యాజమాన్యం దీనిని అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుత యజమాని సీవీసీ క్యాపిటల్స్ ఇక ముందు మిగిలిన 33 శాతం వాటాతో సహ యజమానిగా కొనసాగుతోంది. ఐపీఎల్ జట్టులో భాగమయ్యేందుకు సీవీసీ క్యాపిటల్స్‌కు టోరెంట్ సుమారు రూ.5,025 కోట్లు చెల్లించినట్లు సమాచారం. 2021లో టైటాన్స్‌ను సీవీసీ రూ.5,625 కోట్లు చెల్లించి సొంతం చేసుకుంది. ఈ టీమ్ ప్రస్తుత విలువను రూ.7,500 కోట్లుగా లెక్కగట్టారు. ఈ నేపథ్యంలో సీవీసీ గ్రూప్ తాము పెట్టిన పెట్టుబడిలో సుమారు 89 శాతాన్ని తిరిగి తెచ్చుకోవడంతో పాటు 33 శాతం వాటాను ఇంకా తమ వద్దే ఉంచుకోవడం విశేషం. కొత్త ఒప్పందం కారణంగా ఐపీఎల్‌లో భాగం కావడం పట్ల సంతోషంగా ఉన్నామని... లీగ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు టోరెంట్ గ్రూప్ డైరెక్టర్ జినాల్ మెహతా వ్యాఖ్యానించారు. టోరెంట్ దేశవ్యాప్తంగా ఫార్మాస్యూటికల్స్, విద్యుత్, గ్యాస్ రంగాల్లో పెద్ద ఎత్తున తమ వ్యాపారాలను సాగిస్తోంది. కంపెనీ విలువ దాదాపు రూ.41 వేల కోట్లుగా ఉంది. 2022 ఐపీఎల్ సీజన్‌లో టైటిల్ సాధించిన గుజరాత్ టైటాన్స్ 2023తో రన్నరప్‌గా నిలిచింది.

మకావును మట్టికరిపించి...

క్వార్టర్ ఫైనల్లో భారత్ ● ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమిండియా షట్లర్లు



మాళవిక



లక్ష్య సేన్

కింగ్‌డావో (చైనా): ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. మకావు జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 5–0 తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో భారత జట్టుకు క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారైంది. మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియా చేతిలో ఓడిన మకావు జట్టు వరుసగా రెండో ఓటమితో లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన దక్షిణ కొరియా నేడు భారత జట్టుతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు గ్రూప్ 'డి' టాపర్‌గా నిలుస్తుంది.

తొలి మ్యాచ్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్–ఆద్యా వరియత్ జోడీ 21–10, 21–9తో లోక్ చోంగ్ లియోంగ్–వెంగ్ చి ఎన్జీ జంటను ఓడించి భారత్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21–16, 21–12తో పాంగ్ ఫాంగ్ పుయ్‌పై గెలవడంతో భారత ఆధిక్యం 2–0కు పెరిగింది. మూడో మ్యాచ్‌లో రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్ 21–15, 21–9తో హావో వాయ్ చాన్‌ను ఓడించడంతో భారత్ 3–0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో చిరాగ్ శెట్టి–అర్జున్ ద్వయం 21–15, 21–19తో చిన్ పోన్ పుయ్–కోక్ వెన్ వోంగ్ జోడీపై... ఐదో మ్యాచ్‌లో ట్రెసా జాలీ–పుల్లెల గాయత్రి జంట 21–10, 21–5తో ఎన్జీ వెంగ్ చి–పుయ్ చి వా ద్వయంపై గెలుపొందడంతో భారత విజయం 5–0తో సంపూర్ణమైంది. 2023లో దుబాయ్‌లో జరిగిన ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు కాంస్య పతకాన్ని సాధించింది.



ఘజన్‌ఫర్‌కు గాయం

చాంపియన్స్ ట్రోఫీతోపాటు ఐపీఎల్‌కు దూరమైన అఫ్గానిస్తాన్ టీనేజ్ స్పిన్నర్

కాబుల్: అఫ్గానిస్తాన్ టీనేజ్ ఆఫ్‌స్పిన్నర్ ఘజన్‌ఫర్ ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీతో పాటు వేసవిలో జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు దూరమయ్యాడు. వెన్ను నొప్పితో బాధపడుతున్న ఘజన్‌ఫర్ నాలుగు నెలల పాటు ఆటకు దూరం కానున్నట్లు అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) బుధవారం వెల్లడించింది. దీంతో ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న చాంపియన్స్ ట్రోఫీ కోసం ఘజన్‌ఫర్ స్థానంలో 20 ఏళ్ల లెఫ్టార్మ్ స్పిన్నర్ నంగేయాలియా ఖరోటేను జట్టులోకి ఎంపిక చేసినట్లు ఏసీబీ పేర్కొంది. 18 ఏళ్ల ఘజన్‌ఫర్‌ను ఐపీఎల్ వేలంలో ముంబై ఇండియన్స్ జట్టు కొనుగోలు చేసుకుంది. చాంపియన్స్ ట్రోఫీ కోసం జట్లను ప్రకటించేందుకు గడువు ముగియగా... అఫ్గానిస్తాన్ జట్టు 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ టీమ్‌కు హష్మతుల్లా షాహిది కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో చక్కటి ఆటతీరుతో అభిమానులను అలరించిన అఫ్గాన్ జట్టు... చాంపియన్స్ ట్రోఫీలోనూ దాన్ని కొనసాగించాలని భావిస్తోంది. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఈ నెల 21 కరాచీ వేదికగా దక్షిణాఫ్రికాతో అఫ్గానిస్తాన్ తొలి మ్యాచ్ ఆడుతుంది.

పాక్ 353 ఛేదించింది

● 'శత'క్కొట్టిన రిజ్వాన్, సల్మాన్
● దక్షిణాఫ్రికాపై విజయంతో ముక్కోణపు టోర్నీ ఫైనల్లోకి



రిజ్వాన్, సల్మాన్

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు సొంతగడ్డపై పాకిస్తాన్ జట్టు అదరగొట్టింది. వన్డే క్రికెట్ చరిత్రలో తమ అత్యధిక లక్ష్యాన్ని ఛేదించింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన మూడో మ్యాచ్‌లో ఆతిథ్య పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ఈ విజయంతో పాకిస్తాన్ జట్టు ముక్కోణపు టోర్నీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన పాకిస్తాన్... కీలక పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. కెప్టెన్ తెంబా బవుమా (96 బంతుల్లో 82; 13 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (56 బంతుల్లో 87; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), మాథ్యూ బ్రిజ్‌కీ (83; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. పాకిస్తాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 353 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 49 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 355 పరుగులు చేసింది. కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (128 బంతుల్లో 122 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), సల్మాన్ ఆఘా (103 బంతుల్లో 134; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో విజృంభించారు. ఒక దశలో 91 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన పాక్ జట్టును సల్మాన్‌తో కలిసి రిజ్వాన్ ఆదుకున్నాడు. సఫారీ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఈ జోడీ... నాలుగో వికెట్‌కు రికార్డు స్థాయిలో 229 బంతుల్లోనే 260 పరుగులు జోడించింది. ఓపెనర్ ఫఖర్ జమాన్ (28 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఆరంభాన్నిచ్చాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ముల్డర్ 2 వికెట్లు తీశాడు. సల్మాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఫైనల్‌కు చేరిన న్యూజిలాండ్‌తో శుక్రవారం పాకిస్తాన్ తలపడుతుంది.

1 వన్డే క్రికెట్ చరిత్రలో పాకిస్తాన్ జట్టుకు ఇదే (353) అత్యధిక పరుగుల ఛేదన. 2022లో ఆస్ట్రేలియాపై చేసిన 349 పరుగుల ఛేదన రెండో స్థానంలో ఉంది.



కునేమన్ బౌలింగ్ శైలిపై ఫిర్యాదు

సిడ్నీ: శ్రీలంక పర్యటనలో విజృంభించిన ఆస్ట్రేలియా లెఫ్టార్మ్ స్పిన్నర్ మ్యాట్ కునేమన్ బౌలింగ్ శైలిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ సందర్భంగా కునేమన్ బౌలింగ్ యాక్షన్ నిబంధనలకు లోబడి లేదని అంపైర్లు సందేహాలు లేవనెత్తడంతో... ఆసీస్ స్పిన్నర్ బయోమెకానికల్ పరీక్ష ఎదుర్కోవాల్సి వస్తోంది. 'శ్రీలంకతో గాలె వేదికగా జరిగిన రెండో టెస్టు తర్వాత మ్యాచ్ అధికారుల కునేమన్ బౌలింగ్ అంశాన్ని ఆస్ట్రేలియా జట్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో మా ప్లేయర్‌కు పూర్తి మద్దతు ఇస్తాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2017లో ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేసినప్పటి నుంచి 100కు పైగా మ్యాచ్‌లు ఆడిన కునేమన్... ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడి 25 వికెట్లు పడగొట్టాడు. తాజాగా శ్రీలంతో సిరీస్‌లో 28 ఏళ్ల కునేమన్ 17.18 సగటుతో 16 వికెట్లు తీశాడు. కునేమన్ బౌలింగ్‌పై ఫిర్యాదు అందడం ఇదే తొలిసారి అని సీఏ వెల్లడించింది. ఈ నెల ఆఖర్లో బ్రిస్బేన్‌లో కునేమన్ బయోమెట్రిక్ పరీక్ష చేయించుకోనున్నాడు. అనంతరం ఫలితాలను విశ్లేషణ కోసం ఐసీసీకి పంపనున్నారు. ఒకవేళ కునేమన్ ఈ పరీక్షలో విఫలమైతే అతడిపై సస్పెన్షన్ వేటు పడగనుంది.

అసలంక సూపర్ సెంచరీ

తొలి వన్డేలో ఆస్ట్రేలియాపై శ్రీలంక విజయం



కొలంబో: చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా జట్టుకు అనూహ్య పరాజయం ఎదురైంది. శ్రీలంక పర్యటనలో భాగంగా రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఆసీస్... తొలి వన్డేలో మాత్రం శ్రీలంక చేతిలో ఓటమి పాలైంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య శ్రీలంక 49 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. చరిత అసలంక (126 బంతుల్లో 127; 14 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో విజృంభించాడు. సహచర ఆటగాళ్లు క్రీజులో నిలిచేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న చోట అసలంక కెరీర్ అత్యుత్తమ ప్రదర్శనతో జట్టును ఆదుకున్నాడు. వన్డేల్లో అసలంకకు ఇది నాలుగో శతకం. లంక ఇన్నింగ్స్‌లో దునిత్ వెల్లలాగె (30) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాడు. నిసాంక (4), అవిష్క ఫెర్నాండో (1), కమిందు మెండిస్ (5), కుశాల్ మెండిస్ (19), జనిత్ లియానగె (11), హసరంగ (7) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ 3... స్పెన్సర్ జాన్సన్, ఆరోన్ హార్డీ, నాథన్ ఎలీస్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 33.5 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (38 బంతుల్లో 41; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (12), మాథ్యూ షార్ట్ (0), మెక్‌గుర్క్ (2), కూపర్ (3), లబుషేన్ (15) ప్రభావం చూపలేకపోయారు. శ్రీలంక బౌలర్లలో తీక్షణ 4 వికెట్లు తీశాడు. అసలంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం చివరిదైన రెండో వన్డే జరగనుంది.

ధావన్‌కు గౌరవం

చాంపియన్స్ ట్రోఫీ అంబాసిడర్‌గా నియామకం

దుబాయ్: భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్... చాంపియన్స్ ట్రోఫీ అంబాసిడర్‌గా నియమితుడయ్యాడు. ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి నలుగురు అంబాసిడర్‌లను ఎంపిక చేసింది. ఇందులో ధావన్‌తో పాటు పాకిస్తాన్ జట్టుకు చాంపియన్స్ ట్రోఫీ అందించిన కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్, ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్, న్యూజిలాండ్ దిగ్గజ పేసర్ టిమ్ సౌతీ చోటు దక్కించుకున్నారు. 2013లో భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ చేజిక్కించుకోవడంలో కీలక పాత్ర పోషించిన శిఖర్... ఈ టోర్నీ చరిత్రలో వరుసగా రెండు సార్లు 'గోల్డెన్ బ్యాట్' అవార్డు గెలుచుకున్న ఏకైక ప్లేయర్‌గా నిలిచాడు. 'చాంపియన్స్ ట్రోఫీ అంబాసిడర్‌గా ఎంపికవడం గౌరవంగా భావిస్తున్నా. ఏదో తెలియని కొత్త అనుభూతి కలుగుతోంది. ప్రపంచంలోని 8 అత్యుత్తమ జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నా' అని ధావన్ పేర్కొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో 701 పరుగులు చేసిన శిఖర్... భారత్ తరఫున ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. 2013 చాంపియన్స్ ట్రోఫీలో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన ధావన్... ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గానూ కొనసాగుతున్నాడు.



ఐదు మార్పులతో ఆస్ట్రేలియా



స్టీవ్ స్మిత్



స్టార్క్

● చాంపియన్స్ ట్రోఫీకి స్టార్క్ దూరం
● స్మిత్ సారథ్యంలో బరిలోకి ఆసీస్

సిడ్నీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే గాయాల కారణంగా ప్రధాన పేసర్లు జట్టుకు దూరం కాగా... ఇప్పుడు అందుబాటులో ఉన్న సీనియర్ బౌలర్ మిషెల్ స్టార్క్ సేవలను కూడా ఆ జట్టు కోల్పోయింది. వ్యక్తిగత కారణాలతో స్టార్క్ చాంపియన్స్ ట్రోఫీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో... క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఈ టోర్నీ కోసం యువ పేసర్లను ఎంపిక చేసింది. 'స్టార్క్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. ఆస్ట్రేలియాలో ప్రతిభకు కొదవలేదు. కొత్త ఆటగాళ్లు నిరూపించుకునేందుకు ఇది చక్కటి అవకాశం' అని ఆస్ట్రేలియా చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ పేర్కొన్నాడు. ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న చాంపియన్స్ ట్రోఫీ కోసం జట్లను ప్రకటించేందుకు గడువు ముగియగా... ఆస్ట్రేలియా జట్టు ఐదు మార్పులతో తిరిగి 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. పేసర్లు స్పెన్సర్ జాన్సన్, నాథన్ ఎలీస్, సీన్ అబాట్, బెన్ ద్వారుషుయిస్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్ ఆసీస్ జట్టులో చోటు దక్కించుకున్నారు. కమిన్స్ గైర్హాజరీలో స్టీవ్ స్మిత్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. 2023లో ఆస్ట్రేలియా జట్టు వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్... ఈ టోర్నీకి దూరం కాగా, పేస్ ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్ గాయంతో అందుబాటులో లేకుండా పోయాడు. ఇక మరో ఆల్‌రౌండర్ స్టొయినిస్ అనూహ్యంగా వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు.

ఆస్ట్రేలియా జట్టు: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, అలెక్స్ కేరీ, బెన్ ద్వారుషుయిస్, నాథన్ ఎలీస్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, స్పెన్సర్ జాన్సన్, లబుషేన్, మ్యాక్స్‌వెల్, తన్వీర్ సంఘా, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా.

పాలస్తీనియన్లకు ఆశ్రయం కోసం
జోర్డాన్‌పై ట్రంప్ ఒత్తిడి

వ్యతిరేకించిన జోర్డాన్ రాజు అబ్దుల్లా

2,000 మంది చిన్నారులను వైద్యానికి తీసుకెళ్లడానికి అంగీకారం



వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో అబ్దుల్లాతో డొనాల్డ్ ట్రంప్ చర్చలు

వాషింగ్టన్: గాజా స్ట్రిప్ స్వాధీనం **ప్రణాళిక**లను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ **మరింత** వేగవంతం చేశారు. గాజా స్ట్రిప్ **నుంచి** పంపేయడంతో శాశ్వతంగా నిర్వాసితులయ్యే పాలస్తీనియన్లకు **మీ** దేశంలో ఆశ్రయం కల్పించాలని జోర్డాన్ రాజు అబ్దుల్లాపై ట్రంప్ ఒత్తిడి పెంచారు. మంగళవారం శ్వేతసౌధంలో అబ్దుల్లాతో ట్రంప్ సమావేశమై ఈ అంశంపై చర్చించారు. నివాసితులను తరలించడంతోపాటు యుద్ధంతో దెబ్బతిన్న గాజా**ను** పశ్చిమాసియాలో అత్యద్భుత**మైన** పర్యాటక ప్రదేశంగా మార్చాలన్న **తన** ఆలోచనను వదులుకోబోనని **ట్రంప్ సం**కేతం ఇచ్చారు. గాజాను కొనడం **లేదని, ఏకం**గా స్వాధీనం చేసుకుంటున్నా**మని ట్రంప్** స్పష్టం చేశారు. ''గాజా స్ట్రిప్‌ను తీసుకుంటాం. పశ్చిమాసియాలో ప్రజలకు చాలా ఉద్యోగాలు కల్పించబోతున్నాం''అని ట్రంప్ పేర్కొన్నారు. గాజా నిర్వాసితులకు ఆశ్రయం కల్పించడానికి జోర్డాన్, ఈజిప్టులు అంగీకరిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ''జోర్డాన్‌లో మాకు కొంత భూమి ఉంటుందని నేను నమ్ముతున్నాను. చర్చలు పూర్త**యిన** అనంతరం పాలస్తీనియన్లు **సంతోష**ంగా, సురక్షితంగా జీవించడా**నికి చోటు** లభిస్తుందని అనుకుంటున్నా'' **అని ట్రంప్** వ్యాఖ్యానించారు. ఆర్థిక, సైనిక **సహాయం కో**సం అమెరికాపై జోర్డాన్, ఈజిప్ట్ **ఆధారపడటమే** ట్రంప్ అంత బలంగా చెప్పడానికి కారణం. అయితే... జోర్డాన్‌కు సహాయాన్ని నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తామన్న ట్రంప్ అన్నారు. మద్దతు ఇస్తున్నామన్న వంకతో ఈ దేశాలను బెదిరించాలని భావించట్లేమని చెప్పారు. ''మేము జోర్డాన్‌కు, ఈజిప్టుకు సహాయాన్ని అందిస్తాం. ఆ సాకుతో బెదిరించాల్సిన అవసరం లేదు. మేం అలాంటి భావజాలానికి అతీతులం అనే అనుకుంటున్నాం''అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే పాలస్తీనియన్లను తమ భూభాగంలోకి తరలించే ప్రక్రియకు రాజు అబ్దుల్లా సుముఖంగా ఉన్నట్లు కనిపించలేదు. ట్రంప్ ప్రణాళికను సమర్థించకుండా, వ్యతిరేకించకుండా అసౌకర్యంగా కనిపించారు. తన దేశానికి ఏది మంచిదో అది చేస్తానని అబ్దుల్లా అన్నారు. గాజాలో అనారోగ్యంతో బాధపడుతున్న 2,000 మంది చిన్నారులను మాత్రం చికిత్సచేయించేందుకు జోర్డాన్‌కు తీసుకెళ్తామని రాజు చెప్పారు. రాజు నిర్ణయంపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. పాలస్తీనియన్లను నిర్వాసితులను చేసే ప్రయత్నాలను తాను వ్యతిరేకినని రాజు అబ్దుల్లా గతంలోనూ వ్యాఖ్యానించారు. ''ఇది ఏకీకృత అరబ్ వైఖరి''అని తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ చేశారు. ''పాలస్తీనియన్లను ఇంకెక్కడికీ పంపేయకుండానే గాజా స్ట్రిప్‌ను పునర్ నిర్మించాలి. అందరికీ ప్రాధాన్యత ఇవ్వాలి''అని ఆయన అన్నారు. గాజా అంశంలో అమెరికా కొత్త అధ్యక్షుడు తన ప్రణాళికలను వెల్లడించాక అగ్రరాజ్య అధ్యక్షుడితో భేటీ అయిన తొలి అరబ్ నేత అబ్దుల్లా కావడం గమనార్హం. ఇరువురు నాయకులు ఇతరత్రా అంశాల్లో ఒకరికొకరు స్నేహపూర్వకంగా మెలిగారు. అయితే గాజా గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు రాజు అబ్దుల్లాను ఇబ్బందికర స్థితిలోకి నెట్టాయి.

డోలాయమానంలో కాల్పుల విరమణ

ట్రంప్ గాజా ప్రతిపాదన ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపులో కొత్త సమస్యను తీసుకొచ్చింది. గాజాపై దాడులను నిలిపివేసే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని, తదుపరి నోటీసు వచ్చే వరకు బందీలను విడుదల చేయడం నిలిపివేస్తున్నట్లు హమాస్ సోమవారం తెలిపింది. బందీలందరినీ శనివారం మధ్యాహ్నంలోగా విడుదల చేయకపోతే మీ అంతు చూస్తానని ఇప్పటికే ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో హమాస్ ఏ విధంగా స్పందిస్తుంది, దానికి ఇజ్రాయెల్ ప్రతిస్పందన ఎలా ఉంటుంది?. అప్పుడు కాల్పుల విరమణ ఒప్పందం భవిష్యత్తు ఏమిటనే అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి.

సర్వత్రా వ్యతిరేకత

గాజా స్వాధీనం, పాలస్తీనియన్లను తిరిగి గాజాకు అనుమతించబోమంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై అరబ్ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గాజాను స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్ వ్యాఖ్యలపై స్పందన కోరుతూ ఫిబ్రవరి 7 నుంచి 9 తేదీలలో రాయిటర్స్/ఇప్సోస్ అమెరికాలో ఒక సర్వే నిర్వహించింది. గాజాను అమెరికా స్వాధీనం చేసుకుని అక్కడ నివసిస్తున్న పాలస్తీనియన్లను తరలించే ఆలోచనను తాము వ్యతిరేకిస్తున్నామని ప్రతి నలుగురు అమెరికన్లలో ముగ్గురు చెప్పారు. అంటే.. 74 శాతం మంది అమెరికన్ల అభిప్రాయం ఇదే. ఈ అంశంపై రిపబ్లికన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. గాజా స్వాధీన ప్రకటనను 55 శాతం మంది రిపబ్లికన్లు వ్యతిరేకించారు. 43 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు.

రష్యా చెర నుంచి విడుదలైన
అమెరికా టీచర్



వైట్‌హౌస్‌లోని సౌత్‌లాన్‌లో ట్రంప్‌ను కలిసిన మార్క్ ఫోగెల్

వాషింగ్టన్: అన్యాయంగా రష్యా కారాగారంలో మూడేళ్ల జైలు జీవితం అనుభవించిన అమెరికాకు చెందిన ఉపాధ్యాయుడు మార్క్ ఫోగెల్ ఎట్టకేలకు ట్రంప్ ప్రభుత్వం చొరవతో విడుదలయ్యారు. రష్యా నుంచి బయల్దేరిన ఫోగెల్ మంగళవారం రాత్రి అమెరికాలోని జాయింట్ బేస్ ఆండ్రూస్ వైమానిక స్థావరంలో దిగారు. తర్వాత నేరుగా అధ్యక్ష భవనంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిశారు. తన విడుదలకు అవిశ్రాంతంగా కృషిచేసినందుకు ట్రంప్‌కు ఆయన మనసారా కృతజ్ఞతలు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాతో మాట్లాడి యుద్ధానికి ముగింపు పలుకుతానని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించిన వేళ పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ స్వయంగా రష్యాకు వెళ్లిమరీ ఉపాధ్యాయుడిని వెంట తీసుకురావడం విశేషం. తమ పౌరుని విడుదల కోసం చూపిన స్థాయిలోనే ట్రంప్ సర్కార్ రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం చొరవ చూపుతుందని శ్వేతసౌధం ఒక ప్రకటనలో పేర్కొంది. ట్రంప్ ఇదే చొరవను కొనసాగించాలని ప్రపంచ దేశాలు ఆశాభావం వ్యక్తంచేశాయి.

ఎవరీ ఫోగెల్

అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రానికి చెందిన ఫోగెల్ రష్యాలోని మాస్కో సిటీలో ఆంగ్లో– అమెరికన్ పాఠశాలలో దశాబ్దకాలంపాటు టీచర్‌గా చరిత్ర పాఠ్యాంశాలను బోధించారు. ఉపాధ్యాయునిగా ఉన్న కాలంలోనే మాస్కో ఎయిర్‌పోర్ట్‌లో 2021 ఆగస్ట్‌లో ఆయనను రష్యా పోలీసులు అరెస్ట్ చేశారు. చట్టవ్యతిరేకంగా 17 గ్రాముల గంజాయిని రష్యాకు తీసుకొస్తున్నారని ఆయనపై నేరాభియోగాలు మోపింది. 2022 జూన్‌లో ఆయనకు 14 ఏళ్ల జైలుశిక్ష వేశారు. దీనిపై అమెరికా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. తీవ్రమైన వెన్ను సమస్య కారణంగా వైద్యుల సలహా మేరకే ఆయన గంజాయిని వాడుతూ, వెంట తెచ్చుకున్నారని అమెరికా పేర్కొంది. ఈయనను ''పొరపాటున అరెస్ట్‌కు గురైన వ్యక్తి'గా అమెరికా అభివర్ణించింది. ఎలాగైనా ఆయనను విడుదలచేసి తీసుకొస్తామని నాటి బైడెన్ ప్రభుత్వం చెప్పినా అది కార్యరూపం దాల్చలేదు. అయితే తాజాగా అమెరికా జైళ్లో మగ్గిపోతున్న ఒక రష్యా పౌరుడిని విడుదలచేసి అందుకు ప్రతిగా టీచర్ ఫోగెల్ విడుదలను ట్రంప్ సుసాధ్యం చేశారని మీడియాలో వార్తలొచ్చాయి. అయితే ఈ ఖైదీల పరస్పర మార్పిడి అంశంపై వైట్‌హౌస్ స్పందించలేదు. త్వరలో మరో అమెరికన్ విడుదలై స్వదేశానికి రాబోతున్నారని తెలుస్తోంది.

యూకేలో భారత సంతతి
మహిళకు అవమానం

- మద్యం మత్తులో బ్రిటిషర్ జాత్యహంకార వ్యాఖ్యలు
- 'మేం భారత్‌ను జయించాం.. తిరిగి ఇచ్చేశాం'అంటూ ఎద్దేవా

లండన్‌లో భారత మహిళకు అవమానం జరిగింది. ఒక బ్రిటిషర్ ఆమె పట్ల జాత్యాహంకార వ్యాఖ్యలు చేశారు. లండన్ నుంచి మాంచెస్టర్ వెళ్తున్న రైలులో ఆదివారం జరిగిన ఈ ఘటన తాలుకూ వివరాలు ఆలస్యంగా వెలుగుచూశాయి. భారత సంతతికి చెందిన 26 ఏళ్ల గాబ్రియెల్ ఫోర్సిత్ రైలులో ఇంటికి వెళ్తూ తోటి ప్రయాణికుడితో పలు అంశాలపై చర్చిస్తున్నారు. వలసదారులకు మద్దతు ఇచ్చే స్వచ్ఛంద సంస్థలో పని చేశానని ఫోర్సిత్ చెప్పుకొచ్చారు. అదే సమయంలో అదే బోగీలో మద్యం సేవిస్తున్న ఓ బ్రిటిషర్ ఆమె మాటలకు అడ్డుతగిలారు. తోటి రైలు ప్రయాణికులను 'వలసదారులు'గా అభివర్ణిస్తూ నీచమైన దూషణలకు దిగాడు. ఫోర్సిత్‌ను దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇంగ్లాండ్ చారిత్రక విజయాల గురించి గొప్పగా చెప్పాడు. ''నువ్వు ఇంగ్లాండులో ఉన్నావు. కానీ ఇంగ్లండ్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నావు. ఆంగ్లేయులు ప్రపంచాన్ని జయించారు. భారత్‌ను కూడా జయించాం. కానీ మాకు వద్దంటూ తిరిగి ఇచ్చేశాం. ఇలాంటి దేశాలు చాలానే ఉన్నాయి. మీది సార్వభౌమాధికారమా''అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. వీడియో చివర్లో ఆ వ్యక్తి ఫోర్సిత్‌తో ''నేను నిన్ను కొట్టబోవడం లేదు''అని అన్నాడు. అంతేకాదు.. ఆ ఘటనను వీడియో తీసి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశాడు. అతని జాత్యహంకార దూషణను ఫోర్సిత్ కూడా చిత్రీకరించి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ''అతని నోటి నుంచి వచ్చిన వలస అనే పదం, బాడీ లాంగ్వేజ్, కోపం, దూకుడు చూస్తే చాలా బాధేసింది. ఆయన ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడు. నేను శ్వేతజాతీయేతరురాలిని. ఇదే నా గుర్తింపు. అందుకు నేను గర్విస్తున్నా. జాత్యహంకార వీడియోను పోస్ట్‌చేసినందుకు శ్వేతజాతీయులు ఎందరో నన్ను ఆన్‌లైన్‌లో ట్రోల్ చేశారు. వేధింపులు ఎదుర్కొన్నా. నాకు తెలియని బూతులు తిట్టారు. బ్రిటన్‌లో శ్వేతజాతీయేతర వ్యక్తుల హక్కులపైనే నా ఆందోళన అంతా''అని ఫోర్సిత్ తెలిపారు. ఈ ఘటనపై బ్రిటన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ''వలస వచ్చిన భారతీయుడి కూతురిగా బతకడం, నా దేశ మూలాలంటే నాకెంతో ఇష్టం. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిని. నా కోసం, శ్వేతజాతీయేతర ప్రజల పక్షాన నిలబడి పోరాడతా. నాకు శ్వేతజాతీయేతర వర్గాల నుంచి ఇప్పుడు పూర్తి మద్దతు లభిస్తోంది''అని ఆమె పేర్కొన్నారు. కొన్ని రోజుల కిందట అవంతి వెస్ట్ కోస్ట్ రైలులో ఓ శ్వేతజాతి మహిళ 'మీ దేశానికి తిరిగి వెళ్లిపొండి'అని ఒక భారతీయ దంత వైద్యుడిని దూషించడం చర్చనీయంశమైంది. – సాక్షి, నేషనల్ డెస్క్

ఆంగ్ల భాషా నైపుణ్యం తప్పనిసరి!

ఈ విషయంలో చొరవ చూపాలి • కేంద్రానికి నీతి ఆయోగ్ పలు సూచనలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులైన యువతకు ఆంగ్లంలో సరైన నైపుణ్యం లేకపోవడం వారి పోటీ సామర్థ్యాన్ని దెబ్బతీస్తోందని నీతి ఆయోగ్ వెల్లడించింది. యువతలో భాషా నైపుణ్యాలు పెంపొందించేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేసింది. విద్యార్థులు ఆంగ్లం, ఇతర విదేశీ భాషలపై పట్టు సాధించేలా అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. ఈ మేరకు ఇటీవల 'రాష్ట్రాలు, రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ద్వారా నాణ్యమైన ఉన్నత విద్య విస్తరణ'పేరిట విడుదల చేసిన నివేదికలో ఆంగ్ల భాష అవసరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'అనేక రాష్ట్రాల్లో, స్థానిక పరిశ్రమలలో పనిచేసే నైపుణ్యం గల వ్యక్తులు, ఇతర మానవ వనరులు ప్రధానంగా రాష్ట్రం బయటి నుంచే వస్తున్నారు. ఈ ధోరణికి ముఖ్య కారణం స్థానిక యువతకు ఆంగ్ల భాషలో నైపుణ్యం తగినంతగా లేకపోవడమే. సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సి ఉంది. విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, తద్వారా వారు రాష్ట్రంలోనే ఉంటూ జాతీయ స్థాయిలో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడం అత్యవసరం'అని తన నివేదికలో పేర్కొంది.

ముందున్న రెండు రాష్ట్రాలు

ఆంగ్ల భాష అవసరాన్ని గుర్తించడంలో పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలు ముందున్నాయని నివేదికలో పేర్కొంది. పంజాబ్ ప్రభుత్వం 2023లో బ్రిటిష్ కౌన్సిల్ సహకారంతో ఈ దిశగా ప్రయత్నాలను ప్రారంభించిందని తెలిపింది. ఆరు నెలల పాటు ఇంటెన్సివ్ 18–సెషన్ల కోర్సును నిర్వహించడం ద్వారా ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి పెట్టిందని వివరించింది. దాదాపు 5వేల మంది ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఈ పైలట్ ప్రాజెక్ట్‌తో లాభం కలిగిందని వెల్లడించింది. విస్తరిస్తున్న ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందేందుకు విద్యార్థులకు అవసరమైన భాషా సామర్థ్యాలను పెంపొందించడంలో పంజాబ్ చొరవను నీతిఆయోగ్ ప్రశంసించింది. అదేవిధంగా, కర్ణాటక ప్రభుత్వం 2024లో ప్రారంభించిన కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం, భాషా నైపుణ్యాలను పెంచడం, విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని గుర్తు చేసింది. మైక్రోసాఫ్ట్ ఇండియాతో భాగస్వామ్యంతో 'ఇంగ్లిష్ స్కిల్స్ ఫర్ యూత్'కార్యక్రమం ద్వారా 16 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో 5,795 మంది విద్యార్థుల ఆంగ్ల నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 'స్కాలర్స్ ఫర్ అండర్ గ్రాడ్యుయేట్ టాలెంట్'కార్యక్రమం ద్వారా ఆరు విశ్వవిద్యాలయాల నుంచి అర్హులైన విద్యార్థులకు లండన్‌లోని విశ్వవిద్యాలయాలకు రెండు వారాల పాటు పంపి, వారితో అభ్యసించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఆంగ్ల విద్యను ప్రోత్సహించిందని నీతి ఆయోగ్ ప్రశంసించింది.

రోహింగ్యాల పిల్లల చదువుపై
వివక్ష వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: మయన్మార్‌కు చెందిన రోహింగ్యా శరణార్థుల పిల్లలకు విద్యాబోధనలో వివక్ష చూపరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో రోహింగ్యాలను అనుతించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై తదుపరి విచారణను 10 రోజులకు వాయిదా వేసింది. అయితే, రోహింగ్యాలు టెంట్లలో ఉంటున్నారా? వేరెవరి ఇళ్లలో ఉంటున్నారా? వివరాలు తెలపాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కోరింది. రోహింగ్యా హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ అనే ఎన్జీవో తరఫున లాయర్ కొలిన్ గొంజాల్వెస్ వాదనలు వినిపించారు. ఆధార్ కార్డులు లేకపోవడంతో రోహింగ్యాల పిల్లలను స్కూళ్లలో జాయిన్ చేసుకోవడం లేదన్నారు. వీరి వద్ద శరణార్థిగా గుర్తిస్తూ ఐరాస అందజేసిన కార్డులున్నాయన్నారు.

మిజోరంలో రూ.173 కోట్ల డ్రగ్స్ పట్టివేత

ఐజ్వాల్: భారత్–మయన్మార్ సరిహద్దుల్లోని మిజోరంలో పెద్దమొత్తంలో మాదకద్రవ్యం పట్టుబడింది. ఈ నెల 9వ తేదీన చంపాయ్ జిల్లాలో 57.9 కిలోల బరువున్న మెథాంఫెటమైన్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు అస్సాం రైఫిల్స్ బుధవారం తెలిపింది. మిజోరం పోలీసులతో కలిసి చేపట్టిన ఈ ఆపరేషన్‌లో జొఖౌతర్ క్రాసింగ్ పాయింట్ వద్ద సోదాల్లో దొరికినట్లు వివరించింది. ఐస్, క్రిస్టల్ మిథ్ అనే పేర్లున్న ఈ డ్రగ్ విలువ రూ.173.73 కోట్లని తెలిపింది.

ఉపాధిని కల్పించే
వ్యవసాయానికి ఊతమివ్వండి

కేంద్ర ప్రభుత్వానికి రైతు నేత దల్లేవాల్ వినతి

చండీగఢ్: ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలని రైతు నేత దల్లేవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదే సమయంలో, పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. పంజాబ్–హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీలో బుధవారం జరిగిన మహాపంచాయత్‌నుద్దేశించి ఆయన మాట్లాడారు. గతేడాది ఫిబ్రవరి 13వ తేదీ నుంచి ఇక్కడ కొనసాగిస్తున్న రైతుల నిరసనలకు ఏడాది అయిన సందర్భంగా కార్యక్రమం జరిగింది. ఎంఎస్పీ సహా పలు డిమాండ్ల సాధన కోసం గతేడాది నవంబర్ 26ను నిరశన దీక్ష సాగిస్తున్న దల్లేవాల్ బెడ్‌పై నుంచే ప్రసంగించారు. రైతులందరికీ ఆయన ప్రసంగం కన్పించేలా అక్కడ భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం పంజాబ్, హరియాణాలకు చెందిన అక్రమ వలసదారులను వెనక్కి పంపించడాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. ఇందుకు ప్రధాన కారణం స్థానికంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేకపోవడమేనని చెప్పారు. 'అత్యధికంగా ఉద్యోగ అవకాశాలను కల్పించేది సాగు రంగమే. ఈ రంగం బలంగా ఉంటే ప్రతి ఒక్కరికీ ఉపాధి దొరుకుతుంది. వ్యవసాయమే లాభసాటిగా ఉంటే, మన యువత విదేశాల బాట ఎందుకు పడుతుంది?' అని దల్లేవాల్ ప్రశ్నించారు. 'అందుకే, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలి'అని దల్లేవాల్ కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు దక్కాలనేదే తన పోరాట లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 14న చండీగఢ్‌లో రైతు సంఘాల నేతలతో చర్చలు జరపనుంది.

వాతావరణ మార్పులతో తీవ్రంగా నష్టపోయిన
ఆరో దేశం భారత్

న్యూఢిల్లీ: 1993–2022 సంవత్సరాల మధ్య కాలంలో తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా ఎక్కువగా నష్టపోయిన ఆరో దేశం భారత్ అని ఓ నివేదిక తెలిపింది. ఈ సమయంలో దేశంలో 80 వేల మరణాలు సంభవించగా, ఆర్థికంగా రూ.15.64 లక్షల కోట్ల (180 బిలియన్ డాలర్ల) మేర నష్టపోయిందని వివరించింది. జర్మనీ కేంద్రంగా పనిచేసే జర్మన్‌వాచ్ అనే ఎన్జీవో ఈ నివేదికను వెలువరించింది. 1993–2022 మధ్య కాలంలో భారత్‌లో 400కు పైగా అతి తీవ్ర వాతావరణ సంబంధిత ఘటనలు నమోదయ్యాయంది. ప్రపంచవ్యాప్తంగా 9,400కు పైగా అత్యంత తీవ్ర వాతావరణ సంబంధిత ఘటనలు నమోదు కాగా, 7.65 లక్షలమంది చనిపోయారని పేర్కొంది. మొత్తమ్మీద 4.2 ట్రిలియన్ డాలర్ల మేర దేశాలు నష్టపోయాయని వివరించింది. ఎండలు, వేడిగాలులు, వరదలు, తుఫాన్లు, భూకంపాలు వంటి తీవ్ర వాతావరణ సంబంధిత ఘటనలతో డొమినికా, చైనా, హోండురస్ ఎక్కువగా నష్టపోయాయని, ఆ తర్వాతి స్థానాల్లో మయన్మార్, ఇటలీ, భారత్, గ్రీస్, స్పెయిన్, వనౌటు, ఫిలిప్పీన్స్ ఉన్నాయంది. యుద్ధాలు, సాయుధ ఘర్షణల తర్వాత అత్యధికంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగానే ప్రపంచదేశాలు నష్టపోయాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) కూడా ఇటీవల పేర్కొనడం తెలిసిందే.

మీరు తిరిగొస్తారనే గ్యారెంటీ లేదు

ఇంద్రాణీ ముఖర్జీ విదేశీ టూర్ అర్జీపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: కుమార్తె షీనా బోరా హత్య కేసులో నిందితురాలి ఉన్న ఇంద్రాణీ ముఖర్జీ విదేశీ ప్రయాణానికి సుప్రీంకోర్టు అనుమతి నిరాకరించింది. బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌ల ధర్మాసనం .. మీరు తిరిగి వస్తారనే నమ్మకం లేనందున పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇది చాలా సున్నితమైన అంశమైందున ఆమెకు అనుమతివ్వవద్దని సీబీఐ వాదించింది. విచారణ సగం పూర్తయిందని తెలిపింది. విచారణ కీలకమైన దశలో ఉన్నందున, ఈ సమయంలో విదేశీ ప్రయాణానికి అనుమతించలేమని ధర్మాసనం తెలిపింది. తిరిగొస్తారనే నమ్మకం లేదని వ్యాఖ్యానించింది. దీనికి సంబంధించి బాంబే హైకోర్టు వెలువరించిన తీర్పును సమర్థించింది. ఈ విషయంలో దిగువ కోర్టుకు వెళ్లేందుకు ఇంద్రాణీ ముఖర్జీకి అవకాశమిచ్చింది. అదేసమయంలో, షీనా బోరా హత్య కేసుపై విచారణకు ఏడాదిలోగా ముగింపు పలకాలని దిగువ కోర్టును ఆదేశించింది. ఇంద్రాణీ ముఖర్జీ కుమార్తె షీనా బోరా(24) ముంబైలో 2012లో హత్యకు గురైంది. 2015లో ఈ దారుణం వెలుగు చూసింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన ఇంద్రాణీతోపాటు ఆమె భర్త సంజీవ్ ఖన్నా, కారు డ్రైవర్ రాయ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వీరంతా బెయిల్‌పై బయటకు వచ్చారు. బ్రిటిష్ పౌరురాలైన ఇంద్రాణీ ముఖర్జీ స్పెయిన్, బ్రిటన్ వెళ్లాల్సిన అత్యవసర పని ఉందంటూ ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేయగా గతేడాది జూలైలో అనుమతిచ్చింది. అయితే, సీబీఐ బాంబే హైకోర్టులో సవాల్ చేయగా ప్రత్యేక కోర్టు ఆ ఆదేశాలను పక్కనబెట్టింది.

ఆ కమిషన్ చైర్‌పర్సన్‌ను తొలగించండి: సుప్రీం

న్యూఢిల్లీ: జాతీయ హోమియోపతి కమిషన్ చైర్‌పర్సన్ నియామకం అక్రమమని, ఆయన్ను వెంటనే తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై కర్ణాటక హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పక్కనబెట్టింది. 'జాతీయ హోమియోపతి కమిషన్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ అనిల్ ఖురానా నియామకాన్ని రద్దు చేస్తున్నాం. ఆ బాధ్యతల నుంచి ఆయన వైదొలగాలి. నేటి నుంచి వారం రోజుల్లోగా పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ఆయనకు అవకాశమిస్తున్నాం. ఈ సమయంలో ఆయన విధానపరమైన, ఆర్థికపరమైన ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదు'అంటూ జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను చేపట్టే అధికారికి కనీసం 20 ఏళ్ల అనుభవం ఉండాలని, హోమియోపతి రంగంలో పూర్తి పట్టు ఉండాలనే నిబంధనను పట్టించుకోలేదని ధర్మాసనం తప్పుబట్టింది. తప్పనిసరి అర్హత నిబంధనలను గాలికొదిలేశారని మండిపడింది. నిబంధనలకు అనుగుణంగా తదుపరి చైర్‌పర్సన్ నియామక ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. జాతీయ హోమియోపతి చైర్‌పర్సన్‌గా ఖురానా నియామకాన్ని సవాల్ చేస్తూ అప్పట్లో ఆ పదవికి పోటీపడిన డాక్టర్ అమరగౌడ ఎల్ పాటిల్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే, న్యాయస్థానం ఆ నియామకాన్ని సమర్థించింది. దీనిపై పాటిల్ సుప్రీంకోర్టు తలుపుతట్టారు. కాగా, అనిల్ ఖురానా వచ్చే జూలైలో పదవీ విరమణ చేయాల్సి ఉంది.

మృతుల సంఖ్యను తక్కువ చేసి చూపింది

యూపీ ప్రభుత్వంపై మమతా బెనర్జీ ధ్వజం

కోల్‌కతా: మహాకుంభ మేళాలోజనవరి 29వ తేదీన జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన వారి సంఖ్యను యూపీ ప్రభుత్వం తక్కువ చేసి చూపుతోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. బుధవారం ఆమె రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడుతూ..'కుంభమేళా దుర్ఘటనలో చాలా మంది చనిపోయారు. కానీ, యూపీ ప్రభుత్వం మరణాలపై కచ్చితమైన సంఖ్యను వెల్లడించడం లేదు. మహాకుంభ్‌కు జనం పెద్ద సంఖ్యలో తరలిరావాలనే ఉద్దేశంతో భారీగా ప్రచారం చేసుకుంటున్న యూపీ ప్రభుత్వం..అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లను మాత్రం చేయలేదు'అని ఆరోపించారు.అదేసమయంలో ఆమె, రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయడం లేదంటూ కేంద్రంపై ధ్వజమెత్తారు. రాష్ట్రానికి న్యాయబద్ధంగా అందాల్సిన నిధులను కేంద్రం తొక్కిపెడుతోందని విమర్శించారు. బడ్జెట్‌లో కేంద్రం చేసినవన్నీ శుష్క వాగ్దానాలేనన్నారు. బెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం అవినీతిమయంగా మారిందంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ఆరోపణలను నిరాధారాలంటూ ఆమె కొట్టిపారేశారు.

మళ్లీ కాంగ్రెస్‌లోకి అభిజిత్ ముఖర్జీ

కోల్‌కతా: మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమారుడు, మాజీ ఎంపీ అభిజిత్ ముఖర్జీ నాలుగేళ్ల అనంతరం తిరిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బుధవారం కోల్‌కతాలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి గులాం అహ్మద్ మిర్ ఆయనకు పార్టీ జెండా, సభ్యత్వం అందజేసి, పార్టీలోకి ఆహ్వానించారు. అభిజిత్ 2021లో కాంగ్రెస్‌ను వీడి టీఎంసీలో చేరారు. అప్పట్లో టీఎంసీలో చేరేందుకు తీసుకున్న తన నిర్ణయం తప్పని మీడియాతో అన్నారు. కాంగ్రెస్‌లో తన రాజకీయ జీవితానికి ఇది పునర్జన్మవంటిదని పేర్కొన్నారు. గతేడాది జూన్‌లోనే కాంగ్రెస్‌లో చేరాలనుకున్నా, ఎన్నికలు రావడంతో ఆగిపోయానని చెప్పారు. అయితే, టీఎంసీలో ఉన్న సమయంలో ఆయన రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించలేదు. 2011లో రాజకీయ ప్రవేశం చేసిన, అభిజిత్ 2012లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ టిక్కెట్‌పై జంగీపూర్ లోక్‌సభ సీటును గెల్చుకున్నారు. అనంతరం 2014 పార్లమెంట్ ఎన్నికల్లో ఆ సీటును నిలబెట్టుకున్నారు. అయితే, 2019 ఎన్నికల్లో టీఎంసీ, బీజేపీ అభ్యర్థుల తర్వాత మూడో స్థానంలో నిలిచారు.

ఒడిశాలో పెళ్లికి ముందే కౌన్సెలింగ్

విడాకుల రేట్లు తగ్గించేందుకు జాతీయ మహిళా కమిషన్ యోచన

భువనేశ్వర్: యువ జంటల్లో పెరుగుతున్న విడాకులను తగ్గించేందుకు ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ కేంద్రాలను నెలకొల్పాలని నిర్ణయించింది. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ సూచన మేరకు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 2025ను 'విడాకుల నివారణ సంవత్సరం'గా పాటిస్తామని ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా తెలిపారు. రాబోయే ప్రీ మ్యారేజ్ కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా విడాకుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నామన్నారు. రెండు రోజుల ఒడిశా పర్యటనలో ఉన్న రహత్కర్ ఒడిశా రాష్ట్ర మహిళా కమిషన్ 32వ వ్యవస్థాపక దినోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రికి పలు సూచనలు చేశారు. పెళ్లికి ముందు ప్రాపంచిక జీవితానికి సంబంధించి సరైన సలహాలు ఇస్తే విడాకుల రేటు తగ్గుతుందన్నారు.

పరువునష్టం కేసులో రాహుల్‌కు సమన్లు

లక్నో: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కొత్త చిక్కుల్లో పడ్డారు. భారత సైన్యంపై ఆయన గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పరువు నష్టం కేసులో లక్నోలోని ప్రత్యేక ఎంపీ–ఎమ్మెల్యే కోర్టు ఆయనకు సమన్లు జారీ చేసింది. మార్చి 24వ తేదీన హాజరు కావాలని ఆదేశించింది. 2022 డిసెంబర్‌లో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు భారత సైన్యాన్ని కించపరిచేలా ఉన్నాయని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ ఈ ఫిర్యాదు చేశారు. ఈ కేసు పరిశీలించిన అనంతరం లక్నో న్యాయస్థానం రాహుల్ గాంధీకి మార్చి 24న కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది.

బిలియనీర్ల కోసం భద్రతను బలిచేయొద్దు: ఖర్గే

న్యూఢిల్లీ: కేవలం కొందరు బిలియనీర్లకు మేలు చేయడానికి దేశ భద్రతను పణంగా పెట్టొద్దని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ సరిహద్దులో గుజరాత్‌లో అదానీ గ్రూప్ ఏర్పాటు చేయబోయే రెన్యూవబుల్ ఎనర్జీ పార్కు కోసం సరిహద్దు భద్రతా నిబంధనలను, నేషనల్ సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌ను కేంద్ర ప్రభుత్వం సడలించినట్లు మీడియాలో వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. అధికార బీజేపీ నకిలీ జాతీయవాదం ముసుగు తొలగిపోయిందని విమర్శించారు. ఈ మేరకు ఖర్గే బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాని మోదీ ఇకనైనా స్పందించాలని కోరారు. అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం ఒక కిలోమీటర్ సమీపంలోని వ్యూహాత్మక భూభాగాన్ని అదానీకి కట్టబెట్టారో లేదో తేల్చిచెప్పాలని పేర్కొన్నారు. భారత్–పాకిస్తాన్ సరిహద్దులో భారీ ప్రైవేట్ ప్రాజెక్టుకు ఎందుకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. దీనివల్ల మన దేశ భద్రతకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలను ఏమని పిలిచేవారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

విజయనగర సామ్రాజ్యం

ఆర్థిక వ్యవస్థ

భూమి పన్ను, వివిధ వృత్తి పన్నులు, సామంతులు చెల్లించిన కప్పాలు, శత్రు రాజ్యాల నుంచి దోపిడీ చేసిన సొమ్ము, రాజ ప్రతినిధులు చెల్లించే రాజాభరణాలు, బహుమతులు, విజయనగర సామ్రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరులు. భూమిని నాలుగు రకాలుగా విభజించారు. మాగాణీ పొలాన్ని 'నీరాంబరం', మెట్ట పొలాన్ని 'కాడాంబరం'గా పేర్కొన్నారు. ఈ కాలంలో పన్నులు అధికంగా ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు.

పన్నుల స్వరూపం: పంట పొలం, సారం, దిగుబడుల ఆధారంగా పన్ను మదింపు చేసేవారు. సాధారణంగా ఫలసాయంలో ఆరో వంతును పన్నుగా వసూలు చేసేవారు. భూమిని 'కీసరపాటిగడ'తో కొలిచేవారు. ఆముక్తమాల్యద ప్రకారం రాజుకు లభించే ఆదాయాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఖర్చు చేసేవారు. రాజు దానాలు, రాజు వ్యక్తిగత వ్యయం, గుర్రాల నిర్వహణ, దండయాత్రలు, దేశాభివృద్ధి, రక్షణకు ఆదాయాన్ని ఖర్చు చేసేవారు.

భూమి, వృత్తి, వివాహం, పారిశ్రామిక ఉత్పత్తులపై పన్నులుండేవి. ఒకే స్థలంలో అమ్మకానికి వచ్చే సరకులపై 'స్థలాదాయం' పన్ను, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకుపోయే వస్తువులపై 'మార్గాదాయం' పన్ను, ఇతర రాజ్యాలకు ఎగుమతి చేసే వస్తువులపై 'మామూలాదాయం' పన్ను, నేత మగ్గాలపై 'మగ్గరి' పన్ను ఉండేది. దూదిని ఏకి దారం తీసేవాళ్లు 'పంజుణి సిద్ధాయం' అనే పన్ను చెల్లించేవారు. విజయనగర రాజ్యంలో కొన్ని సీమల్లో పెళ్లి సుంకాలను రద్దు చేసిన మొదటి రాజు తుళువ వీరనరసింహుడు. శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్యమంతటా వివాహ సుంకాలను రద్దు చేశారు. ఇంటిపై 'ఇల్లం', పశువులు మేసే పచ్చిక బయళ్లపై 'పుల్లం', అంగళ్లపై 'మడిగె' లేదా 'అడికాసు' పన్ను, స్థలంపై 'మన', తృణధాన్యాలు, కూరగాయలపై 'మలబ్రమ', కుల తగువుల ద్వారా 'సమయసుంకం' అనే పన్నులు వసూలు చేసేవారు. శ్రీకృష్ణదేవరాయలు వేయించిన కొండవీడు శాసనంలో వివిధ వస్తువులపై విధించిన పన్నుల వివరాలు ఉన్నాయి. వేశ్యలపై పన్ను విధించి దాంతో రక్షక భటులకు జీతాలు చెల్లించేవారని డొమింగోపయస్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. యాచక వృత్తి (బిచ్చగాళ్ల)పై పన్నును 'గణాచారి' పన్ను అని పిలిచేవారు. పుత్రులు లేని కుటుంబీకుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేది. కోటల నిర్వహణకు 'దుర్గనివర్తన', 'దుర్గదణ్ణాయి' అనే పన్నులుండేవి. ఈ పన్నుల వివరాలను రాసేవారిని 'రాయలేఖకులు'గా పిలిచేవారు. వారి సేవలకుగాను రాజులు తగిన హోదా, గౌరవాలు ప్రసాదించారు. భూములు సర్వే చేయడానికి 20 అడుగుల పొడవున్న మానదండాన్ని ఉపయోగించేవారు. వివిధ ఉత్సవాలు, దేవాలయ నిర్మాణాలు, పూజా క్రతువులకు దానాలు, బహుమతులు ఇవ్వడం, వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు అవసరమైన నీటి కాల్వలు, చెరువులు నిర్మించడం లాంటి మంచి పనులు చేసేవారు. సంగీత, సాహిత్య కృత్యాల్లో ప్రావీణ్యం ఉన్న వారిని సముచితంగా గౌరవించేవారు.



న్యాయవ్యవస్థ - శిక్షలు

చక్రవర్తే న్యాయ వ్యవస్థకు ఉన్నతాధికారి. అత్యున్నత న్యాయస్థానం రాజాస్థానం. న్యాయాధీశులను 'ప్రాడ్వివాకులు'గా పిలిచేవారు. సివిల్ నేరాలను ధనోద్భవ, క్రిమినల్ నేరాలను హింసోద్భవ అని పిలిచేవారు. కొన్ని నేరాలకు శిక్షలు కఠినంగా, క్రూరంగా ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు. చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడేవారి కాలు, చెయ్యి నరికేసేవారు. పెద్ద దొంగతనాలకు గొంతు కింద కర్రగుచ్చి వేలాడదీసేవారు. రాజద్రోహం చేసిన వారికి శూలాలతో పొత్తికడుపులో గుచ్చడం లాంటి శిక్షలుండేవి. బ్రాహ్మణులకు మరణశిక్ష అమల్లో లేదు. కానీ కనుగుడ్లు తీయడం, గాడిదలపై ఊరేగించడం లాంటి శిక్షలుండేవి. అట్టడుగు కులాలవారు నేరాలు చేస్తే శిరోముండనం చేసేవారు. అపరాధులను ఏనుగులతో తొక్కించేవారు. అల్ప నేరాలకు పాల్పడిన వారి వీపులపై బండరాళ్లు ఎత్తించేవారు. కింది తీర్పులపై రాజువద్ద పునర్విమర్శ ఉండేది. సత్యప్రమాణం చేయించి శాస్త్రాలు చూసి న్యాయం నిర్ణయించేవారు. గ్రామచావడి, దేవాలయ ప్రాంగణం, ఊరి మధ్య రచ్చబండల వద్ద తీర్పులు చెప్పేవారు.

సామాజిక పరిస్థితులు

అల్లసాని పెద్దన మనుచరిత్ర, విదేశీ యాత్రికుల యాత్రాకథనాలు నాటి సామాజిక పరిస్థితులను వివరిస్తున్నాయి. సమాజంలో వర్ణ వ్యవస్థ, దానికి అనుగుణంగా అనేక కులాలు, ఉపకులాలు ఏర్పడ్డాయి. బ్రాహ్మణాధిక్యత ఉండేది. యజ్ఞాలు, యాగాలు, దానాలు, క్రతువులు విరివిగా చేసేవారు. కవి పండిత సభలు జరిగేవి. యుద్ధాల్లో క్షత్రియులు, వాణిజ్యంలో వైశ్యులు పేరు పొందారు. శూద్రులను తక్కువ కులంగా భావించేవారు. శ్రమశక్తి అంతా వీరిదే. గ్రామాల్లో కుల ప్రాతిపదికన ప్రజలు వేర్వేరుగా నివసించేవారు. మాలలు, మాదిగలను గ్రామాలకు దూరంగా ఉంచేవారు. పాదరక్షలు, చాంతాళ్లు నేయడం, తోలుసంచులు తయారు చేయడం వీరి వృత్తి. విప్రవినోదులు వివిధ వేషాలతో ప్రజలను ఆహ్లాదపరిచేవారు. దేవదాసీలు, వేశ్యావ్యవస్థ, సతీ సహగమనం, ఆత్మార్పణలు, జంతుబలులు లాంటి దురాచారాలు ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు. రాజులు విలాసమైన జీవితం గడిపేవారు. రాజ ప్రసాదానికి అనుకొని 72 కార్యాలయాలు (నియోగాలు) ఉండేవి. యుక్తవయసులో ఉన్న స్త్రీలను రాజుకు రక్షక భటులుగా కూడా నియమించేవారు. కన్యలను ఇతర దేశాల నుంచి కూడా దిగుమతి చేసుకునేవారు. సమాజంలో భోగ స్త్రీలకు గౌరవం ఉండేది. వారు సంగీతం, నాట్యంలో నిష్ణాతులని పయస్ పేర్కొన్నాడు. వివాహాలు ఎనిమిది విధాలుగా జరిగేవి. కట్నాలు, కానుకలుండేవి. పురాణాలు, ఇతిహాసాలు యక్షగానాలు సామాన్య ప్రజల్లో ప్రాచుర్యం పొందాయి. శరన్నవరాత్రులు పదిరోజుల పాటు వైభవంగా జరిగేవి. తొలి విజయనగర రాజులు శైవభక్తులు. తర్వాత రాజులు వైష్ణవ మతాన్ని ఆదరించారు. సంస్కృత నాటకాలు, తెలుగు, కన్నడ యక్షగానాలు, బొమ్మలాటలు, కోడి, గొర్రెపోతు పందేలు నాటి ముఖ్యమైన వినోదాలు. విజయనగర రాజుల కులదైవం విరూపాక్షస్వామి. వీరి రాజ లాంఛనం వరాహం.

శ్రీకృష్ణదేవరాయలు విద్యాగోష్ఠులు జరిపే సభాభవనం పేరు 'భువన విజయం'. ఆయన నివసించే మందిరం 'మలయకూటం'. సాహిత్య సదస్సులో అష్టదిగ్గజాలు విద్వత్తు ప్రదర్శించేవారు. విజయనగరం అత్యంత జన సాంద్రత ఉన్న నగరం . వర్తక వ్యాపారాలకు ప్రధాన కేంద్రం. చైనా నుంచి పట్టు వస్త్రాలు దిగుమతి అయ్యేవని పోర్చుగీసు యాత్రికుడు బార్బోసా పేర్కొన్నాడు. కర్పూరం, చందనం, మిరియాలు, ఏలకులు లాంటి సుగంధ ద్రవ్యాలకు మలబారు తీరం ప్రసిద్ధి చెందింది. గోవా రేవు ద్వారా అరేబియా గుర్రాలు దిగుమతి అయ్యేవి. రాట్నాలపై నూలు వడికేవారు. సాలివారిలో సాలి, పద్మశాలి, పట్టుశాలి, ఆగశాలి లాంటి శాఖలుండేవి. అనంతపురంలోని 'వజ్రకరూర్' వజ్రాలకు ప్రసిద్ధి చెందింది. వస్త్రాలకు నీలి, మంజిష్ట, కరక్కాయి, ఇంగిలీకం లాంటి రంగులు అద్దేవారు. కంసాలి, కమ్మరి, కుమ్మరి తదితరులు కులవృత్తులపై జీవించేవారు.

సంఘంలో వరహాలు, మాడలు, ఫణాలు, ప్రతాపులు (బంగారు నాణేలు), చిన్నము, తార్ లేదా తారం (వెండి నాణేలు), జితల్ (రాగి నాణేలు) రూపంలో డబ్బు చెలామణి అయ్యేది. ధనాన్ని భూమిలోపల బిందెలలో దాచి పెట్టేవారు. ధాన్యాన్ని సోల, తూము, మానికల్లో కొలిచేవారు. ఈ కాలంలో అందగత్తెల వ్యాపారం కూడా జరిగేది. వీరిని 'చంద్రవణామణులు' అని పిలిచేవారు. వీరిని విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. ప్రజలకు జాతరలు, అలంకరణపై మోజు ఎక్కువ.

బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలను 'బ్రహ్మదేవ గ్రామాలు'గా పిలిచేవారు. వీటిపై పన్ను మినహాయింపు ఉండేది. రాజోద్యోగులు, పండితులు, కవులు, శాస్త్రవేత్తలకు ఇచ్చిన గ్రామాలను 'ఉంబళి గ్రామాలు'గా పిలిచేవారు. నిత్య పూజా పునస్కారాలు, ఉత్సవాల నిర్వహణకు పూర్తిగా పన్నులు మినహాయించి ఇచ్చిన గ్రామాలను 'దేవాదాయ గ్రామాలు'గా గుర్తించేవారు. శైవ, వైష్ణవ మఠాధిపతులకు దానమిచ్చిన గ్రామాలను 'మఠాపుర గ్రామాలు' అని పిలిచేవారు. రాజగ్రామాలను 'భండారవాడ' గ్రామాలని పిలిచేవారు.

సాహిత్యం - కళలు

ఈ యుగంలో తెలుగు, కన్నడ, తమిళ, సంస్కృత భాషల్లో సాహిత్యం వికసించింది. కుమార కంపన భార్య గంగాదేవి సంస్కృతంలో 'మధురా విజయం' రచించింది. తిరుమలాంబిక 'వరదాంబిక పరిణయం', రామభద్రాంబిక 'రఘునాథాభ్యుదయం', రాజనాథ డిండిముడు 'సాళువాభ్యుదయం', రెండో దేవరాయలు బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానం, శ్రీకృష్ణదేవరాయలు 'జాంబవతీ పరిణయం', 'ఉషా పరిణయం', 'మదాలస చరిత్ర', 'ఆముక్తమాల్యద' గ్రంథాలు రచించారు. విద్యారణ్యుడు 'సంగీతసారం', బండారు లక్ష్మీనారాయణ 'సంగీత సూర్యోదయం', నారాయణ తీర్థులు 'కృష్ణ లీలాతరంగిణి' రచించారు.

బహమనీ సుల్తానులు

ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేసి, దక్కన్‌లో బహమనీ అమీర్లు క్రీ.శ. 13వ శతాబ్దంలో స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పద్నాలుగు మంది బహమనీ సుల్తాన్లు సుమారు 175 ఏళ్లు దక్కన్‌ను పాలించారు. విజయనగర రాజులు వీరికి సమకాలీకులు. క్రీ.శ. 1347లో దౌలతాబాద్ కేంద్రంగా హసన్ గంగూ అనే అబుల్ ముజాఫర్ సుల్తాన్, అల్లా ఉద్దీన్ హసన్ మహ్మద్‌షా బహమనీ పేరుతో సింహాసనాన్ని అధిష్ఠించి బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడినే అల్లా ఉద్దీన్ బహమనీషా అని కూడా పిలుస్తారు. గుల్బర్గా ఇతడి రాజధాని. ఇతడు తన రాజ్యాన్ని బీరార్ నుంచి కృష్ణానది దక్షిణ ప్రాంతం వరకు, తూర్పు దిశలో వరంగల్, తెలంగాణా ప్రాంతాలు, పశ్చిమ తీరంలో గోవా, దభోల్ ఓడరేవు ప్రాంతాల వరకు విస్తరించాడు. ఇతడికి 'సికిందర్ ఇసానీ' అనే బిరుదు ఉంది. అంటే రెండో అలెగ్జాండర్ అని అర్థం. ఇతడు రాజధాని గుల్బర్గాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు. రాజ్యాన్ని గుల్బర్గా, దౌలతాబాద్, బీదర్, బీరార్ అనే నాలుగు తరాఫ్‌లు(రాష్ట్రాలు)గా విభజించి తరాఫ్‌దార్ల (గవర్నర్లు)ను నియమించాడు. అల్లా ఉద్దీన్ బహమనీ షా మలేరియా జ్వరంతో 1358లో మరణించాడు. ఈ వివరాలు బుర్హాన్ - ఎ - మసీర్ గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి.

మహ్మద్‌షా (1358-1377)

ఇతడు అల్లా ఉద్దీన్ బహమనీషా పెద్ద కుమారుడు. దక్షిణ హిందూ పాలకులైన ముసునూరి నాయకులు, విజయనగర రాజులతో నిరంతరం యుద్ధాలు చేశాడు. విజయనగర సంగమ వంశరాజు మొదటి బుక్కరాయలతో ముద్గల్ కోట కోసం యుద్ధం చేశాడు. వరంగల్ కాటయ నాయకునిపై దాడి చేశాడు. మహ్మద్ షా తన రాజ్యంలో శాంతి భద్రతలు కాపాడాడు. ఎనిమిది మంది మంత్రులున్న సభ ద్వారా పరిపాలన నిర్వహించేవాడు. షేక్ ఉల్ మషాయు జైనుద్దీన్, ఐనుద్దీన్ లాంటి పండితులు ఉండటం వల్ల ఇతడి ఆస్థానం పండిత కేంద్రంగా ఉండేదని 'బహమనీస్ ఆఫ్ దక్కన్' గ్రంథంలో వివరించారు.

రెండో మహ్మద్‌షా (1377-97)

రెండో మహ్మద్‌షా శాంతి కాముకుడిగా పేరు పొందాడు. విద్యాగోష్ఠులు, విద్వాంసులతో ఎక్కువ కాలం గడిపేవాడు. ప్రసిద్ధ పారశీక కవి హఫీజ్‌ను తన ఆస్థానానికి ఆహ్వానించాడు. హఫీజ్‌ను ప్రజలు రెండో అరిస్టాటిల్ (గ్రీకు తత్వవేత్త)గా కీర్తించారు. ఇతడి కాలంలోనే రెండో హరిహరరాయలు అంతర్వేది ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అనేక మసీదులు, పేదల వసతి గృహాలు, పాఠశాలలను రెండో మహ్మద్‌షా నిర్మించాడు. గుల్బర్గా, బీదర్, ఎలిచ్‌పూర్, దౌలతాబాద్‌లో అనాథలకు ఉచిత పాఠశాలలు నిర్మించాడు. బహమనీ రాజ్యంలో 1387–97 ప్రాంతంలో తీవ్ర క్షామం సంభవించింది. పదివేల ఎద్దులను ఉపయోగించి, మాళ్వా, గుజరాత్ నుంచి ఆహార ధాన్యాలను తెప్పించి తక్కువ ధరలకు అమ్మించాడు. కానీ ఈ పథకాలన్నీ మహ్మదీయులకు మాత్రమే పరిమితమైనట్లు తెలుస్తోంది.

'హరిభజియించు హస్తములు హస్తములు'

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

అలంకారాలు

టెట్ / డీఎస్సీ పరీక్షల్లో అలంకారాలపై తప్పనిసరిగా ప్రశ్నలు వస్తాయి. అందువల్ల అభ్యర్థులు శబ్దాలంకారాలైన వృత్త్యనుప్రాసం, ఛేకానుప్రాసం, లాటానుప్రాసం, అంత్యాను ప్రాసం, యమకం, ముక్తపదగ్రస్తం లాంటి వాటి గురించి తెలుసుకోవాలి. అర్థాలంకా రాలైన ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకం, అతిశయోక్తి, శ్లేష, దృష్టాంతం, అర్థాంతరన్యాసం, స్వభావోక్తి, సమాసోక్తి తదితరాలను చదవాలి.



శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రమణీయత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. ఇవి శ్రవణ లాలిత్యంతో పాఠకులకు ఆహ్లాదం కలిగిస్తాయి.

1. **వృత్త్యనుప్రాసం:** ఒకే వర్ణం లేదా రెండు, మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.

ఉదా: చిట్ట పట్ట చినుకులు పట్ట పట్ట మని
పడుతున్న వేళ...
పై ఉదాహరణలో 'ట' కారం అనేకసార్లు ఆవృతమైంది. కాబట్టి ఇది వృత్త్యనుప్రాసం.

2. **ఛేకానుప్రాసం:** అర్థ భేదంతో రెండేసి హల్లు లను వ్యవధానం లేకుండా ప్రయోగిస్తే దాన్ని ఛేకానుప్రాసం అంటారు.

ఉదా: అనాథ నాథ! నీకు వంద వందనాలు
'నాథ, వంద' అనే హల్లుల జంటలను అర్థ భేదంతో ప్రయోగించారు. అందువల్ల ఇది ఛేకానుప్రాసం.

3. **లాటానుప్రాసం:** తాత్పర్య భేదంతో కూడిన రెండేసి హల్లులను వెంటవెంటనే ప్రయోగిస్తే దాన్ని లాటానుప్రాసం అంటారు.

ఉదా: కమలాక్షు నర్చించు కరములు కరములు
పై ఉదాహరణలో 'కరములు' పదాన్ని తాత్పర్య భేదంతో ప్రయోగించారు. అందువల్ల ఇది లాటానుప్రాసం.

4. **అంత్యానుప్రాసం:** ఒక పదం లేదా పాదం లేదా వాక్యం చివరన ఒకే అక్షరం లేదా వర్ణాల సమూహం వస్తే దాన్ని 'అంత్యానుప్రాసం' అంటారు.

ఉదా: కొందరికి రెండు కాళ్లు
రిక్షావాళ్లకి మూడు కాళ్లు
ఉన్నవాళ్లకి నాలుగు కాళ్లు
ప్రతి పాదం చివరన 'కాళ్లు' పదం ఆవృతమైంది. కాబట్టి ఇది అంత్యానుప్రాసం.

5. **యమకం:** సమానమైన స్వర సహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే దాన్ని 'యమకం' అంటారు.

ఉదా: 'మన సుభద్ర మనసు భద్రమయ్యె'
సుభద్ర అనే పదం అర్థ భేదంతో వచ్చింది. కాబట్టి ఇది యమకం.

6. **ముక్తపదగ్రస్తం:** ఒకే పద్య పాదంలో లేదా వాక్యంలో చివరన వాడిన పదాన్ని రెండో పాదంలో మొదటిపదంగా ఉపయోగిస్తే దాన్ని 'ముక్తపదగ్రస్తం' అంటారు. ముక్తపదగ్రస్తం అంటే 'విడిచిన పదాన్ని గ్రహించడం' అని అర్థం.

ఉదా: మన వేటికి నూతనమా
తనమానిని ప్రేమఁదనకుఁ దక్కితినను మా
మొదటి పాదంలో చివరి పదం 'తనమా' అనేది రెండో పాదంలో మొదటి పదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్తం.

అర్థాలంకారాలు

అర్థ సౌందర్యంతో కావ్యశోభను ఇనుమ డించేవి అర్థాలంకారాలు. ఇవి అర్థ ప్రధాన మైనవి.

1. **ఉపమాలంకారం:** ఉపమాన ఉపమే యాలకు మనోహరమైన సాదృశ్యాన్ని వర్ణిస్తే అది ఉపమాలంకారం. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమానధర్మం (ఉపమాన ఉపమేయాల్లో సమానంగా ఉండేది) ఉంటాయి. ఉపమావాచకం ఉపమేయ, ఉపమానాలకు, సమన్వయాన్ని సూచిస్తుంది. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంగి లాంటివి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న అన్ని అంశాలుంటే దాన్ని 'పూర్ణోపమాలంకారం' అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని 'లుప్తోపమాలంకారం' అంటారు.

ఉదా: 'ఓ కృష్ణా! నీ కీర్తి ఆకాశగంగలో హంస వలె మునుగుతూ ఉంది'.
పై ఉదాహరణలో 'కీర్తి' ఉపమేయం, 'హంస' ఉపమానం, 'మునుగుతూ ఉండటం' సమానధర్మం, 'వలె' ఉపమావాచకం. అన్ని అంశాలు ఉన్నాయి కాబట్టి ఇది పూర్ణోపమాలంకారం.

2. **ఉత్ప్రేక్షాలంకారం:** జాతి, గుణ, ధర్మ సామ్యంతో ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. తలంచె దన్, ఎంచెదన్, భావించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్ష వాచకాలు.

ఉదా: 'ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుంచి పుట్టిన ధూమమో అని తలంతును'
ఉపమేయమైన 'చీకటి'ని ఉపమానమైన 'ధూమం'గా ఊహించడం వల్ల ఇది ఉత్ప్రేక్ష అలంకారం.

3. **రూపకాలంకారం:** ఉపమేయంలో ఉప మాన ధర్మాన్ని ఆరోపించి వర్ణించినా లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లు వర్ణించి చెప్పినా అది రూపకాలంకారం.

ఉదా: 'లతాలలనలు రాజుపై కుసుమాక్షతలు చల్లిరి'. ఇందులో ఉపమేయమైన లత లలో ఉపమానమైన లలనల ధర్మాన్ని ఆరోపించారు. ఉపమేయమైన కుసు మాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు. అందువల్ల ఇది రూపక అలంకారం.

4. **అతిశయోక్తి అలంకారం:** లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం. ఇందులో గోరంతను కొండత చేసి వర్ణిస్తారు.

ఉదా: 'దేవాలయ గోపుర శిఖరాలు ఆకాశాన్ని తాకుతున్నాయి'. గోపుర శిఖరం మిక్కిలి ఎత్తైందనే విషయాన్ని అతిశయించి చెప్పడం వల్ల ఇది అతిశయోక్తి అలంకారం.

5. **అర్థాంతరన్యాసాలంకారం:** సామాన్యాన్ని విశేషంతో లేదా విశేషాన్ని సామాన్యంతో సమర్థించి చెబితే అది అర్థాంతర న్యాసాలంకారం.

ఉదా: 'హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు. మహాత్ములకు సాధ్యం కానిది లేదు గదా!'
ఇందులో హనుమంతుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. దీన్ని 'మహాత్ములకు సాధ్యం కానిది లేదు గదా!' అనే సామాన్య విషయంతో సమర్థించారు. కాబట్టి ఇది అర్థాంతరన్యాసాలంకారం.

6. **స్వభావోక్తి అలంకారం:** జాతి, గుణ క్రియాదుల స్వభావాలను ఉన్నవి ఉన్నట్లు సహజసిద్ధంగా, మనోహరంగా వర్ణించి చెబితే అది 'స్వభావోక్తి' అలంకారం.

ఉదా: 'ఆ ఉద్యానవనంలో లేళ్లు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో.. అటూ, ఇటూ గంతులేస్తున్నాయి'. ఇందులో లేళ్ల స్థితిని ఉన్నది ఉన్నట్లు సహజంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి అలంకారం.

7. **దృష్టాంతాలంకారం:** ఉపమాన ఉపమేయాల్లో ఉన్న భిన్న ధర్మాలను 'బింబ ప్రతిబింబ భావం'తో వర్ణిస్తే అది దృష్టాంత అలంకారం

ఉదా: ఓ రాజా! నీవే కీర్తిమంతుడవు
చంద్రుడే కాంతిమంతుడు
ఇందులో కీర్తిమత్వ కాంతిమత్వాలు భిన్న ధర్మాలైనా వాటి బింబ ప్రతిబింబ భావాలు వర్ణించారు. కాబట్టి ఇది దృష్టాంతాలంకారం.

8. **శ్లేషాలంకారం:** ఒక వాక్యంలో అనేక అర్థాలు వచ్చేట్లు పదాలను కూర్చడాన్ని శ్లేషాలంకారం అంటారు.

ఉదా: 'రాజు కువలయానందకరుడు'. ఇందులో 'రాజు' శబ్దానికి పాలకుడు, చంద్రుడు అనే అర్థాలున్నాయి. కువలయం అంటే భూమి, కలువ పువ్వు అనే అర్థాలున్నాయి. 'రాజు భూప్రజలకు పాలనతో ఆనందం కలిగించేవాడు' అని ఒక అర్థం, చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందాన్ని కలిగిస్తాడని మరో అర్థం వచ్చినందు వల్ల ఇది శ్లేషాలంకారం.

9. **సమాసోక్తి అలంకారం:** ప్రస్తుత వర్ణనతో అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.

ఉదా: 'చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖాన్ని ముద్దాడుచున్నాడు'. ప్రస్తుత వర్ణన వల్ల పరాకాంతాచుంబనాభిలాషుడైన కాముకుడు స్ఫురిస్తున్నందు వల్ల ఇది సమాసోక్తి అలంకారం.

మాదిరి ప్రశ్నలు

1. 'కుముదినీ రాగరసబద్ధ గుళికయనగ చంద్రుడుదయించె కాంతిని స్తంద్రుడగుచు' వాక్యంలోని అలంకారం ఏది?
   1) ఉపమాలంకారం 2) ఉత్ప్రేక్ష అలంకారం
   3) రూపకాలంకారం 4) అతిశయోక్తి
2. 'ఆ తోరణం శత్రువులతో రణానికి కారణ మైంది' వాక్యంలోని అలంకారం ఏది?
   1) లాటానుప్రాసం 2) ఛేకానుప్రాసం
   3) యమకం 4) వృత్త్యనుప్రాసం
3. ఉపమాన ఉపమేయాలకు చక్కని సాదృశ్యాన్ని చెబితే అది ఏ అలంకారం?
   1) ఉపమా 2) ఉత్ప్రేక్ష
   3) స్వభావోక్తి 4) సమాసోక్తి
4. అర్థభేదం లేకుండా తాత్పర్య భేదంతో కూడిన రెండు హల్లుల జంటలు వెంట వెంటనే ప్రయోగిస్తే అది ఏ అలంకారం?
   1) వృత్త్యనుప్రాసం 2) ముక్తపదగ్రస్తం
   3) ఛేకానుప్రాసం 4) లాటానుప్రాసం
5. 'సుదతీ నూతనమదనా
   మదనా గతురంగపూర్ణ మణిమయసదనా!'
   లో ఉన్న అలంకారం ఏది?
   1) యమకం 2) ముక్తపదగ్రస్తం
   3) లాటానుప్రాసం 4) అంత్యానుప్రాసం
6. 'రంగధరాతిభంగ ఖగరాజతురంగ విపత్పరం పరోత్తుంగ' పద్య పాదంలో ఉన్న అలంకారం ఏది?
   1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
   3) యమకం 4) అంత్యానుప్రాసం
7. 'చుక్కలు తలపూవులుగా
   అక్కజముగమేనుపెంచి యంబరవీధిన్'
   పద్య పాదాల్లో ఉన్న అలంకారం ఏది?
   1) స్వభావోక్తి 2) అర్థాంతరన్యాసం
   3) అతిశయోక్తి 4) ఉత్ప్రేక్ష
8. 'హరిభజియించు హస్తములు హస్తములు' వాక్యంలోని అలంకారం ఏది?
   1) ఛేకానుప్రాసం 2) లాటానుప్రాసం
   3) వృత్త్యనుప్రాసం 4) యమకం
9. 'మిమ్ము మాధవుడు రక్షించుగాక!' వాక్యం లో ఉన్న అలంకారం ఏది?
   1) అర్థాంతరన్యాసం 2) స్వభావోక్తి
   3) సమాసోక్తి 4) శ్లేష
10. ప్రస్తుత వర్ణనతో అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది ఏ అలంకారం?
    1) సమాసోక్తి 2) అప్రస్తుత ప్రశంస
    3) రూపకం 4) ఉపమా
11. 'శివాజీ కల్యాణీదుర్గాన్ని జయించాడు
    వీరులకు సాధ్యంకానిది లేదు కదా!'
    వాక్యాల్లో ఉన్న అలంకారం ఏది?
    1) అతిశయోక్తి 2) అర్థాంతరన్యాసం
    3) సమాసోక్తి 4) స్వభావోక్తి
12. 'పగయ కలిగెనేని పామున్న యింటిలో
    ఉన్నయట్లు కాక యూఱడిల్లి ఉండునెట్లు చిత్తము?' - పాదాల్లో ఉన్న అలంకారం?
    1) ఉత్ప్రేక్ష 2) రూపకం
    3) ఉపమా 4) అతిశయోక్తి
13. 'ఆమె కడవతో వడి వడి అడుగులతో గడప దాటింది' వాక్యంలో ఉన్న అలంకారం?
    1) వృత్త్యనుప్రాసం 2) ఛేకానుప్రాసం
    3) లాటానుప్రాసం 4) యమకం
14. 'మానవ జీవితం సుకుమారమైంది' వాక్యంలో ఉన్న అలంకారం ఏది?
    1) స్వభావోక్తి 2) శ్లేష
    3) సమాసోక్తి 4) ఉత్ప్రేక్ష
15. 'ఆ రాజు సాక్షాత్తు ఈశ్వరుడే' – ఈ వాక్యంలో ఉన్న అలంకారం ఏది?
    1) అనన్వయం 2) రూపకం
    3) ఉత్ప్రేక్ష 4) అతిశయోక్తి

సమాధానాలు


1) 2	2) 3	3) 1	4) 4
5) 2	6) 2	7) 3	8) 2
9) 4	10) 1	11) 2	12) 3
13) 1	14) 2	15) 2	

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఆంత్రరసంలో మాత్రమే ఉండే ఎంజైమ్ ఏది?

మాదిరి ప్రశ్నలు

1. 'కెరటో మలేసియా' వ్యాధి ఏ విటమిన్ లోపం వల్ల వస్తుంది?
1) రెటినాల్ 2) నియాసిన్
3) బయోటిన్ 4) ఆస్కార్బిక్ ఆమ్లం
2. కిందివాటిలో కొవ్వులో కరగని విటమిన్ ఏది?
1) D 2) E 3) B 4) K
3. కిందివాటిలో స్వేచ్ఛాయుత రక్తప్రసరణ ఉండే జీవి ఏది?
1) వానపాము 2) చేప
3) కప్ప 4) బొద్దింక
4. లెగ్యుమినేసి మొక్క, రైజోబియం బ్యాక్టీరి యాల మధ్య సంబంధం?
1) పరాన్న జీవత్వం 2) సహజీవనం
3) పరభక్షకం 4) కమెన్సాలిజం
5. కిందివాటిలో ప్రత్యక్ష స్పర్శ వల్ల సంక్ర మించని వ్యాధి ఏది?
1) క్షయ 2) డిఫ్తీరియా
3) ధనుర్వాతం 4) గజ్జి
6. 'రెనిన్' ఎంజైమ్ చేసే పని ఏమిటి?
1) కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా మార్చడం
2) అమైనో ఆమ్లాలను ప్రోటీన్లుగా మార్చడం
3) పిండి పదార్థాలను మాల్టోజ్‌గా మార్చడం
4) పాలను పెరుగుగా మార్చడం
7. అయోడిన్ లోపం వల్ల సంక్రమించే వ్యాధి?
1) రక్తహీనత 2) క్వాషియోర్కర్
3) థైరాయిడ్ వాపు 4) మెరాస్మస్
8. జలగ ఏ రకమైన జీవి?
1) పూతికాహార జీవి
2) అంతర పరాన్న జీవి
3) స్వయం పోషక జీవి
4) బాహ్య పరాన్న జీవి
9. నాలుగు గదుల గుండె ఉండే సరీసృపం ఏది?
1) బల్లి 2) కప్ప
3) మొసలి 4) నాగుపాము
10. ప్రౌఢ మానవుని దంతాల్లో కుంతకాల సంఖ్య ఎంత?
1) 8 2) 4 3) 12 4) 2
11. కిందివాటిలో వేరు మొగ్గలు కలిగిన మొక్క?
1) చేమంతి 2) కరివేపాకు
3) రణపాల 4) గులాబీ
12. చెరకు పంటకు సాధారణంగా వచ్చే తెగులు ఏది?
1) తిక్కా తెగులు 2) ఎండు తెగులు
3) ఎర్రకుళ్లు తెగులు 4) అగ్గి తెగులు
13. 'అంగోరా' జాతి కిందివాటిలో దేనికి సంబంధించింది?
1) మేక 2) గొర్రె 3) గేదె 4) ఎద్దు
14. డి.డి.టి. అనేది ఒక ...?
1) క్రిమిసంహారిణి 2) శిలీంధ్రనాశిని
3) వైరస్ నాశిని 4) పైవన్నీ
15. కప్ప టాడ్‌పోల్ లార్వా శ్వాసేంద్రియం ఏది?
1) చర్మం 2) ఊపిరితిత్తులు
3) మొప్పలు 4) వాయునాళాలు
16. కిరణజన్య సంయోగక్రియను సూచించే సరైన సమీకరణం ఏది?
1) $12CO_2 + 12H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
2) $6CO_2 + 6H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
3) $6CO_2 + 12H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
4) $12CO_2 + 6H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 9H_2O$



గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
బయాలజీ

17. 'కేంఫర్' ఏ మొక్క నుంచి లభిస్తుంది?
1) నల్లమందు మొక్క 2) నక్స్‌వామిక
3) ఆసిమమ్ సాంక్టమ్
4) సింకోనా అఫిసినాలిస్
18. నిమ్మ, ఉసిరి, జామకాయలు తినటం వల్ల ఏ వ్యాధి రాదు?
1) రికెట్స్ 2) రేచీకటి
3) బెరిబెరి 4) స్కర్వీ
19. నిల్వ చేసే ప్రక్రియలో క్యూరింగ్ అంటే ఏమిటి?
1) ఈస్ట్‌ను ఉపయోగించి ఆల్కహాల్ తయారు చేయడం
2) పాలను పెరుగుగా మార్చి నిల్వ చేయడం
3) పాలను వేడి చేసి మీగడను వేరు చేయడం
4) కాటేజ్ జున్నును కొన్ని పద్ధతుల ద్వారా మార్చడం
20. కిరణజన్య సంయోగక్రియ జరిగిందని తెలుసుకోవడానికి చేసే పరీక్ష ఏది?
1) KOH పరీక్ష 2) గ్లిజరిన్ పరీక్ష
3) అయోడిన్ పరీక్ష 4) లైట్‌స్క్రీన్ పరీక్ష
21. కిందివాటిలో నిజ ఫలం కానిది ఏది?
1) మామిడి 2) ఆపిల్
3) నిమ్మ 4) జామ
22. బంగాళాదుంపలో ఏ భాగాన్ని ఉపయోగించి పంట సాగు చేస్తారు?
1) పత్రాలు 2) విత్తనాలు
3) కన్నులు 4) పొరలు
23. చింతకాయ విత్తనాన్ని పగులగొడితే రెండు భాగాలవుతాయి. అవి ఏమిటి?
1) అండాలు 2) స్త్రీ బీజకణాలు
3) బీజదళాలు 4) సహకణాలు
24. విత్తనం మొలకెత్తాలంటే నీరు, గాలితో పాటు అవసరమయ్యే కారకం ఏది?
1) కాంతి 2) ఖనిజ లవణాలు
3) ఉష్ణోగ్రత 4) పైవన్నీ
25. 'ఊపిరితిత్తి చేపలు'గా పేర్కొనే చేపలు కిందివాటిలో ఏ వర్గానికి చెందినవి?
1) క్రాసొటెరిజి 2) డిప్నాయ్
3) టీలియోస్టి 4) కాండ్రాస్టీ
26. రుబెల్లా వ్యాధిని కలిగించే సూక్ష్మజీవి ఏది?
1) ప్లాస్మోడియం 2) శిలీంధ్రం
3) బ్యాక్టీరియా 4) వైరస్
27. కిందివాటిలో రక్తప్రసరణ వ్యవస్థ లేని జీవులు ఉన్న వర్గం ఏది?
1) అనెలిడ 2) నిమటోడ
3) ఆర్థ్రోపొడ 4) మొలస్కా
28. విటమిన్ B_3 రసాయనిక నామం ఏమిటి?
1) నియాసిన్ 2) రైబోఫ్లేవిన్
3) సయనోకోబాలమిన్ 4) పైరిడాక్సిన్
29. మానవుని జీర్ణవ్యవస్థలో జీర్ణక్రియ జరగని భాగం ఏది?
1) నోరు 2) జీర్ణాశయం
3) ఆంత్రమూలం 4) ఆహారవాహిక
30. నెఫ్రాన్ అనే భాగం ఏ అవయవ వ్యవస్థకు సంబంధించింది?
1) నాడీ వ్యవస్థ 2) విసర్జక వ్యవస్థ
3) అంతస్రావ వ్యవస్థ 4) కండర వ్యవస్థ
31. కిందివాటిలో చెడు రక్తం కలిగిన రక్తనాళం?
1) పుపుస ధమని 2) పుపుస సిర
3) బృహద్ధమని 4) ఊర్ధ్వ బృహత్ సిర
32. 'బోంబిక్స్' మోరి అనేది ఏ జీవి శాస్త్రీయనామం?
1) లక్కకీటకం 2) సీసీ ఫ్లై
3) పట్టుపురుగు 4) ఈగ
33. 'ఒరైజా సటైవా' అనేది ఏ మొక్క శాస్త్రీయ నామం?
1) జొన్న 2) వరి 3) గోధుమ 4) పత్తి
34. కిందివాటిలో అధిక శాతం ప్రోటీన్లు ఉండే విత్తనాలేవి?
1) బఠాణీ 2) పొద్దుతిరుగుడు
3) వేరుశనగ 4) సోయా చిక్కుడు
35. శ్వాసక్రియలో అంత్య పదార్థాలుగా ఏర్ప డేవి?
1) O_2, CO_2 మిశ్రమం 2) CO_2, N_2
3) CO_2, H_2O 4) H_2O, O_2
36. ఆంత్రరసంలో మాత్రమే ఉండే ఎంజైమ్ ఏది?
1) ఎమిలాప్సిన్ 2) ఎంటరోకైనేజ్
3) ట్రిప్సిన్ 4) కీమోట్రిప్సిన్
37. 'మొక్క ఆహార కర్మాగారం'గా ఏ భాగాన్ని పేర్కొంటారు?
1) విత్తనం 2) ఫలం
3) పత్రం 4) కాండం
38. వైద్యుడు ఒక వ్యక్తిలో అలసిపోవడం, శ్లేష్మంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం లక్షణాలను గుర్తించాడు. అతడికి ఏ వ్యాధి ఉంటుందని నిర్ధారించవచ్చు?
1) కుష్ఠు 2) క్షయ
3) మలేరియా 4) కోరింతదగ్గు
39. బ్యాక్టీరియా వేగంగా వృద్ధి చెందడానికి తగిన ఉష్ణోగ్రత ఎంత ఉండాలి?
1) 20°C - 40°C 2) 60°C - 80°C
3) 80°C - 100°C 4) 5°C - 10°C
40. నాలుక వెనుక భాగంలో ఉండే రుచి గ్రాహకాలు ఏ రుచిని గ్రహిస్తాయి?
1) పులుపు 2) తీపి
3) ఉప్పు 4) చేదు
41. 'ప్రోటోజోవా' అని నామకరణం చేసిన వారెవరు?
1) లీవెన్ హాక్ 2) వాన్ సీ బాల్డ్
3) గోల్డ్‌ఫస్ 4) హైమన్
42. రాబర్ట్ గ్రాంట్ కిందివాటిలో ఏ వర్గానికి చెందిన పేరు ప్రతిపాదించాడు?
1) అనెలిడ 2) ఎకైనోడెర్మెటా
3) ప్లాటీహెల్మింథిస్ 4) పొరిఫెరా
43. ఎడారి మొక్కల్లో కొన్నింటిలో పత్రాలు ముళ్లుగా మారి ఉంటాయి. దీనికి కారణం?
1) జంతువుల నుంచి రక్షణ
2) బాష్పోత్సేకాన్ని అరికట్టడం
3) కిరణజన్య సంయోగక్రియ తగ్గించడం
4) నీటిని ఎక్కువగా పీల్చుకోవడం
44. వాలిస్నేరియా అనేది కిందివాటిలో ఏ మొక్కలకు ఉదాహరణ?
1) జీరోఫైట్లు 2) హైడ్రోఫైట్లు
3) మీసోఫైట్లు 4) లైకేన్‌లు
45. ఏకలింగ పుష్పాల్లో కిందివాటిలో ఏ భాగం లోపించి ఉంటుంది?
1) ఆకర్షక పత్రావళి లేదా రక్షక పత్రావళి
2) పుష్పవృంతం లేదా కీలాగ్రం
3) కేసరావళి లేదా అండకోశం
4) కేసర దండాలు లేదా ఫల వృంతాలు

సమాధానాలు

1) 1;	2) 3;	3) 4;	4) 2;	5) 3;
6) 4;	7) 3;	8) 4;	9) 3;	10) 1;
11) 2;	12) 3;	13) 1;	14) 1;	15) 3;
16) 3;	17) 2;	18) 4;	19) 4;	20) 3;
21) 2;	22) 3;	23) 3;	24) 3;	25) 2;
26) 4;	27) 2;	28) 1;	29) 4;	30) 2;
31) 1;	32) 3;	33) 2;	34) 4;	35) 3;
36) 2;	37) 3;	38) 2;	39) 1;	40) 4;
41) 3;	42) 4;	43) 2;	44) 2;	45) 3.

ఉద్యోగాలు

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మాల్పెలో వివిధ ఉద్యోగాలు

కర్ణాటక రాష్ట్రం మాల్పెలో ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్) ..మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **పోస్టుల వివరాలు:** మేనేజర్(ఫైనాన్స్)-01, డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్)-01, డిప్యూటీ మేనేజర్(ఎలక్ట్రికల్ డిజైన్)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సీఏ, సీఎంఏ, డిగ్రీ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 03.03.2025 నాటికి డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు మేనేజర్ పోస్టుకు రూ.1,16,160, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.96,800
- **ఎంపిక విధానం:** పని అనుభవం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.03.2025.
- **వెబ్‌సైట్:** https://udupicsl.com/


స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఆర్‌బీఐ, కోల్‌కతాలో మెడికల్ కన్సల్టెంట్ పోస్టులు

కోల్‌కతాలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **వేతనం:** గంటకు రూ.1000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ డైరెక్టర్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, రిక్రూట్‌మెంట్ సెక్షన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోల్‌కతా రీజనల్ ఆఫీస్, 15, నేతాజీ సుభాష్ రోడ్, కోల్‌కతా-700001 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 14.02.2025.
- **వెబ్‌సైట్:** https://.rbi.org.in/



Recently deleted files are stored in..?



BANK EXAMS
COMPUTER AWARENESS

1. What is the shortcut key to show font dialog box in MS Word?
a) Ctrl + D b) Ctrl + Shift + F
c) Ctrl + Shift + P
d) All of the above
e) None of the above
2. How to remove all character formats in MS Word?
a) Shift + Spacebar
b) Shift + Enter
c) Ctrl + Spacebar
d) Ctrl + Enter
e) None of the above
3. A(n) ______ is a private corporate network, used exclusively by company employees.
a) Internet
b) Local area network
c) Peer-to-peer
d) Intranet e) Ethernet
4. When you save a file as a Web page, Word converts the contents of the document into _____.
a) Java b) Perl c) HTML
d) Unix e) Linux
5. By default, Word automatically formats each heading in a table of contents as _______
a) Bookmarks
b) Cross -references
c) Hyperlinks d) word-fields
e) HTML rags
6. LAN is an abbreviation for?
a) Large Access Network
b) Local Access Network
c) Large Area Network
d) Local Area Network
e) None of the above
7. Which of the following hardware components is the most important to the operation of a database management system?
a) High-resolution video display
b) Printer
c) High speed, large-capacity disk
d) Plotter e) Mouse
8. If you want to group the records in the abc database, you could use the Job code as the _____.
a) Delete b) Update
c) Sort Key d) Index e) Insert
9. Frames from one LAN can be transmitted to another LAN via the device:
a) Router b) Bridge c) Repeater
d) Modem e) NetWare
10. How many bits internet address is assigned to each host on a TCP /IP internet which is used in all communications with the host?
a) 16 - bits b) 32 - bits
c) 48 - bits d) 64 - bits
e) None of the above
11. When a hyperlink is created, Word formats the Web address as:
a) Italicized and coloured red
b) Italicized and coloured blue
c) Underlined and coloured red
d) Underlined and coloured blue
e) a and b
12. To select a block of text, click at the beginning of the selection, scroll to the end of the selection, position the mouse pointer at the end of the selection, hold down the _____ key, and then click (or drag through the text).
a) Ctrl b) Alt c) Shift
d) Tab e) None of the above
13. With the _____, Word notifies that a smart tag is available by displaying a smart tag indicator on the screen.
a) Auto Correct Options and Paste Options
b) Smart Tag Actions and Copy Actions
c) Auto Correct Options and Smart Tag Actions
d) Paste Options and Copy Actions
e) All the above
14. When the same word is used in multiple locations or a word is used that was not quite appropriate, a thesaurus can be used to look up a (n) _____ or a word similar in meaning.
a) synonym b) homonym
c) antonym d) metonym
e) pynonym
15. Which of the following option in File pull down menu is used to close a MS Word document?
a) Quit b) Close c) Exit
d) New e) Insert
16. _____ shares characteristics with both hardware and software.
a) Operating system
b) Software c) Data
d) File e) Hard ware
17. Recently deleted files are stored in
a) Recycle Bin b) Desktop
c) Taskbar d) My computer
e) Documents
18. Which is not a system tool?
a) Folder b) Backup
c) Scandisk d) Format
e) Edge
19. Virtual stores for B2C electronic commerce are also known as:
a) Auctions b) Houses
c) Web storefronts
d) Internet buyers
e) None of the above
20. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction.
a) B2C b) C2C c) G2C
d) B2B e) B2P
21. This type of electronic commerce involves the sale of a product or service to the general public.
a) B2C b) B2P c) C2C
d) B2B e) G2C
22. Buying and selling goods over the Internet is called _______
a) hyper-marketing
b) cyber-selling c) e-commerce
d) euro-conversion
e) All of the above
23. Before you submit a contribution to a discussion group, you should first __
a) lurk b) signal c) queue
d) ping e) router
24. A popular chat service is called
a) IM-Chat b) UseNet Chat
c) Internet Protocol Chat
d) Internet Relay Chat
e) None of the above
25. What is the shortcut key to Close Active Document in Microsoft Word?
a) Ctrl + F4 b) Shift + F4
c) Ctrl + Shift + F4
d) Ctrl + Alt + F4
e) None of the above
26. Which of the following is not the layer of TCP/IP protocol?
a) Application Layer
b) Session Layer
c) Transport Layer
d) Internetwork layer
e) Mac layer
27. What is the name given to the temporary storage area that a web browser uses to store pages and graphics that it has recently opened?
a) Niche b) Cellar
c) Webspace d) Cache
e) Junk
28. IP address is currently
a) 4 bytes long
b) available in plenty
c) 6 bytes long
d) not assigned as it is all used up
e) any long
29. A computer on the Internet that hosts data, that can be accessed by web browsers using HTTP is known as:
a) Web Rack b) Web Space
c) Web Server d) Web Computer
e) Web client
30. Linux is
a) A Web Browser
b) A Web Server
c) An Operating System
d) An nonprofit organization
e) Web site
31. Microsoft Windows is
a) A Web Browser
b) A Web Server
c) An Operating System
d) A Spreadsheet Package
e) Package
32. A domain name ending with "org" is
a) An organization
b) A commercial website
c) A network site
d) A site which has very high traffic
e) None of the above
33. At which of the following sites would you most probably buy books?
a) www.hotmail.com
b) www.amazon.com
c) www.sun.com
d) www.msn.com
e) All of the above
34. Internet requires
a) An international agreement to connect computers
b) A local area network
c) A commonly agreed set of rules to communicate between computers
d) A world wide web
e) A LAN
35. The maximum size of a write file is limited to only
a) Name of the file
b) Extension of the file
c) The amount of memory in your computer
d) All of the above
e) None of the above
36. Each computer connected to the internet must
a) be an IBM PC
b) have a unique IP address
c) be internet compatible
d) have a modem connection
e) be system PC
37. In normal view, automatic page breaks _____.
a) do not display
b) display on the screen as a single dotted horizontal line
c) display on the screen above the header and beneath the footer
d) display on the screen as a line separated by the words Page Break
e) display on the screen as a double dotted horizontal line
38. Although it is not shown in normal view, to view a header, click _____ on the menu bar and then click Header and Footer.
a) View b) Edit c) Format
d) Tools e) References

Answers

1) d;	2) c;	3) d;	4) c;	5) c;
6) d;	7) c;	8) c;	9) b;	10) b;
11) d;	12) a;	13) d;	14) a;	15) b;
16) a;	17) a;	18) a;	19) c;	20) b;
21) a;	22) c;	23) a;	24) d;	25) a;
26) b;	27) d;	28) a;	29) c;	30) c;
31) c;	32) a;	33) b;	34) c;	35) c;
36) b;	37) c;	38) c.		